సంపుటము 32 భారతి. మార్చి 1955.
సాహిత్య మాస పత్రిక సంచిక-6.

---

# భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్



జూన్ 1955

సంపుటము 32 : : సంచిక 6

విడిపత్రిక వెల ఒక రూపాయి

# ఆర్తగీతము

## శ్రీ బాలగంగాధరతిలక్

నా దేశాన్ని గూర్చి పాడలేను; నీ ఆదేశాన్ని మన్నించలేను; ఈ విపంచికకు శ్రుతి కలుపలేను;

ఈరోజు నాకు విషాదస్మృతి; విధి తమస్సులు మూసిన దివాంధరుతి; నాయెడద మ్రోడయిన ఒక దుస్థితి;

నీ కొత్తసింగారమ్ము వలదు; ఉదాత్త సురభిళాత్తశయ్యా సజ్జితమ్ము వలదు; రసప్లావితము వలదు;

చిత్ర శిల్పకవితా ప్రసక్తి వాంఛింపను; తత్వసూత్ర వాదోక్తి చలింపను; సుందరవధూ కదుష్ణ పరిరంభముల రసింపను;

గతచారిత్రక యశఃకలాపమ్ము వివరింపకు; బహుళ వీరానేక గాథాసహస్రమ్ము వినిపింపకు; ఇంక నన్ను విసిగింపకు;

నేడు నేను కన్నీరుగా కరగిన గీతికను; సిగ్గుతో రెండుగాచీలిన వెదురు బొంగును; మంటలో అంతరాంతరదగ్ధమైన బూడిదను;

పైన దైవమునకు; కింద మానవునకు జవాబు చెప్పవలసిన వాణ్ణి; రసాతలమంట శిరస్సు వంచిన వాణ్ణి; రాత్రిముఖరుదిత బాధాకంఠ నాళాన్ని;

ఈరోజు నేను చూసినదేమి? విధి యిన్ని కత్తులను దూసినదేమి, జాగృతిహేతి వాదరిల రుధిరమేమి?

నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టుకింద మరణించిన ముసలివాణ్ణి;

నేను చూశాను నిజంగా నీరంధ్ర వర్షాన వంతెనకింద నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిలిన దృశ్యాన్ని;

నేను చూశాను నిజంగా తల్లిలేక తండ్రిలేక తిండిలేక ఏడుస్తూ ఏడుస్తూ ముంజేతుల కన్నుల తుడుచుకుంటూ మురికి కాల్వపక్కనే నిద్రించిన మూడేళ్ల పసిబాలుణ్ణి;

నేను చూశాను నిజంగా పిల్లలకు గంజికాచిపోసి తాను నిరాహారుడై, రుద్ధ బాష్పాకులితనయనుడై ఆఫీసుకి వచ్చిన వృద్ధుని, ప్యూన్ వీరన్నని;

నేను చూశాను నిజంగా క్షయగ్రస్త భార్య యిక బ్రతకదని డాక్టరు చెప్పినపుడు ప్రచండ వాతూలహత నీపశాఖవలె గజగజ వణకిపోయిన అరక్త అశక్త గుమాస్తాని; అయిదుగురు పిల్లలు గల వాణ్ణి;

నేను చూశాను నిజంగా మూర్తీభవత్ దైన్యాన్ని, హైన్యాన్ని; క్షుభితాశ్రుకల్లోలనీరధుల్ని; గచ్ఛత్ శవాకార వికారుల్ని;—

ఇదిఏ నాగరికతకు ఫలశ్రుతి? ఏ విజ్ఞాన ప్రకర్ష కుపకృతి; ఏ బుద్ధదేవుని జన్మభూమికి గర్వస్మృతి;

ఇంక నన్ను నిర్బంధించకు నేస్తం! ఈరాత్రి, నేను పాడలేను; ఈ కృత్రిమ వేషాన్ని అభినయింపలేను;

మానవత లేని లోకాన్ని స్తుతింపలేను; మానవునిగా శిరసెత్తుకు తిరగలేను; ఈ నాగరికతారణ్యవాసం భరించలేను;

ఒక్క నిరుపేద ఉన్నంతవరకు; ఒక్క మలినాశ్రుబిందు వొరగినంతవరకు; ఒక్క పేగు ఆకలి కనలినంతవరకు;

ఒక శుష్క స్తన్యసన్నిధిని క్షుధార్తి నేడ్చు పసిపాప ఉన్నంతవరకు; ఒక తల్లి నీరవాక్రోశరవమ్ము విన్నంతవరకు; ఒక క్షత దుఃఖిత హృదయ మూరడిల్లనంతవరకు,

నాకు శాంతి కలుగ దింక నేస్తం, నేను నిగర్వినైనాను; ఈ సిగ్గులేని ముఖాన్ని చూపించలేను;

ఈగుండె గూడుపట్లు ఎక్కడో కదలినవి; ఈకనుల వరదలై పారినవి; ఈ కలలు కాగితపు పేలికలై రాలినవి;

ఈ ఆర్తి ఏ సౌధాంతరాలకు పయనింపగలదు; ఏ రాజకీయ వేత్త గుండెలను స్పృశింపగలదు; ఏ భోగవంతుని విచలింప చేయ గలదు; ఏ భగవంతునికి నివేదించుకొనగలదు...?

# పానగోష్ఠిక

## మహాకవి గెటే

● ● జర్మన్ మహాకవి గెటే వ్రాసిన 'ఫాస్ట్' నాటకమునందలి నాల్గవ రంగమున కిది అనువాదము. యోహాన్ వోల్ఫ్‌గాంగ్ ఫెన్ గెటే, 'ఫాస్టు' ప్రథమభాగమును 1801 లోను, రెండవభాగమును 1831 లోను ప్రకటించిరి. అనంతరము తొమ్మిది మాసములకే ఆయన దివంగతులైరి. గెటే సంస్కృతభాషయందుగూడ మహాపండితుడు. 'ఫాస్ట్' నాటకములో ఆర్ష వాఙ్మయము పలుకుబడి చెల్లినతీరు సహృదయులు గ్రహింపగలరు. సంస్కృత మహాపురాణములలో హరిశ్చంద్రోపాఖ్యానము ఇందలి రచనాశిల్పమునకు కొంత దోహదము కూర్చినదాయనిపించును.

ఈ ఏకాంకరూపకమునకుముందు నాటకములో కొంత కథ నడిచినది. అది ఇది: స్వర్గములో భగవంతుడు సభ తీరియుండగా దేవతలతోపాటు, సాక్షాత్తు సైతానే అయిన మెహిస్టొఫెలిస్‌గూడా ఆ సభకు వచ్చెను. ఆ సభలో డా॥ ఫాస్ట్ ప్రసక్తిరాగా దేవతలు ఆయనను పొగడెదరు. మెహిస్ట్ ఫెలిస్ తాను ఫాస్ట్‌ను సామాన్య మానవునికన్నను హీనునిగా చేయగల ననును. భగవంతుడు ఆ సవాలు గ్రహించి "ఏదీ నీ ప్రతాపమును చూపించుము. నీవేమి చేసినను అతనిలోని మంచితనమును మాత్రము చంపలేవు" అనును. మెహిస్ట్ ఫెలిస్ అట్టి ప్రతినతో ఫాస్ట్‌ను వివేకభ్రష్టుని చేయుటకు అనేక ప్రయత్న చేయును. ఆ ప్రయత్నములలో ఈ పానగోష్ఠికాఘట్టము కూడ నొకటి.

### పాత్రలు

ఫ్రాష్
బ్రాండర్
ఆల్ట్మేయర్
సియబెల్
మెహిస్టొఫెలిస్
ఫాస్ట్

### రంగము: పానశాల

ఫ్రాష్: ఒక్కడూ త్రాగడేంరా! ఒక్కడూ నవ్వడేం! ఏమిటా ఏడుపు చూపులు. తడిసిపోయిన గడ్డిమోపుల్లాగా అట్లా ఉసూరు చచ్చి కూర్చుంటారేం? ఏంరా! మాట్లాడ్రు!

బ్రాండర్: తప్పంతా నీదగ్గర వుంచుకొని ఇంకొకళ్ళ నంటే ఏం లాభంరా! నువ్వేమన్నా పోస్తున్నావా త్రాగడానికి? ఉసూరు నీలో చచ్చింది. పైగా మాలో చచ్చిందంటున్నావు!

అనువాదము: హారీత శివశర్మ

ప్రాష్ : (గ్లాసును బ్రాండర్‌మీదుగా విసిరి) చచ్చిందా! దూడు! ఇట్లారా! త్రాగు! ఇక చెయ్యి హుషారు!

బ్రాండర్: ఆదీ! అన్నంత పనీచేశావ్!

ప్రాష్ : అదేగా నీక్కావలసింది. అవునా!

సియబెల్: ఇక్కడ పోట్లాటలు గీట్లాటలు ఖబడ్దార్! ఎవడన్నా పోట్లాడాడా బయటికి చలో జావ్! త్రాగండి! అరవండి! కేకలు వెయ్యండి! హల్లో! హల్లో! హలో!

ఆల్ట్మేయర్: ఓరి నీ దుంపతెగా! ఆపరా కొంచం! చెవులు పగిలిపోతున్నాయి. ఒరేయ్! ఎవర్రా అక్కడ? కొంచెం దూది ఇట్లా పట్టుకురా! చెవుల్లో పెట్టుకుంటాను. పగిలిపోతున్నాయి.

సియ : హోవన్! ఇంటికప్పు ఎగిరిపోవాల! అప్పుడు మజా తెలియాల! కంఠం ఎత్తానంటేనా!

ప్రాష్ : అదీ హుషారంటే! కాదనేవా డెవడ్రా! బయటికి గెంటండి.

ఆ! టూరాలా రా లా!

ఆల్ :

ఆ! టూరాలా రా లా!!

ప్రాష్ : ఓ! ఓ! సంగీతం కూడానా! ఏదీ! ఎవడ్రా! ఒక్క పదం అందుకోవసే!

రోమకరాజ్యం గొప్పదిహో!
ఎట్లా వున్నది ఇప్పటికో!

బ్రాం : చేష్! విధవపాట! రాజకీయటప్పా! ముండపాట! అది చెవిని పడితేనే నాకు రగులుకొస్తుంది. ఆరే! ప్రాష్! రాజ్యం ఏలడానికి పుట్టావనుకుంటున్నావేమిట్రా నువ్వు! భగవంతుడంటూ వున్నాడు కాబట్టి నీ కాగతి పట్టలేదు. నాకూడా అంతేలే. చక్రం చూపించాగా! నా నక్షత్రం కెయిజర్ నక్షత్రం, నానక్షత్రం ఛాన్సలర్ నక్షత్రం ఒక్కటికాదుట! బ్రతికిపోయాను. ఇప్పుడు ఎవడో పెత్తనం వహించాలా! వద్దా! పోపుని ఎన్నుకుందాం రండహె! మరేమంటారు? వాడికి ఏవో అర్హతలు వుండాలా! అవి ఏమిటో వాటిలో ఎవరికన్నా తెలుసునా అంట.

ప్రాష్ :

అమ్మా నైంటింగేలా!
పొమ్మా ఆకాశంలో-కాని
పొమ్మా సందేశం - ప్రియ
తమ్మునకిమ్మా!

సియ : ప్రేమసల్లాపాలు! ఊహూఁ! సందేశాలు! ఊఁహూ!! అవి మాకొద్దు.

ప్రాష్ : ఏమిటి? వద్దూ? అవే మా క్కావాలి! అవి అక్కర్లేనివా డెవడ్రా! చెప్పండి మాద్దాం!

గడియ తీయవే భామా!
కడిందిగుట్టే లేమా!
విడిదిచేసి మరి విభుడేమో
నడిమిరాత్రి బడి వస్తాడమ్మా!
పొడిచెను తూర్పున చిడిముడిప్రొద్దు
గడియ వేసి ఇక వడివడి పొమ్మా!

సియ : పాడు! అల్లా పాడు! ఇంకా కొంచెంసేపాడు! కొంచెంసేపు దాన్ని పొగడినా తప్పులేదులే! నాకు నవ్వొస్తోందసే! చెప్తాను. దాన్నిగురించిట్రా నీపాట! నన్ను మోసంచేసింది. నిన్ను మోసం చేస్తోంది. అది దెయ్యంరా! దెయ్యం! దాన్ని నమ్మావ్! సరిపోయింది. ఒకణ్ణి కాదోయ్ అది, పదిమందిని ఆట ఆడించేసింది. ఏ దెయ్యమో వచ్చి దాన్ని నడిరోడ్డుమీద పట్టుకొని లాక్కుపోనూ! ఏ అడవుల్లోకో కొండల్లోకో లాక్కుపోయి గంతులు వేయించి వదలిపెట్టనూ! వదిలిపెడితే! ఓహ్వ! పాలుతీసిన ముసలిమేకలాగా అది ఇంటికి రావాలా! నేను చూడాలా! దానికి మనుష్యులు ఎందుకురా! మూరెడు గడ్డం, బారెడు మీసం, కోసెడు కంఠం అట్లా ఉండాలి. వాడితోగాని అది ప్రేమకు దిగదు. నువ్వూ! నేనూ! తీసెయ్యి! నెత్తురు వున్నవాళ్లం; చీము వున్నవాళ్లం;

మరి పూరుకుంటామా? అయినా దాన్ని గురించి మాటలేమిటి? పట్టుకు తన్నక ?

బ్రాం : [బల్లమీద గట్టిగా గుద్ది] నోరుముయ్యం డోయ్! నోరుముయ్యండి! నేను చెబుతున్నా వినండి. జీవితం ఏమిటో చెబుతున్నా వినండి. నేనా, నేను జీవితాన్ని చూచా! ఎట్లా జీవించాలో తూచా! మనలో పడుతున్నారే ప్రేమల్లో కొందరు, వాళ్ళకోసం ఓ ప్రేమపాట పాడేస్తా వినండి. ప్రేమలోపడి కొట్టుకుంటున్నారే, వాళ్లకు నా పాటవుంటే, అది దివ్యౌషధం అను కోండి. చేసేగోల మానండి. బ్రహ్మాండ మైన పాట ఆలపిస్తున్నా వినండి! ఏదీ! ఏదీ! వంత అందుకోండి!

అనగా అనగా వంటిల్లు !
ఆ వంటింటికి సామాను!
ఆ సామానుకు పెద్దగదీ!

అంతా : ఆ సామానుకు పెద్ద గదీ! పెద్ద గదీ!

బ్రాం :

గదిలోవున్నది ఒక ఎలుకా!
అదిరా తిన్నది ముద మెలుకా!
ప్రొద్దున వెన్నెల ముద్దలహో!
ఖుద్దున మాంసం రాత్రిల్లో !!

అంతా :

ఖుద్దున మాంసం రాత్రిల్లో! రాత్రిల్లో!

బ్రాం :

వంటదాని కరికాలివంట
తరగాలి వెంట
తలకంటా !!

అంతా :

తలకంటా! తలకంటా!!

బ్రాం :

పచ్చిగ విషమును తెచ్చినదో
అచ్చుగ పుట్టుల పెట్టినదో
హెచ్చుగ అఖురాట్ మెచ్చిందో
మచ్చిక గరళము మెసవిందో !!

అంతా :

మెసవిందో! మచ్చికగరళము
మెసవిందో!!

బ్రాం : అవ్వ జే మైందయ్యా అఖురాట్టుకు!

గుండెలోపలను మంటపుట్టెనో
మండినదాహం మెలికపెట్టెనో
అద్దరిసీల్లా, ఇద్దరిసీల్లా
చాలక చాలక
రొప్పుతు రొప్పుతు
అటు పరుగెత్తినదో!
ఇటు పరుగెత్తినదో!!

అంతా :

అటు పరుగెత్తినదో,
ఇటు పరుగెత్తినదో!!

బ్రాం :

ప్రేమ చేత వలలోన పడ్డ,
కికురించబడ్డ
బహుదొడ్డ విరహి మహి చెడ్డట్లుగ!

అంతా :

అటు పరుగెత్తినదో!
ఇటు పరుగెత్తినదో!!

బ్రాం :

వంటది భలే వుండాకోరు!
గెంతే ఎలుకను చూచెను కారు!
ఆగదు నవ్వు ఆగదు రువ్వు
పకపక నవ్వినదో
చెకచెక రువ్వినదో!!

అంతా :

పకపక నవ్వినదో!
చెకచెక రువ్వినదో!!

బ్రాం :

ఎలుకకేమొ హృదయాన అగ్నితా
చిలుకుచుండె పలపలగ రవ్వలను
ఎలుకకేమొ హృదయమ్మున మండి
క్రిందికి ఒరిగిందో!
మీదకు ఎగిరిందో!!

అంతా :

క్రిందికి ఒరిగిందో,
మీదకు ఎగిరిందో!!

బ్రాం :

నడిమధ్యాహ్నం అప్పుడైనది
కడు అధ్వాన్నం తన బ్రతుకైనది
వడిగావడిగా పరుగు పెట్టినది
వంటఇంటిలో హసంతిపైబడి
మంటలపొర్లిందో!
గుంటలదొర్లిందో!!

అంతా :

ప్రేమచేత వలలోన పడ్డ,
కికురించబడ్డ
బహుదొడ్డవిరహి మహిచెడ్డట్లుగ
మంటలపొర్లిందో!
గుంటలదొర్లిందో!!

బ్రాం :

మరణవేదనముచేత దొర్లిన
మరణవేదనముచేత పొర్లిన
మరణబాధపడి కుమారిల్లిన
ఎలుకను వంటది చూచి నవ్వెను
ఎలుకను వంటది చూచి ఇట్లనెను
ఆ! ఆ! అఖురాట్!
శరీరం గిరగిరాట్!!
నీజీవం ఫటాఫట్!!

అంతా :

ప్రేమచేతవలలోనపడ్డ కికురించబడ్డ
బహు దొడ్డ విరహి మహి చెడ్డట్లుగ
అఖురాట్!
గిరగిరాట్!!
ఫటా ఫట్!!!

సియ : తెప్పాదియ్యా! ఆ పొయ్యిలో వేళ్లు ఏం మహాబాగా మండాయి. ఆ ఎలుకలో ఏముందని ఆసుతాయి. దాన్ని కాల్చడం మేలని మండాయి.

బ్రాం : చూస్తుంటే ఎలుకలు నీదృష్టిలో మహామంచి జంతువుల్లాగ వున్నాయే? మాంచి నెత్తురు గల జంతువుల్లాగా వున్నాయే! అవ్వంటే నీకుమహా అభిమానంలాగా వుందే.

ఆల్ : మరి ఆ పొట్ట ఏమిటనుకుంటున్నావ్ బట్టతల దిట్టా! ఆ ఎలుక కథ ఏమిటో, వీడి కథా అదే! తలకుమించిన తిండిని తిందా అది-దాని పొట్ట వుబ్బింది. అప్పుడు చావువచ్చి పిల్లి మొగ్గవేసింది. అది వీడికి గడగడాట్ గా వుంది. దొందూదొందేగా మరి!

[మెఫిస్టొ ఫెలిస్, ఫాస్ట్, ప్రవేశం]

మెఫిస్టొఫెలిస్ : [ఫాస్ట్‌తో] మరి ఇప్పుడు నాకు సంతోషంగా వుంది. నిత్యసంతోషంగాళ్లను చూపించనా? పదా! అని. స్వైరం, సంతోషం, అంతా గల్లంతుగా వుంటుంది వాళ్ల సంగతి. వాళ్లకి జీవితం అంతా ఒక పెద్ద పండగ అనుకో. మరి ఆ సంతోషానికి సామగ్రి ఏమిటని? ఎంత అని! అట్టే అక్కర్లేదు. మందప్రజ్ఞ, దురభిమానం, సొంతడబ్బా, కొద్దిగా తెలివి; ఈ సామగ్రి చాలు. సంవత్సరం పొడుగునా ఒకటేపద్ధతి జీవితం; ఒకేరకం సావాసం; త్రాగటం—పాడటం; పాడటం—త్రాగటం. మధ్యే మధ్యే కొంచెంగా ఆటలుగూడా వుంటాయనుకో. త్రాగించే త్రాగి, ఆడించే ఆడి, పాడించే పాడి, మార్పులేని సంతోషంలో పొంగిపోతూవుంటారు. పిల్లిని చూశావు, దాని తోకను చూచుకొని అదే భయపడుతుంది. మన నిత్యసంతోషంగాళ్లను చూశావు, వాళ్ల వికవికలే వాళ్లను అణుస్తాయి. వాళ్లకేమి అక్కర్లేదు ఇవి వినవూ.

రాత్రిభోజనం; తల బొప్పి కట్టకముందే పలాయనం. దుకాణంవాడు అరువిస్తేచాలు, అదే పదివేలు. ఇదీ నిత్యసంతోషంగాళ్ల జీవితపు చాలు.

బ్రాం : వీళ్లెవళ్లో ప్రయాణం చేసివస్తున్న పాంథులుగా వున్నారే! వాళ్ల ముఖాలుచూస్తేనే తెలుస్తోంది. కనిపించటంలా? ఎప్పుడు వచ్చి వుంటారు వీళ్లు? ఒక గంటగూడా అయినట్టు లేదు.

ఫ్రాష్ : నిజం నువ్వన్నది. నువ్వన్నది నిజం. వీళ్లు ఇక్కడివాళ్లుమాత్రం కాదు. ఇది లీప్ జిగ్ తెలుసా! లీప్‌జిగ్‌వాళ్లు లీప్‌జిగ్‌వాళ్లే. లీప్‌జిగ్గంటే ఏమిటి? అదో ఛోటా పారిస్. దాని కదే పారిస్. ఎక్కడికి వెళ్లినా లీప్‌జిగ్‌వాళ్లను ఇట్టే కనిపెట్టెయ్యొచ్చు. వాళ్ల లక్షణం అంతా పానదీరివుంటుంది.

సియ : మరియా క్రొత్తవాళ్లు, వీళ్లెవరంటావు!

ఫ్రాష్ : ఒక్క నిమిషం ఆగు. కన్నుమూసి కన్ను తెరిచేలోపల చెప్పేస్తాను. వాళ్లురానీ! చూస్తావుగా నా తడాఖా. పసిపిల్ల పన్ను ఊడదీసినట్టు, వాళ్ళ నోటివెంటే అంతా ఊడలాగేస్తాను అరేయ్! మీరంతా కొంచెం చాటుకు తప్పుకోండోయ్! నేను చూస్తాను వీళ్ల సంగతి. వీళ్ళను చూస్తోంటే జమీందారుల్లా వున్నారు. ఏమిటో పొగరు మోతవరి! ఏమిటో ఆ దూరం దూరంగా పోవడం! వట్టి ఏకుపుగొట్టు కుంకలు.

బ్రాం : పందెం వెయ్యి! వీళ్లు గజదొంగలు.

అంతా : దుంపతెంపి నిజంకాదుగదా!

ఫ్రాష్ : చూస్తూ వుండండోయ్! అంతా పలికిస్తాను.

మెహి : (ఫాస్ట్‌తో) ఎప్పుడూ ఒక్కటే, ఒక్కటే ఎప్పుడూ. సాక్షాత్తూ సైతాను వచ్చినా గ్రహించలేరు వీళ్లు. వాడు వీళ్ళను పీకలు నొక్కి ఆడించేస్తాడు.

ఫ్రాష్ : అభివందనం, మహాశయులకు. ఖుద్దున సేత కుడ్డి.

సియ : దండం బాబూ! (మెహిస్టొఫెలిస్‌ను చూచి నెమ్మదిగా) ఇకేమిటోయ్! వీడు ఒక కాలు కుంటుతాడు?

మెహి : మేంగూడా మీతో కలిసి కొంచెం హుషారు చేద్దామని వచ్చాం. కూర్చోనివ్వండి. కొంచెం ద్రాక్షాసవం పోయిస్తాను. మాతో గూడా కలిసి సేవిస్తారని...

అంతా : నువ్వు మహా దొడ్డ పెద్దమనిషివిలాగా వున్నావే!

మెహి : కాదు. ఏదో పాట, పాటలో సంగీతం, వినపడి వినపడిందనుకొని, ఆ కంఠాలు మహా బ్రహ్మాండంగా ఉండేసరికి అదికూడా కొంచెం చెవిని వేసుకుపోదామని! సంగీతం అంటే సంగీతమూ అది. ఈ ఇంటి కప్పుకు గూడా పట్టివుంటుంది.

అంతా : నువ్వో మహా పాటగాడివి!

మెహి : అఁ! అఁ! అంతమాటా! ఎవ్వరికి తీసిపోనను కోండి. ఏదో సంగీతం అంటే ప్రేమ. అంతే.

ఆల్ : అయితే ఏదీ? అందుకో ఒక్క పదం.

మెహి : ఒకటేం కర్మం. వందపాడతాను, మీరు సంతోషించాలిగాని—

సియ :

పాతపాటలు వద్దు పొమ్మన్నదీ,
కొత్తపాటలు పాడ రమ్మన్నదీ!

తెలిసిందా కొత్త పాటలు పాడాలి. మజాగా పాడాలి.

మెహి : దానికేం? అట్లాగే.

అంతా : అయితే మొదలుపెట్టు.

మెహి :

అనగనగా అనగనగా
అనగనగా ఒకరాజు
రాజుగారికో భార్య—బహు
అందమైన దా భార్య!
కోమలి నచ్చక కొడుకు నచ్చకను
ప్రేమించెను మరి రాజు—పెక్కువగ
ఉల్లమ్మలరగ నల్లని ఈగను
ఒక నల్లని ఈగను!!

ఫ్రాష్ : నల్లని ఈగేమిటోయ్! వాడు పాడుతున్నది నేను సరిగ్గా విన్నానా? నల్లని ఈగట! ఏం

మనిషివయ్యా నువ్వు! రాజాలదగ్గర వుండ
వలసిన మనిషివి.

మెహి :

అనగనగా అనగనగా
అనగనగా ఒకరాజు
ఆ రాజుగారి కో భార్య - బహు
అందమైనదా భార్య.
కోమలినచ్చక, కొడుకు నచ్చకను
ప్రేమించెను మరి రాజు-పెక్కు-వగ
ఉల్లమ్ములరగ నల్లని ఈగను-ఒక
నల్లని ఈగను—

ఈగకు దుస్తులు కుట్టించాలా!
మేగగ వలెనా ఆ దుస్తుల్లో!
రాజు పిల్చె దర్జీని రమ్యముగ
తేజు మీరు వస్త్రమ్ములు తెచ్చెను
'ఈగకు కోటు
ఈగకు సూటు
కుట్టు కుట్టు'మని
పెట్టెను ఆజ్ఞా!

బ్రాం : ఇదిగో! ఏమయ్యోయ్! ఆ దర్జీ వాటిని సరిగ్గా కుట్టేట్టుగా చూడు. బాగా కుట్టాలి. అందంగా కుట్టాలి. ముడతలు పడకుండా కుట్టాలి. గూనుల్లేకుండా కుట్టాలి. తెలిసిందా. ఆ దర్జీతో చెప్పండి.

మెహి :

శిల్కు గుడ్డలు
శాటిన్ గుడ్డలు
దుస్తులు కుట్టెను మరి దర్జీ
దుస్తులు వేసుకు
దర్పము చూపెను
కుచ్చుల టోపీ
హెచ్చుగ బెట్టెను—
ఈగకు రొమ్మున ఒక నక్షత్రం
ఈగకు జబ్బను ఒక సిలువా
దాని బ్రతుకు అది ఎంత గొప్పదో!
దాని హోషు అది ఎంత పెద్దదో!
బంధువులందరు ఆస్థానంలో
ఉద్యోగులు మరి పెదసర్దారులు.
రాజ దివాణంలోపల ఈగల
రొదకు అంతు మరి పంతులేదను
రాణిని ఈగలు కుట్టినవో!
రాణిని బాధలు పెట్టినవో!!
ఈగను పట్టుకు చంపగాను మరి
ఆజ్ఞలేదు ఆ భవనంలో
ఎవరికి—

ఈగను తిట్టినదో, మరి
వేగమె రొప్పినదో!!
ఈగవచ్చి నామీద వాలితే
ఈగవచ్చి మీమీద వాలితే
ఈగల్లు వచ్చి మనమీద వాలితే
పట్టుకు చంపక భయపడతామా
రట్టడి ఆజ్ఞల తలదాల్చేమా!
పట్టుకు చంపేస్తాం
గట్టిగ నొక్కేస్తాం!!

అంతా :

ఈగవచ్చి నామీద వాలితే
ఈగవచ్చి మీమీద వాలితే
ఈగల్లు వచ్చి మనమీద వాలితే
పట్టుకు చంపేస్తాం;
గట్టిగ నొక్కేస్తాం!!

ప్రాఫ్ : ఓహోహో! ఓహోహో! బ్రహ్మాండంగా వుంది. బ్రహ్మాండంగా వుంది!

పీవ : పట్టుకోండిసే ఈ ఈగల్ని. ఆట ఆడించేద్దాం.

బ్రాం : అట్లా అంటా వేమిటోయ్! ఈ గోరుమీద పెట్టి ఆ గోరుతో నొక్కేస్తాము.

అల్ : స్వాతంత్ర్యం! ప్రాషాసవం! నిరంతరం, నిరంతరం, ప్రాషాసవం, స్వాతంత్ర్యం!!

మెఫి : అరె! అబ్బాయి! ఈ స్వాతంత్ర్యంకోసం మద్యాన్ని సేవించమంటావా? సేవించేస్తాను. కాని మీదగ్గర మద్యం వుంటే, దాన్ని చూస్తేనే డోకు వస్తోంది.

సియ : ఈసారి ఆమాట అంటే అన్నావుగాని, ఇంకోసారిమాత్రం అనమాక.

మెఫి : ఇక్కడ ఈ ఫ్రాష్‌కు కోపం రాకుండా వుంటే నేను బ్రహ్మాండమైన ఆసవాలు తాగిస్తాను మీ అందరిచేతా!

సియ : అట్లా చెప్పు నాయనా! రా! బయటికి రా! దిగు దిగు నాగన్న! దిగు దిగు...

ఫ్రాష్ : నాకోపం ఎందుకరొయ్! ఏదీ సరుకు. రానీ. వర్షం కురిపించు. నేను కాదంటే ఒట్టు. మరి నేనున్నానే, నేను, నాది కొంచెం పెద్దపట్టులే. గ్లాసులు, అర గ్లాసులు, ఆగవు. ద్రాక్షాసవం పోస్తానంటున్నావుగదా, ఇంకా ఏం? ఒక పీపాడు పట్టేశావన్నమాట. దానిపని పట్టడం అంటే ఏమిటనుకున్నావ్, అట్లాగే పట్టాలి పట్టు.

అంతా : ద్రాక్షాసవమే!

మెఫి : అట్లా అయితే ఒక బరమా ఇట్లా అందివ్వండి.

బ్రాం : బరమా ఎందుకంట! ద్రాక్షాసవం పీపాలను బయట వుంచేద్దా మనుకుంటున్నా వేమిటి? అది చెప్పు ముందు?

ఆల్ : బరమాయేగా నీకొక్కవలసింది? ఇదిగో ఇట్లా అందుకో.

మెఫి : [అందుకొని] ఇక ఇప్పుడు చెప్పండి. మీకు ఏయే ద్రాక్షాసవాలు కావాలో?

ఫ్రాష్ : అంటే అర్థం, నీదగ్గర చాలారకాలుగూడా వున్నాయన్నమాట. చెప్పవేం?

మెఫి : మీలో ఎవరికి ఏది యిష్టమో అది.

ఆల్ : ఓర్నీ! అప్పుడే లొట్టలేస్తున్నా వేంరా?

ఫ్రాష్ : సరే! సరే! ఏదీ నాకు 'రీనిష్' ఆసవం రానీ. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి అన్నారు. మన దేశాందే సేవిద్దాం.

మెఫి : [ఫ్రాష్ కూర్చున్న బల్లకు కంత పొడిచి] కొంచెం మైనం అందుకోండయ్యా ఇట్లా. మూతలు చెయ్యండి.

ఆల్ : ఏమయొయ్యోయ్! ఇక్కడ గారడీచేద్దా మనుకుంటున్నా వేమిటి?

మెఫి : [బ్రాండర్‌తో] స్వామీ! మీరేం చిత్తగిస్తారు?

బ్రాం : నేనా! సరే! చాంపేన్ రానీయండి. తళతళాయమానంగా వుండాలి మరి.

[మెఫిస్టొ ఫెలిస్ మళ్ళీ కంతలు కొడతాడు. ఇంతలో మూతలు తయారై వస్తాయి. ఆ ఆ కంతలకు వాటిని అమరుస్తాడు.]

బ్రాం : విదేశీవాళ్లు మన కొద్దో అంటారు. ఒక్కొక్కప్పుడు వాళ్ళు లేకుండా జరగదు. సరే! నా కెందుకు? నేను ఆ విదేశాన్ని ఆసవ రూపంలో మింగేస్తాను. నేను నిజంగా జర్మనీవాణ్ణి కదా! ఫ్రెంచివాడి మొహం మీద ఉమ్మేస్తాను. అయితే ఏం! వాళ్ల ఆసవాలు వున్నాయే, వాటిని ఎవ్వడూ కాదనలేడు. మహా మజాగా వుంటాయిలే.

సియ : [మెఫిస్టొ ఫెలిస్ దగ్గరకు వెళ్ళి] ఇదుగో! నాకు కటువు ఆసవాలు రుచించవ్! తెలిసిందా. మధువు! నాకు మధువు కావాలి.

మెఫి : 'టొకే' పుచ్చుకో అప్పుడు.

ఆల్ : ఏమిటోయ్! ఇదంతా నాటకంగా వుంది. ఏమయొయ్యోయ్! మరి నీ పేకేమిటోగాని, ఇక్కడ నీ తమాషాలు సాగవు. గ్రహించావా! గ్రహించు!

మెఫి : చిత్తం! చిత్తం! ఛా! ఎంతమాట అన్నారూ! మీ రెంత పెద్దలు. మీతో నా ఆటలు. ఊఁ! ఊఁ! కానియ్యండి, ఆలస్యం ఎందుకు. నోట్లో ఇంకా మాటేమిటో మెదులుతోంది — జార్చెయ్యండి. ఏం ఆసవం కావాలి పెద్దలకు?

ఆల్ : నీ యిష్టం వచ్చింది, నా చిత్తం వచ్చింది. ఏది ఇప్పిస్తే అదే పుచ్చుకుంటాను.

[కంతలు చెయ్యడం, మూతలు బిగించడం పూర్తవుతుంది.]

మెఫి : (విచిత్రంగా చేతులు త్రిప్పుతూ):

ద్రాక్షులు ఎక్కడ పుడుతున్నాయ్?
చెట్టుల కొమ్మల పుడుతున్నయ్.

మేకలు ఏమిటి మేస్తున్నాయ్?
చెట్టుల కొమ్మలు మేస్తున్నాయ్.
ద్రాక్షకు రసములు ఎక్కడివి?
చెట్టుల చేవలు తెచ్చినవి.
ద్రాక్షకు రూపం ఎక్కడిది?
చెట్టుల కట్టెలు ఇచ్చినది.
చెట్టుల కట్టెల ద్రాక్షలూరితే
కట్టెల బల్లల ద్రాక్షలూరవో
కన్నులకు చూపులు వుంటే చాలు
తిన్నగ సర్వం తెలియును మేలు
చూశావ్! అడ్డంగా వుందో తెర
పైకి ఎత్తి చూడుము లో, త్వర
ఇంకా చూడు, ఇంకా చూడు,
ఇంకా చూడు,
ప్రకృతి ఫాలం కన్పించిందా
చూడుచూడు మరి యిప్పుడు చూడు
చూపిస్తా నా మహత్తేమిటో
అనలేదా మీా దేవుని కొడుకు?
అన్నాడూ! మరి మూతలు తియ్యి!
త్రాగు ఆసవం; చూడు మహత్తు!

అంతా : (మూతలు ఊడదీస్తారు. ఆసవం కంత ల్లోంచి వస్తుంది.) ప్రవహించు, ప్రవహించు, కాంతులు ఒలికించు. ప్రవహించు, ప్రవహించు, గ్లాసులు నిండించు. హృదయంలో సంతోషం పొంగించు. ఎవరికే ఆసవం ఇష్టం ఆ ఆసవం ప్రవహించు, ప్రవహించు.

మెఫి : త్రాగండి. త్రాగండి కడుపులు నిండేట్లు త్రాగండి. కిందమాత్రం బొట్టుపడనీయకండి. జాగ్రత్త! అపాయం వస్తుంది.

అంతా :

అది మేం విన్నాం, ఇదిమేం విన్నాం
అదిచేస్తాం మరి ఇది చేస్తాం
మనుషుల మాంసం
తినే మనుష్యులు
కనక్ తోషమును పొందిన యట్లుగ
హాయిగ ఇది చేస్తాం!
హాయిగ అది చేస్తాం!
వేయి వేయి కిటు లొకటైనట్లుగ
హాయి హాయి
ఇది త్రాగేస్తాం!
హాయి హాయి
అది త్రాగేస్తాం!

మెఫి : [ఫాస్టతో] చూశావా! వాళ్లను చూడు. వాళ్లకన్న సంతోషి ఎవడు ఇంకా ఈ లోకంలో.

ఫాస్ట : బ్రతికించు బాబూ! నన్ను ఇక్కడినుంచి బయటికి తీసుకుపో. జీవితంలో ఎప్పుడూ ఇహ ఇటువంటి చోటికి రాను.

మెఫి : కొంచెం ఓపిక పట్టవయ్యా! వాళ్ల నిజ ముజా ఏమిటోగూడా చూద్దువుగాని. నన్ను గూడా కొంచెం ఆనందించని.

సియ : [త్రాగుతూ కొంచెం ఒలకపోస్తాడు] సహాయం! సహాయం! బాబో! నిప్పు! నిప్పు! రగులుకుపోతోంది గాడ్! రగులుకు పోతోంది.

మెఫి : ఓసి!ఓసి! అగ్నిభూతమా! ఆగు. నేను ఆజ్ఞాపిస్తున్నాను. కొంచెం శమాయించు.

సియ : ఏమిటంట ఈయన తమాషా. పట్టుకోండహే! తాట ఊడతీద్దాం. మన సంగతి తెలియదల్లే వుంది.

ఫ్రాష్ : [మెఫిస్టిఫెలిస్ తో] ఇదుగో వయ్యోయ్! ఇటువంటి జల్ జంత్రీ పను లేం చెయ్యబోక ఇక్కడ.

ఆల్ : గెంటండిసే! బయటికి. వీడు వట్టి బటాచోరని నేను ముందునుంచీ చెబుతూనే వున్నాను. వట్టి మంత్రాలమారిగాడు.

సియ : ఇదిగో! నీ పేరేమిటో గాని ఇటువంటి గమ్మత్తులు ఇక్కడ చెయ్యక. మేం పెద్దమనుషులం. గారడీ వేషాలు వేస్తే సున్నంత్రింద కొట్టేస్తాం.

మెఫి : నోరు ముయ్యవోయ్! పీపా!

సియ : పీపా! నన్నే పీపా అంటున్నావు. నువ్వు చీపురుకట్టవి. నీ గారడీలు చాల్లే ఆపెయ్!

బ్రాం : తమాయించండి స్వామీ! తమాయించండి. ఇంతకీ నీ రోజులు బాగున్నాయి. కొరడా వాయించకుండా వదిలేస్తున్నా, సంతోషించు.

ఆల్ : [కంతమూత తీస్తాడు. నిప్పువస్తుంది] చచ్చాన్రోయ్! చచ్చా! కాలిపోతున్నాన్రోయ్! కాలిపోతున్నా. మాడిపోతున్నాన్రోయ్! మాడిపోతున్నా.

సీయ : చంపండి. ఏడీ వాడు. దొంగ వెధవ! మంత్రాలు వేస్తాడు! చంపండి; నరకండి; చూస్తారేం.

[అంతా కత్తులు దూసి మెఫిస్టోఫెలిస్ మీదకు పోతారు]

మెఫి : (చేతులు త్రిప్పుతూ పాట)

కదులు రొదలు చెవులలోన
గుదులుకట్టై నిప్పుడు.—
పదరి ఇవ్విరూపమ్ములు
చెదిరి గుములుకట్టగా
అక్కడ ఇక్కడ మరి
ఎక్కడపడితే అక్కడ
గములుకట్టి దెయ్యమ్ములు
కదలులాడు నిక్కడా.

[అంతా ఒకళ్ళను ఒకళ్ళు చూచుకుంటూ దిగ్భ్రాంతులై నిలబడిపోతారు]

ఆల్ : నేనెక్కడ వున్నాను. తస్సదియ్యా! ఇది ఏదో స్వర్గంలాగా వుందే.

ఫ్రాష్ : ఓహోహో! అన్నీ ద్రాక్షతోటలే, ద్రాక్షతోటలే!

సీయ : ఈ పళ్ళేమి పళ్ళంట, ఇట్టే చేతి కందుతున్నాయి.

బ్రాం : ఇక్కడ ఈ ఆకులసందునుంచి చూడండ్రా! చూశారూ! ఏం ద్రాక్షలు! ఏం ద్రాక్షలు!

[అని చెయ్యిచాపి సీయబెల్ ముక్కు పట్టుకుంటాడు. చెరి ఒక్కడు చెరి ఒక్కని ముక్కు పట్టుకుంటాడు. ప్రతి ఒక్కడు కత్తి ఎత్తుతాడు]

మెఫి : [పైనుంచి]

శోషమ్ములు మేఘమ్ములు
దూరమ్ములు అయినప్పుడు
దెయ్యమ్ముల ఖేలనమ్ము దివ్యమ్ముగ
చూడవచ్చు
ఉద్భ్రాంతులు వీరంతా
దిగ్భ్రాంతులు చెడ్డప్పుడు
దెయ్యమ్మన ఏమో కయ్యమ్మన
ఏమో
చయ్యన తెలిసెదరో, క్రయ్యన
విరిసెదరో.

[ఫాస్ట్‌తో గూడా అదృశ్యుడై పోతాడు. తక్కిన వాళ్ళకు ఒళ్లు తెలుస్తుంది].

సీయ : ఏమిట్రా ఇది?

ఆల్ : ఎట్లా జరిగిందంటావ్ ?

ఫ్రాష్ : ఇది నీ ముక్కా ?

బ్రాం : (సీయబెల్‌తో) ఇది నీది. నొక్కేస్తాను. ఏమనుకున్నావో!

ఆల్ : నా ఒళ్ళంతా షాక్ కొట్టినట్లుగా వుంది. ఒరే! ఓ కుర్చీ తెండ్రా! అబ్బా! నాకు మూర్ఛవస్తోంది. కళ్లు ధియిర్లు కమ్ముతున్నాయి.

ఫ్రాష్ : ఏమిటిరా ఈ గోలంతాను.

సీయ : వాడేడి? ఎక్కడికి పోయాడు? ఏమైనాడు? తస్సాదియ్య! ఈ సారి దొరికాడా, ఆపళాన...

ఆల్ : పట్టుకోవాణ్ణి చూద్దాం, తంతానంటున్నావుగా! తన్ను, అదీ చూద్దాం. నేను చూశానువాణ్ణి, పీపామీద ఎక్కి అమాంతం ఎగిరిపోయాడు. ఇహ భయం లేదులే. అమ్మో! నాకాళ్లు! నాకాళ్లు! గుదులుకట్టిపోతున్నాయేమిటి? (బల్ల కేసి తిరిగి) ఇంతకీ ఆసవం హరించిపోయింది. సుయ్యి త్రవ్వాం అనుకున్నాం గాని, ఇగిరిపోయింది.

సీయ : ఇదంతా ట్రిక్కు; ఇదంతా మోసం; ఇదంతా నాటకం.

ఫ్రాష్ : అట్లా అన్నావా! నేను తాగానా! అది ద్రాక్షాసవంలాగే వుందే.

బ్రాం : అందులో ద్రాక్షపళ్లు ఏం పండాయోయ్! వాటిని కాదనటం ఎట్లా? అది గూడా మోసం అంటారా? ఇంత జరిగింతర్వాత దేన్ని నమ్మడం; దేన్ని నమ్మకపోవడం?

[తెర]

# సంస్కృత రూపకములు

## డిమము, ఈహామృగము

శ్రీ బి. వి. సింగరాచార్య

ప్రాచీన రూపకరీతులలో "డిమ" మనే ఒక విలక్షణరూపకప్రభేదం వెలసింది. డిమ మనగా సంఘాతం. డిమ, డింబ, విద్రవ శబ్దములు పర్యాయపదములు. ఈ రూపక విశేషమున ఉపద్రవకరములైన సంఘటనలు వర్ణితములగుటవల్ల దీనికి డిమ మని పేరువచ్చినది.

డిమము సుప్రసిద్ధమైన కథావస్తువుకలదై గంధర్వ, యక్ష, రాక్షస, నాగ, భూత ప్రేత పిశాచాదులైన పదునారుగురు నాయకులు కలదై, శృంగార హాస్యములు వినా మిగిలిన షడ్రసములు *కలదై, రౌద్రరసప్రధానమై మాయేంద్రజాలక్రోధోద్భ్రాంత్యాద్యను భావయుక్తమై చంద్ర సూర్య గ్రహణములు, విమర్శ సంధివినా మిగిలిన నాలుగు సంధులు, నాటకములో వలెనే ప్రస్తావనాదికములు, భారతీ, సాత్వతీ, ఆరభటీవృత్తులు కలదై ఉండవలెనని దశరూపకకారుని మతము.

భరతశాస్త్రము మాత్రం సాత్వత్యారభటీ వృత్తులు మాత్రమే ఉండవలెనని విధిస్తున్నది.

"కైశికీవృత్తి విరలం భారత్యారభటీస్ఫుటం", అని కైశికీవృత్తి తక్కువగను భారత్యారభటీవృత్తులు బహుళముగను ఉండవలెనని రసార్ణవసుధాకరకర్త సర్వజ్ఞ సింగభూపాలుని నిర్ణయము.

వత్సరాజవిరచితమైన త్రిపురదాహ డిమ మొకటి మనకు లక్ష్యముగా లభిస్తున్నది. భావప్రకాశమున వృత్రోద్ధరణ, తారకోద్ధరణ డిమములు; రసార్ణవసుధాకరమున వీరభద్రవిజృంభణమను డిమము లక్ష్యములుగా పేర్కొనబడినవి. కాని, అవి మనకు లభించుటలేదు. మనకు లభించుచున్న వత్సరాజకృతి త్రిపురదాహడిమమైనను ఇటీవల 1918 లోనే ప్రథమతః బరోడామహారాజు కేంద్రగ్రంథ భాండాగారము వారిచే ప్రకటించబడినది.

ఈ త్రిపురదాహడిమమున కైశికీవృత్తి లక్షణములగు స్త్రీ, నృత్యగీత కామోప భోగాదులు స్వల్పముగా నైనా కనిపించకుండుటచే త్రిపురదాహము రసార్ణవసుధాకరలక్షణానుగుణముగా కాక, నాట్యశాస్త్రలక్షణానుగుణముగా ఉన్నదని చెప్పవలెను.

బ్రహ్మవలన విపరీతవరములు పొందిన సర్వతాప, సూర్యతాప, చంద్రతాపులను త్రిపురాసురుల దారుణదర్పోద్ధతిచే పడరానిపాటులు పడుచుండిన ఇంద్రాద్యమరులు తమ దుర్భరదైన్యస్థితిని మహేశునకు నివేదించుకొనగా అతడు బ్రహ్మ, విష్ణు, ఇంద్ర, యమ, సూర్య, చంద్ర, వరుణ, వాయు, కుబేర, హుతాశన నిరృతి శేష, ధర్మ, కార్తికేయ, హిమవంతుల తోడ్పాటుతో త్రిపురాసురులను వారి స్వర్ణ, లోహ, రజత పురములతో సహా దహించివేయు ఇతివృత్తము ఈ త్రిపురదాహ డిమములో సలక్షణముగా నిర్వహించబడింది.

ప్రథమాంకమున ఇంద్రాదులు తమ దీనస్థితిని మహేశునకు విన్నవించుకొను సమయంలో నారదుడు సాధిక్షేపముగా రాక్షసుల దర్పోద్ధతిని అభివర్ణించి, వారందరిలో క్రోధమును రగుల్కొల్పుతాడు. కడకు మహేశ్వరునుకూడ క్రోధోద్రిక్తుడై

"సమితిపరిచితోఽహం సర్వదా సర్వదైత్యైః
కథయ! కోఽయం నారద! ద్రాక్ష్యమూర్ఖః ?

* ఆనాడు రసములు ఎనిమిదే! శాంతమునకు రసత్వమంగీకృతము కాలేదు.

విరచయతు విశంకం నాకలోకంపి నాకః
ప్రలయజలదనాథస్పర్ధి మార్వీరవర్ధిః"

—అని అసుర మర్దనోత్సాహియను పట్టున ముఖ సంధి సుసంఘటితమైనది.

ద్వితీయాంకమున కపటనారద వేషధారులైన అనీక, విపరీతులను దనుజ మాయావులు చెప్పిన మాటల వల్ల బ్రహ్మకు, మహేశ్వరునకు నారాయణునిపట్ల తీవ్రస్పర్ధఏర్పడి దనుజమర్దనోత్సాహము బీజము నష్టమైపోవుచున్నట్లు కనిపిస్తుంది. నారాయణుడిది రాక్షసులమాయఅని యోగదృష్టిచేగ్రహించి వారిని శాంతిపరుస్తాడు. అనంతరం వారు త్రిపురాసురులకు బ్రహ్మఇచ్చిన వరములను పరామర్శించి వారిని సంహరించుటకుగల అవకాశము నిర్ధారణచేసుకొని తదుద్యము సన్నద్ధులగుటతో ప్రతిముఖసంధి సర్వాంగ సంపన్నముగా ఘటింపబడింది.

అనంతరం సర్వతాప నిదేశానుసారం విపరీతుడు కపట నారదవేషమున ఇంద్రాద్యమరులవద్దకు పోయి బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు పాతాళమూలమున బంధింపబడిరని చెప్పి, నిరాశోపహతులైన వారినంద రనూ పాతాళానికి పంపుతాడు. అదే అదనుగా సర్వతాపుడు రాక్షససేనలను స్వర్గముపై దండయాత్రకుపంపు ఘట్టమున గర్భసంధి నిపుణముగా నిర్వహింపబడింది.

ద్వితీయాంకమున - చంద్రతాపుని రజతపురిని చంద్ర, హిమవంతులు; సూర్యతాపుని లోహపురిని పావకసహోయుడైన సూర్యుడు; సర్వతాపుని స్వర్ణపురిని కార్తికేయుడు నాశనము చేయుచుండగా సర్వతాపుడు తన ప్రతాపాతిశయము చేతను, విశదాశయు, శుక్రాచార్యులు తమ మంత్రశక్తిచేతను వారిని నిలువరించుట మొదలైన సంఘటనలచే ఆఘాత ప్రతిఘాతములు సముచితముగా విన్యస్తములైనవి.

అంతమున పృథివిని రథముగాను, చంద్ర సూర్యలను రథచక్రములుగాను, బ్రహ్మను సారథిగాను, హిమవంతుని విల్లుగాను, శేషుని అల్లెత్రాడుగను నారాయణుని అస్త్రముగాను, స్వీకరించి మహేశుడు త్రిపురాసురులను సంహరించుటతో నిర్వహణసంధి పూర్తిఅవుతుంది.

విచిత్రమైన ఆ రథాన్ని నారదుడు ఇలా అభివర్ణించాడు.:

దేవేనాంధకసూదనేన రథినా
సోత్సాహముద్భాసితః
ప్రాప్తోఽయం పృథివీరథోఽద్భుత తమః
సప్తానిలాశ్వైశ్చలన్।
చక్రీభూత సుధాకరార్క కిరణ
స్తోమేన విస్తారిణా
స్వర్గంగా సరసీరుహేషు యుగప
న్నిద్రా ప్రబోధాదధన్॥

ఆ రథము నాకవీథులవెంట పోతున్నప్పుడు, దానికి చక్రాలుగా కూర్చబడిన సూర్య చంద్రుల కిరణపంక్తులు విస్తారములైన వలయాకారముగా వ్యాపిస్తూ ఆకాశగంగలోని పద్మాలకు ఏకకాలమందే ముకుళన వికసనములను కలిగిస్తున్నవట!

ఇట్టి రమణీయ చిత్రణకు, రసపోషణకు నివర్శనములు ఈ డిమమందెల్ల తామర తంపరలుగ ఉన్నవి.

## ఈహామృగము

ఈహామృగశబ్దమునకు,— "మృగవదలభ్యాం నాయికాం నాయకః అస్మిన్ ఈహతే ఇతి ఈహామృగః"—అని దశరూపకకారుని వ్యుత్పత్తి. ఈ రూపక ప్రభేదమందు పరువెత్తిపోవు లేడివలె అలభ్య అయిన నాయికను నాయకు డభిలషించుటచే దీనికి ఈహామృగసంజ్ఞ ఏర్పడినది.

ఇందు వీర, రౌద్రాది దీప్తరసములు; దివ్యులైన నాయికా నాయకులు; దివ్యస్త్రీ కారణమున పలువురు వీరుల నడుమ గలిగిన యుద్ధము; ముఖ, ప్రతిముఖ, నిర్వహణసంధులు, సంక్షోభ, సంఫేట, శృంగారములు ఉండవలెనని భరతముని శాసనము. అంతమున నాయికా నాయకుల సమాగమము ఉండవలెననీ, వ్యాయోగములోవలెకాక ఏదో ఒక వ్యాజమున యుద్ధమును విరమింపజేయవలెననీకూడా నాట్యశాస్త్రమున విధింపబడింది.

"సువిహితవస్తు నిబద్ధ"మై ఉండాలని భరత ముని మతం. మిశ్రమమైన, అనగా - ఖ్యాతాఖ్యాతమైన వస్తువు ఉండాలని ధనంజయుని మతం. నాయకుడు ధీరోద్ధతుడై ఉండాలని, ప్రతినాయకుడు తన నిచ్ఛగింపని దివ్యస్త్రీని అపహరింపగోరి అయుక్త చర్యలవల్ల విఫలుడైపోవడం, ఆ విధంగా కొంత

రసాభాసంకూడా ఉండాలని; అవసరమైతే వధ ఉండవచ్చు కాని, మహాత్ముల వధమాత్రం నిషిద్ధమనీ; భారతీ, సాత్వతీ, ఆరభటీ వృత్తులు ఉండాలని దశ రూపకము విధిస్తున్నది.

నాట్య శాస్త్రకారుని — "ఈహామృగస్తు కార్యః సుసమాహిత కావ్యబంధశ్చ, యదా వ్యాయోగే కార్యం" — అన్న లక్షణానికి "కార్యశబ్దేనాంక ఉచ్యతే. తేన ఏక ఏవాంకః" — అని అభినవ గుప్తపాదుల వ్యాఖ్య.

ఒకే అంకంగాని, నాలుగు అంకములు కాని ఉండవచ్చుననీ, ఒక అంకమైతే ఒకరోజులో జరిగిన కథ, నాలుగంకములైతే నాలుగు రోజులలో జరిగిన కథ అయిఉండాలనీ నాట్యదర్పణకారుని పరిష్కారం.

రుక్మిణీహరణం

త్రిపురదాహ కర్తఅయిన వత్సరాజు రచించిన రుక్మిణీహరణ ఈహామృగ మొక్కటే ఈ రూపక ప్రభేదమునకు కూడ లక్ష్యముగ లభించుచున్నది. ఈ నాట్యశాస్త్రలక్షణము అభినవగుప్తపాదుల వ్యాఖ్యానుగుణముగ ఏకాంకిక గాక; దశరూపక లక్షణమునకు లక్ష్యముగా నాలుగంకములతో కూడి నది.

"మధుకైటభారి ప్రేమసరసీరాజహంసి" అయిన రుక్మిణిని బలవంతముగ 'విజయనోమరుభూమి' లోన వసింపజేయుటకు యత్నించుచున్న శిశుపాల దర్పోద్ధతుని దురుద్యోగమునుగురించి రుక్మిణిచే పంపబడిన సుబుద్ధియను పరివ్రాజికవలన తెలిసికొనిన శ్రీ కృష్ణ, బలరాములు రుక్మిణీ శిశుపాలుల వివాహోత్సవ దర్శనార్థం వచ్చినట్లై, యుద్ధసన్నాహసహితులైవచ్చి రుక్మిణీ శిశుపాలులను నిర్జించి, రుక్మిణిని తీసుకొనిపోవడం ఇందలి ప్రాధానమైన ఇతివృత్తం. ఈ నాలుగంకములలో ఈ కథ వీర, రౌద్ర, భయానక, అద్భుత, శృంగారాభాస, శృంగారరస బంధురముగా నిర్వహించబడింది. ప్రథమాంకమున:

పులకోద్గమపీనాంగీ కృష్ణ
  వివాహం నిశమ్య సాథవతి
మనుతే వివాహమన్యం
  స్వప్నవివాహం వరంగాతీ—

"కృష్ణునితో వివాహమువూట రుత్తిన రుక్మిణి తనువు పులకలు దేరుతున్నది. ఇతరులతో వివాహము మాట చెప్పిన ఆమె వాటిని స్వప్నవివాహములుగా భావిస్తున్నది."

కిం కథ్యతే శ్రవణమాత్ర పరిగ్రహేఽపి
దత్తోత్సవా దనుజవైరిణి రుక్మిణీషా।

"కృష్ణదేవుడు రుక్మిణినిగూర్చిన ప్రసంగము తన చెవిసోకిన ఆనందమును పొందుతున్నాడు," —అను సంతవరకు సాగిన ఆ క్రూరుని ప్రస్తావనలో రుక్మిణీ కృష్ణదేవుల అన్యోన్యానురాగము బీజరూపమున ఉపక్షిప్తమైనది. అనంతరం రుక్మిణీ, కృష్ణులు ఇరువురు కలసివచ్చి తనకు పాదాభివందనం చేసేవరకు, తనకు ప్రాణసమమైన సురను హాలాహలసమంగా చూస్తానని బలదేవుడు ప్రతిజ్ఞచేయడం; "అయిన ఉదయమే ప్రయాణసన్నాహము చేయబడుగాక" అని కృష్ణదేవుడనడంతో బీజము ఆరంభముతో సమన్వితమై ముఖ సంధి ఏర్పడినది.

ద్వితీయాంకములో వసుదేవ, కృష్ణ, బలదేవాదులకు రుక్మిణీ శిశుపాల పరిణయోత్సవాహ్వానము వచ్చుటతో బీజము నష్టమైపోయినట్లు కనిపిస్తుంది. మరల కృష్ణుడు కుండినపురరాజసౌధముప్రక్కగా రథారూఢుడై పోవుచుండగా శుద్ధాంతమునుండి రుక్మిణి, ఆమె చెలికత్తె కృష్ణుని చూస్తారు. ఆ సమయంలో రుక్మిణీ కృష్ణదేవులను కలిపివ్రాసిన ఒక సుందర చిత్రపటమును చెలికత్తె క్రిందికి జారవిడుస్తుంది.

కృష్ణసఖుడు దానిని తీసి—

"కృష్ణదేవా! స్వీకరించు. కమలముతో కూడిన నీ కరకమలమున ఇది ఏదో వచ్చిపడినది."— అంటాడు.

కృష్ణుడు:— (దానిని తీసికొని పరిశీలించి) "ఏమిది? నా రూపచిత్రము రుక్మిణీ సనాథముగా రచింపబడెనా? ప్రియంవద! చూడు! చూడు!" అంటాడు.

ప్రియంవదుడు:— (చిత్రపటమును తీసికొని చూచి)

కిం విహరసి హరిహస్తే
  మమ కరకమలస్య అవసరః

అత్రఇతి తవ పాణింప్రాప్తా
లీలా కమల మిదనిస్సారయతి

అంటూ— హరిహస్తమున ఇక నీ అవసర మేము న్నది? నా కరకమలమే అందుండ దగినది అని, ఆమె తన కరమును నీ చేతనించి, నీ హస్తమందలి లీలా కమలమును నిస్సార మొనర్చినది— అని కృష్ణదేవుని అభినందిస్తాడు.

రుక్మిణీకృష్ణుల సమాగమమును సూచించు ఈ సంభాషణలో బిందుప్రయత్న సమన్వయ రూపమైన ప్రతిముఖసంధి ఏర్పడింది.

పిమ్మట రుక్మిణి శచీపూజా వ్యాజంతో ఆలయమునకు కొనిరాబడిన రుక్మిణిని రథమం దెక్కించుకొని, కొనిపోవుచుండగా రుక్మి, శిశుపాలురు యుద్ధ సన్నద్ధులై అడ్డువస్తారు. కృష్ణుడు ఆ యిరువురను అసహ్య సమరోపమర్దులనొనర్చి, వారిని కొనిపోయి దూరముగ విడచిరమ్మని గరుత్మంతుని నియోగించి తిరిగివచ్చి లజ్జావినమ్రయయియున్న రుక్మిణిని సమీపించి—

"అయమవ్య మిందుముఖి! వైరివరేశ్వరాణాం
అద్యాపి కింవహసి భామిని! వైమనస్యం
యత్కాతరేణ తరళాక్షి! మయా ప్రియోఽపి
ముక్తః ప్రియే సమరకేళి రసోపభోగః॥

"ఇందుముఖీ! శత్రునృపతులంతా సజీవులై ఉన్నారు. ఇంకా నీకీ వైమనస్య మెందులకు? సమర కేళి రసోపభోగము నాకు ఎంత ప్రియతమమైనను నీ వైమనస్యమునకు భయపడి దానిని వదలివచ్చితిని."—అని అనునయించుటతో నిర్వహణసంధి పరిణతమవుతుంది.

## ఇతర లక్ష్యములు

దశరూపక, నాట్యదర్పణకారులు లక్ష్యముగా ఉదాహరించిన జామదగ్న్య జయముగాని, రసార్ణవ సుధాకరకర్త ఉదాహరించిన ధనంజయ విజయము గాని, సాహిత్యదర్పణకారుడు ఉదాహరించిన సౌగంధికాహరణ ఈహామృగముగాని నేడు మనకు లభించుట లేదు.

డిమములోనూ, ఈహామృగములోనూ కూడా కథావస్తువు ప్రసిద్ధమైనదై దివ్యపురుషులతోనూ, దివ్య స్త్రీలతోనూ కూడి ఉండాలని విధించుటవలన ప్రసిద్ధ పురాణకథలలోకూడా ఈ రూపక రచనకు అనుకూలమైన ఇతివృత్తం ఎక్కువగా లభించే అవకాశము లేదు. పైగా ఈరెండు రూపకలక్షణములు ఇంకా అనేక సూక్ష్మతర క్లిష్ట నియమములనుకూడా విధిస్తున్నందున కాబోలు ఈ రూపక ప్రభేదముల రచనకు ప్రాచీన కవులుకూడా ఎక్కువగా పూనుకొనినట్లు కనిపించదు.

# ఋతు లక్ష్మి

శ్రీ బెళ్ళూరి శ్రీనివాసమూర్తి

౧

శీర్షంబందుఁ జలిది నునిచెఁ క్షేత్ర మార్గమ్ము వట్టన్
వర్షప్రాయంపు నిసుగడదన్ వల్కలంబందు పొంగన్
హర్షంబయ్యెఁ హాలిక తరుణీ హావభావైక లీల
వర్షాకాలం బమృత మధుర వ్యాప్తి చేతమ్ము దన్పన్.

౨

శ్రేణుల్ గట్టుఁ జదలబఱచుఁ జేయు నేత్రోత్సవమ్ముల్
నానా భావస్ఫురణ బకముల్ నాచు హృత్సీమ నెల్లన్
ద్యోనాదంబుల్ పరవశగతిఁ దోచు నభ్రింబులేగన్
ఆనందోర్విఁ నిఖిల జగ మోలార్చు కేదారమాల.

౩

శైలాగ్రింబుల్ బిలబిల రవశ్రావ్యగాథల్ వచించున్
జాలైపొర్లుఁ సలలిత ఝరుల్ సానుదేశంబులందున్
వాలుం గొమ్మల్ విపిన తటులఁ వానజల్లుల్ విదల్పన్
ఆలోకించుఁ రసిక హృదయంబార్ద్రి కాలాగమమ్మున్.

౪

ఎందో దేశంబరిగిన ప్రియుండింక స్వస్థానమేగ
క్రిందా కార్య ప్రచయముడిగెఁ కాంతు లుబ్బాతలూపన్
సందోహంబుల్ జలదములు తచ్ఛాయ వర్షించిపోవన్
మందాక్రాంతం బగుచు పాలిచెఁ మానినీ ప్రేమవల్లి !

# జయాపజయాలు

"శండిల"

అనుకోకుండా ఆవేళ బండి ఆలస్యంగా చేరింది ఆ ఊరు. అసలు అయిదింటికే అది చేరుకోవలసింది. దానికి దారి పొడుగునా అడ్డాలే. అన్ని స్టేషనులలోనూ ఆఖరికి అతి చిన్న స్టేషనులో కూడా ఆగితీరవలసిందే. కాబట్టి నాకు మరీ విసుగుపుట్టింది. ప్లాటుఫారంమీద అడుగుపెడుతూ వాచ్ చూసుకున్నా. ఎనిమిదయ్యింది. ఎనిమిదయిందన్న గుర్తు కాబోలు 'భోం య్' మని సైరను కుయ్యోమం మొదలుపెట్టింది. స్టేషన్నుంచి బయటకొచ్చి సైకిలు రిక్షా తీసుకుని బయలుదేరాను. వాడు 'ఎక్కడికి' అని అడగనూ లేదు — నే చెప్పనూ లేదు. రోడ్డు వెంబడి ఎన్నో రిక్షాలు పోటీ పడుతున్నట్టు విసురుగా పోతున్నాయి. దారికి ఇటు అటు వున్న పెద్ద పెద్ద భవంతులకు వ్రేలాడగట్టబడివున్న సైనుబోర్డులు చూస్తున్నా. కొన్ని ఏవేవో దుకాణాలవి, బట్టలు, కిరాణా, ఫ్యాన్సీ ఇత్యాదులు. మధ్య మధ్య ఉన్నవి మంగలిషాపులు రెండో మూడో. సోడా, కిళ్లీల కొట్లు మరికొన్ని. ఇంకొన్ని హోటళ్లు. ఒక బోర్డుమీది అక్షరాలు నన్ను ఆపుచేశాయి. 'ఆపరా!' అన్నా రిక్షావాడితో. రిక్షా నిలిచిపోయింది. ట్యూబులైట్ల కాంతిలో మిలమిలలాడుతున్న, బంగారపు తాపడపు అక్షరాలా అని భ్రమగొలిపే, పాలిషు చేయబడ్డ ఇత్తడి అక్షరాలు చదువుతున్నా, "భోజనవసతి గృహము" అబ్బ! ఎంతలేసి అక్షరాలో! వాటిక్రింద వున్న చిన్న అక్షరాలే నన్ను అధికంగా ఆకర్షించాయి. "ఆధునిక పద్ధతులతో అమర్చబడిన పడకగదులు మా ప్రత్యేకత" అనే తమ పరిచయంతో. "అంటే?" అప్రయత్నంగా నామనస్సు ప్రశ్నించింది. పెట్టెలో లెదరు సూట్ కేసు పట్టుకొని రిక్షా దిగి "పట్టుకురారా! ఆ బెడ్డింగు లోపలికి" అంటూ దరదరా హోటలులోనికి వెళ్ళాను. జేబులోంచి మూడు అణా బిళ్ళలు తీసి రిక్షావాడి చేతిలో పెట్టాను. బహుశా అంతమాత్రం దూరానికి వాడు అనుకున్న దానికంటె హెచ్చే యిచ్చివుండాలి నేను. లేకుంటే సంతోషంతో మందహాసం చేసి సలాముతో వాటి నందుకుంటాడా ఆ కష్టజీవి?

నేను నిలబడ్డాను ప్రొప్రయిటరు కాష్ టేబులు ముందు. నాకు నాలుగువైపులా కొద్ది గజాల దూరంలో వున్న గోడలన్నీ నిలువుటద్దాలలో తాపబడివున్నాయి. ఎటు చూసినా నా ప్రతిబింబాలే నన్ను ఆకర్షించాయి చిరునవ్వులతో. హాలులో అరడజను ట్యూబులైట్లు వెలుగుతున్నాయి. వాట్లపై పురుగులు తెగ ముసురుతున్నాయి. టిఫెన్లు కాఫీలు వుంచడానికి ఏర్పాటు చెయ్యబడ్డ బల్లల ఉపరితలాలు చలువ రాళ్లతో ప్రకాశిస్తున్నాయి. 'ఆధునిక పద్ధతులంటే ఇవేనా?' అనుకుంటూ విస్తుపోతుంటే "ఏం కావాలండీ? స్పెషలు రూమా?" అని ప్రశ్నించిన ప్రొప్రయిటరు కంఠం వినిపించింది. "ఆఁ—ఒక రాత్రికి ఎంత ఛార్జిచేస్తారు?" అన్నాను.

"రాత్రికైతే మూడు రూపాయలు. పగలూ, రాత్రీకూడా వుంటే అయిదు" అన్నాడు.

"అలాగా? ఈ రాత్రికి వుండి రేపు పనిని బట్టి చూస్తా" అన్నాను.

"సరేనండి". అని టేబులుమీది గంటనొక్కాడు. వెంటనే ఒక నడిమి వయస్సులో వున్న వ్యక్తి వచ్చాడు.

"వీరిని ఆరోనంబరు గదికి తీసుకెళ్లు. స్నానాదులకు ఏర్పాట్లన్నీ సిద్ధంగానే వుంటాయి—పదండి" అని మమ్ముల నిద్దరను సాగనంపాడు.

మా చుట్టూ సర్వర్లు, సప్లయర్లు, ప్యాసింజర్లు చేసే రణగొణ ధ్వనిని చీల్చుకుంటూ వంకరగా మేడ ఎక్కిన మెట్లమీదుగా పోయి గది చేరుకున్నాం.

అప్పటికపుడు అక్కడ అన్ని ఏర్పాట్లూ సవ్యంగానే ఉన్నట్లు తోచింది. అద్దమూ, దువ్వెన, కొబ్బరినూనె సీసా, టేబులు, కుర్చీ, విస్త్రీమడత తుంగ చక్కని మంచం, పరుపుమీద తెల్లదుప్పటి, మెత్తని బూరుగుదూది తలగడ—ఫ్రేము అమర్చిన దోమతెర బాగానే వున్నాయి. ప్రక్కనే పదిగజాలదూరంలో స్నానాలగది. లోపల నీటిపంపు, సబ్బుబిళ్ళ — పంపుక్రింద ముక్కాలిపీట, రొత్తన గచ్చుతో గట్టిన దిమ్మ—స్నానానికి కావలసిన సరంజామంతా వుంది. వీటన్నిటిని నాకు చూపించి ఆయన క్రిందికెళ్ళిపోయాడు. ఇటు అటు గదులు పరకాయించాను. కొన్నిటిలో ఎవరో వుండి వాళ్ళ పనులు చూసుకుంటున్నారు. కొందరు తమ విలాసం తెలిపే చిన్న కార్డులు తలుపు చెక్కలకు అమర్చబడ్డ కంతలలో వుంచి గదులకు తాళాలు వేసి ఊళ్లోకి తమపనులు చక్కబెట్టుకోవడానికి వెళ్లివుంటారు.

నేను గదిలోకెళ్ళి చొక్కా, బనియనూ విప్పుకుంటూ కిటికీ తెరచి బయటి ప్రపంచంలోకి చూశాను. దూరాన పారేటి నది—ఒకవంక దగ్గరగా సినీమా లైట్లు "దేవదాసు" అంటూ వెలుగుతూ, ఆరిపోతూ ప్రకటిస్తున్నాయి ప్రజకు. మరోవైపు రైలు స్టేషను. ఓవర్‌బ్రిడ్జి, ఇంజన్లలోంచి వెలికివస్తూ వికృతంగా కారుమేఘాలను సృష్టించే పొగ — వీటన్నిటినీ చుట్టుకొని రొదజేసే జనానీకపు సొద — పట్నానికి తగ్గ హంగులన్నీ సమకూర్చుకొందిరా ఈ వూరు అనిపించింది. త్వరగా సామానంతా లోపల సర్దుకొని పది నిమిషాలేనా దాటకుండా స్నానం పూర్తిచేసి శుభ్రమైన దుస్తులు వేసుకున్నాను.

కాస్సేపు తచ్చాడి టైము చూసుకొన్నా. పది నిముషాలు తక్కువ తొమ్మిది. భోజనానికి పిలుపు వచ్చింది. లేచి గదికి తాళం వేసుకొని భోజనశాలకు వెళ్ళాను. భోజనం శుభ్రంగా, శుచిగా, రుచిగా వుంది. కడుగుకొన్న చెయ్యి తడియారకుండానే వాళ్లిచ్చిన కిళ్ళీ నములుతూ మేడమెట్లెక్కి గదిలోకి వచ్చాను. కొంచెం ఉక్కగా ఉన్నందువల్ల చొక్కా తీసి కొక్కానికి తగిలించి తలుపుదగ్గరగా వేసి, కిటికీ తెరచి మంచంమీద పడుం వాల్చాను. దూరాన నదీ జలాలపై నుండి చల్లనిగాలి గది వైపు వీస్తోంది. క్రింద రాజవీథిలోని రద్దీ కలకలం వినిపిస్తూనే వుంది. ఒక మూలనుంచి "టేబుల్ క్లీన్, ఒకరు చపాతీ, రెండు స్ప్రింగ్‌ట్" ఇంకా ఏవేవో పొలికేకల్లాగ సర్వర్లగోల.

మంచంపై పడుకొని రేపటి కార్యక్రమంగూర్చి ఆలోచిస్తున్నా.

ఊహాలు ఒక వస్తువునుంచి ఇంకొకదానికి గగనసీమలో క్రమంగా విడివడే గాలిబుట్టలవలె విస్తరిస్తున్నాయి. పట్టణం నాకు సుపరిచితమే. ఇద్దరో ముగ్గురో మిత్రులుగూడా వున్నారు. రాత్రివేళ వాళ్లను ఇబ్బంది పెట్టడం ఎందుకని ఈ హోటల్లో దిగాను. రేపు వాళ్ళను కలుసుకోవాలి. తర్వాత ఊళ్లో పనిముగించుకొని రాత్రి ఎనిమిదిన్నరకు బయలుదేరే ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణం. ఇలా తీగలు సాగుకుపోతున్న నా యోచనలను కొన్ని సంఘటనలు హఠాత్తుగా బయటకు నెట్టాయి.

నా గది ప్రక్క నుండి ఎవరో ఎగువకు వెడుతూ వుండాలి. కాలికి జోడుంటే చప్పుడవదూ? అయితే ఆ గలగలలేమిటి? బహుశా గజ్జెలు అయివుండాలి. ఒక స్త్రీ గజ్జెల పట్టీలు గల పాదాలతో నడుస్తూంటుంది. కాళ్లు కొంచెం దళసరిగా వుండివుంటాయి. ఒత్తుగా పడుతున్న సవ్వడి. క్షణంసేపు విశ్రాంతం. మళ్ళీ కొంచెం ధ్వని. మనసు తక్కిన విషయాలన్నిటిని తప్పించుకొని పరిశీలనదెసకు ఎగబ్రాకింది. ఎవరో పురుషులు గూడా వుండివుండాలి వారితో. స్త్రీల వికవికలు, పకపకలు, పరియాచికాలు, అవన్నీ అదొక రకం. బహుశా పురుషుడు స్త్రీల వీపుపై చరచి వుంటాడు. అదే చప్పుడు "రాదు! జడకొనన కట్టిన చేమంతిపూలబంతి నలిగింది. మోటసరసం!" స్త్రీ గొంతు గూడ మోటుగానే వుంది.

ఇంకొకరకం స్త్రీది ఆ నడక. ఏకతో ట్రుపాటే. లేకపోతే ఆ గాజుల గలగలలేమిటి? ఇదేం వరస? ఈ హోటల్లో ఇలాంటి వ్యాపారాలు గూడానా? ఏమో "ఆధునిక పద్ధతులం"టూ అక్షరాలు చెక్కించారు ఇందుకేనేమో!

దిగువన - రెండవనంబరో మూడోదో—అక్కడకు నడచివచ్చే ఆమెది కొంచెం నాపిరకం అయివుండాలి. లేకుంటే మువ్వలు ఒకటికొకటి ఢీకొని, కాళ్ల కడియాలు కొట్టుకుంటూ నడిచేస్తాయా? ఈ వింతల నాలకిస్తూ పరిపరివిధాల వీటినిగూర్చి యోచిస్తూనే నూహించినట్టు ఈ హోటల్లో ఆ వ్యాపారం

ఉండా లేక ఇది నా అనుమానమేనా అని తర్కించు కొంటున్నాను. పట్టణంలో ఇలాంటి హోటళ్లువుంటా యని చాలాసార్లు విన్నాను. ఏ కొక్క ఆకర్షణా లేకుండా ఎలాగ బ్రతుకుతారు వీళ్లు ఈ భవంతులను పోషిస్తూ — ప్రభుత్వానికి గాని, ప్రజా సంస్థలకు గాని ఈ కుపద్ధతులు తెలియవా? లేక తెలిసే ఉపేక్షించడం జరుగుతోందా? ఇదేదో తెలుసుకోవాలన్న ఉత్సాహం, ఉద్వేగం హెచ్చైంది నాలో. మళ్ళీ నిశ్శబ్దం. దూరాన ఊరి ధ్వనులు తప్ప అంతటా నిశ్శబ్దం ఆవరిస్తోంది.

## 2

నిశ్శబ్దం భంగపడింది. నా ఆలోచన ఆగిపోయింది. గుండె కూడా కొట్టుకోవడం మానేద్దామా అని ఆరాటపడింది. ఎవరో నా గదివైపే నడచివస్తున్నారు. సర్వమూ ఆ పదధ్వనివైపే కేంద్రీకరించి చెవులు కళ్లు చేసుకొని చూస్తున్నాను. అదొక ఆశ్చర్యకరమైన నడక. అందులో బిగువు పురుషుడిది కాదు. పాదమేదో మగవాని దసలే కాదు. ఆ అడుగులు నా గది ముంగిటనే ఆగిపోయాయి. తలుపులు మెమ్మదిగా నెట్టబడ్డాయి. లోనికి ప్రవేశించిందొక స్త్రీ. ఆలోచనలోపడి నేను తలుపు మూయ్యడం మరచిపోయి నట్లు తెలిసింది. ఆమె శరీరంమీద ఏ వస్తువుకు కదలిక ఎంతమాత్రము లేదు. స్థిరమైన హృదయం ఉండదగ్గ సుస్థిరమైన దేహం. ఆమె ఎంత చప్పుడు చెయ్య కుండా ఉండాలని ప్రయత్నించినా తలుపు నేల కానుకొని జరజరలాడింది. ఆపాటి సాకు లేకపోతే నేను ఇప్పటిదాకా అటు ఆలోచిస్తున్నట్లు ఆమెకు తెలియనివ్వకుండా ఆ దెసకు మళ్లడం ఎలాగ? మళ్ళీ తలుపును మెమ్మదిగా చేరవేసింది. ఆమె చేర్పరి గాక పోతే మూతపడకుండా తలుపు గొడవ చేసివుండేది. తిన్నగా చడీ చప్పుడు చెయ్యకుండా నడచి అద్దం వున్న బల్లమీదకు వంగి చేతిలోని గ్లాసు పక్కనుంచింది. అలానుంచుతూనే మళ్లీ ఒకసారి తన ముఖం అద్దంలో ఎలా వుందో చూసుకునే వుంటుంది తప్పక. గ్లాసు బల్లను తాకుతూనైనా చప్పుడు చెయ్యలేదు. దానిమీద సాసరు బోర్లించింది — అప్పుడూ లేదు చప్పుడు. "అమ్మయ్య!" అనుకొన్నాను స్థాయి చలించకుండా వున్న ఆ వనిత తలయెత్తి నా వైపు చూడ్డంతో.

"ప్రొప్రయిటరుగారు మీకిచ్చి రమ్మన్నారు పాలు. పడుకొనేముందు పాలుపుచ్చుకునే అలవాటని చెప్పారుట". మాటలో గూడా ఏ వదురూ బెదురూ లేదు. నిశ్చల జలపూరితమైన తటాకంవలె వుంటుంది ఆమె ఎదద? లేక తుఫాను అనంతరం ప్రశాంతతను రూపొందించుకున్న సాగరోపరితలం వంటిదా? నా పోలికలకు పొలిమేరలవుపించడంలేదు. 'నిజమే. నేను మరిచిపోయాను' అనుకుని ఇంకా అలాగే నిలుచున్న ఆమెను చూశాను. ఆమెకు ప్రత్యుత్తర మివ్వదలచుకోలేదు. దాదాపు అయిదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. మళ్ళీ నాకే ఇంకో ఊహ! ఆమె నా ప్రత్యుత్తరంకోసం నిరీక్షిస్తోందా? ఆమెతో ఏమీ మాట్లాడకపోవడం ఏం బాగుంటుంది? మళ్ళీ ఆమెను పరీక్షగా చూశాను. స్త్రీయే, కన్యకాదు. ఇరవయ్యో పాతికో మధ్య వుంటుంది వయస్సు. పట్టిపట్టి చూడకపోతే పదహారేళ్లైనా దాటవన్న భ్రమ గలుగుతుంది. స్త్రీ ఏది చెప్పినా నమ్మవచ్చుగాని వయస్సు మాత్రం నమ్మకూడదు. సంసారేతర వనితలు చెప్పే వయః ప్రమాణం సర్వత్రా సందిగ్ధమే. దీర్ఘంగా నిట్టూర్చి "సరే" అంటే రెండు ముడి అక్షరాలను వెలికి ఉమికించింది నా హృది. ఓహో! ఏమి గాంభీర్యం! ఆమాట కోసమేనా ఆమె అంతసేపు అలా వేచివుంటే? అంతే. గిరుక్కున మళ్లింది. ఆమెకు కోపం కలిగివుండదు. చిన్నతనం అంతకన్నా అనిపించదు. అవమానానికి తావులేదు. లేకపోతే కనీసం అప్పుడే విడిచిన చేమంతి పూలు అంటించివేసిన వాలుజడ సుంతైనా కదలదూ? కాళ్లుచేతులు ఇటు అటు ఆడవూ? పలుచని, సన్నని పొడవైన వ్రేళ్లుగూడా కణుపుకణుపుల మధ్య పీస మెత్తు కదలికనైనా పొందుపరచుకోలేదే — ఆమె ప్రయత్నించి ఆ అవస్థను సాధించలేదు. అసలు ఆమె తీరే అంతేమో! అయితే ఆమెకు అనుకున్నా వశం కానిదొకటి జరిగింది. మల్లు బాడీమీది గ్లాస్గో రవికపైన కప్పుకున్న పలుచని ఉల్లిపొరలాంటి వాయిల్ చీర కదలి, కొంగువోసిలి, పైటచెరగున అద్దబడ్డ వివిధవర్ణాల డిజైనులు కిటికీలోంచి వచ్చే చల్లగాలి తెమ్మెరలకు అందంగా రెపరెపలాడి ముచ్చటగా రంగుల తరంగాలు మురిపెం కూర్చాయి. మరుక్షణంలో ఆమె అవుపించలేదు. తలుపులు మళ్ళీ దగ్గరపడ్డాయి. పడుతూగూడా చప్పుడు చెయ్యలేదు. ఈ వాతావరణమంతా ఆమె గాంభీర్యాన్ని చెప్పక చెప్పు

తోంది. విచిత్రమైన ఊహల్ని నాలో చెలరేగదీసి ఆ వనిత వెళ్లిపోయింది. పరిపరి విధాల పోతోంది మనస్సు. ఆమె ఎవరు? వారాంగనా? హోటల్లో వుండే పనిమనిషా? యజమానుల బంధువా? ఛా! ఎందుకొస్తుంది? అయితే ఆలాగ ఇంకొకడికి పాలు తెచ్చి ఇస్తుందా? ఇదేదో తేల్చుకోవాలి అని తీర్మానించుకున్నాను.

నాలో సంఘర్షణ బయలుదేరింది. "ఆమె మళ్లీ వస్తే బావుండును"

"ఎందుకొస్తుందీ? నీవు వచ్చేలాగే ప్రవర్తించావా?"

"ఎలాగైనా సరే ఆమె రావాలి."

"రాగూడదు. వచ్చినందువల్ల ప్రయోజనం శూన్యం. ప్రమాదంగూడా రావచ్చు."

"ఆమె వ్యభిచారిగదా—అట్లాంటి దానికి గూడా మానాభిమానా లుంటాయా?"

"ఎందుకుండగూడదు? సంఘం ఒక్కుమ్మడిని ఒక్క అవాంఛితాలపై దండెత్తి ఆమెను నొక్కిపట్టి నలిమిపెయ్యాలనుకుందనుకో – దాన్ని తప్పించుకోవడానికి, పుట్టిన ప్రతి ప్రాణీ చచ్చేదాకా ఎలాగో ఓ లాగ శరీరం నిలబెట్టుకోవాలనే సూత్రం ప్రకారం వ్యభిచారానికే పాల్పడిందనుకో — అంతమాత్రాన ఆమెకున్న ఇతరగుణాలు కూడా లాగెయ్యడానికి సంఘానికి హక్కు ఎవరిచ్చారు? వ్యభిచారికి అభిమానం ఎందుకుండకూడదు?

"అలాంటపుడు ఆమె మళ్ళీ రావచ్చుగా— ఇంక ప్రమాదమేమిటీ?"

"ఓహో! అలాగా—నీ వూహిస్తున్నట్లు వ్యభిచారమనే దోషంవల్ల ఆమె నీ కంటికి హీనురాలు. కనాకష్టమైన క్షుద్రజీవి. అయితే అనేక ఇతర విషయాల్లో ఆమె నీకంటె అధికురాలు ఎందుకొక్కకూడదు? వాటిని పురస్కరించుకొని నీపై ఎందుకు దాడి చెయ్యకూడదు? ఏమో ఆయా సందర్భోచితంగా నీవు చిత్తవకూడదని నిశ్చయముందా?"

దరీ అంతూ లేని ఘర్షణ చాలాసేపు నాలోని విభిన్న ప్రకృతులమధ్య నడిచింది. ఒకొక్కొక్కతూరి మొదటిపక్షం క్రిందౌతోంది; ఇంకొక్కప్పుడు రెండవది తేలిపోతోంది. పర్యవసానమేమౌతుందో చూడాలనే కుతూహలం అధికమయ్యింది. ఆమె రాకపోతే బావుండును. పాలమాట గుర్తొచ్చింది. లేచి గ్లాసు ఎత్తి పాలు నోట పోసుకున్నాను. దుగ్ధంలోని మధురిమ నన్ను మత్తెక్కించింది. నేను మరిపోయాను. ఇంక ఆమె రాకకై నిరీక్షయే నాకు మిగిలింది.

ఈతూరి తలుపులు చప్పుడుతోనే తెరచుకున్నాయి. వచ్చింది ఆమె. "లైట్లు వెలుగుతూంటే స్విచ్ ఆఫ్ చెయ్యడం మరచి నిద్రపోతున్నారేమో అనుకున్నాను. మెళకువతోనే ఉన్నారా?" ఓహో! ఈ ప్రశ్న వేసిన వైఖరి నా ఎదను ఎలా గిలుపుతోంది? విధి నాటికి నారు పోసి ఆమెకే సుముఖంగా వున్నాడు. లేకపోతే ప్రతిసారి ఆమెకే చక్కని అవకాశం లభిస్తుందా సంభావణకు? ఇంక నేను తెగించక తప్పిందికాదు. "లైటు ఆర్పడం మరిచిన మాట నిజమే—ఆర్పెయ్" ఓటమిని ఒప్పుకుంటూ కూడా గంభీరంగా చూట్లాడేవాడికివలె నానుండి వెలువడ్డాయి పలుకులు. "తలుపు దగ్గరగా వేసెయ్" స్విచ్ ఆఫ్ చేసిన ఆమెతో అధికారపురస్కృతి ధోరణిలో అన్నాను. ఎంతటి ధైర్యం ఆమెది? ఆమె జాణకూడానా? ఆమె బయటకు వెళ్ళి నెమ్మదిగా నా స్థైర్యాన్ని ఊగిసలాడిస్తున్నట్లు తలుపులు ఎలా లాగుతోందో!

"ఏయ్—నిన్నే—ఇలా రా"

ఆమె రెండు మూడు మాటలనుమాత్రం వదలి నాచే ఎన్నో అనిపిస్తోంది. సరే—ఏం చేస్తాను? ఈ అవస్థను అధిగమించడం అసాధ్యంగా వుంది. నా స్థానంలో ఇప్పుడు ఎంతటి నిగ్రహంగలవాడున్నా, ఎంత ధైర్యవంతుడైనా ప్రకృతి వాటిని వాడినుండి దూరంచేస్తుంది. తప్పదు. క్షణంలో ఆమె వచ్చేసింది. బరిమీదికి నల్లత్రాచు పడగ రెత్తి వచ్చేటట్లే నాకెదురు నిలచింది. చీకట్లో కొంటె కళ్లు మిలమిల లాడాయి. ఆమె అచంచలగా నిలుచునివుంది. అబ్బ! ఎంతటి గాంభీర్యం! ఆమె కన్నులలోకి సూటిగా చూశాను. అరే—కళ్లల్లో నీళ్లు! ఎందుకూ? నే నింత సేపూ ఊహించింది నిజం కాదా? మళ్ళీ ఇంకో భావవీచిక—లేదోయ్—ఆమెకు నీ స్థితి జాలి గొలుపుతోంది. కలభం జ్యోతిని ముద్దుపెట్టుకోడానికి మీద పడుతూంటే జ్యోతికే గనుక కన్నీరుంటే ఇలాగ ఏనాడో కార్చివుండేది—"నిజంగా నేనే?!"

## 3

"ప్లీజ్, లైటు వెయ్"—ఆమెపై ఎంతో విజయం సాధించావనే గర్వంతో ఆజ్ఞాపించాను. త్రుటిలో ఆమె స్విచ్ ఆన్ చేసింది. గది అంతా కాంతిమయమైంది. ఆ వెలుగు మా ఇరువురి హృదయాలలోకి ప్రవేశించగలిగిందా? ఏమో! "ఇలా వచ్చి ఈ మంచం మీద కూర్చో" ఆమెను ఓదారుద్దామని, ఆమె దీనత్వం గూర్చి తెలుసుకుందామని, ఆమెపై జాలిబూని ఆమెను ఆదుకొందామని, ఆమెకు నీతి గరపుదామని, ఆతురపడ్డాను. మనిషిలో అహంభావం ఎప్పుడు ఏ రంగులో ఎంతటి కృత్రిమకాంతితో మెరుస్తుందో ఎవరూ గుర్తుపట్టలేరుసుమా! పైకి విజయభ్రాంతిగా అగుపించిన ఘోర పరాజయం సైతం మన కగుపించదు. ఆ దృష్టి భగవంతుడు ఏకొద్దిమందికో ఇచ్చాడు. వారే ఆదర్శాలకు అనుగుణంగా కఠోరవ్రతాన్ని చేబట్టి ప్రవర్తిల్లగలరు.

నా ఆజ్ఞప్రకారం ఆమె తూచా తప్పకుండా నడుచుకుంటోంది. వెంటనే వచ్చి పరుపుమీద నాకు ఎదురుగా అతి సమీపంగా కూర్చుంది. మా ఇరువురకు మధ్య అడుగు ఎడమైనా లేదు. ముఖాలు, కళ్లు ముఖాముఖీని కొన్ని అంగుళాలమేరకు వచ్చేశాయి. నాకు ఆ క్షణంలో గలిగిన ఆశాభంగం వర్ణనాతీతం. ఇంతకైనా ఇంద్రజాలం ఇమిడి వుందా? చీకట్లో ఆమె కళ్లు నాకు అలాగవుపించాయా? ఆమె నవ్వుతోంది. అది సాధారణపు నవ్వు గాదు. పకపక నవ్వేసినా బాగుండును. పువ్వులాగ పెదిమలు విప్పారి లీలగా మందహాసాన్ని మహాస్త్రంలాగ నా కళ్లల్లోకి ఆ కళ్లు ప్రయోగించాయి. క్షణంముందు ఈ నవ్వునే కన్నీళ్లుగా మార్చానా? అబ్బే—లేదు. నన్ను నేనే నమ్మలేకపోతున్నానేమిటి? నా నిశ్చయం, నా పథకాలు పునాదులకంటా కదిలిపోతున్నాయి. నన్ను వ్యథపాలుచేసి బాధపడుతున్నాను నేనని తెలియాకేమో కొంతసేపు ఆ చిరునవ్వును పొడిగించింది. నన్ను జయించినందుకు గర్విస్తోంది అనుకున్నాను. లేదూ ఆ నవ్వుతో నామీద కక్ష సాధిస్తోందా? ఈమెనెలాగైనా సరే జయించి తీరాలి. నాలో ఉక్రోశం పులుముకుంది. నాకుగా నేనే అనేక ఊహల సుడిగుండాలు నిర్మించుకొని వాటిలో చిక్కుకొని ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నా.

"నీ పేరు"

"రజని"

"మీదీవూరేనా ?"

"ఒక వూరేమిటి" హేళన ధ్వనించింది.

"వృత్తి" సూటిప్రశ్న వాడి.

"వృత్తా—చూస్తున్నారుగా" నవ్వు పెదవుల దాటింది. బియ్యపుగింజలవంటి పలువరుస లీలగా వెలుగు చిలికింది.

"ఇది నీచం కాదూ?" గంభీరమైన నా సవాలు.

"నీచమా? ఎందుకో" ఎంతటి నిర్లక్ష్యం ఈ సమాధానంలో.

"అభిమాన మనేది వుంటే" నా క్రోధ నిస్వనం.

"అభిమానమా—బోలెడు వుంది" నిష్పాటమే దీనిలోనూ.

"ఉంటే" సందిగ్ధత వెలిబుచ్చాను.

"ఉన్నదని రొమ్ము విరుచుకు నేవాళ్ళకంటె" సమాధానం తీవ్రరూపం దాలుస్తోంది.

"నీకు వివాహమైందా?" ఎందుకో ఈ ప్రశ్న.

"అయితే— ఇలాంటివాళ్లదగ్గర ఎందుకుంటానూ?" నన్ను దెప్పుతోంది అవినీతిపరుడ్నని. నా నీతి, నిజాయితీలు ఈమెకు చూపించాలనుకున్నాను.

"అయితే దయచెయ్. ఇక్కడెందుకు?"

"అలాగే వెడతాను. మీ రేది చెబితే అదే చెయ్యాలి ఇప్పుడు ఇక్కడ. కాకున్నా రాజ్యమేలేది మీరు. న్యాయమైతే మటుకు మామాట ఎవరిక్కావాలి. ఇదే మాపని. రమ్మంటే రావటం, పొమ్మంటే పోవటం" ఘాటెక్కుతోంది విమర్శ. "ఇప్పుడు పొమ్మంటే పోతున్నా—మళ్లీ రమ్మంటే రావలసిందేగా—ఈసారి ఏదీ మరచిపోకండి" ఆమె లేచి నాసుబాము వడిగా పాకినట్లు నడిచి గదిబయటకు వెళ్ళింది. నిజంగా త్రాచుకున్నంత రోషమూ, పగా ఆమెలో ఉన్నాయని,— నేను కామంవల్ల గాని ఎదుపిక్కయేమో అని భ్రమించిన— నేత్రాలు పదేపదే నాలో ప్రతిధ్వనింపజేశాయి. నా సవాలుకు ఎదురుసవాలుచేసి ఆమె వెళ్ళిపోయింది. ఆమె స్థితినిగూర్చి తెలుసుకొంటూంటే నాకు చిత్రంగా మూడు పోలికలు స్ఫురించాయి.

ఒకడు గజదొంగ. స్వతహాగా ఎలాంటివాడైనా క్రమేపీ రాటుదేరాడు. దొంగతనం వృత్తిగా,

దలాకీగా, సులువుగా చేసేస్తాడు. నదురూ, బెదురు వుండదు. సమాజం వాడికి పనివ్వక వాణ్ణీ, పెళ్లాం బిడ్డల్నీ మాడ్చేయ్యాలని పగబట్టింది. ఆ కసి వాడిలో దాగివున్న దౌర్జన్యప్రవృత్తిని నిద్రించే ఫణిరాజు నెత్తిపై తన్నినట్లు ఉద్రిక్తపరచింది. వాడు ఆ ప్రవృత్తి ప్రకోపంవల్ల తన్ను ఆ హీనస్థితికి లాగిన ఆకలిమంటలలో మాడ్చి దహించదలచిన సంఘంపై కక్ష తీర్చుకోడానికి దీక్ష బూనాడు. దొంగగా మారాడు. వృత్తిగా చేపట్టాడు. ఆదెప్పుడైతే జీవనాధారంగా స్వీకరించాడో మనం జీవనం కోసం ఎలా బాధపడతామో అలాగే బాధపడతాడు. పట్టుబడితే తాపులు తింటాడు. జైలుకి వెళ్తాడు. మళ్ళీ బయటకొచ్చినా అదే పని. అందుకై అది చేయడంలో ఏమీ అనుమానం వుండదు. వాడి జీవితం సాంతం దొంగతనంలోనే గడపాలని ముద్ర వేసుకొన్నాడు. వాడికి మనం అనుకునే మానాభిమానాలు, నీతినియమాలు ప్రమాణాలు కావు. వాటి కెదురీదడమే వాడి ఆశయం.

బ్లాకుమార్కెటు చేసే షావుకార్లు. ఎదుటివాణి ఆ నేరానికే సంకెళ్లువేసి జైలుకు తీసుకెడుతూంటే ఆ తీసుకెళ్లేవాళ్లకే మస్కా వేస్తాడు. అరీత్యా ధనార్జనే వాడి వృత్తి. వాడూ మానాభిమానాలు తనకు చిత్రంగా నిర్వచించుకుంటాడు.

రాజకీయవేత్తో! వాడూ అంతే. ఒక అవినీతికి పెద్దపాము నోటబడ్డ వైకుంఠపాళీ పావులాగ మొదటి గడికి దిగి మరుక్షణంనుండి మళ్లీ నిచ్చెనలు, ఆశలు, ఎన్నికలు—మామూలుంటాడా? మళ్లీ ఎదిగొచ్చినా అదే ఆట. అది వాడి వృత్తి. మానాభిమానాలు వాడూ చిత్రంగానే చిత్రించుకుంటాడు. మునిసిపల్ చైర్మనులు, ప్రభుత్వోద్యోగులు, అధికారులు, వేశ్యలు—ఒకరేమిటి—అందరూ ఒకరికి తెలియకుండా ఇంకొకరు వేరు వేరు రంగాలలో రంగు రంగులలో దోపిడి చేస్తున్న గజదొంగలే. మొదట్లో అందరు మంచివాళ్లే. అయితే దౌర్బల్యంవల్ల సంఘం తనకుగా తాను వాళ్లను ఆ యా నీచాతినీచకృత్యాలకు పురికొల్పి తద్వారా తనకుతానే సృష్టించుకొన్న వాగురలో తను లోకాని వ్యాధులతో కుళ్లుతో, అవినీతితో కుములుతూ వుంటుంది. ఈ ఇంద్రజాలాన్ని నటించడంలో రజని కూడా ఒక ప్రముఖ పాత్రధారి యని నిశ్చయమైంది.

## 4

పడుకుందామని ఎంత ప్రయత్నించినా నిద్ర రాలేదు. టైము దాదాపు రెండౌతున్నది. ఒళ్లు క్రమంగా నీరసంతో సోలిపోతోంది. లేచివెళ్లి లైటు ఆర్పడానికి కూడా ఓపిక సన్నగిల్లింది. అనుకోని అనేక సంఘర్షణలు నన్ను బలహీనపరుస్తున్నట్లయింది. ఎలాగో వెళ్లి కిటికీ తలుపులు తెరచాను. కొండగాలి మళ్లీ వుంటుంది. శరదృతువైనా హేమంతపు వాసనలు తగిలాయి. చల్లగా మెల్లిగా తాకింది శీతల పవనం. 'దేవదాసు' రెండో ఆట అయిపోయిందనుకుంటాను. ఆఖరి ఘట్టంలోని పాట నెమ్మదిగా చెవులకు సోకుతోంది. "జగమే మాయ బ్రతుకే మాయ — వేదాలలో సారమింతేనయా" వినిపిస్తున్నాడు ఇంకా ఏదో దేవదాసు తాగుబోతు. ఎందుకు ఈ శుష్క వేదాంతం ప్రచారం చేస్తున్నారు వీళ్లు? లేకుంటే ప్రజల బలహీనతను అలుసుగా గ్రహించి దానిపై డబ్బు చేసుకుంటున్నారా? దేవదాసు ఆ స్థితిలో ఎలాగుండివుంటాడో ఊహించారా డైరెక్టరుగాని, నిర్మాతగాని? తాగుబోతునోటంట తత్వమేమిటే అని ఆలోచన కలగలేదూ? ప్రజల అమాయికతను పసికట్టి ఎన్ని విధాల వాళ్లను దోచుకోవాలో అన్ని విధాలా గుల్ల చేస్తున్నారు. కొద్ది నిమిషాలక్రింపట ఉక్కపోసినట్లున్న నాకు ఆ చల్లనిగాలి తగలడంతో దేహం వణకడం మొదలైంది. మళ్లీ లేచి కిటికీ మూసి మంచంపై చదికిలబడ్డాను.

రజనినిగూర్చిన ఆలోచనలు నాకు కునుకు రానియ్యడం లేదు. ఆమె ఎవరైయుంటుంది? ఏ పరిస్థితులకు బానిసై ఇలా మారిపోయింది? సంఘాన్ని ఆమె ఎలా చూస్తోంది? ఆమెవంటి వాళ్లు బయటపడే మార్గం? అసలు వాళ్లను బయటకు తీసుకురావడమేమిటే? చెయ్యి అందిద్దామనివెడితే ఆమెతోబాటు ఆ రొంపిలో ఇరుక్కుపోతే? ఏమైనా సరే ఆమె బ్రతుకునుగూర్చి తర్కించాలి. ఇలాగనుకుంటూంటే రజని మళ్ళీ వచ్చింది.

ఇప్పుడు నాలో అవాంఛనీయ ఉద్వేగాలు ఏమీ లేవు. సరాసరి ఆమె నావద్దకు వచ్చింది. తన కుసుమకోమల హస్తంతో నన్ను తట్టి "ఇదిగో! నన్ను గూర్చి వ్యథచెంది మనసు పాడు చేసుకోకండి. లైటు ఆర్పుకోలేదు. తలుపు వేసుకోలేదు" అన్నది. ఆమె

స్పర్శ, పలుకుతీరు నాకు ఆమె సానుభూతి ప్రకటిస్తున్నదన్నాయి. మనుషు లెంత చిత్రంగా ఉంటారు! ఆమెయందు దొరకలాగున కరుణ వహిస్తున్నానని నే ననుకుంటూంటే ఎందుకో నేనంటె ఆమె జాలిపడుతోంది. "అలాగే, లైటు ఆర్పేసి పడుకుంటా" అని లేచాను. కొక్కానికి తగిలించిన చొక్కా జేబులోంచి కలం తీసుకున్నాను.

"ఏమైనా వ్రాదా మనుకుంటున్నారా?" ప్రశ్నించింది.

"ఔను"

"ఏమిటని?"

"ఏదో ఒక అనుభూతి"

"అడగడం మరచాను. మీరేం చేస్తుంటారు?"

"ఏమీ ఉద్యోగం లేదు. పత్రికలకు అప్పుడప్పుడు కథలు వ్రాస్తుంటాను."

"మీకు... పెళ్లయిందా?" నే నడిగిన ప్రశ్నలన్నీ వరుసగా వేస్తోంది.

"లేదు"

"లేదూ!" ఎంతో ఆశ్చర్యం ప్రకటించింది

"నీవు చదువుకున్నావా"

"ఏదో ఆరో తరగతిదాకా వెలగబెట్టాను"

"కథలు చదవగలవా?"

"పత్రికలు తరచు తిరగేస్తుంటాను"

"నీవు మళ్ళీ ఎందుకొచ్చావు?"

"నిజంగా అడుగుతున్నా—ఒకటి చెప్పండి. మీరు నన్ను గురించి మథనపడుతున్నారు."

"ఊఁ... ఊఁ... లేదు—లేదు."

"అబద్ధం ఎందుకూ? ఇన్నాళ్ళకు ఎదుట నిలిచి మాట్లాడగల ధీమా నాకు కలిగించే వ్యక్తి కనుపించారు ఒక చిన్న మనవి."

"ఏమిటది?"

"ఒక పరాయి ఆడుదాన్ని గూర్చి ఇంత బాధ చెందడం అనవసరం. అది ఒక వ్యాధియై మిమ్ము పీడిస్తుంది. ఈ జబ్బు చాలా గడ్డుది. దీన్నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది. వ్యసనాలన్నిటికన్నా స్త్రీ వ్యసనం చెడ్డది. ఆడుదాన్ని బాగుచేయడం అనేది కూడా వ్యసనం వంటిదే. సంస్కారానికని, ఆమెను లేవనెత్తడానికని లేనిపోని బాధలు పైవేసుకొని కుమిలి కుమిలి తుదకు అదే యావతో శుష్కించి యౌవ్వనం పాడుచేసుకుంటారు." ఆమె సుదీర్ఘ వ్యాఖ్యానం కొనసాగించింది. తనకంటె ఎన్నోరెట్లు బలహీనుడై తనచే ఓడింపబడ్డ ప్రత్యర్థిని దయతో చూసి మాట్లాడే వస్తాదు వదనా లిది. ఆమె వెళ్ళిపోయింది. వెడుతూ స్విచ్ ఆఫ్ చేసి తలుపు దగ్గరగా బిగించి వేసింది—ఆ బిగింపు ఇంక తిరిగి ఆమె రాదని నాకు స్ఫురింపచేసింది.

మనస్సు ఒక నిశ్చయానికి వచ్చింది. దానితోపాటు అది కొంత శక్తిని ఉత్తేజాన్ని ప్రసాదిస్తున్నది. నేను లేచి త్వరగా నడిచి తలుపు గడియపెట్టాను. లైటు వేశాను. మంచంమీద కూర్చొని కాగితాలు పుచ్చుకొని కలం తీసుకున్నా. స్థాయి కుదుర్చుకున్న చిత్తం. సంస్కారానికి దారితీసే నిర్ణయం. నిరాటంకంగా నిటారుగా చొచ్చుకొనిపోయే భావప్రవంతి. కలం చకచక సాగిపోయి కాగితంలో తెల్లదనాన్ని వెలితిచేస్తోంది కాలం నాకు తెలియకుండా ఎలా గడచిపోతోందో—

"ఆమె చరిత్ర చాలా చిత్రమైనది. అవనిలో అటువంటి ఆడవాళ్లు అతి అరుదుగా అవుపిస్తారు. ఈ ఇతివృత్తం వింటే మీరు విస్తుపోతారు. ఇట్లాంటి వ్యక్తులుంటారా అని మీ మనసు మిమ్మల్ని ప్రశ్నిస్తుంది. నిజం కల్పనకంటె చిత్రంగా వుంటుంది. కల్పనను మించిన కల్పన కవిని మించని రవి కల్పించాడా అనే భ్రాంతి జనిస్తుంది.

తల్లిదండ్రులకు కడుపుట్టు ఆడబిడ్డ ఆమె. వాళ్లు చేసిన పాపమేమిటో—బిడ్డలు యుక్తవయస్కులై కొందరూ, కాకుండా కొందరు క్రమేణా కాలం చేశారు. అయినా ఏడు వచ్చేసరికి ఆ కుటుంబంలో మిగిలిన నలుసు ఒక్కతే అయింది ఆమె. వారిది బ్రతికి చెడ్డ సంసారం. తల్లిదండ్రుల్ని పట్టుకున్న పూర్వపు వాసనలు ఆ పూరు తిమురు అచ్చిరాలేదన్నాయి. ఏది రుచిచూచినా చేదుగా వుంది. పూలు నమ్మిన రాజవీధిలో కట్టెల కావడి మోయలేకపోయాడు ఆ మోతుబరి. గంపలో ఇరికించుకొనే కాసికి కుదించుకుపోయిన తమ పెద్దయింటి సంసారాన్ని నెత్తికెత్తుకొని ఆయనా, అయిదేళ్ల పసిపాపను చంకనిడుకొని ఆమె తల్లి కాలినడకను గడిచారు ఎన్నో వూళ్లు.

చెరుకువాడ లో పల్లెటూరూ పట్నవాసమూ కాని మధ్యరకపు గ్రామం. పుచ్చుకున్నాడు రెండెకరాల కొండ్ర కౌలుకి. కాని కల్లీవ గంజితాగి ప్రొద్దు బుచ్చడానికే సిద్ధపడ్డాడు. అయినా పొయ్యికిందికీ మీదకీగూడా ఆ ముగ్గురూ సరిపెట్టలేక పస్తు పడుకున్న రోజులూ ఉన్నాయి. ఒక యేడాది రాటగానే వీధిబడిలో వేసింది ఆతల్లి పిల్లను. కూతురుకు రెండు ముక్కలు చెప్పించాలని ఆ ఇల్లాలి తపన. అక్కడే అయినా వరహాలు అని పేరుపెట్టుకున్న ఆపిల్ల బొంగరంలాగ వీధంతా తానే తిరిగేది. లేమి, తమ పిల్లలకంటె దాని అందం, చురుకు, తెలివితేటలు నూర్డింతల్లా పొరుగింటి వాళ్లకు వరహాలనే పేరు ఈసు పే ఇమడుకుంది. వాళ్ళనే నూటిపోటీ మాటలన్నీ వింటూ పల్లెత్తుమాట నకుండా పిల్లను బల్లగా బతొన్నన్ని పొదుగుల్లో ఇము డ్చుకుని లోకవాకునూ పాలు కుడిచే గోమాతలాగ అక్కున చేర్చుకునేది తల్లి.

రెండేళ్లు గడిచాయి. కౌలుకు పుచ్చుకొన్న పొలం వాళ్లమీద కసిపట్టినట్లు సరిగ్గా పండడం చాలించుకుంది. పెట్టుబడుల తోలూరు వడ్డీలు గుణించుకుంటున్న నోట్లు పేదవాని జీవాత్రకు పెదవి విరుస్తున్నాయి. ఇంక బాకీ తీర్చ గాలేదు. "ఈపాటికి దయచెయ్ వాయనా!" అన్నాడు భామంధు. అఖరికి జీవనోపాధి కూడా కరువయ్యింది. నీళ్లింకలూ, గడ్డికావడీ ఎత్తి ఒక ఏడాది వాగ సంపాడు. గతొన్ని తెలుసుకుంటూ సుందెల సుబ్బులలో కాళరాత్రులు గడపలేక వయసుతో బాటు ఆ తల్లిదండ్రుల జీవాలు తిరపలైపోతున్నాయి. అయితో తిరగలిలో అందరికంటె అతిచక్కగా చదువుకున్న బిడ్డను పనిలో పెట్టవలసివచ్చింది. ఆ వూరి కాఫీ హోటల్లో దాసిగా కుదిర్చారు. పిండి రుబ్బడం, నీళ్లు మొయ్యడం, అరిటాకి పండేసి త్రాగి ఖాళీచేసిన గ్లాసులూ, కప్పులూ కడగడం, ఇల్లు తుడవడం ఈ మొత్తం పనులకు నెలకు ఆ అయ్యారు అయిదు రూపాయ లిస్తానన్నాడు. వాడికి పట్టుమని పద్దెనిమిదేళ్లు లేవు. ఆరువందల మైళ్లు తిరువనంతపురంనుంచి వచ్చి, ఆ వూరు వతను గనిపెట్టి వండుకు తింటూ, ఒక్కడూ స్వయంకృషివల్ల దమ్మిడీలు రూపాయలుగా మార్చడానికి తాపత్రయపడుతున్నాడు.

పదో యేట వరహాలు కాఫీహోటలు పనుల్లో కమిలిపోతూంటే గుండెనీళ్లు గుక్కుకొనేవారు తల్లి దండ్రులు. వాళ్లుమాత్రం ఏం చేస్తారు? తిండిలేక మాడి చస్తూంటే ఊరూ వాడా నిర్దాక్షిణ్యంగా చూసింది గాని వాళ్ళకిన్ని గంజినీళ్ళైనా పొయ్యలేదు. అయ్యారు ఏ నెల కా నెల ఖచ్చితంగా అయిదు రూపాయలూ ఇచ్చేవాడు. తల్లి పిల్లతో పాటు తిరుగుతుంటూ చిన్నపనీ చితకపని మప్పింది. సహజంగా తెలివిరి, గడుసరి ఒళ్ళు దాచుకోడ మెరుగని అమాయిక, వరహాలు అనతికాలంలో ఆ పని లోనూ ఆరిందా అయింది. తండ్రి దొరికినప్పుడెల్లా కూలికి పోయేవాడు. పొరుగిళ్ళవాళ్ళకి తల్లి పిడకలు చేసి, వడ్లు దంచి, బాగుచేసి, ఇళ్ళు అలికి ఇల్లు చేసి సాయం త్రానికల్లా అర్ధరూపాయకు తక్కువ గాకుండా సంపాదించేది. దియ్యయుంటే ఉన్నన్నాళ్ళు చిన్న తినగా మిగిలిన పచ్చడి లేక పులుసు—నీళ్లలో నాన వేసిన మెతుకులు గంజి పోస్తే అదే ఘనంగా కళ్ళ కద్దుకుని పుచ్చుకునేది. అయ్యారు ఒక అర రూపాయి వాళ్ళకి. సంక్రాంతిపండుగకు వరహాలుకు ఒక గౌనూ, పరికిణీ కుట్టిస్తానన్నాడు. జీతం. పది రూపాయలిచ్చినా దక్కనిపని అయిదు రూపాయలకే అమరుతోంది. అమాత్రం పెట్టలేడూ! ఆ తల్లికి ఆ మాటే వెయ్యి వెయ్యిరూపాయల విలువ చూపింది. పిల్ల వరహాలుకు ఈమాటలు వింటూంటే ఎంతో ఆనందం కలిగింది. తనకు ఊహ వస్తోంది. క్రొత్త పరికిణీ, గౌనూ ఎలాఉంటాయో! ఇప్పటిదాకా క్రొత్త అనే మాట ఆమె వాదకాల్లోనే వదిలింది. అదెలాఉంటుందో చూడాలి తనకు. ఓహో! ఆమె మనసు మెలకత్తెటప్పుడు ఆశ లెలాఉంటాయో! మగాడిమాటలా ఉన్నా ఆడదానికి కూడున్నా సరే లేకున్నా సరే ఒంటికి నిండా పస్త్రంగా బట్టవుంటే కనుపు ఎడవను. నిజంగా బట్టలేని కారణంగా ఎందరు సుందరుల అందం వాళ్లను కట్టెలుగా విలపిస్తోంది! ఆ దొర పిల్లకు బాగా పని చేసింది. క్రొత్త బట్టలకోసం చేతులు పుట్టించేసుకుంది రుబ్బురోలు దగ్గర కూర్చొని. పిండి విసిరి విసిరి ఆ పాప అర చేతులు కసుముకుట్టాయి. గిన్నెలు తోమితోమి గీసుకుపోయాయి అతి సున్నితమైన వేలికొనల అంచు లన్నీ. "ఇంకా సంక్రాంతి ఎన్నాళ్ళకే" అని అడిగేది తల్లిని. "ఏమే—ఎందుకూ" అంటే "అమ్మా! అయ్యారుగారు నాకు క్రొత్త పరికిణీ, గౌను కుట్టిస్తా నన్నారుగాదే" అనేది నవ్వుతూ. కూతురు మాటలు వింటూ పైకి నవ్వలేని లోపల్లోపల కుమిలిపోయే వారు తల్లిదండ్రులు.

మనం ఎలాగున్నా కాలంమాత్రం ఆగదు. జొన్ని పోతుండనమే దాని విధి. "అయ్యరుగారూ! ఈ సంక్రాంతికి వరహాలుకు ఓ చిన్న చీర, అరగజా లది చాలండి; ముప్పాతిక ముక్కే చేరదికె—కాని పెడుదురూ" ప్రాధేయపడింది తల్లి. "చూద్దాంలే—ఇంకా ఈ పేండెలేగు గదా" అన్నాడు పెరకోవను ఆలోచించే అయ్యరు. "అడిది గాదుటండీ—తను జలవ" అని ఆమె సెలవు పుచ్చుకుంది.

# వినోదం

శ్రీ యామిజాల శంకరం

A. B. — అనే రెండు దేశాల మధ్య సంకుల సమరం సాగుతోంది. మానవాళికి మృత్యుగహ్వరం తెరుచుకుంది. అదంతా పైశాచిక ప్రళయతాండవం.

అయితే యుద్ధం ఎందుకు జరుగుతోందో, ఎవరికీ తెలియదు. రెండు దేశాలూ సర్వ సంపత్సమృద్ధము లయినవే! అన్ని దేశాలలా కాకుండా యీ రెండు దేశాలలోనూ కలిగినవారే ఎక్కువ; లేనివారు బహు తక్కువ. మొత్తంమీద యుద్ధం కొనసాగుతోంది.

'A'—అనే దేశంలో 'ఎర్నెస్టు'—అనే వ్యక్తి ఉన్నాడు; అతనొక కెప్టెన్. అతిసామాన్య సైనికుడుగా చేరి భుజబలంవల్ల, బుద్ధిబలంవల్ల, అసమాన ప్రజ్ఞానైపుణ్యములవల్ల అతిత్వరలో యీపదవి నాక్రమించగలిగాడు.

సాహసోపేతములైన అతనిచర్యలకు మెచ్చి ప్రభుత్వం అతనికి అనేకబహుమతులిచ్చింది. సర్వసైన్యాధిపతి అతనికి ప్రత్యేకంగా ఒక బంగారు పతకాన్ని బహూకరించటమే కాకుండా, 'వీరవరుడు' — అనే బిరుదప్రదానంకూడా చేశాడు. అతనంటే ప్రజకూ, ప్రభుత్వానికీకూడా ఎంతో మెచ్చుకోలు. అందుకే ఆ వీరవరునకు అమితగర్వం; పట్టరాని అహంకారం.

దానికితగ్గట్టు భీకరమైన విగ్రహం. మేఘగర్జనంలా ఉంటుం దతనిగొంతు. అజానుబాహుడు, వెడల్పయిన వక్షస్థలం. ఆ విశాలనయనాల్లో అగ్నిజ్వాలలు రేకెత్తినట్లు, రక్తపుజీరలు రగులుకుంటూ ఉంటాయి. పదిమంది మహాబలవంతులు మీదపడితే ఒక్క విదిలింపులో అల్లంతదూరాన పడతారు.

ఎప్పుడూ చిత్తుగా త్రాగి, మత్తుగా పడుంటాడు. 'శత్రువు'—అంటే మండిపడతాడు. మనుష్యుల్ని చంపటానికి మహోత్సాహం చూపుతాడు. అతను త్రాగే సిగరెట్టు విలువైనా యివ్వడు మానవప్రాణికి. కొన్ని సంవత్సరాలనుంచీ యీ భయంకరప్రవృత్తి కలవాటు పడ్డాడు. ఎల్లప్పుడూ మానవుల ప్రాణాలు తీయటమే అతని పని అయినందువల్ల, దయా, జాలి, ప్రేమ— అవి అసలెలా ఉంటాయో అతనికి తెలియదు.

గుడారంలో పడుకున్నవాడికి యుద్ధభూమి చూడాలని బుద్ధిపుట్టి బయలుదేరాడు. తన బలగంతో తను చాలామందిని హతమార్చగలిగాడు. తనకు వప్పజెప్పిన ప్రాంతమంతా నాశనంచేసి వదలిపెట్టాడు. అదంతా తన నేర్పరితనం. బుద్ధికౌశలం. కాకపోతే మరొకడు ఆమాత్రం సైన్యంతో అంత బీభత్సం చేయగలడా?

ఆ వీరవరుడు కొంచెం ముందుకు నడిచాడు. శవాలు కాలికి తగిలాయి; బూటుకాలితో బంతుల్ని తన్నినట్టు తన్నేశాడు. వికారాకృతులైన శవాలు— ఒకదానికి కాళ్లు లేవు—మరొకదానికి చేతులు,— ఇంకోటికి వట్టి మొండెమే!...వట్టి తలలు మాత్రం అక్కడక్కడా ఉన్నాయి. కొన్ని ముఖాలు ఆశ్చర్యంగా...కొన్ని వికృతంగా......దీనంగా; పలు రకాలు—ఎడ నెడా కొన్ని మూలుగులు వినిపించుతున్నయ్. మధ్య మధ్య యీ వీరవరుడు "సెహబాష్" అనుకునేవాడు.

తల దించేసరికి ఉరస్సుమీద మెరిసే పతకాలు తళుక్కుమన్నప్పుడల్లా అతని హృదయం ఆనందంతో జలదరించేది.

తలెత్తాడు. తన సైనికులు దగ్ధపరచిన శత్రుపట్టణం పూర్తిగా నేలమట్టమయింది. ఆ బూడిదలో నుంచి నిప్పురవ్వలు రివ్వగాలికి రాజుకుంటున్నాయి. "బాగుంది......" నవ్వాడు.

ముందుకు నడిచాడు. ఒక సైనికుడు కాలికి తగిలాడు; అవసానదశ—స్పృహ లేదు—ఇక రాదు. తల

వాలిపోయింది. ఎప్పుడోగాని గాలి పీల్చడు. ఆ పీల్చినప్పుడు కొంచెం తల పైకి లేస్తుంది. నోటితో పీలుస్తాడు. ఎక్కిళ్లు వస్తున్నాయి. నడుములదాకా కాళ్లు తెగిపోయాయి. "ఏఁయ్"—అంటూ పిలిచాడు. కాని కదల్లేదు. బూటుకాలితో చిన్నగా తన్నాడు. అంతే ఒకే ఒక్క శ్వాస పీల్చాడా వ్యక్తి. మరివా పీల్చలేదు.

అతనింతవరకు మనుష్యుల్ని చంపినమాట వాస్తవమే. కాని చస్తున్న మనిషి నెప్పుడూ తనింత యిదిగా చూడలేదు. ఇప్పుడు చూచాడు.

"జీవితం ఇంతేనా!..." అని ఒక్కసారి అనుకున్నాడు. అతనిజీవితంలో అలా యోచించింది అనుకుందికూడా అదొక్కసారే. అదైనా ఒక్క క్షణం. తలెత్తి నిట్టూర్చాడు. నడచాడు.

ప్రాణంతో పోరాడుతూన్న శరీరాలు కొన్ని కనుపించాయి. శరీరభాగాల్లోంచి రక్తం కారుతోంది. అతనిముందు పడ్డాడు, అందులో ఒకవ్యక్తి, చైతన్యం ఉండి, శక్తిలేక ప్రాణంతో పోరాడేజీవి.

"దాహం ... దాహం ..." అరుస్తున్నాడు. ఇతను '*B*' దేశపు సైనికుడు. పేరు మొరల్. బలమైన దెబ్బలు తగిలాయి. ఒకకాలు మణికట్టుదాకా ఎగిరిపోయింది. ప్రాణాలింకా ఉన్నాయి. శరీరమంతా రక్తంతో తడిసి ముద్దయింది. బాధ భరించలేక మనిషంతా విల్లులాగా వంగిపోతున్నాడు. దాహంతో అతనినాలుక పిడుచకట్టుకొనిపోయింది. కడుపు చేత్తో పట్టుకున్నాడు.

తలెత్తాడు మొరల్. ఎర్నెష్టు తన శత్రువని గ్రహించాడు. కెప్టెన్ అతన్ని చూస్తూ నిలుచుండిపోయాడు. అతనిలో ఆవేదనా లేదు, జాలీలేదు... ఊరికే చూస్తున్నాడు..

"నువ్వా! ... నువ్వు నాకిలా సహాయపడతావు" అన్నాడు మొరల్—వణుకుతోంది గొంతు. తొణుకుతున్నాయి మాటలు. గట్టిగా, బాధతో మూలుగుతూ, శరీరమంతా మెలిపెట్టుకుంటూ దొర్లాడు.

"సహాయం!...పవిత్రమైన నా దేశాన్నాక్రమించుకోవటానికి ప్రయత్నించే వైరిదేశాన్ని, వారి సేనలను నాశనంచేయటానికి కంకణం కట్టుకున్న మహావీరుడు... మేధావి...నీకు సహాయపడటమా!... హహ్హహ్హహ్హ..."

"నవ్వకు; చూడు! నేనూ ఒకప్పుడు నా దేశాన్ని చాలా పవిత్రంగా భావించాను. ఇదిగో... నవ్వకు...ఇప్పుడు నేను చస్తున్నాను. నువ్వు నవ్వుతున్నావు. నాలాగే, ఇలాగే, రేపు నువ్వూ చస్తావు. ఇంకోడు ఇకిలిస్తాడు..."

"ఏఁయ్"—అంటూ మహోద్రేకంలో బూటుకాలితో తన్నాడు: "అబ్బా!"—అంటూ విరుచుకొని పడిపోయి, బాధతో మూల్గాడు మొరల్.

"అసంభవం" యుద్ధభూమి దద్దరిల్లేటట్లు అరువ మొదలుపెట్టాడు కెప్టెన్. "నేను చావటమా!... వీరాధివీరుణ్ణి...నన్ను జయించగలసమర్థులున్నారా? ...మిమ్మల్ని హతమారుస్తాను..."

"ఏదీ యింతమందిని చంపుతున్నావే—ఒక్కణ్ణి బ్రతికించు. చచ్చేవాళ్ళనా; బ్రతికించటానికి బదులు, బ్రతికేవాళ్ళను చంపటంకాదు మానవపరమావధి. దైవసృష్టిని విచ్ఛిన్నం చేయడమేనా నీ ఆదర్శం."—అన్నాడు మొరల్.

"అయితే నువ్వెందుకు చేస్తున్నావు?"—

"కేవలం పొట్టకోసం. ఆకలితో చావలేక యుద్ధంలో చద్దామని బయలుదేరాను."

"అమ్మో!..."—అంటూ ఆర్తనాదం వినిపించింది. వెనుదిరిగి చూచాడు. బ్రతికున్న మనిషే... కదల్లేక పడిఉంటే, ఏదో రాంబందు పీకింది.

"చూస్తున్నావా"—మొరల్ ఆ అవకాశాన్ని పురస్కరించుకొని మొదలుపెట్టాడు. "జీవికి శరీరంమీది మోహం చెప్పరానిది. బ్రతికున్నంతవరకు ప్రతివాడికీ, చర్మం కప్పబడ్డ యీ రక్తమాంసాలు...యీ ఎముకలగూడుమీది మమకారం ఎంతో ఉంటుంది. అబ్బ!...నాలుక పీక్కుపోతోంది. కాసిని మంచినీళ్లు పోద్దూ. చూడు, బ్రతికున్నవాడిమీద నీకు పగ. చచ్చేవాడిమీద నీకు శతృత్వం దేనికి..."

"నిన్ను రక్షించడమా! శతృ సైనికుణ్ణి బ్రతికించటమా!"

"ఎవరి కెవరు శతృవులు?"—ప్రశ్నించాడు మొరల్.

"మీరు మాకు శత్రువులు"—అన్నాడు కెప్టెన్ ఎర్నెష్టు.

"చాలా పొరబడ్డావు. నువ్వొక దేశపువాడివి. నేనొక దేశపువాడిని. నువ్వెవరో నాకు తెలియదు. ఎక్కడివాడవో అంతకంటే తెలియదు. నా ముఖం నువ్వు గాని, నీ ముఖం నేనుగాని ఏనాడూ చూచుకోలేదు. నీకు నేను ఏమి అపకారం చేశాను. పోనీ నావాళ్లు నీ సంసారాని కేమైనా హాని చేకూరిందా. నే నెట్లా శత్రువు నయ్యానూ?"— అని అడిగాడు మోరల్.

"కట్టిపెట్టు నీ కుంటికూతలు. మీ దేశానికీ, మా దేశానికీ మధ్య శత్రుత్వముంది."—అన్నాడు కెప్టెన్.

"అదే నే నడుగుతున్నాను. నీకూ నాకూ పగ లేదని నువ్వే వప్పుకున్నావు. నా సంసారానికీ, నీ సంసారానికీ మధ్య ఏలాంటి పగా లేదు. నా ఊరి వాళ్ళకు...నీ ఊరివాళ్ళకు శత్రుత్వం లేదు. ఎలా ఉంటుంది; ఎవరి కెవరు ద్రోహం చేశారని. మొత్తం మీద యిలా చూచుకుంటే నీ దేశప్రజ మధ్య, నా దేశ ప్రజ మధ్య అసలు వైరమే లేదు. కాని దేశాల మధ్య ఉంది. ఈ ప్రజకు సంబంధించని ఆదేశా లెక్కడున్నాయి. విధిననుసరించి మనం యుద్ధం చేసున్నాం. గానుగకు కట్టిన ఎద్దుల్లా తయారు చేశారు. దేనికోసం యింతచుంది చస్తున్నారు. పవిత్రమయిన యిందరి రక్తంద్వారా సాధించే ఆ మహాకార్య మేమిటి? ...కాస్త చెప్పవూ?"—రాను రాను ఆయాసం విసరికొడుతోంది. ప్రాణాలు కడబడుతున్నాయి. అతని శరీరం ముందుకు వెనుకకు ఊగులోంది. కాదు జలదరిస్తోంది. బహుశా తీవ్రంగా జ్వరం కాస్తూఉండ వచ్చు.

కెప్టెన్ ఎర్నెష్టు బాధ ఎలా ఉంటుందో ఎరుగనివాడు. చుట్టూ చూచాడు. వికృతంగా, పిశాచాలు నృత్యంచేస్తూన్నట్లుండా ప్రదేశం.

మోరల్ మొదలుపెట్టాడు. "కాసిని మంచినీళ్లు పొయ్యవోయ్!...ఇస్సా!...నీ భుజంమీది ఆవాటరు బాటిలు చూస్తూంటే, మరింత దాహ మేస్తోంది. అహ్! ...కాలుపోయిందికదూ?...రక్తం...యీ చేతిలోని ఎముకలన్నీ విరిగిపోయి ఉంటాయి. ఓహ్!....బాధ అపారంగా ఉంది. కాని ఏంచేయను." కాసేపు మూలిగాడు. అతని తలకూడా వాలిపోతోంది. "నీళ్లు"—అంటూ పెదవులు నాలుకతో తడిపాడు. "మంచినీళ్లు. ఊహ్! [దగ్గాడు] కాసిని మంచినీళ్లు పొయ్యవూ?" — అంటూ క్రింది పెదవి చప్పరిస్తూ చాలా దీనంగా జాలిగా అన్నాడు. వాలిపోయేతలను బలవంతంగా ఎత్తుతూ, అతికష్టంగా అన్న ఆఖరు మాట "దేముడంటూ ఒకడున్నాడు..."—అంతే. పడిపోయాడు.

తల తిరిగిపోయింది ఎర్నెష్టుకు. చుట్టూ అనేక శవాలు—కీచురాళ్ళధ్వని. నక్కలకూతలు.

ఆ శ్మశానంలో ఆ నిశ్శబ్దవాతావరణాన్ని చీల్చుకుంటూ ఏవేవో వింత ధ్వనులు, వినవస్తున్నాయి. ఎవరో నవ్వుతున్నట్లుంది; కాదు వెక్కిరిస్తున్నారు; కాదు కర్తవ్యాన్ని బోధిస్తున్నారు.

కెప్టెన్ గబగబా మోకరిల్లాడు. మీది వాటరు బాటిలు తీసి మోరల్ నోట్లో వంచేశాడు. తడారిపోయిన గొంతు—నీళ్ళధాటి కాగలేక కంఠన దగ్గి భొళ్లున కక్కాడు.

చేతులు దులుపుకుంటూ లేచాడు కెప్టెన్. ఎక్కడినుంచో "ఎటెన్షన్"—అని పిలిచినట్టుగా విన్నాడు. అలాగే నిలచి "లెఫ్ట్—రైట్"—కదలకుండా కదం త్రొక్కాడు.

చుట్టూ చూచాడు. ఎవ్వరూ లేరు. వికలాంగులైన శవాలు కనుపించాయి. ఇటు తిరిగాడు. దూరాన్న ఆకాశం, భూమి కలుసుకుంటున్నాయి. అంతంతదూరంగా కనుపించే ఆకాశం భూమీకూడా కొంతదూరంలో కలుసుకుంటాయి కాబోలు!

చేతిలోని వాటరుబాటిల్ను బూటుకాలితో తన్నాడు. అల్లంతదూరాన పడ్డది. క్రింద చూచాడు. ఓ వ్యక్తి జీవన్మరణ సంధ్యలో ఉన్నాడు. బహుశా అయిపోయే ఉంటాడు.

గబగబ రెండుచేతుల్లోకి తీసుకున్నాడు. ముందుకు సాగాడు. అస్తమించే సంధ్యార్కుని పసిడి కిరణాలు అతని నుదుటిపైనా, ఉరస్సుపైనా పడి తళుకు తళుక్కున మెరుస్తున్నాయి.

ప్రకృతికూడా స్తంభించిపోయింది.

*     *     *     *

"నే నెవర్నీ ప్రేమించలేదు. నా కొ శ్రీమతి లేదు. యౌవనాంకురాలు తలెత్తేటప్పటికే నేను మిలటరీలో చేరిపోయాను. కనుపించిన ఆడ దాన్ని బలవంతంగా కౌగలించుకొని కామతృష్ణ తీర్చుకున్నాను.

"మానవకళేబరాలను ప్రేమించాను. ప్రాణాలతో చెలగాటలాడాను. అబ్బా! ... ఎంతమంది నీలాటి అమాయకులను,—తల్లీ, భార్యలనుంచి వేరు చేసి — వారి రక్తాలను చవిచూచాను? ఎంతమంది ప్రాణాలను బలిపుచ్చుకున్నాను? ఘోరం నాయనా! నేను కటికవాణ్ణి; గొర్రెల్ని చంపినట్లు చంపటమే కాని, వాటిమీద ప్రేమ నా కేనాడూ లేదు. నేను రాక్షసుణ్ణి.

"ఓహో! ఇతనికి స్పృహ లేదుకదూ! ఎవరికి చెబుతున్నాను ఎందుకంటున్నా నీమాటలు ..." ఉద్వేగంతో వడక పెంచాడు — కెప్టెన్ ఎర్నెష్టు.

మసక ముసురుకుంటోంది.

*   *   *   *

"డాక్టర్! ఇతణ్ణి బ్రతికించండి. మీ కెంత కావాలంటే అంత యిస్తాను. ఇతను చావకూడదు. చావటానికి వీల్లేదు." — ఆదుర్దాగా, ఆవేశంలో అ వేస్తున్నాడు డాక్టరుతో ఎర్నెష్టు.

"తొందరపడితే ఎలా? అన్నీ కట్లు కడతాను. కాని రక్తమంతా పోయింది—" డాక్టరుమాట పూర్తయినా కాలేదు.

"నా రక్తమిస్తాను కానివ్వండి."

అవాళ్ళెల్లా ఆ సైనికునికి తెలివి రాలేదు. కెప్టెన్ కండ్లలో వత్తులు వేసుకొని చూస్తున్నాడు. డాక్టరుని తొందరపెట్టి క్షణక్షణం తీసుకొచ్చి చూపిస్తున్నాడు.

"చూడు. ఇతనికి నయమవుతుంది; నయం కాకపోతే నా డాక్టరుగిరీ వదులుకుంటాను. నాకు బాగా నమ్మకముంది. భగవంతునిమీద ప్రమాణంచేసి చెబుతున్నాను." భరోసా యిచ్చాడు డాక్టర్.

"అలా వట్టు వేసుకోకండి డాక్టర్! నా అదృష్టాలో. అలా అనుకుంటున్నాను."—బాధగా అన్నాడు ఎర్నెష్టు.

"ఇప్పుడేం గొడవ చేయకు. మళ్ళీ వస్తాను"— డాక్టరు వెళ్ళిపోయాడు.

కెప్టెన్ రక్తమంతా సైనికునికి ఎక్కించబడ్డది. ఆ సాయంకాలం ఆ సైనికుడు ఆ ప్రక్కనుంచి యీ ప్రక్కకు వరిగాడు. ఒక్క నర్సు తప్ప మరెవరూ సైనికునిదగ్గర ఉండటానికి వీలులేకపోయింది. రాత్రి గడచిపోయింది.

తెలతెలవారుతోందనగా అతను కలవరించటం మొదలుపెట్టాడు:—"చూడు లిల్లీ!........రేపటినుంచీ నేను సిపాయిని. ఏదీ—ఒక్కసారి "సిపాయి!"— అంటూ పిలు."—ఇలా ఏవేవో అంటున్నాడు.

ప్రక్క గదిలోని నెల రోజుల బాలింత ఎవతో ఇతని మాటలు వింటోంది. కొన్ని ప్రత్యేక కారణాలవల్ల ఆవిడ అక్కడ ఉండటానికి అనుమతి యివ్వబడింది. ఇలాంటి గొంతు ఆవిడ ఎక్కడో విన్నది-కాదు—చిరపరిచితమైనగొంతు. ఎవ రితను?- అని అనుకున్నది. గొంతువాడిరి గొంతు ఉండకూడదా? ఏమో ఒకవేళ అతను తన ప్రియుడే కాకూడదా? అయినా ఒక్కసారి చూస్తే ఏం పోయింది. అతనే అయితే ఎంత బాగుంటుంది. బాగుండడం మాట సరే—అతను కావద్దూ! లేచింది.

ఆ సైనికుడికి బాగా తెలివి వచ్చింది. కళ్లు విప్పి నాలుగు పక్కలా చూచాడు. అత నెక్కడుంది అతనికే అర్థం కాలేదు. లేవబోయాడు. కాని, కాలూ చెయ్యీ లేవు. అంతా ఏదో వింతగా అగుపించిందతనికి. తను సిపాయి. అవును. యుద్ధంలో కాలు విరిగిపోయింది; చేతి ఎముకలన్నీ నజ్జయ్యాయి. నిజమే. తా నిక్కడ కెలా వచ్చాడు. ఎవరో తనను మోసుకుని వచ్చినట్లు గుర్తు. అవును. శత్రుదేశపు సైనికుడొకడు మోసుకొని వచ్చాడు. అయితే యిప్పుడు తనెక్కడున్నాడు? అబ్బ! బుర్ర ఏంపనిచేయటం లేదు. ఏం గుర్తుకు రావడంలేదు.

ముఖ్యవిషయం కెప్టెన్ ఎర్నెష్టును ఎవరూ గుర్తుపట్టలేదు. మోరల్ మాత్రం అతణ్ణొక శత్రుదేశపు సైనికుడుగా తలపోస్తున్నాడు. నిజం దాగి ఉంది. ఎప్పుడు బయటపడుతుందో చెప్పలేం.

ఇంతలో నర్సు వచ్చింది. ఆవిడను చూచిన తరువాత కొంతసేపటికి బుర్ర పనిచేయగా చేయగా,

తనున్నది ఒక హాస్పటలని గ్రహించాడు. అప్పుడా శత్రుకేశపు సైనికుడు (కెప్టెన్ ఎర్నెష్టు) అన్న మాటలు గుర్తుకొచ్చాయి:—నిన్ను హాస్పటల్లో చేర్పి నీ కాలూ, చేయి నయం చేయిస్తాను."

"ఇదిగో, యీమందు పుచ్చుకోండి"—అంటూ యిచ్చింది నర్సు. మ్రింగాడు.

"కాసేపు విశ్రాంతిగా పడుకోండి'—అంటూ వెళ్ళిపోయింది. కాని "నర్స్" — అంటూ పిలిచాడా సైనికుడు ఆగింది.

"ఇక్కడకు నన్నెవరు తీసుకొనివచ్చారు?"— అడిగాడు.

"ఎవరో సైనికుడు. అతనెవరో నాకెలా తెలుస్తుంది. రోజూ అనేకులు వస్తూంటారు; పోతూంటారు" - అన్నది.

"అతన్ని కొంచెం పిలుస్తావ్ ?"—అన్నాడు.

"సరే"—నంటూ నర్సు వెళ్లిపోయింది. మలుపు తిరిగేటప్పుడు ఆప్రక్కగదిలోని అమ్మాయి ఆపింది: "మాడమ్మా! నువ్వా ప్రక్కగదిలోంచే కదూ వస్తూంట" అని అడిగింది.

"అవును. ఏమమ్మా! ఏం కావాలి"—మృదువుగా అడిగింది నర్సు.

"ఆగదిలో ఉన్న దెవరమ్మా?"

"ఎవరో సైనికుడు"

"అతనెవరమ్మా"

"నాకెలా తెలుస్తుంది. తెలుసుకోవలసిన అవసరం మాకుండదుకదమ్మా. డాక్టరుగారు చెప్పింది చేయటం మావంతు" — నవ్వుకుంటూ వెళ్లిపోయింది నర్సు.

ఆ అమ్మాయి రెండడుగులు ముందుకు వేసింది. గది గుమ్మందాకా వచ్చి తొంగిచూచింది. ఆ సైనికుడు ముఖం అటు త్రిప్పుకొని పడుకున్నాడు. అతనేదో తెలివిగా ఉండే అనుకుంటున్నాడు. రానురాను ఆసైనికుడు యీ అమ్మాయి పేరే ఉచ్చరిస్తున్నాడు. ఈ అమ్మాయిహృదయం దడదడ కొట్టుకుంది. అతను తప్పకుండా తన మొరల్ అయివుండాలని నిశ్చయించుకుంది.

"సిపాయి"—పిలిచింది.

"ఎవరు?"—అంటూ యిటు తిరిగా డతను.

"సిపాయి!"—

"లిల్లీ!"

అంతే! ఒకరి కౌగిలిలో ఒకరుండిపోయారు. ప్రపంచాన్ని ఆ కొద్ది క్షణాలు వారు మరచిపోగలిగారు. ఎన్నో రోజుల (వాళ్ల దృష్టిలో ఏండ్లు) తరువాత యివ్వాళే కలుసుకున్నారు. మధురతరమైన యిలాంటి సమాగమంకోసం అహర్నిశలు నిరీక్షిస్తున్నారు. "నీ కాలేది?...నీ చేతి కిదేం కట్టు" అని లిల్లీ, "మా అమ్మ ఎక్కడ?"—అని మొరల్ ఒకరి నొకరు అడుగుదా మనుకుంటారు. ఆ మైకంలో, ఆ పిచ్చిలో అడుగలేకపోతున్నారు. ఆ క్షణం స్తబ్ధులై ఉండిపోయారు.

వచ్చాడు కెప్టెన్ ఎర్నెష్టు. సైనికుడు పంపిన కబురందిం దతనికి. గుమ్మంలో అడుగుపెట్టాడు. ఈ దృశ్యం చూచి నిశ్చేష్టుడై నిలుచుండిపోయాడు. అతని బుర్రలో ప్రపంచం గిర్రున తిరుగుతోంది. తలుపువారగా, గోడ కావలప్రక్క కూలబడిపోయాడు— స్తబ్ధుడై.

"మా అమ్మ!...ఎక్కడుంది"—మాటలు కూడ గట్టుకుంటూ అడిగాడు మొరల్. "చెప్పు లిల్లీ!"...

కెప్టెన్ ఆశ్చర్యంతో ఒకసారి యిటు చూచి ముఖం తిప్పివేశాడు.

"చెప్పవేం లిల్లీ! మా అమ్మ క్షేమంగా ఉంది కదూ ?"

"ఆవిడ...లే...దు."

"ఆఁ...నిజంగావా! చెప్పు లిల్లీ !"

"అవును. ఆవిడ వెళ్లిపోయింది."

"అమ్మా!" అతని హృదయంలో దుఃఖ సముద్రం పొంగి పొరలింది. భోరున ఏడ్చా డతను. అతని దుఃఖంచూచి, కెప్టెన్‌కుకూడా కళ్ళు చెమర్చినాయి.

ఎవరిని తను చూడాలనుకున్నాడో, ఎవరిని మనసారా పదేపదే పిలవాలనుకున్నాడో, ఎవరు తనకు ప్రాణసమానమో, ఎవరికోసం తనింతగా తహతహలాడిపోతున్నాడో, ఎవరి ఒడిలో పడుకొని, తను ప్రశాంతంగా చచ్చిపోదా మనుకుంటున్నాడో... ఆవిడ ఏది? ఆవిడ లేదు...లేదు...అబ్బా!...

"ఇలా అయిందేం లిల్లీ! మా అమ్మ నన్ను విడిచి ఎందుకు వెళ్ళిపోయింది? నా గురించి కలవరించిందికదూ! నాకోసం ఆఖరు నిమిషంవరకూ చూచింది కదూ! నాకోసం...చెప్ప లిల్లీ!..."

"ఏం చెప్పను?"

"చెప్పక? ఎలా చచ్చిపోయింది?"

"నువ్వు మిలిటరీలో చేరిపోయావు. కాని అలా చేయటం ఎవరికీ యిష్టంలేదు. మమ్మల్ని సుఖపెడదామని, మా కష్టాలుచూడలేక నువ్వు కష్టాలపాలయ్యావు. కడకు ప్రాణాలను బలిదానం చేయటానికి సిద్ధపడ్డావు."

"అయితే సిపాయిగా చేరటం తప్పా?"....అయోమయంగా అడిగాడు మోరల్.

"మామయ్య ఉండగా ఎప్పుడూ ఏమనేవాడు జ్ఞాపకంలేదూ? దేశరక్షణకోసం, దేశ భద్రత కాపాడటం కోసం ప్రాణాలొడ్డటం ప్రతివాడి కర్తవ్యం. దేశంలో అరాచకం తలెత్తకుండా, అశాంతి రేగకుండా, శాంతి అహింసలు నెలకొల్పడంకోసం ప్రతివాడు మిలిటరీలో చేరాలి. కాని—"

"నువు చెప్పింది నిజం లిల్లీ!...మానవమారణ హోమం చేయటంకోసం మనిషి జన్మ ఎత్తలేదు."

"మరునాటినుంచీ ఇల్లు గడవటం మహా కష్టమయింది. ఏం చేయాలి? ఎలా పొట్టగడుస్తుంది? మనింటి విషయం నీకు తెలియందికాదు. దేశంలో యుద్ధంవస్తే వచ్చేవాడికి డబ్బు వస్తుంది. బాగుపడేవాడెవడో బాగుపడతాడు. అంతెంత మాత్రపు మనబోటివాళ్లు ఆకలిదేవతకు ఆహుతైపోతారు.

"అన్నిటి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎలా జీవించగలం. జీవన్మరణసమస్యలో పెనుగులాడే సంసారాల్లో మన దొకటైంది. ఆడవాళ్ళం. ఏం చేస్తాం. ఎన్ని ఉపవాసాలున్నామో ఎవరికి తెలుసు.

"అత్తయ్య ఆ ముసలితనంలో ఆకలితో... వ్యాధితో...నీమీది బెంగతో మంచం పట్టింది.

"ఆ పరిస్థితుల్లో ఏం చేయను. మందూ మాకూ ఎక్కడినుంచి తెచ్చిపోసేను. గాలిలో వెలుగుతోందా దీపం. గాలి తగులకుండా ఎన్ని వేపులనుంచి కాపలా కాసేది. కడ కా దీపాన్ని గాలి ఆర్పివేసింది..."

"అమ్మా!..." అంటూ ఏడ్చాడా సైనికుడు. ఇంత నికృష్టంగా తన తల్లి చనిపోయిందని విని ఘోషించాడు. అతగాడు తనకీ ప్రపంచంలో ఇహ ఏమీ లేదన్నట్లు భావించాడు. అతి ప్రియమైనవారు తననుంచి వేరుచేయబడ్డారు. తను ఉండేం?... లేకేం?...

చాలాసేపు గడిచిపోయింది.

* * * *

"నా చెల్లెలు 'రోజా' జ్ఞాపకముందా మోరల్? గులాబిపువ్వులా గుండ్రంగా ఉంటుంది దాని ముఖమని 'రోజా' అని పిలచేవాడివి. రోజా దానితో వేళాకోళం ఆడేవాడివి. ఎంతో చిలిపి పిల్ల. అయితే రోజా ఏం చేసిందో తెలుసా?

"అత్తయ్య మంచంలో మగ్గిపోతోంది. అన్నం లేక అల్లాడిపోతున్నాము. అమ్ముకు తిందామన్నా ఏమీ లేదు. ఎలా సంపాదించాలో తెలియనివాళ్లం.

"ఈ ఆకలితో నేను చావలేను. ఈ నికృష్టస్థితి నేను చూడలేను. అత్తయ్య అలా జీర్ణించిపోవడానికి వీల్లేదు" అంది.

"ఏం చేస్తాం"—అన్నాను.

"ఏదో ఒకటి చేయాలి."—అన్నది.

"ఏమిటి చేయడం?"

"ఏమిటి మనం చేసిన పాపం? ఎందుకు మనకీ నరకం?..."

"చెల్లీ!"—గాద్గదికంగా అన్నాను నేను.

"జీవితంతో పోరాడాలి. మీకందరికి అన్నం తెచ్చిపెడతా చూడండి..." అంటూ ఉద్రేకంలో పరుగెత్తింది.

"చెల్లీ!...చెల్లీ!!..." నా మాటలు వినిపించుకోలేదు.

"మూడు రోజుల తరువాత తిరిగి వచ్చింది. తిరిగి వచ్చింది మనమనుకున్న రోజా కాదు. భయంకర పిశాచి. పాతికి...దాన్ని తిట్టదలచుకోలేదు. ఎవరి కర్మకెవరు కర్తలు. 'ఇది తప్పు—ఇది ఒప్పు'—అని నిర్ధారించేది మనం; మన మనస్సులు. ఈ తప్పు

ప్పులు కూడా మన మనస్సుల ననుసరించి ఉంటాయి. ఒకరికి తప్పుగా తోచింది—మరొకరికి ఒప్పుగా తోచవచ్చు. మన భావన ననుసరించి యివి మారు తూంటాయి. రోజా చేసిన పని రోజా ఒప్పుగానే భావించింది. ఆఖరి క్షణంవరకు 'నేను తప్పు చేయ లేదు'—అంటూ ఆక్రోశించింది. కాని మా దృష్టిలో దాని పని తప్పుగా కనుపించింది.

"దానిదగ్గరకు పోతే గప్పున వాసన కొట్టింది. బాగా త్రాగి తూలుతోంది. చేతిలో డబ్బుసంచీ పట్టు కుంది.

"ఆ పరిస్థితిలో దాన్ని చూస్తూంటే నాకు పరమ అసహ్యమనిపించింది. దవడలన్నీ పీక్కుపో యాయి. ముఖమంతా పాలిపోయింది. అందంగా అగు పించటంకోసం కృత్రిమంగా అలంకరించుకుంది. దాన్నిగురించి నే నేమీ వర్ణించదలచుకోలేదు. జరిగిన విషయం చెబుతాను. విను:

"తీసుకొచ్చిన డబ్బు నా ముందు పెట్టింది:— "అత్తయ్యకు మందు యిప్పించు. అన్నం అదీ వండు కొని హాయిగా తినండి"

"నాకు అరికాలిమంట నెత్తి కెక్కింది. అదెట్లా సంపాదించిందో నే నిట్టే ఊహించాను. అందుకే ఆ డబ్బు విసరికొట్టాను. దాని ముఖాన విసరికొట్టాను" —ఈ మాటలు చెబుతూంటే కోపంతో లిల్లీ ముఖం కందిగడ్డలా ఎరుపెక్కింది.

"ఎక్కడిదీ డబ్బు? చెప్పవేం?"—అంటూ కసురుకున్నాను.

"ఎక్కడి దేమిటి?—" అన్నది రోజా.

"ఇంత డబ్బు!...ఇది న్యాయంగా సంపాదిం చింది కాదు"—

నవ్వింది రోజా:—"అనుకది తలచుకుంటే ఎంత డబ్బు అయినా సంపాదించగలదు." క్షణంసేపాగి మళ్లీ మొదలు పెట్టింది:—"వాడెవడో వెధవ, బాగా తాగి వచ్చాడు. ప్రేమట!....ప్రేమ!...వాడి బొంద. ఉద్రేకం మొచ్చింతట, వళ్లు మరచిపోయి డొక్కలో బూటుకాలితో తన్నాడు. నిజంగా ప్రక్కఎముకలు విరిగిపోయా యనుకున్నాను. కాసేపయిన తరువాత 'అయ్యో!'—అంటూ ఇంత డబ్బు పారేశాడు. తలాక రకం ప్రేమా చూపిస్తారు. వట్టి పశువులు...

"అది ఇట్లా మాట్లాడుతుందని అనుకోలేదు. ఇంతగా మారుతుందని ఎవరనుకుంటారు. అలా మాట్లా డుతూ ఉంటే వళ్లు తెలియని కోపం వచ్చింది. కోపో ద్రేకంలో నన్ను నేను మరచిపోయాను. (లిల్లీ గొంతు కోపంతో వణకుతోంది) ఆకొన్న సింహంలా మీద పడిపోయాను. రోజా రెండు చెంపలమీదా ఎన్నో వేల దెబ్బలు కొట్టాను. రెమ్మ ఎత్తిపోయి ఉండాలి. కాని రోజా కదల్లేదు. కండ్లు మూసుకొని, తలపైకెత్తి చేతులు వెనక్కు కట్టుకొని నిలుచుంది. కొట్టి, కొట్టి అలసిపోయాను నేను. దాన్ని చూస్తుంటే రోతపుట్టు కొచ్చింది. అంతులేని కోపం వచ్చింది. భరించలేని ఏడుపు వచ్చింది.:—'వెళ్లవతలకు'—కాని రోజా కదల్లేదు.

"కొట్టటం అయిపోయిందా! కొట్టకొట్టు. నువు వళ్ళు మరచిపోయావు. కొడుతున్నావు. పిచ్చిదానివి. నీ పరిస్థితి నేను గ్రహించాను. నాకంటే పెద్దదానివి. లేకుంటే...ఎందుకులే......"

"ఇక్కడకు రావటానికి, నాకు మొహం చూపించటానికి నీ కల్లా సిగ్గులేకపోయింది."

"సిగ్గు!...ఎలా ఉంటుందది."

"ఛీ!...వెళ్ళవతలకు..."—కోపంతో అనే శాను.

రోజా అంది:—"వెళుతున్నాను. కాని నే నెందుకు సిగ్గుపడాలి. నేను ఏం తప్పపని చేశానని. మోహంతో చేశానా? ... కామంతో చేశానా? ప్రేమతో చేశానా? మాట్లాడవేం? ఆకలిబాధ భరించ లేక చేశాను. ఒక్కరోజు కడుపునిండా తిండిలేదు; వంటినిండా గుడ్డలేదు నాకూ హృదయ ముందక్కా! నాకూ కోరికలున్నాయి, ఆశలున్నాయి, ఆశయా లున్నాయి. అన్నిటికీ మొహం వాచిపోయాను. నాలుగురోజులు ఆనందంగా గడుపుదామనుకున్నాను. హాయిగా ఉందామనుకున్నాను. బావా, నువ్వూ నేను అందమయినదాన్నని అంటూ ఉండేవారు. ఆ అందం నా కక్కరకొచ్చింది.

"నర్మపన్నాగాలు కాదు కావలసింది— న్యాయం. మీరు ఎంత నీచంగా నన్ను చిత్రించు కున్నా, నాకేం బాధలేదు. నేను చేసింది తప్పుకాదు. ఇది తప్పు అని చెప్పే పెద్దమనిషి ఉంటే ఇట్లా

రమ్మను. అతన్నిలా అడుగుతాను—గుండెమీద చెయి వేసుకొని చెప్పండి, మీ రెన్ని దారుణ దురంతాలు చేశారు. మీరు చేసిన తప్పుడు పనులవల్ల ఎంతోమంది నాశనమౌతున్నారు. కాని నా తప్పువల్ల నేనే నాశనమవుతున్నాను. ఈ ప్రపంచంలో ప్రతివాడూ చేసే తప్పుకంటె నాది బహు స్వల్పమైంది. కేవలం స్వార్థంతో చేశాను. ఆకలితో అటమటించలేక బ్రతకటంకోసం చేశాను. అది తప్పెలా అవుతుంది?

"నే నెవర్నీ ప్రేమించలేదు. నే నెవరికీ ద్రోహం చేయలేదు. నాకు నేను చేసుకున్నాను. నన్ను నేను మోసపుచ్చుకున్నాను. వీధుల్లో యీడ్చి పారవేసే దిక్కు కూడా లేకుండా యీ నీచపుముండ చస్తుందని కదూ అనుకుంటున్నావు. ఎవడో ఒకడు దారికడ్డని సైడుకాలవలోకి యీడ్చి పారేస్తాడు.

"నాకు చావంటే భయంలేదక్కా. ఇన్నాళ్లూ చావుబ్రతుకుల సమస్యలో జీవించాను. చావంటే భయం పోయింది. ఇప్పుడు బ్రతుకుతున్నాను. ఇష్టంలేకపోతే చస్తాను."

క్షణంసేపు మౌనంగా గడిచిపోయింది. ఎవరూ ఎవరితోనూ మాట్లాడలేదు. ఆఖరికి రోజా అంది:—"పోనీలే అక్కా! నాగురించి నువు బాధపడకు. కాని ఒక్కటిమాత్రం గుర్తుంచుకో—నే నీ పని చేసేటప్పుడు నా హృదయంలో ఎంత కుమిలిపోయానో, నీకు నా ముఖం చూపించటానికి ఎంత బాధ పడ్డానో నీకు తెలియదు. నే నిప్పుడొక రోగాల పుట్టని. ఆశ్చర్యపడకు. నా హృదయం విప్పి చెప్పనీయి. కాని నాగురించి నే నేమీ బాధపడటం లేదు. అవ్వన్నీ మరచిపోవడానికి చిత్తుగా తాగుతాను. మత్తుగా ఏ మురికికూపంలోనో పడుంటాను. నా ముందు కనకవర్షం కురుస్తోంది. ఇది తాత్కాలికం కావచ్చు. కాని యీ ప్రపంచంలో శాశ్వతమేమిటి?

"ఇదిగో డబ్బు. తీసుకో. నీకు భవిష్యత్తు కావాలి. నేను చెడిపోయాను. ఎవరైనా బాగుపడటం మంచిదికదూ? కనీసం బావ వచ్చేంతవరకు మీరు బ్రతకటం అవసరం. నాకోసం కాకపోయినా, నామీద ప్రేమ లేకపోయినా, డబ్బుమీద ప్రేమతో తీసుకో. ఇంకా కావలిస్తే నా కక్కబురుచేయి. వస్తానక్కా! నన్ను ఏవగించుకుంటున్నావని నాకు తెలుసు... నామీద ఏ దృష్టి అలా ఉండటమే మంచిది. వెళ్తాను...క్షమించు...ఈ రోజాను మరచిపోకు.—"

అంటూ కన్నీరు క్రుక్కుకుంటూ పరుగెత్తింది. ఎన్నో పిలుపులు పిలచాను. వినిపించుకోలేదు. "అత్తయ్యా!"—అంటూ అత్తయ్యమీద పడి వలవల ఏడ్చాను.

రోజా తప్పుచేయ లేదంటుంది.

* * * *

"కొన్నాళ్ళకు ఈ ప్రదేశాన్నంతా 'A' దేశం జయించింది"—అంటూ చెప్పుతోంది చరిత్రగమనం లిల్లీ: "సైనిక కోలాహలంతో ధరిత్రి దద్దరిల్లిపోయింది. ఎక్కడివాళ్లక్కడ పారిపోయారు. పోలేనివాళ్ళు మిగిలిపోయారు. ఇళ్లు, పశువులు, ఆస్తిపాస్తుల నన్నిటిని వదిలివెళ్ళారు. కఠిన కర్కశ హృదయుడైన ఆ దేశపు కెప్టెన్ కొల్లగొట్టాడు. అకస్మాత్తుగా ఆక్రమించాడు."

కెప్టెన్ ఎర్నెస్టువళ్లు జలదరించింది. లిల్లీ మొదలుపెట్టింది:—"కాని ఎందరెన్ని దిశలకు పరుగెత్తుతారు. ప్రళయాగ్నిజ్వాలల మధ్య చిక్కుకున్న కీటకాలలా మాడిపోయారు. ఆ కెప్టెన్ గ్రామమంతా దగ్ధపటలం చేశాడు. ఆస్తులన్నీ దోచుకున్నాడు. అందర్నీ హతంచేయించాడు. స్త్రీల నందర్నీ—" లిల్లీ చెప్పలేకపోయింది.

"లిల్లీ!"—అన్నాడు గోముగా మోరల్.

"ఊఁ..."

"యుద్ధంవల్ల మానవత్వం నశిస్తుంది."

"అవును మోరల్! ఎవరైనా ఏదైనా చేయాలని చేస్తే పాపం అవుతుంది. కాని క్రూరంగా, ఘోరంగా హింసించి ఆ పాపపంకిలంలోనికి ఏ వ్యక్తినయినా దింపితే ఆ పాపానికి బాధ్యత ఆ వ్యక్తి దవుతుందా?"

"నాకేం అర్థంకావటంలేదు." అన్నాడు మోరల్. లిల్లీ చెప్పటమా? మానటమా? అన్న సంశయంలో పడ్డది. మోరల్ మళ్లా హెచ్చరించాడు: "చెప్పు లిల్లీ! భయపడకు. తరువాత?"

"తరువాతనా! అలా ఆ కెప్టెన్ పురుగు లేకుండా ధ్వంసం చేయించాడు. స్త్రీలంతా సైనికుల చేతుల్లోపడి దారుణంగా హింసింపబడి మానాలు

పోగొట్టుకున్నారు. ఆ పాపానికి వాళ్లు బాధ్యులా మోరల్.

"అప్పుడేం జరిగిందో తెలుసా? నవయౌవ్వనం తొణికిసలాడుతూ, చంద్రుణ్ణి ధిక్కరించే చిన్నది— ఆ కెప్టెన్ కళ్ళల్లో పడ్డది. బాగా విను. అతి ముఖ్య విషయం"—ఆగింది.

కెప్టెన్ ఎర్నెష్టు సుమ్మంలో కూర్చోలేక పోతున్నాడు. ఆ దారుణాల కన్నిటికీ కారణం తను. ఆమె చెప్పబోయే విషయం అతని కవగాహనయింది.

లిల్లీ మొదలు పెట్టింది:— "అత డామెను బలాత్కరించాడు. కాని ఆమె ఛీత్కరించింది. మస్తుగా త్రాగి, ఒళ్లు తెలియని స్థితిలో, అత డామె గదిలోకి, ఒకనాటిరాత్రి ప్రవేశించటం జరిగింది: భీతిహరిణిలా అతని బాహుపంజరంలో పెనగులాడింది. కాని అత డామెచుట్టూ తన రెండుచేతులతో యినుపకోట కట్టాడు.

* * * *

"తెల్లవారినుంచీ ఆమె కమితమర్యాదలు. కెప్టెన్ ఉంపుడుకత్తెమీద అందరికీ అభిమానం. అది ఉంటే భయం. ఆవిడ చుట్టూ అనుక్షణం యీ సైనికుల కాపలా ఉంది. ఆవిడ చచ్చిపోదామనుకుంది. కాని చావటానికి కూడా వీల్లేకపోయింది.

"ఇంకా బ్రతికిఉన్నాను మోరల్. ఆ పాపానికి ఫలితంగా ఓ కొడుకును కని యీ పాడుముఖం నీకు చూపించటానికి ఇంకా జీవించే ఉన్నాను—" అంటూ ఆత్మకథ చెప్పుకొని ఆమె భోరున ఏడ్చింది.

"లిల్లీ!...ను...వ్వా...!!"—అప్పుడతని పరిస్థితి ఎలా ఉందంటే చెప్పటం కష్టం.

కెప్టెన్ ఎర్నెష్టు భరించలేక లేచాడు. వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాడు.

"నన్ను నీ కసితీరా నీ చేతులతో యీ గొంతు నులిమేయి మోరల్. నీ చేతుల్లో మరణించటంకంటే నాకింకేం కావాలి. ఈ పాపాన్ని తుడిచేయి. నన్ను, నా బిడ్డని చిత్రహింస చేయి. కానియ్యి..." అంటూ అతని కాళ్ళముందు పడింది.

మోరల్‌కు ఏం చేయటానికీ తోచలేదు. ఏం చేస్తాడు? "లిల్లీ! ఇలా జరిగిందేం లిల్లీ!..." అతను శూన్యంలో చేతులు తడుముకున్నాడు. ముఖం తుడుచుకున్నాడు. చాలాసేపు ఆకాశంకేసి చూస్తూ ఉండిపోయాడు. లిల్లీ నేలకేసి చూస్తూ కూలబడి ఉంది. కెప్టెన్ అడుగు ముందుకు పడలేదు. అత నింతవరకు అక్కడ ఉన్నది వీళ్లకు తెలియదు. తలుపు కావల ప్రక్క ఉన్నాడాయె!

"నేను దోషిని!...పాపిని..." ఆవిడ ఉద్రేకంతో జుత్తు పీక్కుంటోంది.

"లిల్లీ!"—మోరల్ హృదయం కరిగిపోయి లాలనగా అన్నాడు.

"నేను మహాపాపిని. ఎన్నాళ్లనుంచో నిన్ను చూడాలనుకుంటున్నాను. నీ హృదయంలో తల మంచుకొని అలా శాశ్వతంగా నిద్రపోవాలనుకుంటున్నాను. నా కామాత్రం సహాయం చేయ్యవ్? చేయవూ?..."

"లిల్లీ! నువ్వు దోషివి కావు. నా ప్రేయసివి."

"ఆఁ...కాదు, కాదు"—

"అవును లిల్లీ!"—అంటూ అత డామెను తన వంటి చేత్తో హృదయానికి చేర్చుకున్నాడు. తలలో అతని వ్రేళ్లు పోనిచ్చాడు. ఆవిడ జుత్తు దువ్వుతున్నాడు:—"చూడు లిల్లీ! నువ్వు పాపం చెయ్యాలని చేయలేదు. నీ శరీరం పాపానికి గురిఅయింది. కాని నీ ఆత్మ పరిశుద్ధమయింది. ప్రేమ ఆత్మానుగతమైంది. శారీరకమైంది కామం. మనమనస్సులున్నది ప్రేమ. నే ననుభవించేది అనుభవించాలనుకున్నది నీశరీరాన్ని కాదు. నిర్మలమైన, నిష్కల్మషమైన నీహృదయాన్ని. ఏదిలిల్లీ! ఇలా నావడిలో పడుకో. చెప్పలేం ఎప్పుడేం జరుగుతుందో? అప్పుడు ఆ నదీసైకతస్థలంలో ఎప్పుడూ పాడే నీఆ పాట ... మధురాతిమధురమైన స్వరంతో పాడి నన్ను తన్మయుణ్ణి చేయి. సైనికుణ్ణయి హృదయాన్ని చంపుకున్నాను. చిగురింపచేయవూ?

ఆమె పాడుతోంది. ఉద్రేకంతో అతనిమీద వాలి అతని పరిష్వంగంలో సర్వానుభూతుల్నీ అనుభవిస్తోంది. ఆవేదనతో ఏడుస్తోంది. అతని హృదయం ఆమెపాటకు లయ కలుపుతోంది.

కెప్టెన్ ఎర్నెష్టు చరచర వెళ్ళిపోయాడు.

ఎంతసమయం అలా దొర్లిపోయిందో గమనించినవా రెవ్వరూలే రక్కడ.

కాని నర్సు తన డ్యూటీ నెరవేర్చుకోవడానికి వచ్చింది.

*　　*　　*　　*

"అతన్ని తీసుకొని పోతున్నారు"—అంటూ చెప్పింది నర్సు. ఆదుర్దా ఆమెలో కనుపిస్తోంది.

"ఎవర్ని?" — అంటూ ప్రశ్నించారు లిల్లీ మోరల్ ఒకేసారి.

"అదే. నిన్ను తీసుకొనివచ్చి యిక్కడ చేర్చి నతన్ని."

"ఎవరతను?"—లిల్లీ అడిగింది.

"మానవుడు" — అంటూ లేచాడు మోరల్. ప్రక్కనే ఉన్న కర్ర భుజం క్రిందికి లాక్కున్నాడు. గుమ్మంలోకి లిల్లీతోవచ్చి సైనికులు కట్టి తీసుకు పోతున్న కెప్టెన్ను చూచాడు. లిల్లీ కెవ్వన కేక వేసింది.

"ఏమిటిది? ఎందుకలా వణకిపోతున్నావు?"—అంటూ ఆదుర్దాగా అడిగాడు మోరల్ లిల్లీని.

"అతను మానవుడు కాదు. దానవుడు."

"ఏమిటే నువ్వంటున్నది లిల్లీ?"

"అవును మోరల్! ఈ దారుణాలన్నిటికీ మూల కారకుడు"

"అతనా!"—ఆశ్చర్యపడ్డాడు మోరల్.

గొలుసులతో కట్టి తీసుకొనిపోతున్నారు కెప్టెన్ ఎర్నెస్టును, 'B' దేశపు సైనికులు.

మంచంలో కూలబడిపోయాడు మోరల్. అతని మనస్సంతా అలోచనలతో నిండిపోయింది:— "ఏమి టిది? అతి నేనా నా సంసారాన్ని నాశనం చేసింది— నా ఊరు శ్మశానం చేసింది!"

అతని పనంతా అయోమయంగా ఉంది. అతను తన ప్రాణాలు కాపాడ్డంకోసం అతని ప్రాణాలు బలి దానం చేస్తున్నాడు. రక్షించటమా! కాని ఎలా? ఛీ! ఇన్ని దుర్మార్గాలు చేసినవాణ్ణి రక్షించటమా? అసంభవం. కాని...

నర్సు మళ్ళీ వచ్చింది. "మీరు విశ్రాంతిగా పడుకోవాలి. ఈ మందు త్రాగండి."

త్రాగాడు. పోతూపోతూ లిల్లీని పలుకరించింది నర్సు:— "పాప ఏడుస్తోంది. మీ గదిలోకి వెళ్ళరా?"

"వెళతానమ్మా!...ఇప్పుడే వెళతాను."

నర్సు చెప్పింది:—"ఇది మీకు తెలుసా? కెప్టెన్ ఎర్నెస్టు కనబడటంలేదని, ఉన్న పళంగా మాయమైపోయాడని 'A' - దేశం గగ్గోలెత్తిపోతోంది."

"ఏమయ్యాడు?"

"ఇప్పుడు మనకు దొరికింది అతనేనట." అని నర్సు వెళ్ళిపోయింది. మోరల్ హడలిపోయాడు.

"ఏమల్లా చెదరిపోతున్నావు?"

"కెప్టెన్ ఎర్నెస్టు అంటే ఎలాంటివాడో నీకేం తెలుసు? అతనంటే 'A' దేశం పగి చస్తుంది. శత్రుభీకరుడు. అతనేవైపు యుద్ధానికి బయలుదేరితే ఆ వైపువారు ఎంత బలాఢ్యులైనా, ఎంత జిత్తుల మారివారైనా హడలి ఛస్తారు. అతని కెదురు నిలవటం భయంకరమైన తుఫానును చింకిచాపతో ఆపటం లాంటిది. కాని అతనేనా యితను..."

*　　*　　*　　*

వరండాలో మిలిటరీబూట్ల శబ్దం రానురాను హెచ్చయింది. 'B' - దేశంలోని కెప్టెనులలో ఒకరైన కెప్టెన్ వెనమ్ వచ్చాడు. అతని అసలు పేరు ఎవరికీ తెలియదు. కాని అంతా కెప్టెన్ వెనమ్ (విషం) అని పిలుస్తారు. అనుచరుడు ఫాక్సు వెంట ఉన్నాడు. ఫాక్సు కెప్టెన్ వెనమ్‌కు దక్షిణ హస్తం.

మోరల్ లేచి మిలటరీ సాల్యూటు చేయబోయాడు. కాని కెప్టెన్ వెనమ్ కల్పించుకొని:— "లేవకు. కూర్చో" దగ్గరేఉన్న కుర్చీని ఇటు లాగాడు. ఫాక్సు కెప్టెన్ వెనమ్ కూలబడ్డాడు. అతని లావుపాటి శరీరం కూలబడేసరికి కుర్చీ కిర్రుమని కదిలి పోయింది. బానలాంటి పొట్ట. చెర్యొత్తు మనిషి. డబ్బాలో రాళ్లు వేసినట్లు గలగలలాడే బొంగురు గొంతు:—'మాడు. నీ కతనితో పరిచయం ఎలా కలిగింది?"

"ఏమన్నారు?"—తిరిగి అడిగాడు మోరల్.

"అతను నిన్నిప్పటుకు తీసుకొని వచ్చాడు. అట్లా అతను నిన్ను యిక్కడకు తీసుకొని రావడానికి కారణం—నీకూ, అతనికి సంబంధం ఉండిఉండాలని మేం అనుకుంటున్నాము."

"మీరేమేమో అనుకుంటున్నారు. నే నతనికి తెలియదు. అతను నాకు తెలియదు"—అన్నాడు మోరల్.

"అయితే ఏం సంబంధమూ లేకుండా నిన్నతను ఇక్కడ చేర్చాడని నమ్మమంటావు? అంతేనా!—" అన్నాడు కెప్టెన్ వెనం.

"ఇలాంటి విషయాలు నమ్మించటం కష్టం. యుద్ధంలో నేను పడిపోయాను. ఈ కాలు, యీ చేయి పోయాయి. ఆర్తత్రాణపరాయణుడైన ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ అలా పడి ఉండిపోయాను. చాలా సేపు...ఎంతసేపో......అలా ఉన్నాను. స్పృహ లేదు.

"స్పృహ వచ్చేసరికి నా పరిస్థితి అవగతమయింది. తెగిన కాలులోంచి యింకా రక్తం చిమ్మి కొట్టుతోంది. తల తిరుగుతోంది. దాహంతో నాలుక పిడచగట్టుకొనిపోయింది. మృత్యువు సమీపించిందని నిశ్చయించుకున్నాను.

"అప్పుడు...అప్పుడు ఇతనక్కడకు వచ్చాడు. జాలిగా ప్రార్థించాను. భగవంతుడు నా కనుకూలుడయ్యాడు. అతను మారాడు. తిరువాత ఏం జరిగిందో నా కయోమయంగా ఉంది. ఇక్కడున్నాను. నా కంతే తెలుసు..."

"మంచిది"—అన్నాడు కెప్టెన్ వెనం. "నీవల్ల దేశానికి చాలా మేలు చేకూరింది. నీ సహాయానికి మాతృదేశం ఋణపడి ఉంది; నిన్నభినందిస్తోంది. నీకు సాంతం నయమయ్యేవరకు ప్రత్యేకంగా సకల సౌకర్యాలు సమకూరుస్తాం."—కెప్టెన్ వెనం వెళ్లిపోతూ ఇతన్నిగురించి డాక్టరుకు గట్టిగా చెప్పివెళ్లాడు.

నర్సు వచ్చింది. ఇప్పుడు మాత్రం అతి జాగరూకతతో ప్రవర్తిస్తోంది. సంభాషణలో కూడా మార్పు వచ్చింది.

"సార్! మందు పుచ్చుకునే టయమయింది"

మందు త్రాగాడు. ఆమెలో అంకురించిన మర్యాదకు, నమ్రతకు మోరల్ ఆశ్చర్యపడ్డాడు. క్షణక్షణం ఆసుపత్రి అంతా అతన్నిగురించి అతిశ్రద్ధ వహిస్తోంది. అతను ఆజ్ఞ యివ్వటం తడవుగా పరిపాలింపబడుతోంది.

తెల్లవారింది. మోరల్ మాత్రం నిద్రపోలేదు. అతని హృదయమంతా ఉద్రేకంతో ఉడుకెత్తిపోయింది. ఆలోచనాప్రవాహతరంగాలు ఒకదాని తరువాత ఒకటిగా పొర్లిపోతున్నాయి. తల దిమ్మెక్కింది.

తన సంసారాన్ని నాశనం చేసినఅతన్ని ఎందుకు క్షమించాలి. తనలాగా అతనుకూడా యిన్ని బాధలు అనుభవించితీరాలి. - "పగ తీర్చుకుంటాను" — అంటూ లేచాడు. కర్ర భుజం క్రింద పెట్టుకుని చరచరా సాగిపోయాడు. నర్సు అడ్డు వచ్చింది. "సార్! తమరు కదలటానికి వీల్లేదు." లాభం లేకపోయింది. లిల్లీ ఏమో చెప్పబోయింది. వినిపించుకోలేదు.

* * * *

కెప్టెన్ వెనం తన సహచరులతో ఆలోచనలో పడ్డాడు. శత్రుదేశపు గుట్టు మట్టులు తెలిసికోవడం గురించి మథన జరుగుతోంది. శత్రుదేశంలో మారణహోమపు పరికరా లెక్కడ తయారవుతున్నాయి. ఏమూల, ఏభూగర్భప్రదేశంలో ఉత్పత్తిచేస్తున్నారు. ఎక్కడా బాంబులు వేసి నాశనం చేయాలి. ఈయావత్ సృష్టినీ నాశనం చేయగల మహా శక్తివంతములైన ఆయుధాలు ఎక్కడ తయారుచేస్తున్నారు? కాని, ఏ రాసించినట్లు ఎన్నెష్టావద్దనుంచి సరైన సమాధానం రావడం లేదు.

"ఎట్లా...ఎట్లా తెలిసికోవడం" — విసుగెత్తిపోయి ఉద్రేకంతో అరచాడు కెప్టెన్ వెనం.

"నేను ప్రయత్నిస్తాను" — అంటూ ప్రవేశించాడు మోరల్. అంతా ఒకరిముఖాలు ఒకరు చూచుకున్నారు. అంతా అనుమానపడుతున్నారని నిశ్చయించి మోరల్ మళ్లీ అందుకొని యిలా అన్నాడు "నమ్మటం లేదుకదూ!"

"ఎందుకు నమ్మటం లేదు"—అన్నాడు వెనమ్.

"మరయితే ఎందు కలా చూస్తున్నారు నాకేసి. నన్ను విశ్వసించండి. వాడు నాకు శత్రువు"

"అవును. వాడు మనకు శత్రువు"

"మీ సంగతి నాకు తెలియదు. నాకు పరమ శత్రువు. పగ తీర్చుకుంటాను." పళ్లు పటపట కొరుకుతూ, ఉద్రేకంతో అరచాడు మోరల్. దగ్గ తెర కమ్మింది. అందరి బుర్రలు ఆలోచనలో పడ్డాయి. తేరుకొని మోరల్ అన్నాడు:—"మీకు తెలుసా

నా ఊరును స్వాధీనంచేసికొని, యిండ్లన్నీ తగుల బెట్టించాడు. అంతా శ్మశానం చేశాడు. ఆస్తులన్నీ దోచుకున్నాడు.

"పిడికల్ల నాతల్లి, నా ప్రేయసి అష్టకష్టా లనుభ వించారు. నా యిరుగు పొరుగు నాశనమయ్యారు. బంధుమిత్రులంతా నశించారు. (కంఠం రుద్ధమయింది) నవమాసాలు మోసి, కని పెంచిన నా తల్లి, నామీద పంచప్రాణాలు పెట్టుకున్న ప్రేమైక స్వరూపిణి, ఆ పవిత్రమూర్తి ఆకలితో, వ్యాధితో, బాధతో అటమ టించి అంతమొందింది. నా ప్రేయసిని, నా హృద యాధిదేవతను బలవంతంగా..." ఉద్రేకంగా "వీడు చేసిన పనులు యిన్నీ అన్నీ కావు. విజయగర్వంతో విర్రవీగిపోయి, వివేచనాజ్ఞానశూన్యుడై యిష్టమొచ్చి నట్లు నాట్యం చేశాడు; చేయించాడు. ప్రతీకారం చేసి పగతీర్చుకుంటాను. ఇన్ని పరాభవాలూ అతనికి జరగాలి. వాడి ప్రేయసిని వాడిముందు క్రూరంగా ఘోరంగా అనుభవించాలి. తీర్చుకుంటాను పగ... హ హ్హ హ్హ హ్హా..." కండ్లు తిరిగి గిరున పడిపోయాడు.

కెప్టెన్ వెనం మోరల్ దగ్గరకు గబగబా వెళ్ళాడు. తగిన ఉపచర్యలతో సేద తీరుస్తున్నాడు. ప్రతివారి ముఖానా ఏం జరుగుతుందో అనే ఆదుర్దా అగుపిస్తోంది.

కెప్టెన్ వెనం కొంత స్వస్థత చెందటానికి అవ కాశం దొరికింది. ఎందుకంటే మోరలును అడ్డుపెట్టు కుని యితనిద్వారా ఆ దేశపు రహస్యాలు తెలుసుకో వచ్చు. ఈ దెబ్బతో అతని పరాక్రమం లోకానికి విదితమౌతుంది. శత్రుదేశపు గుండెను చీల్చబోతు న్నాడు. కొన్ని సంవత్సరాలు గా ఎవరూ తెలుసుకో లేని రహస్యాన్ని తెలుసుకొనబోతున్నాడు. అంటే వారి మారణాయుధాల సృష్టినే నాశనం చేయబో తున్నాడు. అందరికంటే ముందే అతనే పని చేయటా నికి సంకల్పించుకున్నాడు. అవసరమైతే ప్రాణా లొడ్డటానికి కూడా సిద్ధపడుతున్నాడు.

అప్పుడు...అప్పు డెవరినోట విన్నా అతని పేరే చెప్పుకుంటారు. అతణ్ణి అద్వితీయ శోధకునిగా ఆరాధిస్తారు. ఆ గొప్పతనమంతా అతనికే దక్కాలి.

కెప్టెన్ వెనం ఆలోచనలకు ఫాక్సు అడ్డు తగి లాడు:—"ఇంత ఉద్రేకంలో ఉన్నాడు మోరల్. ఇతనేం సమాచారం తెలుసుకుంటాడు..."

"అలా అనకు. ప్రతీకారవాంఛ ఇతనిలో బాగా రేకెత్తింది. ఆ అవకాశాన్ని మనం ఉపయో గించుకోవాలి...అన్నాడు కెప్టెన్ వెనం.

వెనం అనుమానపడ్డాడు!—"చుట్టూ కాపలా ఉంటే యితనేం అడుగుతాడు—అతనెలా చెబు తాడు"—

"అయితే ఒంటరిగా పంపుదామా? అక్కడ ఏం జరిగిందో మన కెలా తెలుసుంది."

"అదే నేనూ ఆలోచిస్తున్నాను."

"వీళ్ళకు కనుపించకుండా వీళ్ళ ననుసరిస్తాను"

"మంచి ఉద్దేశ్యం"—అన్నాడు వెనం.

* * * *

మిలటరీ గుడారాల్లో ఒకదాన్ని జైలుగా మార్చారు. అందులో బంధించబడ్డాడు కెప్టెన్ ఎర్నెస్టు. చీకటింకా బాగా అలుముకోలేదు. చంద మామ రావటానికింకా కొంచెంసేపు కావాలి. సూర్యాస్తమయానికీ, చంద్రోదయానికి మధ్య జరిగే సంఘర్షణాసమయం. ప్రతి వస్తువునూ బాగా చూడ టానికి సరిపడ్డ కాంతి ఉంది.

ఆ జైలులోకి కర్రమోపుకుంటూ, ఉన్న ఒకే ఒక కాలు యీడ్చుకుంటూ నడిచాడు మోరల్. ఒక మూలగా నక్కి తొంగిచూస్తున్నాడు ఫాక్సు. పశ్చి మాభిముఖుడై తదేక దృష్టిగా చూస్తూ కూర్చున్నాడు ఎర్నెస్టు. అస్తమించిన తరువాత మిగిలిన ఆ రెండు కొండల్నే చూస్తున్నాడో, లేక యింకా మిగిలిన రక్తకిరణసందోహం, మేఘశకలాలపై మెరసే ఆ తళుకునే అవలోకిస్తున్నాడో, చెప్పలేం. రెప్ప వాలటం లేదు.

నెనుకగా ప్రవేశించాడు మోరల్. అతని కర్ర చప్పుడవుతూనే ఉంది. ధ్యాననిమగ్నుడై యున్న ఎర్నెస్టు అతని రాక గమనించలేదు. చేతులు వెనక్కు విరిచి కట్టబడ్డాయి. చేతులకు, కాళ్ళకు మెదలటానికి వీల్లేకుండా సంకెళ్లు వేశారు.

మోరల్ అతన్ని క్షణంసేపు చూస్తూ నిల బడ్డాడు. తనొక పనిమీద వచ్చాడు. ఓ కార్యం సాధించాలి. అందుకే నియమితుడయ్యాడు. ఇవన్నీ మరచిపోయాడు. ప్రతీకారవాంఛ తిరోగమించింది. అతనిలోని మానవత్వం పెల్లుబికింది. అదిరి దద్దరిల్లే

ట్లు "అన్నా!"—అంటూ అరచాడు. కళ్ళవెంట నీళ్లు రాలిపడ్డాయి.

గభాలున పక్కకు తిరిగాడు ఎర్నెస్టు. మోరల్ ను చూట్టం తడవుగా:—"ఎలా ఉంది వంట్లో" అని ప్రశ్నించాడు.

మోరల్ యిదేమీ వినిపించుకోలేదు. తన్ను గురించి ఆలోచించుకోలేదు!—"ఆదేమిటి? గోళ్ళ నిండా ఆ రక్త మేమిటి? వీపునిండా ఆ దద్దు లేమిటి? ఏమి టివన్నీ?—" భయంతో బేలాడై పోయాడు. గొంతు బొంగురుపోయింది; వణికింది.

"నీ కాలు, నీ చేయి అలా ఎందుకయ్యాయి చెప్పవ్?"—

నిబ్బరంగా అన్నాడు ఎర్నెస్టు. వాక్యంతో గంభీరంగాను, ముఖం ప్రశాంతంగా చిరునవ్వుతో తొణికిసలాడుతోంది.

మోరల్ చలించిపోయి అతని కాళ్లమీద పడి పోయాడు.

ఎర్నెస్టు గోముగా అన్నాడు:— "కూర్చో. నువ్వల్లా పడిపోతే నాకెంతో కష్టంగా ఉంది. కూర్చోవూ? నా కాళ్లు, చేతులు కట్టారాయెను— నిన్నెల్లా కూర్చోబెట్టేం."

"ఇదంతా ఏమిటి?—"

"ఖుంజకు విరిచికట్టి కొరడాలతో కొట్టారు."

"ఆఁ..."

"చేతులవేళ్ళనిండా కాళ్ళవేళ్ళనిండా గుండు సూదులు దింపారు......"

"అబ్బా" — భోరున ఏడ్చాడు మోరల్. మెత్తనిహృదయం మంచులా గబగబ కరగిపోయింది.

"ఇంకా—"

"ఇహ వద్దు. ఎందుకు యిలా చేస్తున్నారు. కారణం?"

"యుద్ధం"—ఒకటేమాట అన్నాడు ఎర్నెస్టు.

"శత్రువనా?"

"అదీ ఒక కారణం కావచ్చు."

"అసలు కారణం చెప్పవ్?"

"ఏముంది మా దేశంలో మారణాయుధాలు ఎక్కడ తయారయేదీ చెప్పుతుంటారు. తెలిస్తే నిజంగా చెప్పిఉండేవాడినే. అవన్నీ ఒక్కసారి ధ్వంసమయితే యుద్ధం ఆగిపోయేది. ప్రజ బ్రతికి పోయేవారు..." అన్నాడు ఎర్నెస్టు.

"నేను దుర్మార్గుణ్ని అన్నా! నావల్లకదూ, నువ్విన్ని బాధలు పడాల్సి వచ్చింది."

"నానుంచి నువ్వు, నీ సంసారం అనుభవించిన దానికంటేనా? నావల్ల ఎంతమంది హింసింపబడ్డారు. నువ్వు నాకు మహోపకారం చేశావు. నీ సంపర్కం నాక్కలుగనినాడు ... ఎంతోమందిని చంపుతూ ఉండేవాడిని. ఎన్నో ఊళ్లు కాల్చి పారవేస్తూ ఉండే వాడిని. ఎంతమంది ఆస్తులనో సోల్జర్లు దోచుకుంటూ ఉండేవారు. ఎంతోమంది స్త్రీలను బలాత్కారంగా—" ఆగాడు. ఊపిరి పీల్చుకొని తాపీగా మొదలుపెట్టాడు:—నీవల్ల నాలో ఎక్కడో అణగారిపోయిన మానవత్వం పెల్లుబికింది; నేను చేసిన ద్రోహాలన్నిటియొక్క ఫలితం నా కండ్లముందు చూచాను. ఒకనాడు మానవుడు మానవుణ్ని చంపటం ధీరత్వం, శూరత్వం అని తలచాను. కాని ఆ మానవుడు చనిపోయినతరువాత అతని సంసారానికి కలిగే తీరని నష్టాన్ని గుర్తించలేదు; అతని సంసారం ఎన్ని బాధలనుభవిస్తుందో గమనించలేకపోయాను. పేలు పడిన ప్రతి గుండు చంపేది ఒక మనిషినేకాదు! అతన్ని అంటిపెట్టుకున్న యింకా అనేకమందిని."

నిశ్శబ్దత సాగిపోతోంది. కొంతసేపు ఎవరూ మాట్లాడలేదు. మోరల్ ఏదో మాట్లాడబోయాడు. కాని ఎర్నెస్టు అందుకున్నాడు:—"నువ్వు చెప్పిన విషయాలన్నీ యిందాకటినుంచీ మననం చేస్తున్నాను. ఎవరికెవరు శత్రువులు? ప్రజమధ్య వైరంలేదు, దేశాలమధ్య ఉంది. ఎక్కడున్నా యీ దేశాలు? దేశమంటే ప్రజ కాదా? బుద్ధిపూర్వకంగా మానవుడు యితరులను చంపుతున్నాడా? ప్రాణాలరచేతిలో పెట్టుకొని పోరాడాల్సిన అగత్య మేమొచ్చింది. ఎవరో కొద్దిమంది వ్యక్తులకోసం యింతమంది చావటమా?...

"అన్నా!..." అన్నాడు మోరల్.

"ఏమిటి?"

"మనం యిక్కడినుంచి వెళ్ళిపోదాం."

"పారిపోవడమా?"—అన్నాడు ఎర్నెస్టు.

"కాదు. ఈ మహామృత్యు కరాళగహ్వరంలో నుంచి తప్పించుకుందాం..."

"తప్పించుకుని"—

"మీ దేశం పోదాం."

"మా దేశమా?" — నవ్వాడు ఎర్నెష్టు— "దేనికి? మీ దేశమొస్తే నన్నేం చేశారు? మా దేశంపోతే నిన్నదే చేస్తారు. పైగా నాకో రెండు మెడల్సు... నాలుగు బిరుదులు... ఛీ!..."

మోరల్ మెత్తటి హృదయం ఘోషించిందంటే నమ్మరేమో! ప్రాణాలు తప్పించుకోవడమే కాకుండా, వచ్చే గౌరవమర్యాదలను కూడా కాలదన్నుతున్నాడంటే ఎంతటివాడి హృదయమైనా నీరైపోతుంది.

"ఇంకెక్కడికైనా పోదాం."

"ఎక్కడికి?..."

"ఎక్కడైతే యుద్ధంలేదో అక్కడకు. ఏ దేశం శాంతి నాకాంక్షిస్తున్నదో ఆ దేశం. ఎక్కడైతే జీవితానికి స్వస్థత, స్వేచ్ఛా వున్నాయో...అక్కడికి పోదాం."

"అయినా—" మెల్లగా అంటున్నాడు ఎర్నెష్టు "నాకు జీవించాలని కోరిక లేదు. ఎందుకంటే యీ భయంకరపిశాచం యింకా జీవించి ఉండటం మంచిది కాదు. సర్వవిధ్వంసానికీ కారకుణ్ణయిన నేను ... నేనే దేవుణ్ణని విర్రవీగాను. పరమోత్కృష్టమైన మహాశక్తి మరొకటుందని నీవల్ల గ్రహించాను. ఈ ధ్యానంలో యీ జీవితం యింతటితో చాలిస్తాను. నా మనస్సుకు శాంతి కావాలి. ఈ లోకంలో అది లభ్యం కాదు.

"తమ్ముడూ!! నన్ను క్షమించవూ? తీరని అపచారాలెన్నో చేశాను. మాయని మచ్చ లేర్పరచాను. నా దురాచారాలు క్షమార్హమైనవి కావు. కాని మిగిలిన యీ బహుకొద్ది జీవితం ప్రశాంతంగా దొర్లిపోవటానికి, నీ నోటినుంచి ఆ మాట అను."—

"అన్నా!..." అంటూ విరుచుకొని పడిపోయాడు మోరల్ ఎర్నెష్టు కాళ్ళమీద:—"నా మాట విను. నాతో వస్తావుకదూ?....మాట్లాడవేం?..."

"కోరికలు నశించినప్పుడు జీవించటం దేనికి?"

"నాకోసం..." అన్నాడు మోరల్.

"నేను రాను తమ్ముడూ!... నా గురించి నువ్వు బాధపడకు. నా జీవితంలో ఒక్క మంచిపని చేశాను. ఒక వ్యక్తిని బ్రతికించాను. అంతే...అదే నాకు సంతృప్తి..."

"నా కెక్కువ మాటలు రావు. నిన్నొక్కటే అడుగుతున్నాను. ఇప్పుడంతా నా చేతుల్లో ఉంది. ఇద్దరం కలిసి పారిపోదాం. వస్తావను. రానంటే ఇక్కడే తల బ్రద్దలు కొట్టుకొని చచ్చిపోతాను. ఆ మాట అను. ఆ మాట అను..."

ఎర్నెష్టుకు ఏమి చేయడానికి తోచలేదు. అతని దృష్టిపథంలో లిల్లీ మెరసింది. వెంటనే:—"రాను"—అన్నాడు.

మోరల్ తల నేలమీద మోదుకోవటం మొదలు పెట్టాడు. వారించటానికి వీల్లేకుండా ఎర్నెష్టు చేతులు కట్టివేయబడి వున్నాయి:—"సరే."—అన్నాడాఖరుకు.

* * * *

కెప్టెన్ వెనం విచారణ కుద్యమించాడు. ఫాక్సు వెనుక నిలుచొని వున్నాడు:—"దేశద్రోహీ! నన్ను నమ్మించి, నాకళ్ళల్లో మట్టికొట్టి, మాతృదేశాన్ని పరహస్తాల్లో నుంచటానికి ప్రయత్నించావు. మోరల్! నన్నే మోసం చేద్దామనుకున్నావుకదూ..." అంటూ వెనం ఎర్నెష్టుదగ్గరకొచ్చాడు:—"చెప్పు నీ కిదివరకితను తెలుసా? యుద్ధభూమిలోని యితన్ని తీసుకొని రావటానికి కారణం ఏమిటి? నిన్నెందుకితను వదిలిపెట్టటానికి సిద్ధపడ్డాడు...మాట్లాడవేం?..."

"నేను చెప్పేది ఏమీలేదు..."

"రాస్కెల్..." అంటూ ఎర్నెష్టును ఆ లెంప యీ లెంప వాయించేశాడు వెనమ్.

"అన్నా!..." దుఃఖమాపుకోలేక బిగ్గరగా అరచాడు మోరల్ ... కంళ్లవెంట బొటబొటా నీళ్లు కారాయి.

"ఛీ! ఏడవొద్దు! సైనికుడు మృత్యువుకు వెరుస్తాడా?..." అన్నాడు ఎర్నెష్టు.

"కాని వాళ్లు మన్ని అర్థంచేసుకోలేకపోయారు..."

"పోనీలే! నువ్వు చెప్పావుగా! —దేవుడంటూ ఒకడున్నాడని..."

బయటనుంచి ఒక సైనికుడు ఒక అమ్మాయిని ముందుకు తోశాడు : — 'ఇదిగో సార్ ! ... యీ అమ్మాయే హాస్పటల్లో మోరల్ తో ఉంది. తీసుకొని వచ్చాం...."

లిల్లీ లోనికి వచ్చింది. మోరల్‌ను చూచి కంట తడిపెట్టింది: మోరల్ ఆమె కేసి తిరిగాడు:— "లిల్లీ, నేను దేశానికి ద్రోహం చేశానట. దేశద్రోహిని. నాకేశిక్ష విధిస్తారో యింకా చెప్పలేను. ఒకరోజున నిన్ను నేను ప్రేమించాను. కాని అతడు నీదగ్గ..." అంటూ ఎర్నెస్టును చూపాడు. లిల్లీ, ఎర్నెస్టు ఒక్కసారిగా ఏదో అనబోయారు కాని — "ఆగండి. లిల్లీ!...ఒక దేశపు రాజు...మరో దేశపు రాణి...రెండు దేశాలకు ఒక యువరాజు. రెంటికి అతడే వారసుడు. నీకుమారుడే ఒక కానుక. శాంతిదూత...ఏడవకు ..."

"నిశ్శబ్దం...." ఖంగున అరచాడు వెపం — "మోరల్ !... నువ్వు కుట్రచేయటానికీ, యీ దేశద్రోహచర్యకు ఉద్యమించటానికి గల కారణాలు చెప్పు."

మోరల్ మొదలుపెట్టాడు : — "నేను చెప్పబోయేది మీరు కడదాకా వింటారని నాకు నమ్మకం లేదు. నే నిప్పుడు ప్రపంచంలో దేనికీ భయపడను. మృత్యువు నాహ్వానిస్తున్నాను.

"మానవునకు కావలసిం దేమిటి? తిండి, బట్ట. అవెప్పుడు, ఎలా లభ్యమవుతాయి? ప్రశాంతత భగ్నమైన యీ పరిస్థితుల్లో, తన కేం కావాలో మానవుడెలా సమకూర్చుకోగలడు? మనిషికి స్వస్థత లేదు. ఈరోజు తనది, రేపు మరొకడిది. చల్లటి సంసారాలన్నీ చెల్లాచెదరయిపోయాయి. రేపు ఏం జరుగుతుందో ఎవడికీ తెలియదు. మానవునకు శాంతి... భద్రతలు కావాలి. అప్పుడే కమ్మగా తింటాడు... హాయిగా ఉంటాడు.

"ప్రజా నినాదం ఎప్పుడైనా విన్నారా?"

"అందరికీ అన్నం కావాలి, బట్ట కావాలి. సుఖం కోరుకుంటారు. అందరికీ జబ్బులొస్తాయి, పుడతారు...చస్తారు...ఆశలు, కోరికలు ఆశయాలు అన్నీ ఉంటాయి. ఇవి అందరికీ ఉంటాయి. వీటన్నింటిని చంపుకొని మానవుడు ప్రాణాలను బలిదానం చేస్తున్నాడు. దేనికి?.. ఏ మహత్కార్యం సాధించటంకోసం?

"మమ్మల్ని పశువుల్లా యుద్ధంలోకి గదిమారు. ఎందుకోసం? ఎవరికోసం యుద్ధం చేస్తున్నామో మాలో ఒక్కడికీ తెలియదు. ప్రతి గుండుతో ఒక శత్రువును చంపమన్నారు. ఎవడా శత్రువు. అతనికీ నాకూ శత్రుత్వ మెలా ఉంది. ఎవరు ఎవరికి ఏం అపచారం చేశాం...

"నేను దేశద్రోహిని. అవును కదూ?

"మమ్మల్ని బలవంతంగా యుద్ధానికి పంపారు. మా సంసారాలకు మీరేం రక్షణ కల్పించారు. నా సంసారం నాశనమయింది. అన్నం లేక అల్లాడిపోయారు. నాతల్లి క్షుధాగ్నిలో దహించుకొనిపోయింది. నా తండ్రి మొదటి యుద్ధంలో అసువులు విడిచాడు. నా అన్న రెండో యుద్ధంలో ప్రాణాలర్పించాడు. నా ప్రేయసి బలవంతంగా చెరుపబడింది. ఇన్ని విధాలా నాశనమయ్యాం. మాకేం మేలు చేకూరింది? మా సంసారంలాగా ఎందరి సంసారా లిలా ఆహుతయిపోయాయో ఎప్పుడన్నా గమనించారా? దీనికంతా కారణం ఏమిటి? యుద్ధాల వల్ల చేకూరే మేలేమిటి?

"ప్రజలకు శాంతి భద్రతలను చేకూర్చి క్షేమంగా పరిపాలించటమా ప్రజాప్రభుత్వాల లక్ష్యం ... అందర్నీ హతమార్చటమా?...మాట్లాడరేం?...

"మైలార్డ్! నేను దేశద్రోహిని కదూ?

"మేం మానవులుగా మనటానికి ప్రయత్నించాం. శాంతిని ఆకాంక్షించే దేశానికి పారిపోయి ప్రశాంతమైన జీవితం గడపటానికి నిశ్చయించాం. కాని మీరు మమ్మల్ని మానవులుగా మననీయలేదు.

"మైలార్డ్!—మీరు విచారించేది న్యాయాన్ని మాత్రమే. న్యాయానికతీతమైన ధర్మాన్ని కాదు. న్యాయానికి కండ్లు లేవు; చెవులు మాత్రమే వున్నాయి. ధర్మానికి యీ రెండూ కావాలి; ఇంకా ఆత్మసంస్కారం, ఆత్మసాక్షాత్కారం కావాలి. మహాత్ములు మహర్షులు తప్ప విడిచి మామూలువాళ్లు ధర్మాన్ని విచారించలేరు. అక్కడ [అంటూ ఆకాశం కేసి చూపాడు] వాడు విచారిస్తాడు ధర్మాన్ని.

"అబ్బా!...మేం...దేశ...ద్రోహులం...... మై...లార్డ్! మేం...ద్రోహులం......" అంటూ గుండె పట్టుకొని విరుచుకొని పడిపోయాడు మోరల్. మళ్ళీ లేవలేదు; లేవడు. పట్టుకున్న యిద్దరు సైనికుల్ని ఒక్క విదిలింపుతో అంత దూరానికి నెట్టేసి "తమ్ముడూ!" అంటూ మోరల్‌ను కౌగలించుకున్నాడు ఎర్నెస్టు.

ఎర్నెస్టు పారిపోతున్నాడేమోనని ఖంగారుపడి కాలికి గురిపెట్టి పిస్టల్ పేల్చాడు ఫాక్స్. కాని ఎర్నెస్టు గభాలున కూలబడటంతో గుండెల్లోనుంచే దూసుకుపోయింది.

ప్రళయఘోషలతో వీరవిహారం చేసే బ్రహ్మాండమైన సముద్రాన్ని యిద్దరు సాహసులు దాటబోయారు. కాని......

# దక్షిణదేశీయాంధ్రవాఙ్మయము

## యక్షగానవిషయ పరామర్శ

శ్రీ యస్వీ జోగారావు

అఖండ దీపారాధన దానశాసన వాఙ్మయ చరిత్ర' వా ప్రసిద్ధి వహించిన 'తెనుఁగు కవులచరిత్ర' రచించినపూజ్యశ్రీ నిడుదవోలు వేంకటరావుగారిటీవల 'దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము' అను మరియొక బృహద్గ్రంథమును మదరాసు విశ్వవిద్యాలయము తరఫున వెలయించినారు. మొదటిది కవుల చరిత్రమైతే యిది వాఙ్మయ చరిత్రము. అసలు ప్రాయికముగా రెంటికి నొక ముఖ్య భేదముగలదు. కవులచరిత్రమున కవుల దేశకాలములు కులగోత్రాదికములు, వారి కాశ్రయులగు వారి యుదంతము మొదలగు చరిత్రాంశములే కాని కావ్యవిమర్శ యుద్దిష్టము కాకపోవచ్చును. కవుల గ్రంథముల పేళ్ళు చేర్కొని నాలుగైదు పద్యములు మచ్చులిచ్చి యంతటితో సరిపెట్టవచ్చును. కాని వాఙ్మయచరిత్ర మనగనే కావ్యోత్పత్తి కధిష్ఠానమాత్రమగు చరిత్రాంశము, యుగలక్షణ సమన్వయముతోడి కావ్య విమర్శయు, ఒక్కొక్క వాఙ్మయ ప్రక్రియయొక్క పరిణామక్రమ నిరూపణము నుండవలెను. కాని వెంకటరావుగారి సూక్ష్మ దృష్టికి శాసనకర్తలును కవులు; కేటలాగులు కావ్యములవంటివి. వారి రెండు గ్రంథములందును క్రమముగా నవియే ప్రధానవిషయములు.

అయిదువందల పుటలకు పైబడిన 'దక్షిణదేశీయాంధ్రవాఙ్మయ గ్రంథమునం దర్ధాధికము కేటలాగులు, శబ్దసూచికలు, ఆశ్వాసాంతగద్యలు మొదలగువాని నకళ్లకు గొదువపెట్టబడినవి. కడమ భాగమున అధస్సూచికలు, అనుబంధములు, గ్రంథ ప్రతుల కొలతలు, చరిత్రలు, ఉదాహరణల పునరుక్తులును పోను కావ్యవిమర్శ యున్నది అచ్చయిన గ్రంథముల మీద మాత్రమే, అదియు సహజముగా గొన్ని యవకతవకలతో, కొంత హెచ్చుగను, అచ్చుకానివానిపై లొచ్చుగను గలదు, కొన్నిటిపై లేనేలేదు.

ప్రకృతవిషయము ఏతద్గ్రంథమునగల యక్షగానసమీక్ష (సమీక్ష యనుటకు మనసొప్పకున్నది) యందలి లోప స్వరూపము నిరూపించుటయే. దక్షిణాంధ్రయుగసాహిత్య ప్రక్రియలలో నతిముఖ్యమైనది యక్షగానము. ఆ కాలమున దానికి రాజప్రాపకము, రంగభోగమును విస్తరిల్లినవి. ముఖ్యముగా తంజాపురాస్థానము తన్మహనీయస్థితిమూలమై నిలచినది. అట తత్పరిణతి యొక విశిష్టపథమున సాగినది. (చూ. డాక్టరు శ్రీ నేలటూరి వెంకట రమణయ్యగారి 'యక్షగానము - తంజావూరు' అను వ్యాసము - ఆంధ్రపత్రిక ఖర సంవత్సరాది సంచిక). అప్పటి యక్షగానము లనేక సమకాలిక జాతీయ జీవిత విశేషములకు ముకురావలోకన ప్రాయములై యున్నవి. అట్టి ముఖ్యమగు సాహిత్యశాఖయొక్క పరిణామమును నిరూపించుట ప్రస్తుత గ్రంథకర్త కవశ్య కర్తవ్యము. కాని వారది నెరవేర్పలేదు.

అసలు దక్షిణాంధ్రయుగ వాఙ్మయమున నముద్రిత గ్రంథములసంఖ్య, అందు యక్షగానముల సంఖ్యయు నధికములు. ముద్రితము లెక్కువగా శృంగార ప్రబంధములగుటచే నిదివరకే బహుధావిమృష్టములై ప్రచారము నందినవి. విమర్శ యెక్కువగా నావశ్యకమైన దీయముద్రిత యక్షగానముల గురించియే. వీనిగురించి వెంకటరావుగారు సవివరణములకు గ్రంథ దీపికలనుండి సంగ్రహించి యుదాహరణములను గుప్పించినారు పేజీల పెంపకమునకై. వారెంత సాహసముగల పరిశోధకులో అంత గ్రంథవిస్తర భీతి లేని రచయితలు. అట్లే ఉదాహరణల విషయమున

కొంత యుదాహరులో విమర్శ విషయమునకంటె మిత భాషలు.

నేడు వందకు పైగా దక్షిణాంధ్ర యక్షగానముల పేళ్లు వినబడుచున్నవి. ముప్పాతిక లభించుచున్నవి. వెంకటరావుగారు అరువది యూరింటి పేళ్లు పేర్కొనిరి. అందుపలబ్ధములై యముద్రితములుగానున్నవి యేబదియెనిమిది. వానిగురించి వారి వ్రాత సుమా రెనుబదిపుటలు. అందు సుమారరువది పుటలు తూచా తప్పకుండ కేటలాగులకు ప్రాటకాపులైనవి. కేటలాగుల వాటా కేటాయించినచో కేవల గ్రంథ విమర్శనము పట్టుమని పదిపుటలు లేదు. ప్రక్రియా పరిణతిగురించి పల్లెత్తుమాటలేదు. పోనీ ఉదాహరణల కైన మితౌచితీ పరిజ్ఞానము(*Sense of proportion*) ఉపయోగింప బడలేదు. ఒక ఉదా॥ వెం॥ రా॥ గారి గ్రంథము పుటలు 145నుండి 163 వరకు వరుసగా తంజావూరి సరస్వతీమహలు కేటలాగు (ఆంధ్ర విశ్వపరిషత్ప్రచురణ, 1933) నకు నకళ్లు. మక్కీకి మక్కీ. (దయచేసి 'శైపారు' వేసి మాడగలందులకు ఓపికగల పాఠకులకు వేడికోలు).

ఈ కవి కులగోత్రము లివి, ఇతడు రచించిన గ్రంథము లివి, ఇవిగో యుదాహరణలని యింక కేటలాగుల నేకరువు పెట్టుటకు ఉపక్రమించిన నది పరిశోధన యగునా? అదియుం గాక కేటలాగులలో సాధారణముగ గ్రంథాద్యంత భాగములే ముక్తసరిగా ఉదాహరింపబడును. అవి గ్రంథస్వరూపము సూచముట్టుగా నిరూపింప సమర్థములై యుండునా? అసలు వెంకటరావుగారు కొన్నిచోట్ల కేటలాగులోని విషయములనే యేమరిన పట్టులుఁగలవు. అనగా వీ రనేక గ్రంథముల మొగ మెఱుఁగరు. మాచిన కొలది పాటి గ్రంథముల గూర్చియైన సమ్యక్పరిశీలనము లేదు. వారి ధోరణిలోనే వారు కాలుజారిన సందర్భములనేకము గలవు. పరి పరి విధముల లోపముల నిట కొంత పరామర్శింతును.

1. పుట 31 లో — రఘునాథనాయకుని 'గజేంద్రమోక్ష, రుక్మిణీకృష్ణ వివాహ రచనలు సాహిత్యసుధలో యక్షగానములుగా పేర్కొన బడినవి' అని కలదు. మొదటిసంగతి అవి రెండును పేర్కొనబడుట సంగీతసుధలో — "......గజేంద్రమోక్షం, చరిత్రం చ నళస్యచిత్రమ్॥ శ్రీ రుక్మిణీకృష్ణ వివాహయక్ష గానం ప్రబంధా నపినైకభేదాన్ నిర్మాయ..." (చూ. సంగీతసుధ — చరిత్రమ్. శ్లో. 62 & 63, *Journal of the Music Academy (Madras), Vol. I*, 1930). ఆ నడుమనున్న నలచరిత్ర ద్విపద. ఇందు గజేంద్రమోక్షము యక్షగానమని చెప్పబడలేదు. ఇంతకు నది యలబ్ధము.

2. పుట 107 లో — కోనేటిదీక్షితుని విజయ రాఘవ కల్యాణముగురించి — 'విజయరాఘవ కాంతిమతీ వివాహ మిందు వర్ణితము' అని కలదు. ఇందలి నాయిక కాంతిమతి కాదు. మదన మంజరి. ఈ విషయము తం॥ స॥ మ॥ కేటలాగులోనే కలదు. (చూ. పుట 253). కాంతిమతి మన్నారుదాస నాటక కథానాయిక.

3. పుట 108 లో — తంజాపురాన్నదాన మహానాటకమును 'హృద్యమగుకృతి' యని పేర్కొనిరి. తంజావూరి సత్రములో 'తిడియా' వేసిన యొక అరసిక విప్రుని సానులతో విరసముగా ప్రసంగించుట యిందలి యితివృత్తము. నడుమ నొకచో శుద్ధాచ్ఛిక మగు నపశుద్ధ శబ్దపర్యాయముగూడా ప్రయుక్తమైనది. వారి కది యెట్లు హృద్యమనిపించినదో మరి?

4. పుట 184లో — మన్నారుదేవుని హేమాబ్జ నాయికాస్వయంవర రచనా కాలమును గ్రంథమునందలి యొక ముహూర్త సందర్భమును పురస్కరించుకొని అందు సౌమ్యనామ సంవత్సరము పేర్కొన బడుటచే నది క్రీ. శ. 1664 అని నిశ్చయించిరి. కాని క్రీ. శ. 1664 క్రోధి. ఆ సౌమ్య 1669. రచనాకాల నిర్ణయమున కిట్టి భంగ్యంతర సూచనలంతకు ముందు పేర్కొనబడిన గ్రంథములందును గొన్నిటగలవు. అవి యొప్పరికింపబడినవి.

5. శహాజీ యక్షగానములో గొన్నిటి యితివృత్తములే వీరి యూహాపోహ గానమున కందలేదు. ఉదా. సతీదానశూరము మొ॥ ప్రసిద్ధేతివృత్తములను ద్రౌపదీకల్యాణము, పార్వతీకల్యాణము మొదలగు గ్రంథములకు 'ద్రౌపది పెండ్లికథ యిందు వర్ణితము, పార్వతి పెండ్లికథ యిందు వర్ణితము' అని విషయ వివరణము యథార్థముగా నీయగలిగిరి. కాని కిరాతవిలాసమును దానిగురించి 143 వ పుటలో 'అర్జునునకుఁ బరమేశ్వరుడు పాశుపతంబు నొసగుట యిందలి యితివృత్తము' అని వ్రాసినారు వెంకటరావుగారు. ఇది పచ్చి బుకా

యింపు. కచ్చితముగా వారు గ్రంథము చదువక చెప్పినమాటయని రుజువగు చున్నది. ఇం దర్జునుని యూసే లేదు. పార్వతితో పరమేశ్వరుడు తన సర్వస్వము పందెమొడ్డి పగడసాలాడి యోడి కిరాత వేషమున నడవికిబోయి తపస్సుచేసికొను చుండును. పార్వతి పశ్చాత్తప్తయై తానును భిల్లాంగనా వేషమును స్వీకరించి యడవికేగి యతనిని గలసికొనును. ఇది యిందలి యితివృత్తము.

తం॥ స॥ మ॥ కేటలాగు (పుట 201) లో నే కవి ప్రోక్తమైన కథాసంగ్రహ ముదాహరింప బడినను పాపము పరాకు పడినారు వెంకటరావుగారు. కిరాత శబ్దము చూడగనే అర్జునశబ్దము స్ఫురించినది వారికి. వారి గ్రంథవిషయమున పాఠకులిట్లు పొరబడకుందురు గాక.

6. పుట 144 లో — శహాజీ శాంతా కల్యాణమునుగురించి వ్రాయుచు 'దశరథుని కూతురగు శాంత ఋష్యశృంగుని పెండ్లియాడినకథ' అని యనిరి. శాంత తండ్రి రోమపాదుడు. పోనీ యామె పెనిమిటి పేరైనా సరిగా పేర్కొనగలిగిరంతే చాలు. అసలు శహాజీ యక్షగానముల విలువ విషయ మాత్రగతము గాదు. వాని సంఖ్యవలె వైవిధ్యము ననల్పము. తరచుగ రచనలో ప్రక్రియలో భాషాప్రయోగములో నేదో యొక విశేషము చమత్కారము నుండును. ఆ విశేషములు మరి కేటలాగుల కెక్కలేదాయె. ఇంక వెంకటరావుగారి వెల్లడింగ గలము? ఏక కర్తృకములగు నన్ని గ్రంథములగురించి కొన్ని సామాన్యలక్షణములనైన పేర్కొనవలదా? పోనీ ప్రతి గ్రంథమును విమర్శింప నక్కరలేదు. ఒక్క ముఖ్యకృతియొక్క ప్రత్యేకతనైన స్వతంత్రముగా విమర్శింపవలదా? కాని వెంకటరావుగారి దొక విమర్శవక్కాణగలదు — 'ఇన్ని గ్రంథములు రచియించుటచేతనే శహాజీ మహారాజా గుణభరిత సకలభాషా చతుర్విధ సాహితీ నిర్వాహకుడనియు సాహితీ సంభావ శారద యనియు ప్రసిద్ధి వహించినవాడు' అని యన్నిటికి నొక్కటే ముక్తాయింపు. కాని యే గ్రంథ మేయే దేవున కంకితమైనదో పేర్కొనుట విశేషము!

7. పుట 150—151 లలో — పార్వతీ పరిణయము శహాజీకృతిగా పేర్కొనబడినది. కాని దాని చివర మంగళములో 'మహేంద్రశాహ రాజాయ మంగళం ... శ్రీ చోళనాయకాయ శ్రీ వాసుదేవ కవి వచస్సంతుష్టాయ మంగళమ్' అని యుండుటచే దీని కర్తృత్వము శంకింపదగినది. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారును ఈ అభిప్రాయమునే వెలిబుచ్చిరి. (చూ. 'మహారాష్ట్రభూపతులు — ఆంధ్ర సాహిత్యము' అను వ్యాసము. భారతి — డిసెంబరు, 1958). వెంకటరావుగా రీశంకనైనా నుటంకించి యుండవలసినది.

8. పుట 171 లో — గిరిరాజకవి రచించిన శాహేంద్రచరిత్రము గురించి, 'శాహాజీ యొక కన్యను వలచి యామెను పెండ్లియాడుట యిందలి యితివృత్తము' అని వ్రాసిరి. ఇందలి నాయిక గణిక. ఆమెయే శహాజీని జూచి మోహించి చెలికత్తెను రాయబార మంపినది. భామాసులభుడైన యా నేవర వెంటనే యింగులకు సమ్మతించి యామెను యథోచితముగ సత్కరించును. అంతే. పెండ్లి యూబుసు లేదు. వెంకటరావుగారు పలుతావుల విషయము నసలు విప్పి చెప్పనే చెప్పరు. చెప్పినచోట్ల తప్పులు వచ్చుచున్నవి కద.

9. పుట 172 లో — గిరిరాజకవి రాజమోహన కొరవంజి రామమోహన కొరవంజియను శీర్షికతో నుదాహరింపబడినది. దీనికి నెం॥ '500 నుండి 510 వరకు మూడు ప్రతులుగల' వనిరి. అది '509 నుండి 511 వరకు' అని యుండవలె. ఇది కాక నెం. 570 రు గల ప్రత్యంతరమును గలదు.

10. పుట 177 లో — ఉదాహరింపబడిన గిరిరాజకవి సర్వాంగసుందరీ విలాసము మంగళములో నొక విశేషము వీరు గుర్తించినట్లు లేదు. ఇందును వాసుదేవకవి పేరు వచ్చినది. అసలీ మంగళ గీతము పార్వతీ పరిణయము చివరవచ్చినదే. మరియొక విశేషము. ఈ సర్వాంగసుందరీ విలాసపు టవతారికయు, శేషాచలపతి కృతియైన సరస్వతీ కల్యాణపు టవతారికయు నొక్కతీరుగ నున్నవి. అసలు సర్వాంగసుందరీ విలాసపుటవతారికయే శహాజీ యాస్థానపు యక్షగానముల కెక్కువగా మాదులయైనట్లు తోచును. ఉదాహరించనివి సరేసరి కాని యుదాహరించినవాని లోని విశేషములనైన గుర్తించలేదు వెంకటరావుగారు.

11. శహాజీ యక్షగానములవలె కంఠీరవరాజ కృతులు కేటలాగులలో వివరింపబడలేదు కావున

వెంకటరావుగారు వానిని చూడవలసివచ్చినది. అందుచే వానినిగురించి వ్రాయుటకు కొంత యవకాశము చిక్కినది. పుట 405 లో నీ రుదాహరించినట్లవి పదునాలుగుకావు. పావకినాటకము, వైవస్వతి నాటకము, నైరుతినాటకము ఇత్యాదులు ప్రత్యేక నాటకములు గావు. అవి అష్టదిక్పాలక విలాసమను దాని లోని యంతర్భాగములు.

12. పుట 408 లో —కంఠీరవరాజు కలవాణీ విలాసముగురించి వ్రాయుచు 'ఇందు కలవాణి యను వేశ్య కంఠీరవరాజును చూచి మోహించుకథ చెప్పబడినది' అని వ్రాసిరి. కాని కలవాణి వేశ్యకాదు. 'కాంభోజ పతిపుత్రి కలవాణియనెడి అంభోజలోచన ...' అని కలదు.

13. పుట 408 లో—కంఠీరవరాజు నాట్యవిద్యావిలాసము గూర్చి వ్రాయుచు 'ఇందు సంస్కృత భాగము హెచ్చుగా నున్నది. పద్యరచన తెనుగున నచ్చటచ్చట గానవచ్చును' అని వ్రాసిరి. కాని తెనుగు సంస్కృతమునకు రెండు రెట్లున్నది. ఇందు తెనుగున దరువులు, ద్విపదలే గాని పద్యము లసలు లేవు.

ఇక అనావశ్యకములగు చిల్లరమల్లర విషయము లనేకము సేకరించి ప్రకటించిన వెంకటరావుగారు దక్షిణాంధ్ర వాఙ్మయమునకే చెందునట్టి ఉపలబ్ధము లగునట్టి యనేక ముఖ్యములైన యక్షగానముల పేరైన పేర్కొనక విడిచిరి. అందు కొన్ని కేటలాగులలో వివరింపబడినవే, కొన్ని ముద్రితములైనవి కూడ. వాని నీ దిగువ నుదాహరించెదను:

1. భక్తవత్సలవిలాస నాటకము—కర్త శహాజీ. (అముద్రితము. కేటలాగులో నుదాహరింపబడలేదు. తంజావూరు సరస్వతీమహాలు ప్రతి నెం. 117)

2. రాజకన్యాపరిణయము — కర్త గిరిరాజు. (అముద్రితము. తం॥ స॥ మ॥ కే. నెం. 568 569)

3. పంచకన్యాపరిణయము — కర్త బాలకవి (సుబ్బన్న కావచ్చు) కృతిభర్త శహాజీ. (అముద్రితము. తం. స॥ మ॥ కే. నెం. 589)

4. శాహమహారాజు కల్యాణము—కర్త తెలియదు. (బాలకవి సుబ్బన్నయగునేమో!) (అముద్రితము. తం. స॥ మ॥ కే. నెం. 681)

5. వాదజయ కొరవంజినాటకము—కర్త పేరు తెలియదు. (నడుమ నొక అరవదరువులో తమిళ రామకవి నామధేయుం డొకడు పేర్కొనబడినాడు. శహాజీపై రచింపబడినది.) (అముద్రితము. తం. స॥ మ॥ కే. నెం. 597.)

6. రాజరంజన విద్యావిలాస నాటకము—కర్త తుళజరాజు *I* (అముద్రితము. కేటలాగున లెక్కలేదు. తం. స॥ మ॥ ప్రతి నెం. *B* 13944)

7. సీతాకల్యాణము — (అముద్రితము. తం॥ స॥ మ॥ కే. నెం. 673) కేటలాగులో 'కర్త తెలియదు' అని యున్నదిగాని గ్రంథమునందు అవతారికలోనే 'గోపాలకృష్ణయ్య కొమరుడైనట్టి వెంకటరాముడు ... విరచించె ... ' నని స్పష్టముగా నున్నది. ఇతడు క్రీ. శ. 18 వ శతాబ్ది యుత్తరార్థమునందు మెలట్టూరు భాగవత మేళ నాటక కూటములకు కులపతియగు వెంకటరామశాస్త్రియే. (అని నేను శూలమంగళము భాగవతోత్తములు పూజ్యపాదులు శ్రీ స్వామినాథ, కల్యాణరామయ్యరుగారల నుండి వెంకటరామశాస్త్రి గ్రంథములకు శూలమంగళము గ్రంథలిపి ప్రతులు సంపాదించి వానిని తెనుగు లిపిలోనికి మార్పించి వ్రాయించుకొనుచున్నపు డందలి వివరములనుబట్టి గుర్తించితిని.)

8. రుక్మాంగదము (అముద్రితము. తం. స॥ మ॥ కే. నెం. 582). ఇందు గ్రంథకర్త పేరు కానరాదు కాని శ్రీ స్వామినాథ భాగవతోత్తరు మెలట్టూరు వెంకటరామశాస్త్రి కృతియని చూపించిన రుక్మాంగద చరిత్రయు, అసమగ్రముగ నీ గ్రంథము మున్నంతమట్టు కొక్కే తీరుగనున్నవి.

9. యక్షగాన రామాయణము — గ్రంథకర్త్రి అన్నదానం వెంకటాంబ.

ఇది అన్నదానం రామలక్ష్మమ్మ గారిచే 1912 లో కర్నూలు చంద్రమౌళీశ్వర ముద్రాక్షరశాలలో ముద్రితమై ప్రచురింపబడినది. వెంకటాంబ సేలముజిల్లా హొసూరు తా॥ లోగీర అగ్రహారవాసిని. ముద్రణ కాలమునకు సుమారు 200 ఏండ్లకు పూర్వము అనగా క్రీ. శ. 1712 ప్రాంతమున నీమె యున్నట్లు రామలక్ష్మమ్మగారు వ్రాసియున్నారు పీఠికలో.

10. సీతారామవిజయము—కర్త త్యాగరాజు. ఇది వాలాజానగర్ లోకనారాయణశాస్త్రిగారిచే

పరిష్కృతమై ముద్రణ గాంచినదట (చూ. త్యాగరాజ శతవార్షికోత్సవ సంచిక) కాని ఎక్కడో ఎప్పుడో వివరములు తెలియవచ్చుటలేదు. ఇపుడు ప్రతులు దుర్లభము. మధుర సౌరాష్ట్రసభలో నొక వ్రాత ప్రతి యుండిన నుండవచ్చును.

11. సుందరేశ్వర విలాసము—కర్త: మారుపెద్ది చెంగల్వరాయశాస్త్రి. చెంగల్పట్టుజిల్లా చెయ్యూరు వాసి. కాలము క్రీ. శ. 1810–1900. ఇది శ్రీ పి. సాంబమూర్తిగారిచే ప్రచురింపబడినది. (*Indian Music Publishing House, Madras, 1952*)

ఇవికాక, యక్షగానములు కాకపోయినను వెంకటరావుగారి గ్రంథమున చేరదగిన తత్సదృశరచనలు కొన్ని గలవు. 1. బొమ్మలాట హాస్యనాటకము— ఇది 'దక్షిణసింహాసనాధీశ్వరుండు విజయపేట రఘునాథభూపాలుని నాటకశాలకు' సంబంధించిన దని గ్రంథమునుండియే తెలియగలదు. 2. కుచేల చరిత్ర. 3. రుక్మాంగద చరిత్ర. 4. సుబ్బయార్య కవి తామ్రధ్వజ చరిత్ర మొ॥ నవి. పై వాన్నింటికిని మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున ప్రతులు గలవు. ఇవి యింకను కేటలాగుల కెక్కలేదు. వాని భాండాగార సంఖ్య: *1-R. 1394; 2 & 3-R. 1602; 4-R. 1608.* చివరి మూడును మధుర సౌరాష్ట్రసభ తెనుగు హరికథలు.

ఇక ఉదాహరణోదారులైన వెంకటరావుగారి గ్రంథమున పేర్కొనబడియు నుదాహరణపు మచ్చులకైన నోచుకొననివి త్యాగరాజు నౌకాచరిత్రము, ప్రహ్లాద భక్తివిజయము, శివనారాయణ తీర్థుల పారిజాతాపహరణము మొదలగునవి. నౌకాచరిత్రమున కొక్క ప్రచురణ పేర్కొనబడినది కాని కడమ రెండింటి యునికికూడ తెలుపబడలేదు. (నౌకాచరిత్రము ప్రతులు తంజావూరు సరస్వతీ మహాలు, ఆంధ్ర సాహిత్య పరిషత్తు, మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునందును గలవు. ప్రా॥ లి॥ పు॥ భాం॥ ప్రతి (నెం. 1896) కి కేటలాగులో వివరణ గలదు. అదికాక క్రీ. శ. 1873 నుండి నౌకాచరిత్ర రెండు పర్యాయములు ముద్రితమైనట్లు నా యెరుక). ప్రస్తుతము నౌకాచరిత్రయు ప్రహ్లాద భక్తివిజయము త్యాగరాజ కీర్తనలతో గలిసి 1949 లో కాక్స్టను ప్రెస్సులో ముద్రింపబడిన ప్రతులు మదరాసు ఎమ్. ఆది అండుకోవారి ప్రచురణలు లభించును. తీర్థపాదుల పారిజాతము ప్రతి తం॥ స॥ మ॥ లో గలదు. కేటలాగులో వివరింపబడినది. నెం. 544. వెంకటరావుగారి గ్రంథమున ఉదాహరణలీయబడియు నునికి పేర్కొనబడని యముద్రిత గ్రంథములును గలవు. వాని యునికి నేను పేర్కొందును.

1. పెదకెంపరాయని గంగా గౌరీ విలాసము. (ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారము. *D.No. 1846*)

2. కంఠీరవ రాజు యక్షగానకృతులు. (ప్రా. లి. పు. భా. *D. No. 1128. Kannada Mss.*)

3. ఎల్లయ చంద్రతారా విలాసము. (ప్రా. లి. పు. భాం. *R. Nos. 130 & 204*).

ఉపరి నిరూపణమును బట్టి వెంకటరావుగారి గ్రంథము నందొక్క యక్షగానముల విషయమే యిట్లుండ తక్కిన వాఙ్మయ శాఖల మచ్చుటయు నెట్లుండునో చెప్పవలెనన్న నది పలువురుపరిశోధకులు పనికట్టుకొని పడవలసినపాటు. వారిటు కేవలము కేటలాగు పాండిత్య స్వయంపాకముతో నెంతకాలము లోకమును బూకరింతురో తెలియకున్నది. వారి వ్రాతలయందలి విషయమును వెంటనే విశ్వసింప రాదు. ప్రతి గ్రంథమును పునఃపరిశీలనా దృష్టితో స్ఫుటము చేసికొని పోయినగాని నిజము నిక్కచ్చిగా తేలదు. ప్రస్తుత గ్రంథమునుగురించి యొక మంచిమాట చెప్పక తప్పదు. ఇందలి చరిత్రాంశము చాలమట్టుకు చక్కగనే యున్నది. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయమునకు సంబంధించినంతమట్టున కింతే వెల్తిగా పూర్వపు కేటలాగుల సర్వస్వము, సర్వ వ్యాసముల సారాంశము నిందు గలదు. ఇది పునర్ముద్రణమే గాంచునెడల నపుడైన సమర్థులగువారిచే పరిష్కృతమైనయెడల నొక అతి నవ్యాదర్శ గ్రంథ వివరణిక (*Ideal type of Descriptive Catalogue*) గా నుపయోగపడును; భావి పరిశోధకులకు దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయమును గూర్చి మరి యెవ్వనమైన కేటలాగుల యక్కఱయు నుండదు. ఇక గ్రంథవిస్తర భీతి నింతటితో విరమింతును.

# పెన్నేటిపాట

శ్రీ విద్వాన్ విశ్వం

[గత సంచికతరువాయి]

## అయిదవ సర్గ

అంబటివా రటుకులుదంచంబిలిచిన, పల్లెయని, బ్రసాపడి, మధ్యా
హ్నంబే గంగమ్మచనెఁ, కంబమువోల్ రోకలొకటి గైకొని వేగఁ.

అటుకులదంపక మ్మన మహాశ్రమదాయక, మగ్గిరేగు గు
స్పిట; నుడికించి వడ్లనొక పెద్దపెనమ్మునవేపి రోటిలో
పిటపిటలాడదంచవలె, పీకలమీదుగనుండు, నల్గు రో
క్కటితరువాతనొక్కటి చకాచక పోటులువేయగావలెఁ.

చేతులుబొబ్బలెక్క, నలసెఁబదముల్, దగవుట్టె, గుండెలుఁ
కూతలువెట్టె, రక్తమురగుల్కొనె, ముక్కులనూపిరాడుటే
మోతగనుండె, కన్నులఅమోడ్పులకుందగవయ్యె, తెప్ప పా
టు తడవైన రోకలిపెకిల్లను, రెక్కశకించు కక్కునఁ.

చేయిమార్చిమార్చి చేతికొలదిదంచె - ఒక్కక్షణముగూడ నూరకొనక
మూడుపెనములందు మూలుగుధాన్యము - వరుసమీదవరుసవచ్చుచుండె.

నిప్పుచెఱగునెండ, దుప్పటిపైకప్పు, మూడుప్రొవ్వులందు మొద్దుమంట,
వాయిమీదవాయి, వడిదంపక మ్మింక - చెప్పనేల వారితిప్పలెన్నొ?

నలుగురిలోకల్లా గంగులుచిన్నది, దూడపిల్ల, కోమలమ్ముగా
కలకలలాడుచునున్నది, విలవిలలాడెఁ పెనాన వేలగింజవలె.

దగపుట్టుచున్నదని వేరుగనిలిచిన తోడివారు రుంజుకొందురఁ
దిగులున, నెట్టో పండ్లఁబిగబట్టి కరమ్మునెత్తి బిరబిరదంచెఁ.

అందులోనొక్క పెద్దముత్తైదు - వీమె తనకలాటనుజూచి జాలిని-వహించి,
అలతతీర్చుకోవేపిల్ల - యనెనుగాని, బింకమున దంచుచునెయుండె పెద్దప్రొద్దు.

ప్రొద్దుమునింగగాని పనిపూర్తికా, దొడలఁ వశమ్ములో
కద్దనిచెప్పలేము, తనకంటెబలమ్ముజవమ్ముగల్గు వా
రద్దరిమొండుటాకులటు లల్లలనాడగ, నేవళమ్ముగా
సుద్దుల ముద్దులఁ బెరుగుచుండిన తానిక ఓపగల్గునా?

'ముంతెడుగింజలైన మనభుక్తికిజాలును, నేనుదెత్తు నా
యింత, రవంతపైపనులనే సరిపోవునువెచ్చ, మింతలో
నంతకునింతకుఁ బరువులైనపనుల్ తలవేసుకోకు' మం
చెంతగ మామజెప్పిన, తనే విన, దాతనితోడుసీడనై.

మామమాత్ర మూఱక క్షణమాత్రముండ లేడుగద ! కోడితో లేచి, వాడవాడ
మాటుమణిగినదాక, చెమ్మటల నోడ్చుచుంటజూచి తనెట్లుకూర్చుండగలదు?

నల్తుమువడ్లుపెండ్లికని నాగుకుతెచ్చినవల్లెయుండె; కు
ప్ప ల్తనుగొట్టితెచ్చినది వల్లెకుచీరకుచాలదయ్యె, నా
కొల్తలకూలి కొట్టముఁనకుఁ సరిపోవనిదయ్యె, నింక తా
నల్తయుటంచు నెట్టులనునాయమ? మామయవస్థఁజూచుచుఁ.

దాపటికమ్ములేదు, తనుదానయి చిక్కులనన్ని జెప్పు; చూ
పోవమి నేరుదెప్పిన నెదో ఒకచీర ఉగాదినాడు, తా
నే పనిమీద వెళ్ళినటులే చని, తీసుకవచ్చు; కంటిలో
పాపగ తన్నుజూచు - తనపాలిటి దేవుడు మామ యింతకుఁ.

తానయి చేతనైనపని తప్పకసేయదలంచె గంగు, లా
పైన ఒకొక్కనాడు తన ప్రాణముసొంపకయున్నలోన లో
నే నలతఁ బిగించుకపనిఁ విడనాడదు; మూడుప్రొద్దులుఁ
లేనివియున్న వేవికదలింపక బువ్వనుబెట్టు మామకుఁ.

తనకేమో నెలనుండి 'పైదిరుగు', పొంతంబట్టినిల్చుండి పో
మెనుగానీ, పదినాళ్ళనాడు తనకేమేమయ్యెనో! కండ్లు లే
వన చీకట్లుగ్రసించకొట్టము, శిరోభారమ్ముతో ప్రొద్దు గూ
కినదాకా పడియుండె: నద్దది మొదల్! గీపెట్టుకర్ణమ్ములుఁ.

'సందకాడ' జొన్నసంగటిగెలకంగ, లెడ్డుచూరినుండి తీయుచుండ
మనకగ్రమ్మి, పొయ్యిమంటలోపడబోయి, మల్లిపట్టుకొనగ మనిపిదక్క.

మడికలుపులప్పుడిల్లే, తడిపచ్చికగోసి, మోపుతలనిడితెచ్చెన్
తడికకు మో పానించుచు పడిపోయెను; సుంకులమ్మ ప్రాణముసిలిపెన్.

నిమ్మకాయబొప్పి, నెమలీక, జీలకర్రయును కాల్చితేనెరంగళించి,
నాకుమనెను; దాననాల్నాళ్ళుబాగుండె, 'బొట్టు' లేక తేనెపుట్టదిపుడు.

మొన్న రాత్రి కడుపునన్న సన్నగనొచ్చి, తెల్లవారుజాముకల్ల హెచ్చె;
చుట్టజుట్టుకొనుచు, తట్టుకోలేక, ఎంతలపరించినదియొ దైవ మెఱుగు!

కానీ లేతవయస్సునది, లోనున్న యొకింత బలిమి రోజరోజకున్.
కానలవట్టుచునుండె, జగాన నిగారంపుసుద్ది కలదె లేమిండెన్.

పలుకడగండ్లగాసిలి, యవాంతరభేదము ప్రమింగికొంచు, నా
యెలజవరాలు, మామ గనిపించిన పొంగులువారుపోడుముల్
పులకలుగూర్చ, సన్నిపగపుల్ బొయివెట్టి, క్రమించికొంచు, రో
జులు గమియించుచుండె - తలసూపెడుకోర్కెలు తీవసాగగన్.

తానొకనాడు సందుమొన దక్కవలో నొకమట్టిమిద్దెనో
దేనినొ వేసుకోవలె; పదింబది రెక్కలవంచియొల్లొ బా
కీని తెగించితీర్చవలె; కేరుచు త్రుళ్ళుచునుండు పాపనిన్
తానయి మామకిచ్చి, సులతానుపుసీవని చెప్పగావలెన్.

ఈమాటలో చిసప్పుడు, కోమలి చెక్కులనుపూసె కుంకుమపూవుల్;
గోముగ మోమిడి, మామను మామూలినమ్మనుచు నడుగమానసమయ్యెన్.

తటుకునదోచె: నాపగ లతంతశోకయించుకతల్లడిల్లి, వే
నటపడి తొందరన్ కొలదిసాదముతో జనె బావిసేవకున్
గటుతరభావ; మాముగుదకా ల్వడకెన్, మెయిచెమ్మటించె, నొ
క్కట కనుచీకటుల్, తలమొగన్ సుడిగాలిని జేపె గిఱ్ఱునన్.

పడెపడెనంచునందఱు, గబాలున చేతులనున్న వచ్చటన్
దడదడవేసి, చుట్టుకొని: 'దయ్యముబట్టినదేమొ? - వాతమొ
క్కడ గనిపించెనేమొ?- వెనుకేగలదేమొకొ మూర్ఛ? - కుప్పగా
పడుపసిపిల్లలుందురె? విపర్యయమియ్యది' దటంచు నెంచుచున్.

మొగమున నీరుగొట్టి, పదముల్ కరముల్ ముకుగంచి మంత చ
ల్లగ గనిపించినన్, బనపు రాగులపిండియుఱుద్ది, వేడిగం
జి గుటక వేయనిచ్చి, మఱిసేకుఱునంతకు వీచివీచి, క
న్నుగవనువిప్పినన్ మనసులూరటజెంది అనంతతృప్తితో

ఇరుప్రక్కలనిద్దఱుగా - తరుణింబట్టుకొని, నందుదాటించుక వ
చ్చిరి కొట్టమ్మున; కక్కడ పురులెక్కిన చీకటుల్ గుబుల్ కొనుచుండన్.

ప్రమిద, వత్తి, ఆముదము, నగ్గిపుల్ల - నొక్కొక్కరొకటి తెచ్చి - గూడుదెఱచి,
ఈతచాపవేసి ఎటొపడుకొనబెట్టి, వారిపనులమీద వారు చనిరి.

అంతకంటెవార లందింపగల సాయమేమిగలదు? చేతనేమిలేని
పుట్టుపేదవారు పొలతులందఱుపాప! మైననేమి హృదయమంత - మృదువు!
పొరలుచున్నదామె చిఱుచాపపైబడి, తెఱలుతెఱలుపొరల తెరలుగ్రమ్మ,
కనులనీరులురల, నునుచెక్కులదరగా, ఎఱుకమఱపుదారియిఱుకలందు.
కొంతసేపటి కొకకొంత కోలుకొనుచు, తడకచప్పుడుకాగ రంగడనితోచి,
ముంచుకొనివచ్చుదుఃఖమ్ము మూసిపెట్టబోయి, బిగ్గఱగా నేడ్చివేయసాగె.
పిల్లికూన, బెదరి చల్లముంతనుద్రోసె, మామకెట్టులనుచు నామెలేచె,
చెవులుగింగురనియె, చేతులాన్పగ లేక, విసరుకొనుచుబోయి - పసరుగ్రక్కె.
రంగన్న వచ్చెబారెడునంగలతో, తడకలాగి యవలకుద్రోసెన్;
గంగమ్మదుర్గతింగని, చెంగునచేతులనునెత్తి చేరిచె చాపన్.
ఏమిజరిగినదో తనకేమిబోధపడుటయేలేదు; తనగొంతు పలుకలేదు;
అల్లె నిర్విణ్ణుడై గంగులమ్మతలను, తొడపయింబెట్టుకొని గ్రుడ్లువిడుచుచుండె.
ఒక్కచేత నామెచెక్కిలినిమురుచు, నొక్కచేత తలను నొక్కిపట్టి,
తేమలేనిగొంతు తెమలక, తాకిడిమాటలాడునేమొ! మమత నతడు.

ఆ చెయిసోకి, గంగమ హృదంతరమందలిజీవనాడి ఏ
దో చలియించె, కన్నుగవదోవలువిచ్చె, కడిందిమక్కువన్
పూచిన మొగ్గవోలె తనువున్ వడదేర్చెను, మానసాంత రా
శా చిరదీర్ఘికాపతిత శైవలజాలము కొంత తొట్రిలెన్.

కమలినకన్నులన్ విరిసె కమ్మని జీవలతాంతవాసనల్,
భ్రమసినగుండెలోని పరువమ్ములగింజలు మోసులెత్తె, నే
యెముకలలోనికో గలిసియేగిన నెత్తురుచాయ మేనిపై
గమగమలాడజొచ్చె; తమకమ్ముల కమ్ముల నీనె నూరుపుల్.

ఆక్షణమందు రంగడు సమాధిగతుండగుయోగి వోలె నే
అక్షరనిత్యసత్యమధురాంతరభూమిక చెంత నిల్చి, చి
త్తక్షయలక్ష్యసిద్ధి గనుదార్పుల నూర్పుల జిక్కవట్టి, ప్ర
త్యక్షపరాత్పరత్వ చరమావధిలోన లయించుచుండెనో!

గంగమ మామా! యని బిగ్గంగాగిలిహత్తి, గుండెగంటలు మ్రోయన్
నింగి నరుంధతికన్నుం జెంగలువలు నీరు గ్రమ్మ చెక్కిలినిమిరెన్.

రంగడు పిల్లాయనిబిగ్గంగాగిలిహత్తి గుండెమొగ్గలుపూయన్
నింగి పుహూరవుకన్నుం జెంగలువలునీరు గ్రమ్మ చెక్కిలినిమిరెన్.

కొక్కొరొక్కోయటంచు నదిగో బరువెక్కినగొంతునెత్తి,కొ
మ్మెక్కి, ఒకింతకొవ్వగదలించుచు, తెక్కలనార్చుకొంచు, నీ
దిక్కయి కోడి కూసిన; దిదే ప్రణవమ్ము దరిద్రమానవా
న్యక్కరణహోమమంత్రమున, కింక మొదల్ మఱి నిన్నచావులే.

నిన్నయే నేడు వీరికి, నేటివలెనె రేపువచ్చును, గుండెల నూపివదలు;
మాపులే వీరి రేపు, లీమాయవదలు రేపకడకోసమే వీరి - ఈప్రతీక్ష!

కండలుగోసి పాళ్ళిడి, బికారులజేసి, జనాలనెత్తురుల్
పిండుచు, కుక్కకూడయినబెట్టక, పొట్టలగొట్టి, కూళలన్
దిండులకానబెట్టి, జగతిన్ గరుణార్ద్రత కగ్గివెట్టు పా
షండుల వల్లకాదు - మనసా! యిది మానవసంఘ మెట్లగున్?

గుండెలుకోసియివ్వగలకూరిమి, కొండలమోయుతాల్మి, క
ట్టెండకునిల్చి బండలుపెకిల్చున బ్రద్దలుగొట్టి బంగరున్
చెండుల పైకిదీయగలచేవ - జితించినవీరి కర్మమా
ర్తాండుల డాచిదాపడు చెఱన్ గను పాతకమేలదైవమా!

దైవమా! ఉంటివా చచ్చినావ నీవు?
ధర్మమా! గెంటిరా నిన్ను ధరణినుంచి?
సంఘమా! తలకెక్కెనా నన్ను నీకు?
హృదయమా! మానవుడు నిన్ బహిష్కరించె!

ధరణికంపింప, గులగిరులురలిపడగ,
మేరుశిఖరముపై నెక్కి, మిన్నులదర-
చచ్చె నీలోకమున మనస్సాక్షి యనుచు
నెత్తినోరిడి కొట్టుకోనిండు నన్ను!

★

ఇదే పెన్ను ఇదే పెన్ను నిదానించి నడు!
విదారించు నెదర్క పట్టి ఎడారి తమ్ముడు!

సమాప్తము

# అశ్రుతర్పణం

శ్రీ సింగరాజు లింగమూర్తి

నడుస్తూ నడుస్తూవున్న శ్యామలరావు దటుక్కున ఆగిపోయి వెనక్కి తిరిగిచూసి, మళ్లీ ముందుకు అడుగు వెయ్యబోయాడు. "మిమ్మల్నేనండీ" అంటూ ఒక ఇరవై—ఇరవైరెండేళ్ళ యువతి అతణ్ణి సమీపించింది. శ్యామలరావు అప్పటికే ఇంకా తనను కాదేమోనని ఆశ్చర్యంతో అలాగే ఆమెవంక చూస్తూ నిలబడ్డాడు. "అలా చూస్తారేం ...పదండీ" అంటూ ఆమె అతనిప్రక్క ప్రక్కనే నడుస్తున్నది. శ్యామలరావును సంభ్రమాశ్చర్యాలు ముంచెత్తాయి. "ఎవరీమె?...ఎప్పుడూ ఎక్కడా చూసిలేనే...ఒక వేళ ఈమె పొరబడటంలేదుకదా?" అనుకున్నాడు మనస్సులో. "పొరబడటానికి రాత్రిసమయం కాదే?... 'మనిషినిచూస్తే అంత పొరబడే తెలివితక్కువదికూడా కాదు...మరి ఈమె పట్టపగలు నడిబజారులో పిలిచి ఎంతో పరిచయమున్నట్టు మాట్లాడుతున్న దేమిటి?" అని తర్కించుకుంటున్నాడతను.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? ... ముక్కూ ముఖమూ తెలియని మిమ్మల్ని పిలిచాననా?" అతని ముఖంలోకిచూస్తూ ప్రశ్నించిందామె. దానితో అతను ఆమె పూర్తిగా అపరిచితురాలేనని నిశ్చయించుకున్నాడు. "చూడబోతే అభాగ్యురాలుగానే ఉంది. లేకపోతే ఎంత నాగరికురాలైతేమాత్రం ఒక పరాయివాడిని పట్టపగలు నడివీధిలో పిలిచి మాట్లాడుతూ ప్రక్కప్రక్కగా నడుస్తుందా?" ఆమె ప్రశ్నకేమీ సమాధానం చెప్పకుండానే అనుకుంటున్నాడతను.

ఇద్దరూ దగ్గరిగా ప్రక్కప్రక్కనే నడుస్తున్నారు. అనుకోకుండానే శ్యామలరావు వెనక్కి తిరిగి చూశాడు. అతనితోపాటే ఆమెకూడా తిరిగి చూసింది. ఎవరో ఇద్దరు వాళ్లివెనకాలే వస్తున్నారు. అతని గుండె దడదడలాడింది. "కొంపతీసి తనకు తెలిసినవారుకాదుకదా?" అనుకుంటూ వాళ్ళను తేరిపారచూసి కాదని నిశ్చయించుకోడంతో అతని గుండె దడ తగ్గిపోయింది. వెనకాల వస్తున్న వాళ్లు నవ్వుతూ, తుళ్లుతూ ఏవో మాట్లాడుకుంటూవస్తున్నారు. ఆమెతో నడుస్తుంటే ఒకటి రెండుసార్లు భుజం తాకడంవల్ల అతను కొంచెం ప్రక్కకు ఒదిగి నడుస్తున్నాడు. ఎదురుగ్గా ఒక కాఫీహోటలు కనిపించడంతో "కాఫీ తాగుదామా?" అతని కళ్ళల్లోకిచూస్తూ అందామె. శ్యామలరావుకు కుతిక పట్టుకున్నట్లయింది. "జేబులో డబ్బులేదని సందేహిస్తున్నారుకదూ?... మరేంఫరవాలేదు నాదగ్గర ఉన్నాయిలెండి" అంటూ ఆమె అతని చేతినిపట్టుకొని వ్రేళ్లల్లో వ్రేళ్లుదూర్చి కాఫీహోటలులోకి దారితీసింది. శ్యామలరావుకు పసిపిల్లవాడిలా ఆమెను అనుసరించక తప్పింది కాదు. ఆమె బ్రెడ్, కాఫీ తెప్పించింది. "అట్లా బెరుగ్గా ఉంటారేం? — చిన్నప్పటి స్నేహితుడు కలిసినట్టు ఉషారుగా మాట్లాడక" నవ్వుతూ అందామె. అతను కొంత ధైర్యం తెచ్చుకొని "మీ పేరు?" అన్నాడు— ఆమె సౌందర్యాన్ని కళ్ళతో ఫుణుకుతూ. "మీరు అని మన్నించనక్కరలేదు. హేమా అని పిలవండి" అందామె. అతను మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

'ఇదే తను ఒక పరాయి ఆడదాన్ని, అందులో అపరిచితురాలైన అందగత్తెను నడిబజారులో పిలిచి చనువుగా మాట్లాడిస్తే ఊరుకుంటుందా? ఎడంకాలి చెప్పుతీసి దౌడ వాయించేయదూ? అందుకే ఆడది ఎందుకైనా సమర్థురాలన్నారేమో?' ఆమె చనువుకు, తెగువకు ఆశ్చర్యపోతూ అనుకుంటున్నాడతను. ఇంతలో వారి వెనకాలే అనుసరిస్తున్న ఇద్దరుకూడా వచ్చి, వీళ్ళకు ఎదురుగ్గావున్న టేబిలుముందు కూర్చున్నారు. వాళ్ళిద్దరూ శ్యామలరావును అదోకలా చూస్తున్నారు. "వీళ్ళ ముఖం తగలెయ్య అట్లా చూస్తారేం తనను" అనుకుంటూ అతను హేమవంక

చూశాడు. "ఏమండి...ఇంటికి వెడదామా—సినిమాకు వెడదామా?" అంది హేమ. 'ఏమంటే ఆమె ఏమనుకుంటుందో' అనుకుంటూ "నీ ఇష్టం ఎలాగైనా సరే" అన్నాడు. ఇద్దరూ బైటికివచ్చారు. ఆమె ఆటోరిక్షాను పిలిచింది. ఆమె కూర్చుంటూ "రండి... కూర్చోండి" అంది. 'ఏమిటీ వైభవం' అనుకుంటూనే ఎక్కి కూర్చున్నాడు. 'ఏమిటీ మనిషితత్వం... ఆమె అంతస్తెక్కడ—తన అంతస్తెక్కడ?' ఆలోచిస్తూ కూర్చున్నాడు శ్యామలరావు.

'నేను అందమైనదాన్నే కదూ?' హేమ అతని కళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించింది. అతను ఆమె ముఖంవంక చూస్తూ 'కాదని ఎవరనగలరు?' అన్నాడు. ఆమే స్నిగ్ధంగా నవ్వింది. 'ఇదంతా కలకాదుగదా' అనుకున్నాడు శ్యాం. 'మీ పేరు చెప్పరుకదూ?' భలోక్తిగా అందామె. 'ఎందుకు చెప్పనూ?' అన్నాడు శ్యాం. 'మరి ఇందాకటినుంచీ చెప్పలేదేం? నా పేరు అప్పుడే చెప్పేశానుగా' కొంటెగా అతనివంక చూస్తూ అంది.

'మరేంలా — మాటల్లో మరచిపోయాను. శ్యామలరావని అంటారు' అన్నాడు. 'చాలా బాగుంది. అయితే ఇకనుంచి శ్యాం అనే పిలుస్తాను. కోపం రాదుకదూ?' కిలకిల నవ్వుతూ అంది హేమ. 'ఏమిటీ విపరీత ధోరణి' అనుకుంటూనే, 'కోపమెందుకూ? మీరు ఎలా పిలిచినా సంతోషమే' అన్నాడు. 'అదుగో...నన్ను మళ్ళీ మీరు అని అంటున్నారు. నేనలా ఒప్పుకోను, నేనుకూడా ఇకనుంచి 'నివే' అని అంటాను. స్నేహితులం. నీవు—నీవు అని పిలుచుకుంటే తప్పేముందీ?' అంది హేమ. ఆమె మాటలకు శ్యామలరావుకు నవ్వు వచ్చింది. ఆటోరిక్షా ఒక పార్కు ముందునుంచి పోతున్నది. "కాసేపు పార్కులో కూర్చుని పోదాం లే శ్యాం" అంటూ ఆటోరిక్షాను ఆపించింది.

ఇద్దరూ వెళ్ళి పార్కులో పచ్చికమీద కూర్చున్నారు.

"చూశావా శ్యాం....అందరి కళ్లూ మనమీదనే ఉన్నాయి" అంది. అతనేం మాట్లాడలేదు. "అన్నా చెల్లెల్ని చూసినా తెలియనివాళ్లు ఏవేవో సంబంధాలు కల్పిస్తారు." మళ్లీ ఆమే అంది.

"తెలియనివాళ్లు అనుకోడంలో తప్పేముందీ?" ఆమెనుండి ఏమి సమాధానం వస్తుందోనని సందేహిస్తూనే అన్నాడతను.

"ఎందుకు తప్పుకాదూ? మనిద్దరినీ స్నేహితులని ఎందుకు అనుకోరాదూ?" రెట్టిస్తున్నట్టుగా అంది హేమ.

"నీవన్నది నిజమే హేమా? కానీ లోకం దృష్టిలో అలా అనిపించదేమో?" సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టుగా అన్నాడతను.

"అదేం కాదు శ్యాం. అడదంటే అంత చులకన అయిపోయింది. ఏం?—ఒక ఆడదీ మొగవాడూ పవిత్ర హృదయాలతో స్నేహంగా ఎందుకు ఉండరాదూ?" చేత్తో గడ్డిపరకల్ని త్రుంచుతూ అంది హేమ.

శ్యాం ఆలోచనలోపడ్డాడు. "నిజమే...ఇద్దరు మొగవాళ్ళు, ఇద్దరు ఆడవాళ్ళు స్నేహంగా ఉన్నట్టు, ఒక ఆడది మొగవాడూ స్నేహంగా ఎందుకుండరాదూ?...ఊహూ...అది సాధ్యంకాదేమో? స్త్రీ అంటేనే ఒక ప్రత్యేకమైన ఆకర్షణ పురుషుడికి. అలాగే పురుషునిలోనూ ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉండి స్త్రీని లొంగదీసుకుంటుంది. ఇద్దరూ సమవయస్కులై యౌవనం పుర్లు తిరుగుతున్నప్పుడు పవిత్రమైన స్నేహం ఎలా సంభవమౌతుంది - ఎంతటి మనోనిగ్రహంకలవారికో తప్ప! ఈమె పవిత్రమైన స్నేహవాత్సల్యంతోనే నా చేతిలో చేయి కలిపి, వ్రేళ్లలో వ్రేళ్లు దూర్చి, భుజం భుజం తాకుతూ నడిచింది? అదీ—ఇంతకుముందు ముక్కు ముఖమూ తెలియని వాడితోనా?" అనుకుంటున్నాడు శ్యాం.

"ఏమిటి ఆలోచిస్తున్నావు శ్యాం" అతని సమాధిని భగ్నంచేస్తూ అంది హేమ.

"అబ్బే...ఏమీ లేదు. మన కలయికను గూర్చి" అతని వాక్యం పూర్తికాకుండానే హేమ అందుకొని "ఏం, మనం స్నేహంగా ఉండలేమనా?" అంది.

"ఎందుకుండలేం....కానీ" సాగదీస్తూ అన్నాడు శ్యాం.

"కానీ లేదు—గీనీ లేదు....లే పోదాం" అంటూ హేమ లేచింది. ఇద్దరూ వెళ్ళి మళ్ళీ ఆటోరిక్షాలో కూర్చున్నారు. డ్రైవరుకు తన ఇంటిగుర్తులు చెప్పి పోనీయమందామె.

'సినిమాకు వెడదామన్నావుగా' ఆమెకు జ్ఞాపకం చేస్తున్నట్టుగా అన్నాడు శ్యాం.

'ఉహూ....సినిమా చూస్తే నాకు ఏడుపొస్తుంది. ఇంటికే వెడదాం' అంది హేమ. అతనేం మాట్లాడకుండా కూర్చున్నాడు. ఆటోరిక్షా నడుస్తున్నది.

'సినిమా చూస్తే ఎందుకు ఏడుపొస్తుందో?... అటువంటిది ఇందాక సినిమాకు వెడదామా అని ఎందుకు అడిగింది ... పార్కులో కూర్చుందామని దిగి, పట్టుమని పదినిముషాలు కూడా కూర్చోకుండానే— ఏమిటీ మనస్తత్వం ఆలోచిస్తున్నాడు శ్యాం. ఏమిటో ఆమె తరహా అయోమయంగా ఉందనుకున్నాడు.

'ఇందాక కాఫీహౌసులో మన కెదురుగా వచ్చి కూర్చున్న ఇద్దరూ ఎవరనుకున్నావు శ్యాం?" అని ప్రశ్నించింది హేమ. తనకేం తెలుసు అన్నట్టుగా చూశాడు శ్యాం.

'వాళ్ళిద్దరూ నన్ను వెంటాడారు!"అందామె.

'ఎందుకూ?' సందేహాస్పదంగా అన్నాడతను.

'ఒంటరిగా ఆడది కనబడితే ఎందుకు వెంటాడుతారేం?'

'సరే—ఆమె తనని ఎందుకు పిలిచి మాట్లాడించిందో ఇక అర్థమైందనుకున్నాడు శ్యాం. "మొత్తానికి భలే తెలివిగలది. వాళ్ళబారినుండి తప్పించుకోడానికి తనను ఈవిధంగా ఉపయోగించుకుందన్నమాట. అయితే మాత్రం ఒక పరాయి మొగవాడితో భుజాలు రాసుకుంటూ నడవవలసిన అవసరం ఏమిటి? మాటలతోనే బాగా చదువుకున్న దానిలాగ ఉంది. ఈమెను వెంటాడటానికి వాళ్ళకు ధైర్యం ఎలా వచ్చిందో' అని అనుకుంటున్నాడు శ్యాం.

'వాళ్ళిద్దరూ ఆసుపత్రిలో కంపౌండర్లు. బజారులో ఒక్కదాన్నే కనబడేప్పటికి వెంటబడ్డారు. దేవుడిలా నీవు కనపడ్డావు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఏమయ్యేదో?' అంది హేమ.

ఇంతలో ఆటోరిక్షా ఆమె ఇంటిముందు ఆగింది. "ఇక నేను వెడతా—నా డ్యూటీ అయిపోయింది గా" అన్నాడు శ్యాం.

'అదేమిటి...అలా అంటావేం శ్యాం?' ఆశ్చర్యంతో అందామె.

"నీవు క్షణంగా ఇల్లు చేరుకుంటానికేగా నన్ను ముక్కుకు తాడుబోసినట్టు లాక్కొని వచ్చింది." కొంచెం ఉక్రోషంతోనే అన్నాడు శ్యాం.

"నీవు ఉత్త పిచ్చివాడివి శ్యా[illegible] అయితే నిన్ను పార్కుకు చేరకముందే [illegible] దాన్నిగా. మనం ఆటోరిక్షా ఎక్కాక [illegible] ముఖాలు వేసి వెళ్ళిపోయారు తెలుసా?" అందామె.

"అరరే...తను తొందరపడి అవేశ[illegible] నాలుక కరుచుకొని సిగ్గుపడ్డాడు శ్యాం.

* * *

"ఎక్కడికి వెళ్లావు తల్లీ...నీకోసం [illegible] కూర్చున్నాం" అంటూ ముసలి దంపతులు [illegible] లోకి వచ్చారు.

'ఏం?... ఎందులోనైనా పడి [illegible] న్నారా?' అంటూ 'రా శ్యాం లోపలికి' [illegible] చెయ్యిపట్టుకొని లోపలికి దారితీసింది.

'ఇతనెవరమ్మా?' సందేహిస్[illegible] ప్రశ్నించాడు ఆమె తండ్రి.

'ఎవరా?...ఆ హాస్పిటల్ కాం[illegible] విజాయితీగల మనిషి. పెళ్లి చేసుకుంటా[illegible] మోసగించిన దగుల్బాజీ కాదు. అతనూ [illegible] నా జీవితాన్ని సర్వనాశనం చేశారు. [illegible] కులు కాని తల్లిదండ్రులా?' అంటున్న[illegible] శ్యామలరావుకు ఇదేమీ అర్థంకాక స్తబ్ధం[illegible] పోయాడు. హేమ ముఖం కందిగడ్డలా[illegible] యింది. కోపంతో కళ్లు ఎర్రబడ్డాయి. అ[illegible] మైన విగ్రహం నిమిషంలో కాళీరూపం [illegible] శ్యాం ఆమెవంక చూడలేకపోతున్నాడ[illegible] ట్టుండి హేమ పెద్ద పెట్టున ఏడుస్తూ [illegible] కొట్టుకుంటున్నది. తల్లిదండ్రులు ఆమె[illegible] బోయేప్పటికి ఆమె వాళ్ళను కొట్టబోయిం[illegible] అలా కొట్టుకొని ఏడుస్తుంటే శ్యాం చూ[illegible] లేక ఆమెను పట్టుకుంటానికి దగ్గరగా పో[illegible] 'వద్దు నాయనా వద్దు...అది ఆ పిచ్చిలో[illegible] లెక్కచేయకుండా కొడుతుంది' అంట[illegible] తండ్రి శ్యామును పట్టుకున్నాడు. హే[illegible] ఏడ్చి ఏడ్చి స్పృహతప్పి పడిపోయింది.

'హేమ పిచ్చిదా?...ఎంత చక్క[illegible] డింది. ఎటువంటి మంచి అభిప్రాయ[illegible] బుచ్చింది' అనుకుంటూ ఆశ్చర్యపోయా[illegible] ఆమె తల్లిదండ్రుల కళ్ళల్లో నీళ్ళు [illegible] అతని కళ్లుకూడా చెమ్మగిలినాయి. అ[illegible] కాసేపు హేమకు ఉపచారాలు చేసేప్పటి[illegible] కొంచెం స్పృహకలిగింది. ఆమెను [illegible] మంచంమీద పడుకోబెట్టారు. శ్[illegible] పోదామనుకున్నాడు. కాని వెళ్లడానికి కా[illegible] ఏదో ఆలోచిస్తూ అక్కడే కూర్చున్నా[illegible]

ఉన్న ఫోటోలు చూస్తుంటే హేమ ఫోటో కనిపించింది. స్టెతస్కోపు పట్టుకొని చిరునవ్వులు చిందుతోంది. దానిప్రక్కనే ఫ్రేముకట్టివున్న ఆమె మెడిసిన్ డిప్లొమా కనిపించింది. శ్యాం ఆశ్చర్యపోయాడు. 'హేమను ఏదో కాస్త చదువుకుందనే అనుకున్నాడు కాని, లేడీ డాక్టరని అనుకోడానికే ఆస్కారం లేకపోయిందే' అనుకున్నాడు. ఇంతలో హేమ తండ్రి అక్కడికి వచ్చి అతనిప్రక్కనే కూర్చున్నాడు.

"చూశావా నాయనా...ఇదీ వరస. ఇట్లా రోజుకు ఒకసారైనా వస్తుంటుందీ పిచ్చి." కన్నీళ్లు పెట్టుకుంటూ అన్నాడాయన.

"ఒక్కగానొక్క కూతురు. ఎంతో గారాబంగా పెంచాము. మొదటినుంచీ ఉన్నతాశయాలతో ఉండేది. లేడీ డాక్టరుఅయి ప్రజాసేవ చేయాలని మురిసిపోతుండేది. అలాగే అయింది. మొదట్లోనే స్వంత డిస్పెన్సరీ ఎందుకని, కొంత అనుభవంకోసం ఏ ఆసుపత్రిలోనైనా చేరుదామనుకుంది. నా పలుకుబడివల్ల ఈ ఊరి ఆసుపత్రిలోనే ఉద్యోగం దొరికింది. ఒక సంవత్సరం ఎంతో ప్రశాంతంగానే గడిచింది. హేమ పనిచేస్తున్న వార్డులోకే మరో క్రొత్తడాక్టరు వచ్చాడు. అతనూ చాలా మంచివాడే. వీళ్ళిద్దరికీ మంచి స్నేహమైంది. ఒకరినొకరు ప్రేమించుకున్నారు. అతను మాఇంటికి వస్తుండేవాడు. ఈడూ జోడూ బాగుందనీ, ఇద్దరూ డాక్టర్లే కాబట్టి ప్రాక్టీసు పెట్టి ప్రజాసేవ చేస్తారనీ ఎంతో కుతూహలపడ్డాను. హేమా అతనూకూడా అలాగే అనుకున్నారు. ఎక్కడికి వెళ్ళినా, ఏ సినిమాకు వెళ్ళినా కార్లో ఇద్దరూ కలిసే వెళ్లేవారు. అతను మా వర్ణంవాడు కాకపోయినా మేమంతగా పట్టించుకోలేదు. కానీ అనుకున్నవన్నీ జరిగితే ఇక లేనిదేముందీ? అతను ఎవరికీ తెలియకుండా నెలరోజులు సెలవుపెట్టి వాళ్ల ఊరికి వెళ్ళిపోయాడు. అప్పటికే హేమ దిగులు పడిపోయింది. ఒకరోజు అతనిదగ్గరినుంచి ఉత్తరం వచ్చింది. తన వాగ్దానం నెరవేర్చనందుకు క్షమించమనీ, తల్లిదండ్రుల బలవంతంమీద మేనమామ కూతుర్ని పెళ్లి చేసుకున్నాననీ ఆ ఉత్తరంలో వ్రాశాడు. దానితో హేమకు పూర్తిగా మతిపోయింది. మళ్ళీ ఇక్కడికి రావడానికి ముఖం చెల్లక అతను ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడు. అతని తియ్యనిమాటల్లో ఒక మామూలు ఆడదిలాగానే హేమ మోసపోయింది. ఆమే కాదు—మేమూ మోసపోయాము. అతనికేం అతను క్షమించమని తేలిగ్గానే అనేశాడు. ఇది క్షమించదగిందేనా? భ్రష్టుడు హేమజీవితం నాశనం చేశాడు. అప్పటినుంచే ఈమెకు పిచ్చిపట్టుకుంది. ఆమెను ఇల్లు కదలకుండా కంటికి రెప్పలా చూసుకుంటున్నాము. ఇవ్వాళ్ళే ఎప్పుడూ రానిపరాకు రావడంవల్ల వీధిలోకి వెళ్ళిపోయింది. మనిషి బాగానే మాట్లాడుతున్నట్లు ఉంటుంది. ఆ మాటల్లో ఏవో తెలియని అర్థాలుంటాయి. ఉన్నట్టుండి ఇవాళటిలా పిచ్చివచ్చి హైరాన పడిపోతుంది' అంటూ ముసలాయన హేమ జీవితాన్నిగూర్చి క్లుప్తంగా చెప్పాడు.

ఆరోజునుంచీ శ్యామలరావు ఇంచుమించు ప్రతిరోజూ హేమయింటికి వెడుతూ గంటలకొద్ది ఆమెతో మాట్లాడుతూ ఉండేవాడు. ఆమెపిచ్చి రోజురోజుకూ ఎక్కువకాసాగింది. దానితోపాటు ఆరోగ్యంకూడా చెడిపోతూవచ్చింది. ఆ పిచ్చిధోరణిలో శ్యామును కూడా ఏమిటేమిటో అనేది, కాని అతనవేమీ పట్టించుకొనేవాడు కాదు. వైద్యుల సలహాతో ఆమెను విశాఖపట్నం పిచ్చిఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడినుంచి హేమ తండ్రి వారానికోసారి శ్యామలరావుకు ఉత్తరం వ్రాస్తుండేవాడు.

రెండునెలలు నిమిషాలమీద జరిగిపోయాయి. ఒకరోజు 'హేమ నిన్ను చూడాలంటున్నది. వెంటనే బయలుదేరిరా' అని శ్యాముకు ఆమె తండ్రి టెలిగ్రాంతోపాటు డబ్బుకూడా పంపాడు.

శ్యామలరావు వెళ్లకుండా ఉండలేకపోయాడు. హేమను చూసి మొదట్లో గుర్తించలేకపోయాడు. ఆమె దేహం కృశించినా ముఖంలో ఏదో ఆకర్షణ ఉట్టిపడుతున్నది. అతనిరాకకు హేమ తల్లిదండ్రులు ఆనందించారు. హేమ తన చేతుల్లోకి శ్యాం చేతులు తీసికొని నవ్వింది. 'చాలా చిక్కిపోయాననుకుంటున్నావుకదూ శ్యాం?...మనిద్దరం స్నేహంగా ఉందామనుకున్నాము. మన స్నేహంలో మాలిన్యం లేదు... కపటాలు, కార్పణ్యాలూ అసలే లేవు. కానీ... శ్యాం....మనం ఇక స్నేహంగా ఉండలేం...నిన్ను చూస్తుంటే మతిపోతున్నది....నిన్ను మోసం చేస్తున్నాను శ్యాం...నీ స్నేహితురాలిని మరచిపోవు కదూ' అని అంటుంటే ఆమె కంఠం జీరపడింది. ఆమె కళ్లలో నీళ్లు నిండాయి. 'ఏడవకు హేమా... జీవితంలో నిన్ను మరచిపోలేను' ఆమె ముంగురులు సరిచేస్తూ అన్నాడు శ్యాం. ఆమె కళ్ళల్లో నీళ్లు అలాగే నిలిచిపోయాయి. ఆమె నుండి మళ్లీ ఏ సమాధానమూ రాలేదు. శ్యాం అదుర్దాగా ఆమెను పరిశీలించి చూశాడు. "హేమా!...హేమా!...నీ స్నేహితుడిని వదిలి వెళ్లిపోయావా హేమా?" బొంగురుగొంతుతో అన్నాడు శ్యాం. అతని కళ్ళల్లో నీళ్లు నిండాయి. రెండు కన్నీటిబిందువులు హేమ ఫాలభాగం మీదపడి ఆమె కన్నీటి చాలికలలో కలిసిపోయాయి.

# కన్యాశుల్కము

శ్రీ కేతవరపు వేంకట రామకోటిశాస్త్రి

**1861-1915** మధ్యకాలమున నున్న శ్రీ గురజాడ అప్పారావుగారు వ్రాసిన రూపకము కన్యాశుల్కము. 1892 సం॥ న ఈ రూపకము రచించబడి 1897 సం॥ న మొదటి మారుగ ముద్రింపబడినది. తరువాత అదే రెండింతలుగా పెంచబడి 1909 లో ముద్రించబడినది. నేడు మన కుపలభ్యమగు రూపకము 1909 లోని ముద్రణ ప్రతి యొక్క పుత్రికయే.

కన్యాశుల్కమునందలి ఇతివృత్తము ఉత్పాద్యము: మరియు సాంఘికము. ఈ రూపకమున ప్రవేశపెట్టబడిన పాత్రములు నాటికాలమున నున్న కొందర నుద్దేశించియున్నవని విశాఖజిల్లా వారు చెప్పుదురు. నాటికాలమునమున్న సాంఘికదురాచారములను ఖండించు నుద్దేశముతో శ్రీ అప్పారావుగారీ రూపకమును రచించిరని కొందరు నమ్ముచున్నారు. నాటి సంఘజీవమున కిది ప్రతిబింబమని కొందరి యూహ. ఎవ రేమనుకొనినను ఇందలి ఇతివృత్తమునకును నాటి సంఘమునకును కొంత సంబంధముండక తప్పదనుట నిర్వివాదాంశము. ఇట్లు సాంఘికేతివృత్తమును గ్రహించి రూపకముగా రచించిన శ్రీ అప్పారావుగారెంతవరకు కృతార్థులు కాగలిగిరో పరామర్శించి నిరూపించుటయే ఈ వ్యాసమువలని ప్రయోజనము.

నాటకము అను శబ్దము రూపకమునకు పర్యాయపదముగా నేడు వాడుకలో నున్నది. కాని ఆలంకారికమతమున నాటకమనునది దశరూపకములలో నొకటి. భారతీయులు రసదృష్టిగలవారగుట చేత రూపకమును పది విధములుగా విభజించుకొనిరి. అన్నింటిలోను నాటకముత్తమము. అందు వీరశృంగారరసములలో నొకటి అంగిగా నుండవలయును. మిగిలినవి అంగములు. కన్యాశుల్కము 'హాస్యరసప్రధానమగు నాటకము' అని ప్రచారమున నున్నది. ధనంజయాదులదృష్టిలో ఇది నాటకము కాజాలదు. రూపకమనుటకు బదులు నేడు మనము నాటక మనుచుండుటవలన కన్యాశుల్కము హాస్యరస ప్రధానమగు రూపకమగును. ధనంజయుడు హాస్యరస ప్రధానమగు రూపకము నంగీకరించి దానికి ప్రహసనమని పేరు పెట్టినాడు. మనము కన్యాశుల్కమున రసమున్నదనియు, అది హాస్యమనియు అంగీకరించుచున్నాము గనుక ఆలంకారిక మతము ననుసరించి మనరూపకము ప్రహసనమగును. నాటకమునకున్న విలువ ప్రహసనమునకు విజ్ఞుల దృష్టిలో నుండదు. స్వల్పప్రయోజనమున ననుసరించి ప్రహసనము రచించబడును. భాణమువలెనే ప్రహసనముగూడ ఏకాంకమని ధనంజయుడు. కాని కన్యాశుల్కము నాటకమువలె సప్తాంకమై యున్నది. ప్రహసనము ధనంజయునిమతము ననుసరించకపోయినను నాటకమువలె దీర్ఘము కారాదు. కనుక కన్యాశుల్కము రసవిషయమున ప్రహసనమును, అంకవిషయమున నాటకమునువలె నున్నది. అనగా నొకదృష్టి కిది ప్రహసనము. మరొకదృష్టికి నాటకము. మనలో రసదృష్టి అధికము గనుక కన్యాశుల్కమును ప్రహసనముగా గ్రహించవచ్చును. దేనినిగా గ్రహించినను రూపకము గాకపోదు. కనుక రూపకమర్యాదలననుసరించి విమర్శించుట ముఖ్యము.

రూపకము సద్యః పరనిర్వృతితో బాటు సన్మార్గమును మానవాళికి అందునట్లు చేయవలయును. అసలు వాఙ్మయప్రపంచమునకే వర్తించు ఈ సిద్ధాంతము, అందు తలమానికమైన రూపకమునకు వర్తించు ననుటలో విప్రతిపత్తి యుండరాదు. పాశ్చాత్యులును రూపకమున ఆశించిన గుణము లీ రెండుమాత్రమే. (*The drama appeals to two instincts deeply rooted: (1) The craving for amusement (2) The desire for improvement. This two-fold appeal accounts for the complex origin of the drama...*) (A. C. R). ఈ రెండు గుణవిశేషములును రూపకమున బహుధాశక్తములై ప్ర

ర్శింపబడుటకు (1) కథ, (2) సన్నివేశము, (3) పాత్రములు, (4) రచన—అనునవి దోహదములగును. కన్యాశుల్కమున ఇవి ఏవిధముగా నిర్వహింపబడినవో వివరింతును.

(1) కథ—అనగా ఇతివృత్తము. దీనికి సార్వజనీనత, సార్వకాలికత అనివార్యములు. కన్యాశుల్కమున ఇవి మృగ్యములు. వేశ్యాసంపర్కము—కన్యాశుల్కము అను రెండింటిని ఆధారముగా చేసికొని పెరిగినది ఇందలి కథ. ఈ రెండింటిని దూష్యములుగా నిరూపించుటయో లేక కర్తవ్యములుగా చూపుటయో రూపక పర్యవసానమగును. కర్త సంఘసంస్కర్త అనుట నిర్వివాదము గనుక దూష్యములని నిరూపించవలయును. అందు కొరకు కథను అల్లుకొనవలయును. రూపకకర్త అల్లిన కథ అందుకు సమర్థమైనదా అని ప్రశ్న. ఆ కథను నే నిచట వ్రాయనవసరముండదు. ఈమధ్య ఆ రూపకమును పలువురు చదువు అదృష్టము ఒకరివలన కలిగినది. ఆ యవకాశమును ఆంధ్రావళి ఉపయోగించుకొని యుండునను నమ్మకము గలవాడనగుటచేత రూపకములోని కథను ఇచట వ్రాయను. రూపకమునందలి ఇతివృత్తము నిబిడముగా నుండవలయును. అనగా నిరూపింపదలచుకొనిన భావమున కెంత విస్తృతి యవసరమో అంతకు మించక ఇతివృత్తనిర్వహణమున కర్త జాగ్రత వహించవలయును. ఇతివృత్తములోని ప్రతియంశమును ఉద్దిష్టార్థమునకు దోహదము చేయునదిగా నుండవలయును. కథాసంక్షేపముతో పాటు ప్రాధాన్యపోషణము రూపక కర్త నిర్మాణప్రజ్ఞకు నికషోపలము. కన్యాశుల్కమునందలి ద్వితీయాంకము—రెండవస్థలము—24, 25 పుటలలోని శిష్యుని స్వగతముగాని, కరటకశాస్త్రి, శిష్యుల సంభాషణముగాని ఇతివృత్తమునకు సంబంధించినవి కావు. 26 పుటలోని సంభాషణమాత్రము ముఖ్యమైనది. పంచమాంకము ఒకటవస్థలమున పడకగదిలో లుబ్ధావధాన్లుచేసిన అల్లరి ఇతివృత్తగమనమునకు సహాయకారి కాదు. అతని భార్య (ఆడవేషమున నున్న కరటకశాస్త్రి శిష్యుడు) లేచిపోయిన దారాత్రియేగదా, అది కథాగతి కనుకూలమేయైనదిగదా అనిన, దీనికి మూడుపుటల (102, 103, 104) గందరగోళ మక్కరలేదని సమాధానము. రెండవస్థలమున రామప్పపంతులుగారి ఇంటిలో పోలిశెట్టి మొదలైనవారి పేకాట (పుటలు. 107, 108, 109, 110, 111) ప్రదర్శనము ఆధికారికవస్తువున కాటంకమేగాని మరొకటి గాదు. మూడవస్థలమున లుబ్ధావధాన్లగారి ఇంటిముందు బ్రహ్మరాక్షసిని సీసాలో బిగించుటను గూర్చి గవరయ్య చేసిన గొడవ కేవలము అసందర్భము. (పుటలు. 116, 117) నాల్గవస్థలము — రామచంద్రపురము అగ్రహారమున సారాయి దుకాణము వెనుకతోటలో చేరిన బైరాగి, యోగిని, రామదాసు మొదలైనవారిసంభాషణములు (పుటలు. 118, 119, 120, 121, 122, 123, 124, 125) నిరర్థకములు. రూపకేతివృత్తముతో అతుకనివి. ఇందలి యోగి, రామదాసు, హెడ్ కానిస్టేబులు తరువాతి ప్రధానకథతో సంబంధము కలవారే కదా అనవచ్చును. వీరి సంబంధమువలన కథకు పారిపుష్ట్యము కలుగలేదు. కించిత్తు సంబంధమును ఏర్పరచుటకు ముందుగా వారి కింత ప్రాధాన్యమీయ నక్కరలేదు. సప్తమాంకము ఒకటవస్థలము. విశాఖపట్టణపు వీధిలో బైరాగి ప్రవేశ ప్రదర్శనము కావలసిన దానికంటె దీర్ఘము. మూడవ స్థలము సౌజన్యారావు పంతులుగారి కచేరి గదిలోని పోలిశెట్టి పంతులుగారి సంభాషణము (పుటలు. 168, 169, 170) నిష్ప్రయోజనమైనది. ప్రధాన కథకు పోషకము కాకపోగా, బాధకముగు అప్రస్తుత విషయ విన్యాస మింత యుండుటవలన కన్యాశుల్కరూపకమునందలి ఇతివృత్తమున నిబిడబంధము లేదనుట విమర్శకు లంగీకరించవలసిన విషయము. మిగిలిన కథయైనను నిర్దుష్టముగా ఉన్నదా అని ప్రశ్న. లేదని సమాధానము. వివరింతును.

2. సన్నివేశము — నిజమునకు సన్నివేశమనునది కథలోని అంతర్భాగమేయగును. అయినను వివరణముకొరకు పృథక్కరించితిని. రంగస్థలముమీదకు వచ్చిన పాత్రముల ప్రవృత్తి అట్లే యుండవలయునను భావము సామాజికులకు కలుగునట్లు రూపకకర్త జాగ్రత్త తీసికొనవలయును. పాత్రముల వాచికము గాని, చేతలుగాని వారికి స్వాభావికములనునట్లు కల్పించవలయును. రంగస్థలమున పాత్రముల సమావేశపరచుట, కథాగతికి పోషకముగా నుండునట్లు కర్త చూచుకొనవలయును. అసందర్భములకు తావీయరాదు. ఈ గుణములన్నింటిని సన్నివేశకల్పనముగా గ్రహించి

విమర్శింతును. "ఈ వేళ క్రిస్మిస్ శెలవులు యిచ్చి వుంటారు. వీడివైఖరి చూస్తే పరీక్ష ఫేలైనట్టు కనబడు తుంది". (పుట. 5) విజయనగరమునుండి ఎటకేని వెళ్లి పోదలచిన గిరీశము వేంకటేశము నుద్దేశించి అనిన మాటలివి. క్రిస్మిస్ అనగా క్రిష్టమస్. ఆంగ్లపాఠశాలలలో డిశెంబరు మాసమున క్రిష్టమస్ సెలవుల నిత్తురు. ముందు పరీక్షలు జరుపుదురు. అర్ధ సంవత్సరపు పరీక్ష లివి నేడు. విద్యార్థుల 'పాసు, ఫేలు' నిర్ణయ మీ పరీక్షలవలన కాదు నేడు జరుగుట. ఆ నిర్ణయము ఏప్రియల్ మాసమున జరుగు పరీక్షలవలన జరుగు చున్నది. గిరీశము మాటలనుబట్టి నాటికాలమున డిశెంబరు సెలవులకు ముందు పరీక్షలే విద్యార్థుల 'పాసు - ఫేలు' నిర్ణయించునవిగా ఉన్నట్లు ద్యోతకమగు చున్నది. అయినను ఒక సందేహము. విద్యార్థుల 'పాసు-ఫేలు' నిర్ణయప్రకటనము సెలవులలో జరుగుట సంభవము. సెలవులిచ్చునాటికే జరిగినట్లుగా చెప్పుట సహజముగాదు. ఎట్లయినను నేటివారి కిది వింతగా గోచరించును. అనగా రూపకకర్త సార్వకాలికత లేని కల్పన చేసినాడు గిరీశము కృష్ణారాయపురము చేరుటకు. 15 వ పుటలో, గిరీశమును కొట్టుటకు గాను, మధురవాణి ఇంటిలో ప్రవేశించి, మంచము క్రింద నున్నాడని తెలిసికొని తానుగూడ చీపురుకట్టతో మంచముక్రిందకు దూరిన పూటకూళ్లమ్మ, గిరీశము పైకి వచ్చి రామప్పపంతులు నెత్తి చరచి పరుగెత్తిన తరువాత, కొంతకాలము మధురవాణిచేత అనున యింపబడుచు, కౌగిలించుకొనబడుచు, ముద్దుపెట్టు కొనబడుచు నున్న రామప్పపంతులు "ఆ ముండ మంచం కిందనించి రాదేం" అనువరకు మంచముక్రిందనే యుండునట్లు సన్నివేశము కల్పింపబడినది. ఆమె మంచముక్రిందకు దూరుటకు హేతువు గిరీశమును కొట్టదలచుకొనుటయే. అతడు పైకి వచ్చి వెళ్లిపోయినతరువాతగూడ తాను మంచము క్రింద ఎందుకున్నట్లు? మధురవాణి ముద్దులు—కౌగిలింతలు చూచుటకా? ఆ పనిమీద రాలేదే తాను. ఎంత వేశ్యయైనను మంచముక్రింద మనిషి నుంచి ఆపనులు చేయునా? జుగుప్సాకరములు కాకపోవునా? దూడ మేతకు తాటిచెట్టు ఎక్కినాడన్నట్లున్న దీ సన్నివేశము. గిరీశము మధురవాణి యిల్లు వీడిపోవుటకు పూటకూళ్ళమ్మప్రవేశము దోహద మిచ్చుచున్నది గదా అనిన, అందుకు సన్నివేశము వింత అసందర్భముగను, అసమంజసముగను సృష్టింపవలెనా? ఒక దానిని ఉద్ధరించుటకు మరొకదానిని చెడగొట్టరాదు. నిర్మాణకుశలు డట్లు చేయడు. చేయరాదు. 23 వ పుటలో గిరీశమును, వెంకటేశమును భోజనమునకై పిలుచుటకు గాను బుచ్చమ్మ వచ్చును. అంత గిరీ— 'వాట్ యీమె నీ సిస్టరా? తల చెడ్డట్టు కనబడు తున్న దే?'

వెంక—'మా అక్క, జుత్తుకి చవుఁటాసుకోదు.'

గిరీ—'తల చెడ్డం అంటే, విడో అన్నమాట'— ఈ సంభాషణము జరిగినది. దీనినిబట్టి బుచ్చమ్మ వితంతువనియు, తల వెంట్రుకలు కలదనియు తెలియు చున్నది. పరమ వైదికి, శ్రోత్రియుడు అయిన అగ్నిహోత్రావధానుల కూతు రామె. వితంతువులకు తల వెంట్రుకలు తీయించు ఆచారము బ్రాహ్మణ సామాన్యము. నేటికిని పూర్వాచారపరాయణులైన బ్రాహ్మణు లా ఆచారమును పాటించుచున్నారు. పాశ్చాత్యనాగరకతలో మునిగి తేలుచున్న నేటి కాలమునను గూడ కొందరలో ఆ ఆచారము అమలులో నుండగా, నాడు, రామకృష్ణారాయపురాగ్రహారీకుడును, వేదము 'యనఘైరెంకుపన్నాలు' చదువు కొనిన వైదికుడును, ఆచారవిషయమున మూర్ఖమైన పట్టుదల గలవాడును, ఐన అగ్నిహోత్రావధాని వితంతువైన తనకూతునకు శిరోజములుంచినాడనుట అసంభవమేగాక అసందర్భముగూడను. పోనీ, ఆకాలమున వితంతువునకు శిరోజములు తీయు నాచారము లేదేమోననుకొని తృప్తిపడుటకు, 53 వ పుటలోని "తుమ్మెదపంక్తుల్లా ఉండే జుత్తుగూడా తినివేస్తారు గదా" అని గిరీశము వితంతువులనుగూర్చి జాలిపడు వాక్యము బాధకమగుచున్నది. కనుక 23 వ పుటలోని కల్పన మసందర్భమైనది. ఉత్తరోత్తరము బలీయమను సిద్ధాంతమునవలంబించినను 53 పుటలోని వాక్యము చేత అది పరాస్తమగుచున్నది. ఇది వ్యాకరణశాస్త్రము కాక రూపకమగుటవలన స్వవచోవ్యాఘాతమగును. అట్లు కారాదు. షష్ఠాంకమున రామప్పపంతులువలన లుబ్ధావధాని వివాహవిషయము తెలిసికొని తనను మోసగించినందు కాగ్రహోద్రిక్తచిత్తుడై "వెళ్లి గాడిద కొడుకు రొమికలు విరగ్గొడతాను" (పుట. 139) అని సంసిద్ధుడైన అగ్నిహోత్రావధాని, రామప్ప పంతులు చెప్పగానే "నాకు తోవ తెలియదే" అనుట

ఉచితము గాదు. ఏమనగా రామచంద్రపురము అగ్రహారము. సాధారణముగా పల్లెటూరై యుండును. పైగా ఆయూరి చెఱువుగట్టునకు చేరినాడు అగ్నిహోత్రావధాని. ఊరు సమీపములో నున్నది. ఊరిలో ప్రవేశించి ఎవరి నడిగినను లుబ్ధావధాన్ల ఇల్లు చూపించగలరు. చీకటిసమయమేమో ననుకొనిన గాదని 136 వ పుటలో రామప్పపంతులు "తెల్లవారవచ్చింది" అని సాక్ష్య మిచ్చుచున్నాడు. 'తెల్లవార వచ్చింది' అనుటవలన తెల్లవారినట్లు భావము సిద్ధించుట లేదుగదా యనిన ఏనుగులతోను గుఱ్ఱములతోను, బండ్లతోను వచ్చిన అగ్నిహోత్రావధాని చేతిలో ఎందరు పనివారు లేరు—ఒకరిని తీసికొని వెళ్ళవచ్చునుగదా—రూపకకర్త శిష్యుని ప్రవేశపెట్టదలచుటచేత ఇంత అనౌచిత్యమునకు పాల్పడవలసివచ్చినది. ఒకవేళ అగ్నిహోత్రావధాని ఆగ్రహావేశమున ఎముకలు విరుగగొట్టెదనని పలికినను, నిజమున కతని కా తాహతులేదనియు, దానిని కప్పిపుచ్చుకొనుటకు దారి తెలియదని సంకోచించినట్లు నటించినవాడనియు సమర్థించవచ్చిన 140 వ పుటలోని 'గాడిద కొడుకును రూ చెడ్డదెబ్బలు కొట్టేశాను' అను వాని వాక్య మడ్డువచ్చును. క్రిమినలు కేసు పెట్టుటకు సంకల్పించి 'ఇదేదో అయితే నేగాని ఇంటిమొహం చూసేదిలేదు' (పుట. 141) అని రామచంద్రపురము చెఱువుగట్టున పలికి, బుచ్చమ్మను గిరీశము లేవదీసుకొని వెళ్లినట్లు తెలిసికొని వెంకటేశమును కొట్టి వెంటనే (8 వ స్థలమున) విశాఖపట్టణమున మధురవాణి బస యెదుటివీధిలో రామప్పపంతులుతో కూడి అగ్నిహోత్రావధాని ప్రవేశించును. ఇతడు తన వారి నందరిని ఆ చెఱువుగట్టున వదలి విశాఖపట్టణము చేరినట్లు తెలియుచున్నది. ఇది అంత బాగుగాలేదు. వారిని కృష్ణారాయపురము పంపి తాను తన వ్యవహారము చూచుకొనవలయును. కనీసము వారితో కృష్ణారాయపురము పొమ్మని చెప్పియైనను అగ్నిహోత్రావధాని విశాఖపట్టణము రావలయును. అదియును చేయలేదు. రూపకకర్త ఈ విషయమున జాగ్రతి వహించక అగ్నిహోత్రావధానిభార్య వెంకమ్మను, కుమారుడు వెంకటేశమును మిగిలినవారిని రామచంద్రపురము చెఱువుగట్టున వదలిపెట్టుట రూపకమునకు బిగిగాని జిగిగాని కూర్చుటలేదు. రూపక పాత్రములు మధ్యలో నిర్లక్ష్యము చేయబడరాదు. ప్రవేశించిన పాత్ర యొక్క ప్రయోజనసిద్ధికై తుదివరకు నుండవలయును. ప్రాసంగికములైన పతాకా ప్రకరులకు సంబంధించిన పాత్రములు మధ్యలో విడిపోవచ్చును. అగ్నిహోత్రావధాని భార్య, కుమారుడు ప్రాసంగిక పాత్రములు కాజాలరు. వెంకటేశ ముండుటవలననే గిరీశము అగ్నిహోత్రావధానివద్దకు చేరగలిగినాడు. వెంకమ్మవలననే కరటకశాస్త్రి తన శిష్యున కాడువేషము వేసి లుబ్ధావధానిని మోసము చేసినాడు. ఇతివృత్తము ఈ తల్లికొడుకులవలననే పెరిగినది. రూపకేతివృత్తము దారమువలె సాగుట కుపయోగపడినవారిలో వీ రిరువురును ప్రముఖులు. అట్టి వీరు చెఱువుగట్టుమీద విడువబడి, ఇక మిగిలిన రూపకమున ప్రవేశపెట్టబడకుండుట—ప్రసక్తియైన చేయబడకుండుట రూపకము శిథిలబంధమైనదని ఋజువు చేయుచున్నది. కల్పనాపటిష్ఠముగామి వ్యక్తమగుచున్నది. ఇక మధురవాణి విశాఖపట్టణ మెప్పుడు ఎందుకు వచ్చినదో నిరూపించబడలేదు. 136 వ పుటలో రామచంద్రపురమున రామప్పపంతులుఇంటిలో నున్న మధురవాణి 143 వ పుటలో ఎవరికి తెలియకుండ విశాఖపట్టణము చేరినది. 136 వ పుటలో 'నిజంగా మంగళహారతి తెస్తుంది కాబోలు పెంకిలంజ' అని వీధివాకిటనుండి చెఱువుగట్టుకు చేరిన రామప్పపంతులు తిరిగి మధురవాణిని రామచంద్రపురమున కలుసుకొనలేదు. 143 వ పుటలో రామప్పపంతులు కడియమును మధురవాణివద్ద తాకట్టుపెట్టి డబ్బు తెచ్చుకొనవచ్చునని అగ్నిహోత్రావధానికి సలహా ఇచ్చుచున్నాడు.

మధురవాణి విశాఖపట్టణమున నున్నదని అతని కెట్లు తెలియవచ్చినది? రామప్పపంతులే ఆమెను అచట నుంచినాడా? ఆ విషయ మంతకుముందు సూచించబడవలయును. అట్లులేదు. అంతకుపూర్వము 136 వ పుటలోని మధురవాణిప్రవర్తనము రామప్పపంతులు మాట వినునట్లులేదు. రామప్పపంతులను విసర్జించి లేచి పోదలచియున్నచో ఆమె తనకు మొదటినుండి పరిచయమైయున్న విజయనగరము వెళ్లుటలో సామంజస్యమున్నదిగాని విశాఖపట్టణము వచ్చుటలో లేదు. అట్లయినచో ఆమె విశాఖపట్టణమే ఏల పోవలయును? ఎచటకైనను పోవచ్చును. రూపకకర్త ఇక తన ఇతివృత్తమునకు రంగస్థలముగా విశాఖపట్టణమును

చేయదలచుకొనినాడు. అందువలన పోయిన పాత్రములు పోగా మిగిలినవారిని విశాఖపట్టణము చేర్చినాడు. లుబ్ధావధాన్లుగూడ యాదృచ్ఛికముగా చేర్చబడినవాడే. ఇట్టివారే యోగి, రామదాసు, పోలిశెట్టి, హెడ్ కానిస్టేబులు మొదలైనవారు. రూపకకర్త తాను కావలయునని తనపాత్రలచేత పనులు చేయించరాదు. అనగా తాను తనపాత్రముల చేతలకు సామంజస్యమును కూర్చుకొనుచుండవలయును. అట్లు చేయనిచో రూపకము నిర్జీవమై రూపకకర్తచేత శవమువలె లాగబడుచున్నట్లు కనుపించును. ఈ యవస్థనుండి కన్యాశుల్కకర్త తన రూపకమును తప్పించలేక పోయినాడు. లుబ్ధావధానులు బసలో రామప్పపంతులతో మాటాడుచుండగా సౌజన్యారావు పంతులు ప్రవేశించును. సౌజన్యారావు వకీలు. లుబ్ధావధానిపక్షమున వ్యవహారము నడుపువాడు. అతనితో మాటాడదలచినచో తనఇంటికి పిలిపించుకొను స్థితిలో నున్నాడు సౌజన్యారావు. అతడు లుబ్ధావధాని బసకు వచ్చుట అసందర్భము. అది వాని సౌజన్యమునవచ్చును గదా అనిన, అతను వచ్చి సాధించిన పరము ప్రయోజనమేమియు లేదు. నిష్ప్రయోజనమైన సన్నివేశమును రూపకకర్త కల్పించరాదు. దానివలన రూపకము రక్తికట్టక పోగా, శక్తిహీనమైనదిగా కనుపించును. దీనినిబట్టి రూపకకర్త ఉపజ్ఞ వ్యక్తమగును. ఇక కోర్టు వ్యవహారములున్నవి. వాటి విషయమున తగవరితనము నెరపుటకు నాకు శక్తిచాలదు గాని, కలిగిన సందేహములు వివరింతును. అగ్నిహోత్రావధాని లుబ్ధావధానిని కొట్టి తిరిగి చెఱువుకట్టకు వచ్చి 140 వ పుటలో "క్రిమినల్ కేసు నడపటానికి అవకాశం వుంటుందా" అని రామప్పపంతులనడుగును. ఈ క్రిమినల్ కేసు ఎవరిమీద? లుబ్ధావధానిమీదనా? ఏమని ? అతడే తనను కొట్టినాడనియా? లేక లుబ్ధావధాని తన మీద క్రిమినల్ కేసు నడుపుట కవకాశముండునా అని అగ్నిహోత్రావధాని అడిగినాడా ? 141 వ పుటలోని రామప్ప పంతులు మాటలను బట్టి లుబ్ధావధాని మీదనే కేసు నడుపుట వారి భావమైనట్లు తెలియుచున్నది. 144 పుటలోని నాయుడుగారి మాటలను బట్టి లుబ్ధావధానియే ఇతనిమీద క్రిమినల్ కేసు నడుపుచున్నట్లూహించుట కవకాశమేర్పడుచున్నది. 165వ పుటలోని భీమారావు మాటలనుబట్టి అగ్నిహోత్రావధాని తన కూతుని లేవదీసుకుపోయిన గిరీశముమీద కేసు నడుపుచున్నట్లు కనుపించుచున్నది. 140 వ పుటలో అగ్నిహోత్రావధాని క్రిమినల్ కేసు విషయము ప్రస్తావించునప్పటికి, గిరీశము బుచ్చమ్మను లేవదీసుకొనిపోయిన ఉదంతము అతనికి తెలియదు. కనుక అగ్నిహోత్రావధాని మొదట చెప్పిన క్రిమినల్ విషయము గిరీశమునకు సంబంధించినది కాజాలదు. మరి గిరీశముమీద కేసు ఎప్పుడు పెట్టినాడో తెలియదు. 159 వ పుటలోని సౌజన్యారావు పంతులు మాటలవలన లుబ్ధావధాని అగ్నిహోత్రావధానిమీద కేసు పెట్టినట్లును, అగ్నిహోత్రావధాని గిరీశముమీద కేసు పెట్టినట్లును తెలియుచున్నది. 141 వ పుటలోని 'ఇగ్నేవో అయితే నీగాని ఇంటిమొహం చూసేదిలేదు' అన్న అగ్నిహోత్రావధాని లుబ్ధావధానివిషయమే తేల్చుకొనుటకు నిశ్చయించుకొనినాడు. కాని తరువాత గిరీశముమీదకు దండెత్తినాడు. పోనీ పర్యవసానమేమైనను తేలినదా అనిన లేదని సమాధానము. సౌజన్యారావు లుబ్ధావధానిపక్షము వహించిన వకీలు. అతను అగ్నిహోత్రావధానిమీద వ్యవహారము నడుపవలయును. అది మాని గుంటూరు శాస్త్రుల్లు ఎవరా అని సౌజన్యారావు ఆలోచించును. 148 వ పుటలోని కరటకశాస్త్రి మాటలనుబట్టి లుబ్ధావధాని ఖూనీకేసులో ముద్దాయి అయినట్లు తెలియుచున్నది. అనగా భార్యను చంపినాడని రామప్పపంతులు కేసు పెట్టించినాడని. అట్లయిన ఖూనీకేసుముద్దాయి జైలులో నుండవలయును గాని పట్టణమున ఒక బసలో నుండుట యెట్లు? ఒక సూత్రమున ఇముడని ఇన్ని కేసులను ప్రవేశపెట్టి, ఒకదానిని తేల్చక ఎక్కడివారి నక్కడ విశాఖపట్టణపు వీధులలో తిరుగుడని వదలి, సౌజన్యారావుచేత గిరీశమును ఇంటినుండి వెళ్ళగొట్టించి, మధురవాణిని సౌజన్యారావుఇంటిలో నుంచి రూపకము సమాప్తము చేయుట ఇతివృత్తగ్రథనమున గాని, సన్నివేశకల్పనమునగాని పటిష్ఠము గామి తెల్లము చేయుచున్నది. అసలు రూపకమున కన్ని ఇతివృత్తములును తగవు. గ్రహించిన దానిని ప్రతిభతో నిర్వహించవలయును. ప్రతివాడును రూపకకర్త కాలేడు. అయినవారిలో శ్రేష్ఠుడొకడుండును. రూపకకర్త అభివ్యక్తము చేయదలచినభావము వ్యంగ్యమర్యాదననుసరించి ఉండుట కావలయును. వేశ్యాసంపర్కము వర్జనీయమని గాని

అనుసరణీయమని గాని, కన్యాశుల్కము ఉచితమని గాని, అనుచితమని గాని రూపకకర్త వ్యక్తము చేయలేకపోయినాడు. ఇతివృత్తమును మైనమువలె వంచుకొని ఉద్దిష్టార్థనిరూపణమున కుపయోగించుకొనలేకపోయినాడు. కథకు కాళ్లు లేవు. ముంతకు చెవులు లేవు అను సామెతననుసరించినది కన్యాశుల్కము. అనవసరములును, అసందర్భములును ఐన ప్రస్తుతవిషయములలో రూపకము 192 పుటలకు వచ్చినది. కథ—తత్సంధానము అను విషయమున కన్యాశుల్కకర్త కృతార్థుడు కాలేదు. అందుకు కారణము కథాకథనకౌశల మతనికి లేదు.

(3) పాత్రములు — పాత్రసృష్టి రెండువిధములు. చిత్రణ మొకటి. వర్ణన మొకటి. చిత్రణమున కర్త భావుకతి అప్రత్యక్షముగను, వర్ణనమున ప్రత్యక్షముగను పనిచేయును. శ్రవ్యకావ్యములందు రెండును ఉపాదేయములైనను దృశ్యకావ్యములందు కేవలము చిత్రణమే కర్తవ్యము. దీనిని రూపకకర్త రెండుమార్గముల సాధించవలయును. మొదటిది పాత్రగతము. అనగా పాత్రముయొక్క వాచికము అనగా సంభాషణ, పాత్రయొక్క చేత అనగా కార్యము. పాత్ర పలికిన మాటలవలన చేసిన చేతలవలన తనకు తానై వ్యక్తిత్వము సాధించుకొనును. రెండవది పరగతము. అనగా ఒక పాత్రమును గూర్చి రూపకమునందలి మరియొక్క పాత్ర వ్యాఖ్యానించుట. ఈ వ్యాఖ్యానమువలన చేయుచున్నట్టియు, చేయబడుచున్నట్టియు పాత్రములు పూర్తిగ మూర్తి గట్టుకొనును. ఈ విధముగా పాత్రములు స్వయం సంపూర్ణములగునట్లు శక్తిగల రూపకకర్త చేయగలడు. ఉద్దిష్టార్థప్రపంచనార్థమే రూపకకర్త ఏపని చేసినను. కనుక పాత్రముల క్రమోన్మీలనముగూడ తన్ముఖముగనే యుండును. కన్యాశుల్కమున రంగస్థలముమీదకు వచ్చు పాత్రములు 32. ఇవి మాటలాడు పాత్రములు. ఇందు స్త్రీలసంఖ్య 5. సుబ్బమ్మ అను అగ్నిహోత్రావధాని రెండవకూతురు రంగస్థలముమీదకు రాదు గనుక వారిలో చేర్చలేదు. సప్తమాంకమున బైరాగి వెనుక ప్రవేశించు పదిమంది శూద్రులలో ముగ్గురు మాత్రమే మాటాడుదురు. కనుక మిగిలిన ఏడుగురను పైన చేర్చలేదు. కథాసూత్రముతో సంబంధమున్న వారిని గూర్చి క్లుప్తముగా వ్రాయుదును.

గిరీశము—ఇతడు వ్యభిచారి. సంస్కృతాంగ్లములతో కొంత పరిచయముగలడు. మాటకారి. మోసకారి కూడాను. వితంతువివాహము లవశ్యకర్తవ్యములనియు, కన్యాశుల్కము కూడదనియు, వేశ్యాబహిష్కారము కావలయుననియు, ఇతడు ప్రతివారితోను ఉపన్యాసధోరణిలో మాటాడును. ఇతని భాష అంగ్లభూయిష్ఠము. సంస్కృతము క్వాచిత్కము. విజయనగరమున మధురవాణిని, పూటకూళ్ళమ్మను కొంతకాల మనుభవించి చెప్పకుండ కృష్ణారాయపురము చేరినాడు. అగ్నిహోత్రావధాని కూతురు బుచ్చమ్మ కనుపించగానే అమాయికురాలైన ఆ వితంతువును లేవదీసుకొనిపోవుటకు నూహించి, వెంకటేశమునకు పాఠము చెప్పుచున్నట్లు నటించుచు వితంతువివాహమును ప్రసక్తికి తెచ్చి, వారియందు అపారమైన కరుణగలవానివలె ఉపన్యసించి నెమ్మదిగా బుచ్చమ్మమనసు మార్చి, తనతో లేచివచ్చునట్లు ప్రమాణము చేయించుకొని, అగ్నిహోత్రావధానితో కలసి రామచంద్రపురము వచ్చుచు మార్గమధ్యమున బుచ్చమ్మతో సహా లేచిపోయినాడు. తన పెదతల్లికుమారుడైన లుబ్ధావధానివద్దకు చేరి తనను దత్తత చేసికొమ్మని అడుగును. లుబ్ధావధానికేసు సౌజన్యారావువద్ద నుండుటవలన గిరీశము అతనివద్దకు చేరి తనను గూర్చి "నెపోలియన్ ఆఫ్ అంటినాచ్" అనియు "సోషల్ రిఫార్మర్" అనియు చెప్పుకొని తనకతని సహాయపడవలసినదిగా కోరినాడు. అతడు సరేననినాడు తమ్ముని అన్న పెంచుకొనుట వింత. మధురవాణి సౌజన్యారావుపంతులువద్దకు వచ్చినపుడు గిరీశము విషయము వ్యక్తముకాగా సౌజన్యారావు అతనిని "తక్షణం ఇంట్లోనుంచి పైకి పో!" అనినాడు. గుమ్మము దాటి "డామిట్! కథ అడ్డంగా తిరిగింది" (పుట. 192) అని వెళ్లిపోయినాడు గిరీశము—ఇతనిలో ఉదాత్తమైన గుణమొక్కటియు లేదు. ఏ పరమప్రయోజనమును ఇతడు సాధించినాడో నాకు బోధపడుటలేదు. వితంతువివాహము అవసరము అని ఇతను బుచ్చమ్మవద్ద ఇచ్చిన ఉపన్యాసములు హాస్యాస్పదము లగుచున్నవి. బుచ్చమ్మను లేవదీసికొనిపోవు తాపత్రయమున అత డట్లు మాటాడుచున్నాడేగాని మరొకటి కాదు అని ప్రవర్తననుబట్టి మనకు తెలియుచున్నది. సంఘసంస్కరణ మని పేరు పెట్టుకొని అమాయికులను మోసము చేయు

చున్నట్లుగానే గిరీశము చిత్రింపబడినాడు. సంఘ సంస్కర్తలమని రొమ్ము విరుచుకొని తిరుగువారిని దూర్తులుగా నెంచవలయుననే అభిప్రాయమును వ్యక్తము చేయుటకు శ్రీ అప్పారావుగారీ గిరీశము పాత్రమును సృష్టించినారా అనిపించుచున్నది. సమాజము అనుసరించుటకు గాని, ఆమోదించుటకు గాని తగని ఇట్టిపాత్రను చిత్రించుటలో రూపక కర్త అభిప్రాయమేమై యుండును? లుబ్ధావధానికి లేఖ వ్రాయుటలోను, సౌజన్యారావువద్దకు చేరుటలోను గిరీశము స్వార్థము నే ప్రకటించినాడు. ఏ విషయమునను ఉదాత్తత పొందనిపాత్రము గిరీశము. శ్రీ అప్పారావుగారు సంఘసంస్కరణాభిలాషతో ఈ రూపకము రచించియున్నచో తన అభిలాషను వ్యక్తము చేయలేకపోగా తనను తానే పరాస్తము చేసికొనివాడని అంగీకరించవలయును. విధవావివాహముతో పాటు దొంగతనము (పుట. 94) కూడ అత్యావశ్యక కర్తవ్యమని రూపకకర్త గిరీశముచేత పలికించుచుండగా వాని యందు సానుభూతి యెట్లు కలుగును? రెండవది హాస్యరసపోషణమునకని మొదటిది దానిని ద్విగుణీకరించుట కగుచున్నది. నాటి సమాజమును సంస్కరణము కావించుటకై కంకణము కట్టుకొని పనిచేసిన యుగపురుషుడు వీరేశలింగము పంతులుగా రప్పటి వారేగదా! శ్రీ అప్పారావుగారిని గూర్చి వారేమను కొనిరో— తను కనుకూలు డనుకొనిరో— ప్రతికూలు డనుకొనిరో? సంస్కరణ మెట్లున్నను గిరీశము పాత్రము నిష్ప్రయోజనమైనది. అతనినుండి నేర్చు కొనవలసిన గుణపాఠ మేమియు లేదు. నవ్వి వదలి వేయ వలసినవాడే గిరీశము.

మధురవాణి— వేశ్య. అప్పుడప్పుడు, వేశ్యకు మాత్రము నీతి లేదా? వేశ్య అవగానే అంత చులకనా? ఈ ధోరణిలో మాటాడుచుండును. ఈమె విషయము విజయనగరములో మనకంతగా తెలియదు గాని రామచంద్రపురము వచ్చినతరువాత వెకలిదానివలె కనుపించుచున్నది. చతుర్థాంకమున రామప్పపంతులు, లుబ్ధావధాని పెండ్లి విషయము మాటాడుకొను సందర్భమున లుబ్ధావధానినిగూర్చి చేసిన సంభాషణచేత, వెకలితనమును వ్యక్తీకరించుచున్నవి. ఆ కరటకశాస్త్రి శిష్యుని పకపడే ముద్దు పెట్టుకొనుట, రామప్ప పంతులుతో వచ్చిన కొండిబొట్లును, పంతులు ఇంటిలోనికి పోగానే సంజ్ఞచేసి ముద్దుపెట్టుకొనుట, "నీకూ వాకూ వేస్తం"(పుట 92) అని "మరి ఒకసారి ముద్దు" పెట్టుకొనుట, సౌజన్యారావు వద్దకు వెళ్లి తనను ఒకమారు ముద్దు పెట్టుకొనినచో, లుబ్ధావధానికేసువిషయమున సహాయము చేయుగలననుట మొదలగువానివలన మధురవాణి నీచపాత్రగా కనుపించుచున్నది. చిట్ట చివరకు సౌజన్యారావు ముద్దుపెట్టుకొనుటకు రాగా మహా పతివ్రత వలె "చెడనివారిని చెడగొట్టవద్దని మా తల్లి చెప్పింది" (పుట 190) అని ఆ వకీలునకు మాత్రమూ సౌఖ్యము కలుగ చేసినది గాదు. శ్రీ అప్పారావుగారీ మధురవాణిపాత్రను సృష్టించుటవలన సాధించిన ప్రయోజనము వేశ్యలు చెడనివారిని చెడగొట్టుటకు యత్నించరాదను ప్రబోధమేనా?

రామప్పపంతులు— స్త్రీలోలుడు. 'కోర్టు పక్షి' స్వార్థపరుడు. ఇంతకుమించి ఇతనిగూర్చి వ్రాయనవసరము లేదు.

సౌజన్యారావు—వకీలు. సంఘ సంస్కరణాభిలాషకలవాడు. వేశ్యావిముఖుడు. పినను తన కేసువిషయమున సహాయము చేయుటకు వచ్చిన మధురవాణి ముద్దుపెట్టుకొనినచో, సహాయము చేయుదుననగా అంగీకరించి తరువాత మాట నిలువ బెట్టుకొనుటకుయత్నించి, మధురవాణిచే వారింపబడిన వాడు. గిరీశము విషయ మామె చెప్పగా తెలిసికొని అతనియెదుట "ఆమెతో షేక్ హాండ్" చేసినవాడు. ఇతడు లుబ్ధావధానితోను, అగ్నిహోత్రావధానితోను చేసిన ప్రసంగమున శ్రీ అప్పారావుగారు తాము చెప్ప దలచుకొనిన హితమును ప్రవేశపెట్టిరి. కాని రూపకమున ప్రముఖపాత్ర నిర్వహించుచున్నట్లున్న గిరీశము వలన తమ అభిప్రాయ వ్యక్తీకరణమునకు కలిగిన నష్టము సౌజన్యారావుచేత పరిహరింపజేసికొనలేక పోయినారు. ప్రముఖ పాత్రతో చేయించలేని పనిని ప్రాసంగిక పాత్రతో నిర్వహించుట కష్టము.

అగ్నిహోత్రావధాని—వెంకమ్మ—వీరి దాంపత్యము ప్రత్యేకత కలిగిన వింతపోకడ గలది. అతనిని ఆమె నిరసించుటకు యత్నించును. అతడధికారము నెరపుటకు పూనుకొనును. సంతాన విషయమున వెంకమ్మకు వాత్సల్య మధికము. అగ్నిహోత్రావధానికి పట్టుదల అధికము. వెంకమ్మ రూపకమున మధ్య ప్రవేశించి మధ్యలోనే విడువబడుటవలన ఆమె పాత్ర పూర్తిగ మూర్తిగట్టుకొనలేదు. ఆమెకు పునః ప్రవేశ మున్నచో కథ మరొక విధముగా నుండెడిది. అగ్ని

హోత్రావధాని పట్టుదలతోనే చివరవరకు నిలచినాడు. కోర్టు వ్యవహార విషయమున లొంగినాడు.

బుచ్చమ్మ—అమాయికురాలయిన వితంతువు. ఈమె కేవలము సాంసారికమైన లౌకికసుఖమును వాంఛించి మాత్రమే గిరీశముతో లేచిపోలేదు. గిరీశము ఏ ఉద్దేశముతో చెప్పినను ఈమె మాత్రము తన చెల్లెలు తనవలె కాకుండ సుఖపడవలయును అను భావముతోనే గిరీశముతో లేచిపోయినది. పరుల సౌఖ్యము నభిలషించి, తనకును సుఖము లభించు మార్గమును అనుసరించినది. తన సుఖము అవినీతియే కావచ్చును. కాని పరార్థమును సాధించు నుద్దేశముతో తా నవినీతికి పాల్పడినది. దానిని త్యాగముగానే గణించవలయును. శ్రీ అప్పారావుగారి చేతిలో క్రమోన్మీలనము చెందిన స్త్రీ పాత్ర బుచ్చమ్మ మాత్రమే.

లుబ్ధావధాని — ముందు అగ్నిహోత్రావధాని సంబంధము వద్దనుకొనినాడు. ఇంతలో అగ్నిహోత్రావధానివద్దనుండి (రామప్ప పంతులు వ్రాసిన) లేఖ వచ్చినది. అంత ఎగిరిపడినాడు లుబ్ధావధాని. తాను అగ్నిహోత్రావధాని సంబంధ మక్కరలే దనవచ్చును. అతడు తన సంబంధము వద్దనరాదు. విచిత్రమైన మనస్తత్త్వమది. అంతకుపూర్వ మక్కరలేని సంబంధ మా లేఖ వచ్చినతరువాత అదే కావలసివచ్చినది. తాను మాట తప్పవచ్చును. ఎదుటివాడు తప్పరాదు. ఇది అతని తత్త్వము. అంతకంటె తక్కువ ఖరీదునకు పిల్ల ఉన్నదని రామప్పపంతులు చెప్పగా అగ్నిహోత్రావధానిసంబంధము వదులుకొనుటకు సిద్ధపడినాడు. డబ్బు విషయము వచ్చినపుడు మాట నిలకడ గాదు. ఇదియు చిత్రమే. డబ్బు తక్కువగా వచ్చెడి ఆ సంబంధము కుదిరించవలసినదిగా లుబ్ధావధాని రామప్ప పంతులను కోరును. వాని వెంటబడును. రామప్ప పంతులు కుదిరించిన సంబంధమును అంగీకరించి అతను పెద్దిపాలెమునుండి తిరిగివచ్చు లోపలనే కరటకశాస్త్రి దురాలోచనమున తన స్వార్థము చూచుకొని లుబ్ధావధాని 'ఏకరాత్ర వివాహము' చేసికొనినాడు. ఆ భార్య పారిపోయి (శిష్యుడు) కానీ కేసుగా పరిణమించి విశాఖపట్టణము చేరిన లుబ్ధావధాని పశ్చాత్తాప రూపమున బాధపడును. 145 వ పుటలోని అతని స్వగతి ముదాత్తముగా నున్నది. శ్రీ అప్పారావుగా రుద్దేశించిన భావవ్యక్తీకరణము ఆ స్వగతిములో జరిగినది. సంఘమునందలి దురాచారము లన్నింటిలో కొన్నింటిని లుబ్ధావధానియందు నిరూపించుటవలన రూపకకర్త యీ పాత్రమును అద్వితీయముగా చిత్రించగలిగినాడు. లుబ్ధావధాని తన కూతు నొక ముసలివాని కమ్మినాడు. అది వితంతువై కానితిరుగులు తిరుగుచున్నది. అందుకు హేతువు తా నేనని లుబ్ధావధాని అంగీకరించి బాధపడును. తాను ముసలివాడైయుండి పెండ్లి ప్రయత్నము చేసి ఇంత యవమానమునపాలైనందుకు క్రుంగిపోవును. తన కూతును వితంతుశరణాలయమునకు పంపు స్థితికికూడ ఆ సమయమున అతడు దిగివచ్చినాడు. కాని లోని రక్తము ఛాందసమైనదగుటచేత "ఏమి చిత్రాలు వెధవలకి మతం కట్టారట! ఎన్నడూ వినలేదు. అమ్మిని వెళ్ళి ఆ మతం మానిపుంటాను" (పుట 145) అని వెనుక ముందుల కూసులాడి మాటాడును. శ్రీ అప్పారావుగారు తా మాశించిన ఉద్దేశములలో నొకటి రెండు మాత్రము లుబ్ధావధాని పాత్ర చిత్రణమున సాధించిరి. స్త్రీ పాత్రములలో బుచ్చమ్మకువలె పురుషపాత్రములలో లుబ్ధావధానికి ఉదాత్తత కల్పించినాడు రూపకకర్త. కన్యాశుల్క రూపకమున సానుభూతికి యోగ్యములైన పాత్రము లీ రెండుమాత్రమే.

వెంకటేశము — గిరీశము కృష్ణారాయపురము చేరుటకు హేతుభూతుడైనాడు. అతని ఉపన్యాసములు ఊకొట్టుట కుపయోగించినాడు.

మీనాక్షి—తాను తనయిష్టమువచ్చినట్లు తిరుగుచు తండ్రినికూడ గౌరవించుట తెలియని మూర్ఖురాలు. రామప్పపంతులు వెంబడిబడి పెండ్లి చేసికొమ్మని వీధినబడినది.

4. రచన - ఈ యంశము క్రింద అంకవిభజనమును గూర్చియు రసపోషణమును గూర్చియు వ్రాయుదును. నాటకము పరిపుష్టమై రక్తిగట్టుటకు ఐదుఅంకములు చాలునని గీర్వాణాలంకారికులును పాశ్చాత్య విమర్శకులను నిరూపించిరి. భారతీయులు నాటకము పది అంకములవరకు పెంచుకొనవచ్చుననిరి. ఐనను ఐదంకము లనునది నాటకము శక్తముగుటకు కావలసిన పంచసంధులను ఆధారముగా చేసికొని ప్రభవించినదే. నాటకమెన్ని అంకములుండినను పంచసంధులతోనే రక్తిగట్టును. పాశ్చాత్యులాశించిన *Initial Incident, Growth, Crisis, Denovement and Catas-*

*trophe* అను ఐదును నాటకమున నిరూపింపబడవలయును. ఐదంకములనుటలో ఒక్కొక్క అంకమున ఒక్కొక్కటి నిరూపింపబడవలయునని భావము. *"Some kind of Conflict is, however, the datum and very back-bone of a dramatic story"* అను ప్రాథమిక సిద్ధాంతమే కన్యాశుల్కమునకు వర్తించునపుడు పై విధముగా నుండు అంకవిభజనమును మన చూపింపరాదు. స్వల్పనియమములకు ఆంగ్ల పద్ధతులకు దిక్కులేదు గాని అధిక నియమవంతమైన భారతీయ రూపకపద్ధతి కిట తావెట్లు గలుగును? ఏది ఎట్లు చేసినను ప్రధాన కథ ప్రతి అంకముతోను, సంబంధము కలిగి యుండునట్లయినను రూపక కర్త చూచుకొనవలయును. కథ స్థలాంతరమునకు అనగా దూరదేశమునకు పోవునపుడు అంకవిభజన చేసికొన వచ్చును. కన్యాశుల్క కర్త ఆ పనిగూడ చేయలేదు. మొదటి రెండంకముల విభజనము పైదృష్టికి సమంజసము లే. మొదటిది విజయనగరములోని కథకు సంబంధించినది. రెండవది కృష్ణరాయపురమునకు సంబంధించినది. తృతీయాంకము రామచంద్ర పురాగ్రహారమున ప్రారంభమై కృష్ణరాయపురమున అంతమగును. చతుర్థాంకము కూడ రామచంద్రపురమున ప్రారంభమై కృష్ణరాయపురమున అంతమగును. పంచమాంకమంతయు రామచంద్రపురమున నే జరిగినది. షష్ఠాంకము రామచంద్రపురము చెఱువుగట్టున ప్రారంభమై విశాఖపట్టణమున అంతమైనది. సప్తమాంకమంతయు విశాఖపట్టణమున నే జరిగినది. సాభిప్రాయమైన అంకవిభజనము కాదిది. ఐదను పంచసంధులతో నిమిత్తము పెట్టుకొనని రూపకమును అంకవిభజనవిషయమున చర్చింపనక్కరలేదు.

రసవిషయమును గూర్చిన వివరణము:—ఈ రూపకమున హాస్యము రసము. "వికృతాకార వాగ్వేష చేష్టాదేః కుహకాద్భవేత్, హాస్యో హాసః స్థాయిభావః" అని విశ్వనాథకవిరాజును, "వాగంగాది వికార దర్శన జన్మా వికాసాఖ్యో హాసః" అని పండితరాయలును హాస్యమును నిర్వచించిరి. అనగా వికృతములైన ఆకార వాగ్వేష చేష్టలను చూచుటవలన కలిగిన చిత్త వికాసరూపమగు వృత్తి విశేషము హాస్యమనబడుచున్నది. ఇట వికృత శబ్దమున కర్థము ప్రకృతము కానిదనియే. *"At bottom, of course, humour is an elemental fact, indetendent of nationality; it derives from a sense of incongruity."(A. C. R)*. మిగిలిన రసములవలెగాక హాస్యము చాల కొద్దికాలములో స్థాయినందుకొని ఆనందమును కలిగించును. కొంచె మెక్కువైనచో జుగుప్సను కలిగించును. ఆకారము గాని, వాక్కు గాని, వేషము గాని, చేష్ట గాని పరిమితములైనపుడే హాస్యము రక్తిగట్టును. కన్యాశుల్కమున హాస్యము అధికము వాక్కువలన సాధింపబడినది. కొంత చేష్టవలన. చేష్టవలన సాధింపబడిన హాస్యముకంటె వాక్కువలన సాధింపబడిన హాస్యము శ్రేష్ఠము. కనుక స్థూలముగా ఈ రూపకమునందలి హాస్యము సముచితమనియే చెప్పవచ్చును. చేష్టలవలన అనగా రూపకమునందలి పాత్రముల చేష్టల వలన అని అర్థము. ప్రథమాంకమున పాత్రలు మంచము క్రిందకు దూరుట, తృతీయాంకమున ఆడవేషమున నున్న కరటకశాస్త్రి శిష్యుని చేష్టలు—ఇటవేషము గూడ, మధురవాణి రామప్ప పంతులుమీద సిరా బోయుట, చతుర్థాంకమున నీళ్లు బోయుట, రామప్ప పంతులు లేఖ చదువుచుండగా విరుగబడి నవ్వుట, పంచమాంకమున లుబ్ధావధాని నిద్రలో కాళ్లు చేతులు కొట్టుకొనుచు గోలచేయుట, సారాయిదుకాణము వెనుక తోటలోనివారి చేష్టలు ఇత్యాదులు హాస్యమును కలిగించునవియే. కాని వీటికంటె వాక్కువలన సాధించిన హాస్యము శక్తము. ఈ రూపకమున హాస్యము మూడు వంతులు గిరీశము వాక్కువలన కలుగుచున్నది. గిరీశము వాచికము మూడు వంతులు ఆంగ్లభాషలోనే. కనుక ఆంగ్లము వచ్చిన సామాజికు లానందించినంతగా రానివా రానందించలేరు. గిరీశము రంగస్థలముమీదకు పదికొండుసార్లు వచ్చును. సప్తమాంకము 172 వ పుటలోని మొదటి ప్రవేశము లెక్కలోనిది కాదు. రంగస్థలముమీదకు వచ్చిన ప్రతిసారి సగటున 50 ఆంగ్ల శబ్దములు వాడినవి వాడకుండ ఉపయోగించి వానిని తిరిగి తిరిగి కలుపుకొనును. మొత్తము కన్యాశుల్కమున 600 పైగా ఆంగ్ల శబ్దములు వాడబడినవి. ప్రథమాంకముననే ఒక్క గిరీశము దాదాపు 100 ఆంగ్లపదములను వాడినాడు. తెలుగుతో కలిపిన ఆంగ్లశబ్దముల వాడుకయే హాస్యము జనించుటకు హేతువగుచున్నది. ఇదియే వాగ్వికృతి. ఆంగ్లశబ్దములను తొలగించినచో రూపకము నిర్జీవమగును. తెనుగు రూపక దేహమునకు ప్రాణము ఆంగ్ల

శబ్దముగా చేసినాడు తత్కర్త. ఆంగ్లశబ్దముల వాసన లేకను హాస్యము గలిగిన తావులు లేకపోలేదు. ఇట్టి హాస్యము 14, 15, 24, 62, 119, 142 పుటలలోను ఇంకను మరికొన్ని స్థలములలోను గలదు. దీనికితోడు ఈరూపకమునందలి తెనుగు విశాఖజిల్లా మాండలిక మగుటవలన, అది తనకు సహజమైన ఒక 'యాస' వలన హాస్యమును పోషించుచున్నది. "నేను ఈ ప్రదర్శనాన్ని వాడుకభాషలో తోడిగాను. ఏమంటే, ప్రజాబాహుళ్యానికి గ్రాంథికభాషకంటె ఇదే సులభతరగ్రాహ్యం గనకనున్నూ, తెలుగులో హాస్యరచనకి ఇటువంటిపదజాలం అనువైనదని నా నిశ్చితం గనుకనున్నూ" అని గురజాడవారి ఆంగ్లము లోని ఉపోద్ఘాతమును శ్రీ భమిడిపాటివారు తెనుగు చేసినారు. దీనినిబట్టి కన్యాశుల్కమున వాడబడిన భాష వాడుకలోనున్నదే అని తెలియుచున్నది. వాడుక ఒక్కొక్క ప్రాంతమున నొక్కొకవిధముగా నుండును. ఈ రూపకమునందలి భాష విశాఖజిల్లాలో వాడుకలో నున్నది. గురజాడవారికాలమున విశాఖ జిల్లా వాడుకభాష ఇంత ఆంగ్లభాషా ఛాయిష్టమై యుండెడిదేమో నాకు తెలియదు. అసగా వాటి వారు — ప్రజాబాహుళ్యము గ్రాంథికభాష నర్థము చేసికొనలేనిస్థితిలోను ఆంగ్లము నర్థము చేసికొను పరిస్థితిలోను ఉండెడివారని మనమూహించ వచ్చును. ఐనను సమంజసముకాని యూహ ఇది. గ్రాంథికాంధ్ర మర్థము కాదని మనమంగీకరించినను విదేశీయమైన ఆంగ్లము, ప్రజాబాహుళ్యమునకు సులభ తర గ్రాహ్యమనుట పొసగని విషయము. ధర్మవరం రామకృష్ణమాచార్యుల వారాకాలమువారే గదా. వారి చిత్రనళీయముకంటె, విషాద సారంగధరమునకంటె ప్రజాబాహుళ్యమును కన్యాశుల్క మాకర్షించినదా? ధర్మవరమువారి రూపకములు గ్రాంథికాంధ్రమున నున్నవిగదా—? గయోపాఖ్యానమునకంటె ఎక్కువ కన్యాశుల్కప్రతు లమ్ముడుపోయినవా? కన్యాశుల్కము విశాఖవారికి, ఆంగ్లభాషాజ్ఞానముగలవారికి వినోదమును మాత్రమే కలిగింపగలిగినది. పట్టణములను వదలినచో పల్లెలలో కన్యాశుల్కము జీవించలేదు. కారణ మచటివారి కాంగ్లభాషాజ్ఞానముండదు. ఏది యెట్లయినను 'ఆంగ్లశబ్దములు వాడబడనిచో కన్యాశుల్కము హాస్యరూపకముగూడ ఐయుండెడిదిగాదు.

రూపకమునకు ప్రదర్శనయోగ్యతయు ఒక గుణము. ఉత్తమరూపకమున సాహితీగౌరవమును, ప్రదర్శనయోగ్యతయు రెండును నుండును. ఏది లోపించినను రూపకముయొక్క ఉత్తమత్వము లోపించినట్లే. కాని విమర్శకులు కొందరు సాహితీ గౌరవము నధికముగా వాంఛింతురు. కన్యాశుల్కరూపక మంతయు ప్రదర్శన యోగ్యముగా లేదు. ఈ విషయము నాకు అనుభవపూర్వకముగ తెలియును. నేను రూపకమున అగ్నిహోత్రావధానిపాత్రము నిర్వహించి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుని బహుమతిని గూడ పొందితిని. కథ ఒక సూత్రము ననుసరించి సాగకపోవుటచేత అనవసరములనుతొలగింపవలయును. నేను మొదట కథకుసంబంధించనివిగా నిరూపించినవి ఈ రూపకమును ప్రదర్శించు ప్రతివారు తొలగింప వలసినవే. ఆంధ్ర విశ్వవిద్యాలయ రజతోత్సవ సందర్భమున జరిగిన స్నాతకోత్సవమునాడు (1952-53) విశ్వవిద్యాలయమున ఈ రూపకమును మేము ప్రదర్శించితిమి. అంతరంగస్థలము అన్ని పరికరములు ఉన్న మాకే రూపకమంతయు ఆడుటకు వీలుపడినది గాదు. ఏమనగా సారాయి దుకాణము వెనుకనున్న తోటను రంగస్థలముమీద ప్రదర్శించుట యెట్లు? అట్టిదే పేకాట—పైగా ప్రధాన కథకు సంబంధించినవి గావు. అందువలన రూపకమున ప్రధాన కథను విడువక యెంత తగ్గించుకొనుటకు వీలగునో అంతవరకు తగ్గించుకొని ప్రదర్శించితిమి. అప్పటికిని రెండు గంటలకుపైన పట్టినది కాలము. గంభీరమును, ఉదాత్తమైన రూపకము కాకపోవుటవలన నవ్వుకొనుచు జనము రూపకము పూర్తియగువరకు చాల నుండి యుండిరి. మే మాలింగన చుంబనాదులు విసర్జించితిమి. ఎవరైనను అట్లే చేయవలయును. ప్రదర్శనమున కీ రూపకమున తీసివేత చాల అవసరము. లేకపోయినచో తీర్థమునకు తీర్థము, ప్రసాదమునకు ప్రసాదము అగును. అనగా వాఙ్మయమున దీని కెంత స్థానమున్నదో ప్రదర్శన యోగ్యతయు అంతే గలదు. ఈ రూపక మెప్పుడాడబడినను పట్టణములలోనేగాని పల్లెలలో ఆడబడినట్లు నాకు తెలియదు. వారు దీనిని ఆడలేరు. చూచి ఆనందింపనులేరు. దీని కాలంక మేమనిన భాష. ప్రదర్శనమును చూచినప్పటికంటె రూపకమును చదువుకొనినపుడు నాటి సాంఘికమైన వ్యవస్థ బాగుగా బోధపడును.

శ్రీ అప్పారావుగారు, సాంఘికమైన ఇతివృత్తమును గ్రహించి, వ్యావహారిక భాషలో (విశాఖ మాండలికము) హాస్యమును సృష్టించుచు, సంఘసంస్కరణాభిలాషతో ఒక రూపకమును వ్రాయుటకు యత్నించగా కన్యాశుల్కము తయారైనది. కర్త రూపక నిర్మాణమున సిద్ధహస్తుడు కాకపోవుటవలన, ఇతివృత్త గ్రథనమునను, సన్నివేశ కల్పనమునను, పాత్ర చిత్రణమునను అవకతవకలనివార్యములైనవి. రూపకకర్త తాను చెప్పదలచుకొనిన విషయమును చెప్పలేకపోయినాడు. అవకతవక అనుగుణము హాస్యమునకు దోహదమిచ్చినది యగుటవలనను, రూపకకర్త హాస్యమును సృష్టించుటవలనను కన్యాశుల్కము, చూచిగాని, చదివిగాని నవ్వుకొనుటకు మాత్రము వీలైనది

"*A play in which the element of conflict is slight will always be found defective as a play, however great its other merits may be*" (*W.H.H.*) అను పాశ్చాత్యాభిప్రాయముతో గాని, మహోదాత్త రసభావనిరంతరమైన వస్తువును రూపకమున గ్రథించవలయునను ప్రాచ్యుల మతములో గాని మనకు తాదాత్మ్యము కుదురనిచో, అనగా వారి అభిప్రాయములు మన కర్థము గాక గాని, ఐనను అనుసరించుటకు అంగీకరించకుండుట గాని జరిగినచో, కన్యాశుల్కము మహానాటకముగా మనకు ప్రత్యక్షమగును. రూపకము వ్యావహారిక భాషలో వ్రాసినంత మాత్రమున గొప్పది కాజాలదు. ఏ భాషలో వ్రాసినను కావలసినది చెప్పదలచుకొనిన భావమునకు పోషకమైన నిబిడమగు ఇతివృత్తమును స్వీకరించుట, అసందర్భముల పొంతకు పోకుండ సన్నివేశముల నేర్పాటు చేయుట, పాత్రములను క్రమోన్మీలనము గావించుట, ముఖ్యములు. రూపకకర్త వీటివిషయమై జాగ్రత వహించవలయును. శ్రీ అప్పారావుగారు తానొక మార్గము నేర్పరచదలచి, సాంఘికేతివృత్తమును స్వీకరించుట, వ్యావహారిక భాషను వాడుట ముదావహమే. కాని గ్రహించుటలో లేదు గొప్పదనము నిర్వహించుటలో నున్నది. ప్రతివాడును ఏదో ఒకటి గ్రహించవచ్చును. ఉదాత్తముగా ప్రతిభాసమన్వితుడు మాత్రమే నిర్వహించగలడు. నవ్యమును సృష్టించుటకు యత్నించినందులకు వారికి నమస్కారము. వారు కృతార్థులుమాత్రము కాలేదు. వారియందు మన కున్న విశేషాభిప్రాయమును బట్టి "మహాకవి, యుగకర్త, ఆంధ్రసారస్వతసామ్రాట్" ఇత్యాది బిరుదములనీయవచ్చును. ఈ రూపకమునను సరించి అవి సార్థకములు కావు. శ్రీ అప్పారావుగారు కవిత్వము గూడ వ్రాసినారుగదా, దానివలన ఆ బిరుదములు సార్థకములగునేమో యని కొందరూహించవచ్చును. దానివిషయమునను కావు. మరొకసారి శ్రీ అప్పారావుగారి కవిత్వమునుగూర్చి వ్రాయుదును. అప్పుడావిషయమును వివరింతును. ఎవరినిగాని పొగడవలసిన అవసరముగాని తెగడవలసినస్థితిగాని మనకు లేదు. ఉండరాదు. రాగద్వేషములకు లోనుగాక గౌరవభావముతో ప్రతి పుస్తకమును చదువవలయును; సత్యమును వీలైనంతవరకు తార్కికముగా నిరూపించవలయును. ఈ విషయమున నే నెంతవరకు కృతార్థుడనైతినో నా యీ వ్యాసమే నిదర్శనము — మొదట కన్యాశుల్కము ప్రహసనముగా చేర్కొని నాటకమునువలె విమర్శ జరిగినదేమని కొందరకు సందేహము కలుగవచ్చును. అంకవిషయమున గాని, ముఖ నిర్వహణ సంధుల విషయమున గాని కన్యాశుల్కము ప్రహసనమువలె లేదు. ఇతివృత్తము విస్తరముగా నుండుటవలన విమర్శ నింతగా సాగినది గాని మరొకటి గాదు. నాటకముగా దీని గ్రహించి విమర్శించుటకు పూనుకొనినచో ఆరంభ ప్రయత్నాది పంచావస్థలు, ముఖ ప్రతిముఖాది పంచసంధులు, బీజబింద్వాది అర్థప్రకృతులు ప్రసక్తము లయ్యెడివి. వీటిని వదలి ఉచితానుచిత వివక్షతో నే విమర్శ సాగినది.

# పృథ్వీపుత్రులు

శ్రీ అంగర సూర్యారావు

## పాత్రలు

| | |
|---|---|
| మల్లయ్య | ఎల్లయ్య |
| కామరాజు | సుబ్బయ్య |
| వెంకయ్య | రత్నావతి |
| సీతారాం | రాధ |
| గౌరీపతి | |

### రంగము : 1

* స్థలం: కామరాజు యింటి ఆవరణ. సమయం: రాత్రి 11 గంటలు. చెట్లు, రకరకాల పూల మొక్కలు గాలికి కదులుతూ వుంటాయి. దూరాన్నుంచి వచ్చే ఎలక్ట్రిక్ దీపపుకాంతి చెట్లమీద పడుతోంది. గాలికి కదిలే ఆకుల సవ్వడి తప్ప ప్రకృతి నిశ్శబ్దంగావుంది. మల్లయ్య, ఎల్లయ్య చెట్లక్రీనీడలోంచి అడుగుల సవ్వడి కాకుండా—వెనకకూ ముందుకూ బెదురు చూపులు చూస్తూ—ప్రవేశిస్తారు. యిద్దరూ దృఢకాయులు. వయస్సు 40 సంవత్సరాలు. గుండ్రని పెద్దముఖాలు; బొద్దుమీసాలు; కండలు తిరిగిన దండలు. కళ్ళలో జుత్తు పడకుండా వుండేందుకు యిద్దరూ తలలకు నల్లటి గుడ్డలు కట్టుకున్నారు. ఆ సమయంలో వాళ్ళను ఎవరైనా చూస్తే యమదూత లనుకుంటారు.

మల్లయ్య : ఇంకా యింట్లోవాళ్లు నిద్రపోయినట్టు లేదురా ఎల్లయ్యా!

ఎల్లయ్య : ఒరేయి మల్లయ్యా! యీ కాలపు మనుషులు—అందులోనూ డబ్బున్న వాళ్ళున్నారు చూశావ్రా—వాళ్ళు రాత్రుళ్లంతా పేకాట కబ్బుల్లోను, సినిమాల్లోను తిరిగి తిరిగి అర్థరాత్రి యేళ యిళ్ళకొస్తారు. పగలంతా మస్తుగా తిని నిద్రపోయి రాత్రంతా మెలుకువగా వుంటారు.

మల్ల : అందుకేరా మన తాతలనాటి రోజులకంటే యీ రోజుల్లో దొంగతనం చెయ్యడం కత్తిమీద సాములాంటిది.

ఎల్ల : ఆ కాలపు మనుషులు రాత్రి 9 గంటలకే నిద్రపోయేవారు.

మల్ల : అందులోను ఆ కాలంలో ఎలట్రి దీపాలు లేవు. మన పూర్వీకులు చీకటిళ్లల్లో తేలిగ్గా దూరి సొమ్మెత్తుకు పోతూవుండేవారు—ఈ రోజుల్లో ఏముంది? చీకటి గది కదా అని మనం దూరగానే, యింటి యజమాని టుప్పున మీట నొక్కగానే ఎలట్రీ దీపం ఎలిగిపోతాది; మనం దొరికిపోతాం.

ఎల్ల : అంతే కాదురా! ఆ రోజుల్లో దొంగలు పడ్డారు మొర్రో అని ఎంత అరిచినా—మనకి జడిసి—ఎవళ్లా వచ్చేవాళ్లు కాదు. ఇప్పుడేముంది? యీలేస్తే పోలీసొస్తారు. యింటి యజమాని ఫోనులో మాటాడితే సిపాయీలు తుపాకీలు పట్టుకుని వస్తారు.

మల్ల : అయినా మనం జడిసిపోడంలేదు. యిన్ని కట్టుదిట్టాలున్నా మనం జయంగా సొమ్మెత్తుకు పోతున్నాం. (ఉత్సాహంతో) ఒరేయ్ ఎల్లయ్యా యీ రోజుల్లో మన తాతలుంటే మన తెలివికి ఎంత సంతోషించేవోరురా!

ఎల్ల : (నిస్పృహతో) ఏం సంతోషంరా ఎర్రిబుల్లిబాబు! మన తాత ముత్తాతలు ఎన్నిసార్లో కన్నాలేశారు. అయినా జెయిళ్లంటే ఎలాగుంటాయో ఆళ్లకు తెలియదు. మనం సూడు! అప్పుడే మూడుసార్లు జెయిలుకెళ్లొచ్చాం.

మల్ల : ఒరేయి ఎల్లయ్యా! నా కెన్నాళ్లనుంచో ఓ సందేహం వుందిరా!

ఎల్ల : ఏంటిరా అది?

మల్ల : మనం యిన్నేళ్లనుంచి దోపిడీలు సేస్తన్నాంగందా మన దగ్గిర సుడ్డిగవ్వయినా నిలవలేదేంరా?

ఎల్ల : (తేలిగ్గా నవ్వి) ఓస్ ఆమాత్రం తెలియదట్రా! మనకి యీశ్వరుడి శాపం వుందంట! ఎంత సొమ్మొచ్చినా, తినేసి తిరిగేసి ఖర్చు పెట్టెయ్యాలంట! అందులో దమ్మిడీ మిగిలించినా పాపమంట!

మల్ల : నాకీ శాపాలమీద, పాపాలమీద నమ్మకం లేదురా! అయినా యింక యీ దొంగబతుకు వదిలిపెట్టకపోతే లాబంలేదురా!

ఎల్ల : ఒరేయి మల్లయ్యా! మనం యిద్దరం జంటగా ఎన్నో దొంగతనాలు సేశాం. జైళ్లకెళ్లాం. తాపులు తిన్నాం. బుర్రలు బద్దలుకొట్టించుకున్నాం.

మల్ల : పసువులకంటే హీనంగా బతికాం.

ఎల్ల : పోయినతడవ జైలునుంచి వస్తా—యింకెప్పుడూ దొంగతనాలు సెయ్యకూడదని—దారిలో ప్రమాణకాలు సేసుకున్నాం.

మల్ల : అయినా యివేళ దొంగతనానికి తిరిగి బయలుకేరాం.

ఎల్ల : నిజంగా బుద్ధిపూర్వకంగా దొంగతనం సెయ్యాలని మనకి లేదురా! మనసేత రోజులలా సేయిస్తున్నాయిరా! బాబూ! (విషాద దృక్కులతో మల్లయ్యను చూస్తాడు.)

మల్ల : ఇదంతా మన కర్మం గాకపోతే నీ పిల్లానికి యిప్పుడే జబ్బు రావాలంటరా?

ఎల్ల : (విచారంతో) అది బతుకుతాదో లేదో సెప్పలేమురా! అదిగాని సచ్చిపోతే నలుగురు పిల్లల్ని తీసుకుని నేనే నూతిలో పడాలిరా మల్లయ్యా! (కళ్లు తుడుచుకుంటాడు.)

మల్ల : ఇసారించకురా! మనం ఏం సెయ్యగలం! ఆ బగమంతుడిమీద బారం వేసి వూరుకుందాం. డాక్టరేమన్నాడు?

ఎల్ల : పదివొందలైనా ఖర్చుసేసి మందు వేయించకపోతే బతకదన్నాడురా!

మల్ల : ఈ పెపంచకంలో మనలాంటి బీదోళ్ళం వున్నాం సూశావూ—కాలూ సెయ్యి వొంగకుండా వున్నంతకాలమే మనుషులం. ఆ తర్వాత పసువులకంటే కనాకష్టం.

ఎల్ల : ఆ బగవంతుడు దొంగోళ్ళకుకూడా పిల్లల్ని ఎందుకిచ్చేడో?

మల్ల : అసలా దేవుడు దొంగోళ్ళని ఎందుకు పుట్టించేడో?

ఎల్ల : (కుడివైపు చూస్తా ఆత్రుతతో) ఒరేయి మనుషు లొస్తున్నారురా! జాగర్త! సెట్లవెనక్కి పదు!

[ఇద్దరూ తొందరగా చెట్లవెనక దాక్కుంటారు. కొమరాజు ప్రవేశిస్తాడు. అతని వెనుక సుబ్బయ్య, వెంకయ్య కర్రలు పట్టుకొని వినయంగా మాట్లాడుతూ కుడివైపునుంచి ప్రవేశిస్తారు. కొమరాజు వయస్సు 30 ఏళ్లు వున్నా 25 ఏళ్ళ యువకునిలా కనిపిస్తాడు. సన్నగా పొడవుగా వుంటాడు. సిల్కు చొక్కా; గ్లాస్కో పంచె; పొగ్గా కత్తిరించిన మీసాలు; వేళ్లకు ఉంగరాలు; చేతికి రిస్టువాచీ నవనాగరికుడివలె బాగా డబ్బున్నవాడిలా కనిపిస్తాడు.]

కామరాజు: ఒరేయి సుబ్బయ్యా! మొన్న నీకు చెప్పాను మాకావూ జీవాలయం పక్క యింట్లో ఒక అమ్మాయి వుందని.

సుబ్బయ్య: మేమూ చూసొచ్చామండి! చాలా అందంగా వుందండి ఆ పిల్ల. ఏరా ఎంకయ్యా?

వెంకయ్య: ఓ! సక్కగా సందమామలా వుందండి!

సుబ్బ : ఆ పిల్ల సచ్చిపోయిన నర్సింహంగారి అమ్మాయంటండి!

వెంక : ఇంతకాలం అల్లి సిన్నాన్న పెంచేడంటండి. పాపం! ఆ సిన్నాన్న కూడా సచ్చిపోతే ఆపిల్ల అన్నగార్ల దగ్గిరికి వచ్చేసిందంట. (సుబ్బయ్యకేసి తిరిగి) అంతే కాదట్రా సుబ్బయ్యా!

సుబ్బ : అల్లంతా మంచి కష్టాలలో వున్నారండి. ఈ సమయంలో గాని మీరు తలుసుకున్నారంటే ఆ పిల్ల యిట్టే దొరికిపోతాదండి.

కామ : (సంతోషంతో) మీలాంటి నమ్మకమైన నౌకర్లు దొరికినందుకు నేను చాలా సంతోషిస్తున్నానురా! మీ రిద్దరూ సమాచారం చాలావరకూ సేకరించుకు వచ్చారు.

సుబ్బ : (ఉత్సాహంలో) మరోవారం రోజులలో అంతా సెటిల్ సేసెయ్యకపోతే నా పేరు సుబ్బయ్యే కాదండి!

కామ : నువ్వేం శ్రమపడనక్కరలేదురా! నేనే స్వయంగా అంతా సెటిల్ చేసుకువచ్చాను.

సుబ్బ : (నిరుత్సాహంతో) అలాగంటండి!

వెంక : ఎలాగైనా బాబుగారు తలుసుకున్నారంటే వదిలెయ్యరు.

కామ : ఆ అమ్మాయి పేరు రాధ. ఈవేళ ఉదయం ఒక స్నేహితుడి యింటిలో కలుసుకున్నాను. ఆ స్నేహితుడి చెల్లెలు, యీమె చిన్నప్పుడు చదువుకున్నారట. స్నేహితుడి చెల్లెలికి యీవేళ పుట్టినరోజు. టీపార్టీ జరిగింది. ఆ టీపార్టీలో రాధను కలుసుకున్నాను. జంకూ గొంకూ లేకుండా నాతో మాట్లాడింది. ఫర్వాలేదు కదా అని నా కారులో బీచికి రమ్మన్నాను. రాదేమో అనుకున్నాను. కాని నిస్సంకోచంగా కారులో నా ప్రక్కను కూర్చుంది. కారును క్షణంలో బీచిరోడ్డువైపు మళ్ళించాను.

సుబ్బ : (సంతోషంతో) సెబాష్! యింకనేం! బాబుగారి రొట్టె నేతిలో పడింది.

కామ : నేతిలో పడితే సంతోషిద్దుం—కాని అది వెళ్ళి సముద్రపు ఉప్పునీళ్ళలో పడింది.

సుబ్బ }
వెంక } : (నిరుత్సాహంతో ఒక్కసారిగా) అదేం బాబూ?

కామ : పిలిచినవెంటనే బీచికి వచ్చింది గనక నన్ను తప్పకుండా ప్రేమించి వుంటుందని అపోహ పడ్డాను.

సుబ్బ : ఏం బాబూ? మీరంటే యిష్టం లేదా?

వెంక : ఎదురుతిరిగిందా బాబూ?

కామ : నామీద మక్కువ వుందని తలచి ఆమెకు నా ప్రేమను తెలియజేశాను.

సుబ్బ : (ఆత్రుతతో) చిత్రం! అప్పుడేమందండి?

కామ : మీకు యింతవరకూ పెళ్ళికాలేదా అని అమాంతంగా ప్రశ్నించింది.

వెంక : తమరేం జవాబు సెప్పేరు?

కామ : (తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ) ఇటువంటి ప్రశ్న వేసిందేమిటిరా దేవుడా అని మొదట కంగారుపడ్డాను. నాకు పెళ్ళి అయ్యిందని, యిద్దరు పిల్లలుకూడా వున్నారని తెలిస్తే ఆమె నన్ను తప్పకుండా దూరంగా వుంచుతుందని వూహించాను. వెంటనే నాకు పెళ్లికాలేదని తిరుగులేని అబద్ధం చెప్పేశాను.

సుబ్బ : అప్పటికైనా తమ ప్రేమను ఒప్పుకుందా బాబూ?

కామ : ఒప్పుకుంటే యింక కావలసింది యేముందిరా? యిదెక్కడో కొరకరాని కొయ్యలావుంది. (అసలు విషయంలోకి వస్తూ) యిదంతా మీకు ఎందుకు చెబుతున్నానో తెలిసిందా? రేపటినుంచి మిమ్మల్నిద్దరినీ రాధ దగ్గరకు పంపిస్తూ వుంటాను. మీరు పొరబాటునైనా నాకు పెళ్ళి అయ్యిందని, పిల్లలున్నారని

ఆమెతో చెప్పారా మిమ్మల్ని ఉద్యోగంలోంచి అమాంతం తీసేస్తాను. జాగ్రత్త!

వెంక : మా కొంప(?) తెలియదటండీ బాబుగారూ!

సుబ్బ : ఇంతకూ వ్యవహారం ఏమీ కుదరలేదన్నమాట!

కామ : (చిరాగ్గా) లేదురా! బాబూ! లేదు! పెళ్లి చేసుకోమని అడుగుదామని ఆమె ఉద్దేశ్యం.. కాని నన్ను అడగదు. నాచేతే అడిగించాలని ఆమె ఉద్దేశం. ఎక్కడో చెరజాణలా వుంది!

సుబ్బ : గట్టి పిచ్చే తెచ్చిపెట్టిందే! మళ్ళీ పెళ్లెలా చేసుకుంటారు?

కామ : రాధను చూచినప్పటినుంచీ నామనసు మారిపోయిందిరా సుబ్బయ్యా! ఇక తప్పనిసరి అయితే ఆమెను పెళ్లిచేసుకుంటాను.

సుబ్బ : (భయంతో) అమ్మయ్యో! అమ్మగారుండగానే!

స్త్రీకంఠం : (సరిగా యీమాట అనే సమయంలో లోపలనుంచి) ఒరేయి సుబ్బయ్యా! బాబుగారింకా రాలేదూ?

సుబ్బ : (భయంతో) వచ్చేరమ్మా!

కామ : (భయంతో) ఇంకా అమ్మగారు నిద్రపోలేదటరా? (ఎడమవైపు చూస్తూ) కొంప మునిగింది. వస్తోంది. ఇక ప్రారంభిస్తుంది గొడవ!

(ఎడమవైపునుంచి రత్నావతి ప్రవేశిస్తుంది. వయస్సు 25 సంవత్సరాలు. ముఖం చూడగానే చాలా నెమ్మదైన మనిషనిపిస్తుంది. మెడలో విలువైన ఆభరణాలు వుంటాయి.)

రత్నావతి: అర్ధరాత్రి వేళకూడా యిల్లు చేరుకోకపోతే ఎలాగండి? లంకంత కొంపలో నేనొక్కతెనూ ఎలా వుండగలను చెప్పండి? (సుబ్బయ్య వెంకయ్యలతో) మీ రిద్దరూ వెళ్ళి గేటుదగ్గర పడుకోండి. [illegible] దొంగ లెక్కువగా తిరుగుతున్నారట. జాగ్రత్త!

సుబ్బ : మనయింట్లో అడుగు పెట్టినతరవాత దొంగోడు బతికి బయటపడతాడనుకోకండి!

వెంక : మేం వున్నంతకాలం మీకు అలాంటి భయం లేదు(?). పోయి పడుకోండి అమ్మగారూ! (సుబ్బయ్య, వెంకయ్య కుడివైపు వెళ్ళిపోతారు.)

రత్నా : (వాళ్లు పోతున్నవైపు చూస్తూ) మీకు తగిన నౌకర్లే దొరికారు. బాబుగారు యింకా రాలేదు పిలుచుకురండిరా అంటే—కాలు కదపకుండానే జవాబు చెప్తారు. మీకు యింత వయస్సు వచ్చినా యిద్దరు పిల్లల్ని కన్నా మీలో చిన్నతనపు చేష్టలు కొంచెంకూడా తగ్గలేదు.

కామ : (విసుగ్గా) అయితే నేనేం చేస్తున్నానంటావ్?

రత్నా : ఏం చేస్తున్నారు! పగలంతా క్లబ్బులలో డబ్బు తగలేస్తున్నారు. రాత్రులంతా అ[illegible] వాళ్లను వెంటబెట్టుకొని తిరగరాని చోట్లలో తిరుగుతున్నారు. మీరు ఎంతకాలానికి దా[illegible]లోకి వస్తారో తెలియడంలేదు.

కామ : చూడు రత్నం! నువ్వు అనవసరంగా మనసు పాడుచేసుకుంటున్నావు. నన్ను గురించి లేనిపోని విషయాలన్నీ వూహించి బాధపడుతున్నావ్.

రత్నా : (కోపంతో) మీరంటే కిట్టక మీమీద అబద్ధాలు చెబుతున్నానంటారా? మీరు కని[illegible] వల్లికి నెక్లేసు బహుమతి యివ్వడం అబద్ధమా? ఆమెతో సీ-చిలో తిరగడం అబద్ధమా? (విచారంతో) ఆ కళ్లు తెరవని పసిపిల్లల ముఖం చూసి అయినా కొంచెం బుద్ధిగా మసలండి!

కామ : (కోపంతో) ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు?

రత్నా : మీరేం చెయ్యనక్కర్లేదు. భగవంతుడు మీకు కావలసినంత ఐశ్వర్యాన్ని యిచ్చాడు. రత్నాలవంటి పిల్లల్ని యిద్దరి ప్రసాదించాడు. కాలు కదపకుండా సుఖంగా, హాయిగా మిమ్మల్ని యింట్లో వుండమనే నేను కోరేది.

కామ : సరదాలు తీర్చుకోకుండా, స్నేహితులతో తిరగకుండా ఖైదీలా ఎప్పుడూ యింట్లో కూర్చుంటావా?

రత్న : ఇంట్లో వుండడం మీకు యిష్టంలేకపోతే బయట తిరిగినా చెడ్డవాళ్ళ సావాసం చెయ్యకుండా వేళకు ఇల్లుచేరుకుంటే చాలు నేను సంతోషిస్తాను.

కామ : (హేళనగా) గొప్పపని చేస్తావు! నువ్వు సంతోషించకపోతే నా కొంప మునిగిపోతుంది కాబోలు!

రత్న : కట్టుకున్న యిల్లాలి కన్నీటిబిందువు ఏ యింట్లో రాలుతుందో ఆ యింట్లో సుఖ సౌభాగ్యాలు వుండవు. ఈ విషయం మీరు బాగా తెలుసుకోవాలి!

కామ : నీదగ్గర ధర్మపన్నాలు నేర్చుకోవలసినంత అజ్ఞానిని కానులే.

రత్న : స్త్రీ, త్రాగుడు, జూదం యివన్నీ—విజ్ఞానికి వుండవలసిన లక్షణాలు అనుకుంటాను!

కామ : (కోపంతో) యిక నీ అధిక ప్రసంగం కట్టిపెట్టు! యింతవరకూ నువ్వేమన్నా సహిస్తూ వచ్చాను. దేనికైనా హద్దువుంది.

రత్న : అదే! నేను చెప్పేదీని! దేనికైనా హద్దువుండాలి. మీరు ఎలా తిరిగినా వేళకు యిల్లు చేరుకుని కొంతసేపైనా పిల్లలతో, నాతో సంతోషంగా కాలం గడిపితే చాలు. సంతోషిస్తాను. పెద్ద కుర్రాడికి నాలుగేళ్ల వయసు వచ్చింది. వాడిని ఒక్కసారైనా మీతో బయటకు తీసుకువెళ్లారా? వాడు మీతో వస్తానని ఎన్నిసార్లు ఏడ్చాడు? (క్షణం ఆగి) అవును! మీతో ఎలా తీసుకువెడతారు! వాడు మీతో వుంటే మీ పనులన్నిటికీ అడ్డుకదూ?

కామ : (విసుగ్గా) అబ్బబ్బ! అర్ధరాత్రి అయినా యింకా నీ పోరు నాకు తప్పదనుకుంటాను.

రత్న : (కళ్లు తుడుచుకుంటూ) నన్ను భగవంతుడు వేగం తీసుకుపోతే నా పోరు మీకు శాశ్వతంగా తప్పిపోతుంది.

కామ : (నిస్పృహతో) హరి భగవంతుడా! మాట మాటకు చావును కోరుకునే దుర్బలత్వాన్ని స్త్రీలలో ఎందుకు సృష్టించావురా?

రత్న : అసలు భగవంతుడు స్త్రీలను—కాలు కదపకుండా, నోరు మెదపకుండా—ఒకచోట పడివుండే పనికిమాలిన వాళ్లగా సృష్టించాడు. యీ అనర్థకాలన్నిటికీ అదే మూల కారణం!

కామ : (ప్రసంగాన్ని మార్చే ధోరణిలో) పిల్లలు నిద్రపోయారా?

రత్న : నిద్రపోక ఏం చేస్తారు? యిదివరకు మీకోసం చూసేవారు. యిప్పుడు వాళ్లకూ అలవాటు తప్పిపోయింది.

కామ : అదీ మంచిదే!

రత్న : మీకు అన్నీ మంచివే! రేపు ఏ దొంగలో వచ్చి పిల్లలగొంతూ నా గొంతూ నులిమి పారేస్తే మీకు యింకా మంచిది. మీ అడ్డు పూర్తిగా వదిలిపోతుంది. అప్పుడు మీరు స్వేచ్ఛగా తిరగవచ్చు.

కామ : (కోపంతో) యిక నీ వాగుడుకు అంతు వుండదనుకుంటాను. (నిస్పృహతో) ఎంత ఐశ్వర్యం వున్నా నా ప్రాణానికి సుఖం లేదురా భగవంతుడా!

రత్న : ఐశ్వర్యం వున్నకొలాన్నే మన ప్రాణానికి సుఖం లేదనిపిస్తోంది నాకు. చూడండి! ఈ లోకంలో కోటాను కోట్ల దరిద్రులున్నారు. వాళ్లు భూమిమీద పుట్టి, ఏ చెట్టు నీడలోనో పెరిగి పెద్దవాళ్లవుతున్నారు. కష్టపడి చెమటోడ్చి పెళ్ళాం పిల్లలను పోషించుకుంటున్నారు. వాళ్లతో పోల్చి చూసుకుంటే వాళ్లుపొందే ఆనందంలో నూరవ వంతైనా మనకు లేదనిపిస్తోంది.

కామ : (నిరసనగా) దరిద్రుల కొంపలోంచి వచ్చినందుకు నీ దరిద్రనగొట్టు బుద్ధి ఎక్కడకు పోతుంది?

రత్న : మీరు నిరసనగా వుండవచ్చు. కాని నేను దరిద్రుల యింట్లో పుట్టినందుకు గర్విస్తున్నాను. నేను నిరుపేదల యింటినుంచి వచ్చినందువల్లనే నాలో జాలి, కరుణ మొదలైన సద్గుణాలు శాశ్వతంగా నిలిచివున్నాయని నమ్ముతున్నాను—మీరు ధనవంతులు గనక మీ యింట్లోవుంటే నేను శాశ్వతంగా

సుఖపడతానన్నే ఆశతో మా నాన్న తన రక్తమాంసాలు ధారపోసి—కోరిన కట్నం యిచ్చి—నన్ను మీకు పెళ్ళిచేశాడు. తన అంచనా పూర్తిగా తప్పినందుకు—ఆయన బ్రతికి వుంటే—యిప్పుడెంత దుఃఖించే వాడో! (పైట చెంగుతో కళ్లు తుడుచుకుంటుంది.)

కామ : (రాజీధోరణిలో) ఇప్పుడెందుకు ఆ గడిచిపోయిన గాథలన్నీ తవ్వుకుని బాధపడడం! అర్ధరాత్రి గడచిపోయింది. రా! లోపలికి పోదాం. (ఆమె చెయ్యిపట్టుకొని ఆమెతో ఎడమవైపుగా నిష్క్రమిస్తాడు—మల్లయ్య ఎల్లయ్య చెట్ల వెనకనుంచి తిరిగి ప్రవేశిస్తారు.)

మల్ల : డబ్బున్న వాళ్లు సుఖంగా వుంటారనుకోడమే గాని ఆళ్ల బతుకంతా గోలేరా!

ఎల్ల : అసలు డబ్బున్న వాళ్ళ ప్రపంచకమే వేరురా! అన్నంలేక మనం అగోరిస్తా వుంటే తిన్నది అరగక ఆళ్లు బాధపడతన్నారు.

మల్ల : వీళ్ళ సొత్తులో కొంత మనం ఎత్తుకుపోతే వీళ్లకు ఉపకారం సేసినోళ్లం అవుతామేమో ననుకుంటున్నానురా!

ఎల్ల : సేతినిండా డబ్బుంటే ఎవడికైనా కళ్లు మూసుకుపోతాయిరా!

మల్ల : ఆ డబ్బు కాస్తా అరతి కర్పూరంలా గాలిలో కలిసిపోతే కళ్ళు బారాజుల్లా తెరుసుకుంటాయి!

ఎల్ల : ఇలాంటోళ్లని గురించి మనం జాలిపడ గూడదురా! బంగారం బొమ్మలాంటి పెళ్లాం వున్నా సుఖపడడం సేతగాని యీ కామ రాజుకి బుద్ధి సెప్పాలిరా!

మల్ల : నేను యిక్కడ నిలబడి మనుషులొస్తున్నారేమో సూస్తా వుంటాను. నువ్వు లోనకెళ్లి అనుపానులన్నీ సూసుకురా!

ఎల్ల : యిందాకొచ్చేరు సూశేవూ—ఆ నౌకరు గాళ్లు—ఆళ్లని కొంచెం జాగర్తగా కనిపెడుతూ వుండు.

మల్ల : అలాంటి కాపలా కుక్కలకి మనం జడుస్తామంటరా! (కోపంతో) డాబు సేత్తన్నారు దొంగ కొడుకులు! దొంగోళ్లని సేణంతో వదలి పెట్టరంట!

ఎల్ల : (కోపంతో) ఆళ్ల కర్రలతో కోలాటం ఆడిద్దును—సమయం కాదని వూరుకున్నాను గాని!

మల్ల : (నిర్లక్ష్యంగా) ఆళ్లేం సేత్తారుపోరా! పోయి అంతా సూసుకొని సవ్వనరా!

[ఎల్లయ్య చెట్లచాటున నక్కుతూ, అడుగులలో అడుగులు వేసుకుంటూ ఎడమవైపు నిష్క్రమిస్తాడు. మల్లయ్య ముందుకూ వెనకకూ పరకాయించి చూస్తూ అటూ యిటూ తిరుగుతూ వుంటాడు. రెండు నిమిషాలు గడిచినతరవాత ఎడమవైపునుంచి ఎల్లయ్య తిరిగి ప్రవేశిస్తాడు)

మల్ల : (ఆత్రతతో) ఆళ్లు నిద్రపోయేరటరా!

ఎల్ల : లేదురా! అవతలవేపు వరండాలో కూచుని యింకా కేక లేసుకుంటున్నారు.

మల్ల : (నిరుత్సాహంతో) అయితే మనం యివ్వేళ వుట్టి సేతులతో యింటికి పోవలిసిందేనట్రా?

ఎల్ల : ఉపాయం వుండాలిగాని వుట్టిసేతులతో ఎందుకు పోతాంరా?

మల్ల : (ఉత్సాహంతో) ఏటిరోయ్ ఆ వుపాయం?

ఎల్ల : ఆ మొగుడూ పెళ్లాలిద్దరూ అవతలి వరండాలో కూచుని కజ్జా పెంచుకుంటున్నారు. ఆళ్ళవాటంనూత్తే యిప్పటిప్పుడే వూరుకునేలాగ లేరు. డబ్బున్న గది తలుపులు తెరిచి వున్నాయి. ఆళ్లకి కనబడకుండా యిటువేపు నుంచి గదిలో దూరవచ్చు!

మల్ల : (సంతోషంతో) అయితే యింకేంరా! సెణంలో పని కానిచ్చుకువచ్చెద్దాం.

ఎల్ల : (సంశయిస్తూ) కాని మరోచిక్కుందిరా!

మల్ల : (నిరుత్సాహంతో) ఏటిరాబాబూ ఆచిక్కు?

ఎల్ల : ఆ గదిలో యిద్దరు సంటిపిల్లలు నిద్రోతున్నారురా!

మల్ల : సంటిపిల్లలున్న యింటికి కన్నం వెయ్యడం కష్టమేరా. ఏదైనా గల్లుమని సప్పుడయితే ఆళ్లు కెవ్వుమని కేకేస్తారు.

ఎల్ల : ఒరేయిమల్లయ్యా! దానికో ఉపాయం సెప్తున్నాను. జాగ్రత్తగా యిను! పిల్లలు 'కుంయ్' మంటే సాలు—కోడిపీక నులిమినట్లు—పీక నులిమి పారెయ్! దానితో మన పని జయంగా పూర్తి చేసుకు వచ్చేస్తాం.

మల్ల : (జాలిగా) ఒరేయి ఎల్లయ్యా! పిల్లలు గంగోడువు! అలాటిపాపపు పని సెప్పకురా! నోరులేని పిల్లలు దేవుడు లాంటోళ్ళు! ఆళ్ళు మనకేం అపకారం సేసేరు సెప్పు! పుత్తి పుర్నేనికి ఆళ్లని సంపెయ్యడానికి నా మనసొప్పదురా!

ఎల్ల : నాకూ అలాంటి పనిసెయ్యడం యిష్టం లేదురా. కాని ఆళ్లు లేస్తే మనం దొరికిపోతాం. యివతల డబ్బూ దొరకదు—అవతల లాటీ కర్రపోట్లు, జైలు తప్పవు.

మల్ల : నవ్వన్ని సెప్పు! నేనుమాత్రం అలాంటి పాపపు పని సెయ్యను. నోరులేని పిల్లల్ని మనం రచ్చిస్తే దేవుడు మనల్ని రచ్చిస్తాడు.

ఎల్ల : దేవుడు రచ్చించినా, రచ్చించకపోయినా పోలీసులు మనల్ని బచ్చిస్తారు.

మల్ల : యేమైనా సరే! పిల్లల్ని సంపనని మాట యిస్తేనే నేను నీతో గదిలో కొస్తాను. లేకపోతే రాను.

ఎల్ల : ఒకళ్ళని సంపడం అంటే మనకి మాత్రం సరదా అంటరా! అలాగే సంపొద్దులే నడు! మనం వచ్చిన యేశాయిశేషం బాగుంటే ఆళ్ళు లేవరు. లేకపోతే మళ్లా రెండేళ్ళు జైలు సేసొస్తాం! పద!

[యిద్దరూ ఎడమవైపు నెమ్మదిగా అడుగుల సవ్వడి కాకుండా నిష్క్రమిస్తారు—తెర]

## రంగము: 2

* * స్థలం: జగన్నాథ దేవాలయం—సమయం: అదేరోజు రాత్రి 10 గంటలు. దీపపు కాంతిలో దేవుని విగ్రహం దివ్య కాంతులను వెదజల్లుతూ వుంది. ఆగి ఆగి ప్రక్కనుంచి వినిపించే గుడిగంటలచప్పుడు నిశ్శబ్దతను భగ్నపరుస్తోంది. అర్ధనిమీలిత నేత్రాలతో ధ్యాననిష్ఠలో మునిగి సీతారాం దేవుడి ముందు కూర్చున్నాడు. అతని ముఖం అతి ప్రశాంతంగా వుంది. దేహం శుష్కించిపోయింది. కళ్లలో తేజస్సు కనిపిస్తోంది. పంచె కట్టుకున్నాడు. చిరిగినపాతపట్టుపంచె కప్పుకునాడు. వయస్సు 30 సంవత్సరాలు—ఎడమవైపు నుంచి రాధ ప్రవేశిస్తుంది. తెల్లగా, అందంగా, పొడవుగా వుంది. ముఖంలో ఉత్సాహం కనిపిస్తోంది. వయస్సు 20 సంవత్సరాలు. దేవుడినీ సీతారాంనీ ఒకక్షణం పరిశీలనగా చూస్తుంది.

రాధ : అన్నయ్యా!

సీతా : (బాహ్య ప్రపంచంలోకి వచ్చి వెనక్కి తిరిగి) ఏం రాధా?

రాధ : రాత్రి పది గంటలు దాటిపోయింది. ఇంకా యింటికి రావా?

సీతా : జగన్నాథుని కరుణ సంపాదించనిదే నేను యింట్లో అడుగు పెట్టను రాధా.

రాధ : రోజురోజుకూ నువ్వు పిచ్చివాడివు అయిపోతున్నావన్నయ్యా! ఆ రాతి దేవుడు నిన్ను కరుణిస్తాడనుకుంటున్నావా?

సీతా : సమస్త జీవకోటినీ సృష్టించిన దేవుడు మానవ జీవితాలపై కమ్ముకొన్న కారుమేఘాలను తొలగించక పోడు. కాని అజ్ఞానంతో, తొందరపాటుతో మానవుడు దేవుణ్ణి తృణీకరించడానికి పూనుకుంటున్నాడు.

రాధ : నువ్వు పొరబాటు పడుతున్నావు అన్నయ్యా! రోజులు మారిపోయాయి. మనం యీనాడు పరమాణుయుగంలో వున్నాం. నేడు మానవునకు సాధ్యంకానిదేదీ యీ ప్రపంచంలో లేదు. మానవుని

కంటే అధికు డెవరూ ఏ లోకంలో లేరు.

సీతా : (కోపంతో) అపచారం! దేవుడి సమక్షంలో దేవుణ్ణి నిరశిస్తున్నావా రాధా! (నిట్టూర్పు విడిచి) అవును! నీలో భక్తి భావా లెలా కలుగుతాయి? భౌతికవాది అయిన చిన్నాన్న దగ్గర యింతకాలం వరకూ పెరిగిన నీకు ఆ సిద్ధాంతాలు పట్టు పడడంలో ఆశ్చర్యం ఏముంది?

రాధ : దేవుడిమీద విశ్వాసంకంటే ఆత్మవిశ్వాసం మనిషికి ముఖ్యం అన్నయ్యా! కష్టపడి, చెమటోడ్చి పని చెయ్యాలి. మానవ సమాజాన్ని పురోగమింప చేయాలి. అప్పుడు దేవుడుకూడా సంతోషిస్తాడు. అంతేకాని దారిద్ర్యాన్ని తట్టుకోలేక నిరుత్సాహపడి, జీవిత సంగ్రామంలో ఓడిపోయి—'నువ్వు తప్ప నాకేం దిక్కు లేదని'—దేవుణ్ణి పట్టుకుంటే దేవుడుమాత్రం ఏం చెయ్యగలడు అన్నయ్యా?

సీతా : అక్కడే పొరపాటు పడుతున్నావు చిట్టి చెల్లీ! కష్టకాలంలో మనిషికి దేవుడొక్కడే దిక్కు. సృష్ట్యాదినుంచీ దేవుడు తన భక్తులను కాపాడుతూ వచ్చాడు. నాకు దేవుడి మీద పరిపూర్ణ విశ్వాసంవుంది. మన కష్టాలు గట్టెక్కేవరకూ నే నిక్కడే నిరశన వ్రతం చేస్తాను. (ఉద్రేకంతో) మన దరిద్రం తీరక పోతే భగవంతుడి సమక్షంలో ప్రాణ త్యాగం చేస్తాను.

రాధ : నువ్వు యీ కాలంలో వుండవలసిన మనిషివికా దన్నయ్యా! మానవ ప్రయత్నం లేనిదే యీ లోకంలో ఏపనీ కాదు. నువ్వుకూడా కష్టపడి పని చెయ్యి. అప్పుడు మనపరిస్థితులు కొంతగాకపోతే కొంతైనా బాగుపడతాయి. చిన్నన్నయ్య చూడు! పాపం! రోజంతా కష్టపడి పనిచేస్తున్నాడు. వాడుకూడా నీలా తయారయితే మన కుటుంబం ఏమయేది?

సీతా : గౌరీపతి యింకా యింటికి రాలేదా?

రాధ : లేదు. పాపం! కేవలం రో[...]
రూపాయలకోసం ఉదయం 8 గ[...]
రాత్రి 10 గంటలవరకూ రక్త[...]
ధారపోసి పనిచేస్తున్నాడు.

సీతా : అంతా భగవదేచ్ఛ!

రాధ : (కోపంతో) ఒకమనిషిమీద [...]
స్వారీచెయ్యడంకూడా భగవం[...]
మేనా?

[ఈమాట అంటున్న సమయంలో [...]
నుంచి గౌరీపతి వస్తాడు. అ[...]
చొక్కా, మాసిన ఫుల్ ఫాం[...]
బూటు వేసుకున్నాడు. జు[...]
వందరగా ముఖంమీద పడుతో[...]
ఎర్రగా, చింతనిప్పులలా వునా[...]
షిని చూడగానే యిట్టే [...]
స్వభావం కలవాడని తెలుస్తుంది[...]

గౌరీపతి: ఏంరాధా? అర్ధరాత్రి అవుతువా[...]
యీ దేవుడికొలువు మనకు తప్ప[...]

రాధ : అన్నయ్య ఇంకా భోజనం [...]
పిలవడానికి వచ్చాను.

గౌరీ : ఇంతరాత్రివరకూ యిక్కడ [...]
వన్నయ్యా?

సీతా : నాయనా! గౌరీపతీ! నన్ను ఈ[...]
తంగా వుండనియ్యి. రాధను నీ[...]
తీసుకుపో. ఈ రాత్రంతా [...]
న్నాథుని సమక్షంలో వుం[...]
కున్నాను.

రాధ : (గౌరీపతితో) మనయిల్లు [...]
ప్రక్కనే వున్నందువల్ల యీ[...]
వచ్చిపడింది.

సీతా : దేవుడు నిత్యం మనకు అం[...]
వుండడం మన అదృష్టం!

గౌరీ : దేవుడు మనల నేదో ఉద్ధరిస్తా[...]
నమ్మకంలో రోజంతా ఉ[...]
వున్నావా అన్నయ్యా? మాట[...]
సంగా వస్తున్నదో చూడు! ఇల[...]
సుష్కింప చేసుకున్నందువల్ల [...]
ఏమిటి?

సీత : మీ తెలివితక్కువకు నాకు జాలి కలుగుతోంది. మీరు అంధకారంలో పడి కొట్టుకుంటూ—దూరాన్నుంచి దేవుడు చూపిస్తున్న జ్యోతిని—కళ్లు తెరచిచూడలేక నిందిస్తున్నారు. మనో నేత్రాన్ని తెరచి చూడగలిగితే నీకు తిన్నగా దివ్యజ్యోతి కనిపిస్తుంది. అదే స్థిరం. అదే నీకు ముక్తిని ప్రసాదించేది. నీ భౌతిక దృష్టికి కనిపించే ప్రతి వస్తువూ నశించిపోయేదే! అశాశ్వతమైన వస్తువులను చూచి—అవే నిజమని—అశాశ్వతమైన మానవ ప్రాణి భ్రమిస్తోంది.

గౌరి : అన్నయ్యా! యింతవరకూ నీమీద వున్న గౌరవంతో నీ మాటకు ఎదురుచెప్పలేదు. కాని యిప్పుడు చెప్పవలసి వస్తున్నందుకు విచారిస్తున్నాను.—నీ సిద్ధాంతాలను నమ్మితే యిక యీ ప్రపంచానికి పురోగమనం వుండదు.—ఈ దేవుడు వట్టి అప్రయోజకుడని, ఎందుకూ కొరగాని వాడని ప్రత్యక్షంగా ఋజువు కనిపిస్తోంది.

సీత : ఏమిటా ఋజువు?

గౌరి : మన నాన్నగారు తమ జీవితాన్నంతా దేవుణ్ణి పూజిస్తూ వృథా చేశారు. చనిపోయే క్షణం వరకూ దేవుని కొలుస్తూనే వున్నారు. చివరకు దేవుని స్మరిస్తూ ప్రాణాలను విడిచిపెట్టారు. అదే మానవప్రాణి అయితే నాన్నగారి కష్టాలకు హృదయం ద్రవించివుండేది. కాని నీ రాతిదేవుడిలో రవంత చలనమైనా కలగలేదు— ఈ దేవునిమీద చూపిన శ్రద్ధలో నాల్గవ వంతైనా మన కుటుంబపు విషయంలో చూపితే మనం యీనాడు దరిద్రంలో యింతఅల్లాడవలసిన అవస్థ వుండేది కాదు. ఈ దేవుడు చేతకానివాడని నిరూపించడానికి యింతకంటే సాక్ష్యం ఏం కావాలి?

సీత : (శాంతంగా) అఖండజ్యోతి కాంతిని చూడలేక కళ్ళుమూసుకొని పైగా దాన్ని నిందిస్తున్నావు నాయనా! దేవుడు మన కష్టాలను గమనిస్తున్నాడు. అచిరకాలంలో మనకు శుభం కలుగుతుంది.

గౌరి : ఎందుకొచ్చిన మాటలివి అన్నయ్యా! యిప్పటికైనా యీ మాయనుంచి తప్పుకొని మానవప్రపంచంలో అడుగుపెట్టు. కళ్లు తెరచిచూడు! కోటానుకోట్ల మానవులు దరిద్ర రాక్షసితో హోరాహోరీ పోరాడుతున్నారు. కొంతమంది స్వార్థపరులు తమ సోదరమానవుల రక్తమాంసాలను అమ్ముకొని వ్యాపారం సాగిస్తున్నారు. నీవు రాత్రింబవళ్ళు కొలిచే యీ భగవంతుడు ధనవంతుల పక్షం వహించి వారి తరఫున ధర్మకర్తృత్వం వహిస్తున్నాడు.

సీత : తప్పు నాయనా! దేవుణ్ణి నిందించకు! దేవుడు ఎవరి పక్షం వహించడు. ఆయన నిష్పక్షపాతి. తన బిడ్డలందరూ సుఖ సౌభాగ్యాలతో బతకాలనే ఆయన ఆకాంక్ష!

గౌరి : నలుగురు అన్నదమ్ములలో ఒక తమ్ముడు చేతగాని వాడవుతాడు. అప్పుడు వాడిని మిగిలిన అన్నలు నిర్దాక్షిణ్యంగా బయటకు నెంటుతున్నారా? అటువంటప్పుడు కొందరు మానవులు దరిద్రులైనంతమాత్రాన వాళ్ళను ధనవంతులు అష్టకష్టాలూ పెట్టాలా?

సీత : మానవులలో ఆ విశాలదృక్పథం నశించింది నాయనా! అందుకు దేవుడేం చెయ్యగలడు?

గౌరి : దేవుడేమీ చెయ్యలేడు. దేవుణ్ణి నమ్ముకుంటే రోజులు గడవవు. నువ్వు వాస్తవిక ప్రపంచంలో అడుగుపెట్టు. (రాధను చూపిస్తూ) ఇరవైయేళ్ళవయసు వచ్చినా—మన ఒకేఒక చెల్లెలు—రాధకు యింతవరకూ పెళ్ళి చెయ్యలేకపోయాం. మన నాన్నగారే కనక బ్రతికివుంటే దానినిచూసి ఎంత దుఃఖించేవారో!

రాధ : అన్నయ్యా! నాగురించి మీరేమీ మనసు పాడుచేసుకోవద్దు! నేను వరుణ్ణి స్వయంగా ఎంచుకున్నాను.

గౌరి : (చకితుడై) అదేమిటి రాధా? నువ్వెప్పుడూ నాతో చెప్పలేదే!

రాధ : అదే! యీ వేళ చెప్పాలనుకుంటున్నాను.

సీతా : నీకు నువ్వే వరుణ్ణి ఎంచుకోవడం ఆచార విరుద్ధమమ్మా!

గౌరి : వరుడు మంచివాడైతే ఆమె ఎన్నుకున్నందు వల్ల నష్టం లేదు. (రాధతో) ఎవరు రాధా అతను?

రాధ : కామరాజు గారు!

గౌరి : (ఆశ్చర్యంతో) ఎవరూ! కామరాజా! రాధా! నీకింకా అనుభవం చాలదు. ధనవంతుడు త్రాచుపాములాంటివాడు. ఏమాత్రం అజాగ్రత్తగావున్నా విషపు కోరలతో కాటు వేస్తాడు.

రాధ : త్రాచుపాము క్రౌర్యం పాములవాడిముందు ఎందుకూ కొరగాదన్న విషయం కూడా నువ్వు తెలుసుకోవాలి.

సీతా : మనకంటే అధికులతో వియ్యం మంచిదికాదమ్మా!

గౌరి : నేను మొదటినుంచీ కనిపెడుతున్నాను. మన రాధలో ధనకాంక్ష, ఆభరణాలమీద వ్యామోహం ఎక్కువగావుంది. తన కోరికలను తీర్చుకోవడంకోసం యీమె ధనవంతుణ్ణి పెళ్ళాడ్డానికి నిశ్చయించుకుంది.

సీతా : దానికింకా చిన్నతనం. అటువంటి కోరికలుండడం సహజం. అందులో తప్పేమీ లేదు. ఏ మనిషీ తనంత తాను కష్టాలు కావాలని కోరుకోడు. (అకస్మికంగా గుడి గంటల సవ్వడి చెవులు చిల్లులుపడేటట్లు వినిపిస్తుంది. సీతారాం తొందరగా దేవుడి కేసి చూస్తాడు. తరవాత రాధా గౌరీ పతుల కేసి చూస్తాడు.) అమూల్యమైన కాలాన్ని వృధాచేశాను. గౌరీపతీ! ఇక రాధను తీసుకొని వెళ్ళిపో!

రాధ : ఈ రోజుకు యిక భోజనం చెయ్యనక్లేనా అన్నయ్యా?

సీతా : ఈరోజు పూర్తిగా నిరాహార దీక్షతో దేవుణ్ణి పూజించదలచుకున్నాను. ఇక నా ధ్యానానికి భంగం కలిగించకండి. వెళ్లి పొండి. (దేవుడివైపు తిరిగి కళ్లు మూ కుంటాడు.)

గౌరి : దినదినానికీ నీకు వెర్రి ఎక్కువవుతో అన్నయ్యా! (నిస్పృహతో) యిక నిన్ను దారిలోకి తీసుకురావడం మానవమాత్రు శక్యంకాదు. రా! రాధా! పోదాం!

రాధ : అన్నయ్యను యిక్కడ ఒంటరిగా విడిచిపెట్టిపోవడమేనా?

గౌరి : మళ్ళీ వద్దాం.

[యిద్దరూ ఎడమవైపుగా నిష్క్రమిస్తార దేవుడిముందు పీఠంమీద తలవాల్చి ప కుంటాడు సీతారాం. — రెండునిముషా నిశ్శబ్దం — ఎడమవైపునుంచి మల్లయ్య ఎల్లయ్య వగర్చుకుంటూ పరుగెత్తుకు వస్తార ఎల్లయ్య చేతిలో ఒకమూట వుంటుంది.]

మల్ల : సంతిపిల్లలు మనకొంప తీశారు. సరి సొమ్ము మూట కడుతున్నప్పుడే యిద్దరు కలిసి కెవ్వుమనాలా?

ఎల్ల : అందుకేరా బాబూ పీక పిసికి పారెయ్యమ ముందే సెప్పేను నేను.

మల్ల : రామ! రామ! ఆమాట అనకురా! సం పిల్లలజోలికెళ్లకపోతే మనల్ని దేవుడు రక్షిస్తాడు.

ఎల్ల : (హేళనగా) యిప్పుడు రచ్చించేడుకాద దేవుడు నిన్నూ! — ఆ రొదవలిద్దరూ క లేసుకుని యిలాగే వస్తున్నారు. యిప్పుడే సేత్తావో సెయ్యి!

మల్ల : ఇంక లాభం లేదురా. అళ్లు పేసినగో యీవాడిలో జనం అంతా లేచిపోయా యింక మనం తప్పించుకుపోడం కష్ట ఆమూట తీసికెల్లి దేవుడిముందు పారెయ్య మనం ఆమెట్లైన కాలదాకుందాం. సొమ దొరికిందిగందా అని మనల్ని వెతక మానేసి అళ్లే పోతారు.

ఎల్ల : (విచారంతో) ఇంత కష్టపడి ఎ కొచ్చినసొమ్ము యిచ్చెయ్యవలసిందేనం మల్లయ్యా?

మల్ల : (ఆతురతతో) అంతకంటే ఉపాయ లేదురా. అళ్లు వచ్చేస్తున్నారు. సప్ దేవుడిముందు పారెయ్యి.

ఎల్ల : (ఒక అడుగు ముందుకు వేసి) ఒరేయ్! ఇక్ ఎవడో మనిషి పడుకున్నాడురా!

మల్ల : (తొందరగా) పడుకుంటే పడుకోనియ్య. నువ్వు దేవుడిముందు మూట పెట్టెయ్య.

[దేవుడి విగ్రహానికి, సీతారాంకూ మధ్య పీఠంమీద మూట పారేస్తాడు ఎల్లయ్య. మల్లయ్య, ఎల్లయ్య యిద్దరూ తొందరగా కుడివైపు నిష్క్రమిస్తారు. మూట పీఠం మీద విసిరేప్పుడు కలిగిన 'గల్లు'మనే శబ్దానికి సీతారాం కళ్ళు తెరిచి చూస్తాడు. తిన్నగా మూట కనిపిస్తుంది. విప్పుతాడు. దానినిండా ధగధగ మెరిసే అమూల్యమైన ఆభరణాలు, రూపాయలూ కనిపిస్తాయి. సీతారాం కళ్ళు ఆశ్చర్యంతో మెరుస్తాయి.)

సీతా : (దేవునివైపు తిరిగి) భగవాన్! ఏమిటి నీ మాయ!

[ఎడమవైపునుంచి సుబ్బయ్య, వెంకయ్య వగర్చుకుంటూ పరుగెత్తుకు వస్తారు. యిద్దరి చేతుల్లోనూ కర్రలు వుంటాయి. సుబ్బయ్య చేతిలో తాడుకూడా వుంటుంది.)

సుబ్బ : (సీతారాంను చూసి) దొరికేడురా దొంగ! (రెక్క పట్టుకొని లేవదీస్తాడు.)

వెంక : (దగ్గరకువచ్చి) మమ్మల్ని తప్పించుకుపోదామనుకున్నావా? హుఁ! (కళ్లెర్రజేస్తాడు.)

సీతా : (శాంతంగా) ఏమిటి నాయనా యిది!

సుబ్బ : (వెంకయ్యతో) యింకా ఏం తెలియనట్టు నాటకం ఆడుతున్నాడురా!

వెంక : (సొమ్మును చూపిస్తూ) యీ సొమ్మంతా ఎత్తుకొచ్చింది నువ్వు గాకపోతే నీ బాబెవడు?

సీతా : హరి భగవాన్! ఏమిటి నీ మాయ!

సుబ్బ : కొంగ జపం చేస్తున్నాడురా యింకానూ!

వెంక : (గద్దిస్తూ) నిజం చెప్పు! ఆ సొత్తు ఎత్తుకొచ్చింది నువ్వా కాదా?

సీతా : నాకు ఏపాపపుణ్యం తెలియదు.

వెంక : (కళ్లెర్రచేసి) తెలియదూ! నీచేత యిప్పుడే నిజం చెప్పిస్తాను. వుండు. (కర్ర పైకెత్తి బలంకొద్దీ సీతారాం బుర్రమీద కొడతాడు. సీతారాం తలనుంచి రక్తం చిమ్ముతుంది. "హాయిరాం!" అని కెవ్వున అరచి నేల కొరిగిపోతాడు సీతారాం)

సుబ్బ : ఇప్పుడైనా నిజం ఒప్పుకుంటావా?

సీతా : (నీరసంగా కళ్లు తెరచి దేవుని విగ్రహం దగ్గరకు పాకి పడతాడు. ముఖం రక్తంతో తడిసివుంటుంది.) భగవాన్! జీవితకాలం నిన్నే నమ్మికొలిచినందుకు యిదా ఫలితం!

వెంక : (గద్దిస్తూ) ఏయ్! కట్టిపెట్టు నీ నాటకం! (రెక్క పట్టుకొని లేవదీస్తాడు)

సుబ్బ : (వెంకయ్యతో) అలా కళ్లప్పగించి చూస్తావేంరా! యీ పగ్గంతో రెక్కలువిరిచి కట్టెయ్యరా! (యిద్దరూ కలిసి సీతారాం చేతులు తాడుతో వెనుకకు విరిచి కడతారు. సుబ్బయ్య సొత్తును తిరిగి మూటకట్టి చేత్తో పట్టుకుంటాడు. వెంకయ్య సీతారాంను కదలకుండా పట్టుకుంటాడు.)

వెంక : పదరా! బాబుగారి దగ్గరికి తీసుకుపోదాం. యియ్యేళ పెద్ద దొంగతనం పట్టేసినందుకు మనకు బహుమతులు దొరుకుతాయి. (యిద్దరూ చెరోవైపున నడుస్తూ సీతారాంను తీసుకుపోతూ వుంటారు. అదే సమయంలో ఎడమవైపునుంచి గౌరీపతి, రాధ ప్రవేశిస్తారు. యీ దృశ్యాన్ని చూసి యిద్దరూ చకితులౌతారు.)

రాధ : (సీతారాంను కౌగలించుకొని) ఏమిటన్నయ్యా యిదంతా? దేవుడిలాంటి నిన్ను బుర్ర బద్దలుకొట్టడానికి ఏ దుర్మార్గులకు చేతులాడినై! (పైటచెంగుతో అతని ముఖంమీద కారుతున్న రక్తాన్ని తుడుస్తుంది. సీతారాం ధ్యానంలో మునిగి మౌనంగా వున్నాడు.)

గౌరి : (నౌకర్లిద్దర్నీ చూసి కోపంతో) మా అన్నయ్యను యిలా దండించడానికి కారణం?

సుబ్బ : సొత్తు ఎత్తుకుపోతూవుంటే తన్నకుండా ముద్దెట్టుకుంటామంటండీ!

గౌరి : ఎవరి సొత్తు?

వెంక : కామరాజుగారింట్లో నండీ!

రాధ : కామరాజుగారింట్లో మా అన్నయ్య దొంగతనం చేశాడా? అబద్ధం! యీ రోజంతా దేవుడి సముఖంలో వుపవాసంతో వున్నాడు మా అన్నయ్య. నేను వచ్చి కామరాజుగారితో చెబుతాను. మా అన్నయ్యను వదిలిపెట్టి వెళ్లండి.

సుబ్బ : అదేం లాభంలేదమ్మోయ్ రాధమ్మగారూ! మేం దొంగను తీసికెళ్లకుండా వుట్టి చేతు

లతో యెళ్లం. కావాలంటే మీరు తరవాత వచ్చి సెప్పుకోండి. మీరు సెప్పితే కానిస్తరు.

వెంక : యింకా కబుర్లు సెబుతున్నావ్ పదరా సుబ్బయ్యా!

[సుబ్బయ్య వెంకయ్య లిద్దరూ సీతారాంను నడిపించుకొని తొందరగా ఎడమవైపుగా నిష్క్రమిస్తారు. గౌరీపతి, రాధ ఆశ్చర్యంతో నిశ్చేష్టులై చూస్తూ నుంచుంటారు]

రాధ : ఇదేం అన్యాయం? సాధువులాంటి అన్నయ్యపై నేరం ఆరోపించి తీసుకుపోతున్నారు!

గౌరీ : (తేరుకొని) ఈ లోకంలో న్యాయా న్యాయాల విచక్షణ నశించింది చెల్లీ! కళ్లు మూసుకొని ఒకమూలను కూర్చున్న వాడినికూడా రొంపిలోకి లాగుకుంటుంది లోకం. గంగిగోవులాంటి అన్నయ్యను రెక్కలు విరిచికట్టి తీసుకుపోతున్నారు. అన్నయ్యకు రేపు న్యాయస్థానం శిక్ష విధించినా మనం ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. (ఉద్రేకంతో) ఇక వూరుకుంటే లాభం లేదు. అన్నయ్యను క్షణంలో విడిపించుకు వస్తాను. యీ అన్యాయాన్ని చూస్తూ సహించి వూరుకోలేను. అవసరమైతే అడ్డువచ్చిన వాళ్ళ అంతం కనుక్కుంటాను. తిరిగి వస్తే అన్నయ్యతో కలిసే యింటికి తిరిగి వస్తాను. లేదా అన్నయ్యతో కలిసి నేనుకూడా జైలుకు వెడతాను. ఇక నామాటకు అడ్డు చెప్పకు నువ్వు యింటికిపో! (తొందరగా ఎడమవైపు నిష్క్రమిస్తాడు. "అన్నయ్యా!" "అన్నయ్యా!" అని ఎలుగెత్తి పిలుస్తూ రాధ అతనివెనుక తొందరగా నిష్క్రమిస్తుంది. —కుడివైపునుంచి నెమ్మదిగా మల్లయ్య, ఎల్లయ్య తిరిగి ప్రవేశిస్తారు.)

మల్ల : యిదేంటిరా ఎల్లయ్యా యీగా మారింది యెవ్వారం?

ఎల్ల : ఆ దొరవ లిద్దరూ సొత్తు పట్టుకుపోయింది కాక ఏపాపం పుణ్యం ఎరగని ఆ కుర్రోణ్ణి లాక్కుపోయేరేరా?

మల్ల : ఆ పిల్లలు ముగ్గురూ సచ్చిపోయిన నర్సింగారి పిల్లలు కాదంట్రా?

ఎల్ల : ఆశేరా! ఆ బాబు ఎంత మంచోడు! సచ్చి ఏలోకాన్నున్నాడో కాని మనల్ని ఎంత బాగా సూసేవోడురా!

మల్ల : (జాలిగా) నర్సింగారి పిల్లలు యిలా కష్ పడుతూవుంటే సూత్తా వూరుకోలేనురా. ఇప్పుడు మనం వూరుకుంటే ఆ కుర్రోణ్ణి జైలేసేస్తారురా!

ఎల్ల : ఇంక మనం ఏం సెయ్యగలంరా?

మల్ల : మనం ఏదో ఒకటి సేసి ఆ అబ్బాయిని తప్పించాలిరా! లేకపోతే మనం పాపంలో పడిపోతాం. (ఒక క్షణం ఆలోచించి) యింక ఆల్సెంసేస్తే లాబంలేదురా. నే సెల్లిపోయి దొంగతనం వొప్పేసుకుంటాను. నువ్వు యింటికెళ్ళిపో!

ఎల్ల : ఒరేయి మల్లయ్యా! నువ్వు నేను పడుతున్న కష్టాలు సూడలేక నాకోసం దొంగతనానికి వచ్చేవు. నిన్ను జైలుకు పంపించడం నాకు యిష్టంలేదురా. నేనే యెళ్ళిపోయి నేరం ఒప్పేసుకుంటాను.

మల్ల : పెళ్ళాం, పిల్లలు గలవోడువు నువ్వు జైలు వెళ్లొద్దురా! అందులోనూ నీ పెళ్ళాం రోగిష్టిది. యిలాంటప్పుడు నువ్వు యి ల్లొదిలిపెట్టి పోకూడదు. కబుర్లు సాలించి తిన్నగా యింటికిపో! నేను రెండేళ్లూ రెండు రోజుల్లాగ జైల్లో గడిపేసి వొస్తాను. నాకోసం ఏడిసేవోళ్లు కూడా యీ ప్రపం కంలో లేరు.

ఎల్ల : (మల్లయ్యను కౌగిలించుకొని భోరు ఏడుస్తూ) ఒరేయి మల్లయ్యా! నీ రుణ ఎలా తీర్చుకుంటానురా!

మల్ల : (ఓదార్చుతూ) మనలో మనం సాయపడి పోతే మనుషులమైపుట్టి ఏంలాబంరా! ఇం ఎల్లిపోరా.

[ఎల్లయ్య వెళ్లలేక, వెళ్లలేక ఎడమవైపు వెళ్ళిపోతాడు. మల్లయ్య దేవుడిముంద మోకాళ్లమీద నిలబడి నమస్కారం పెడుతూ వుంటాడు. — ఎడమవైపునుంచి కా రాజు, రాధ, గౌరీపతి, సీతారాంను తీస కొని సుబ్బయ్య వెంకయ్య ప్రవేశిస్తారు.

సుబ్బ : యిక్కడకూడ యీబాబు మాట యిప తుంటే మేం కళ్లారా సూశాంబాబూ!

వెంక : ఏం అనుమానం లేదుబాబూ! సొత్తు పట్టుకు పోయింది యీయనే!

రాధ : లేదండీ! యీరోజు ఉదయంనుంచీ కాల కదపకుండా మా అన్నయ్య యీ దేవా లయంలో నే కూర్చున్నాడండి.

గౌరీ : మా అన్నయ్యకు యీ దొంగతనంతో ఎంత మాత్రం సంబంధం లేదు.

కామ : (సీతారాంను ఉద్దేశించి) మీరేం చెబుతారు?

సీతా : అంతా భగవంతుని మాయ! నాకేం తెలియదు. నేను కళ్లు తెరచిచూసేసరికి తిన్నగా మూట కనిపించింది.

కామ : (హేళనగా) అయితే ఆమూటను మీ ముందు దేవుడు తీసుకువచ్చి పెట్టేశాడంటారు.

[యింతసేపటినుంచీ యీ ప్రసంగాన్ని శ్రద్ధతో వింటున్న మల్లయ్య ముందుకు వస్తాడు. అందరూ అతనికేసి చూస్తారు.)

మల్ల : (గంభీరస్వరంతో) ఆ మూటని ఆయన ముందు పెట్టింది భగవంతుడు కాదు — నేనే పెట్టేను.

సుబ్బ : (సంశయిస్తూ) యీ దెబ్బకితో కూలిచ్చి నేరం వొప్పిస్తున్నట్టున్నారు బాబూ!

మల్ల : (కోపంతో సుబ్బయ్య మెడపట్టుకొని) ఒరేయ్! నీలా డబ్బున్నవాళ్ల యింటిముందు కూలికోసం కాపలా కుక్క పని సెయ్యడం లేదురా! నేను! (ముందుకు నెట్టుతాడు. సుబ్బయ్య వెళ్లి వెంకయ్యమీద పడతాడు. సుబ్బయ్య, వెంకయ్య కోపం దిగమింగుకుంటూ చెదురుచూపులతో మల్లయ్యను చూస్తావుంటారు).

కామ : (మల్లయ్యతో) నువ్వు దొంగిలించినట్టు మాకు రుజువేమిటి?

మల్ల : కావలసినన్ని ఆనవాళ్లు చెబుతాను. జాగ్రత్తగా యినండి బాబుగారూ! ఇయ్యేళ రాత్రి పదకొండు గంటలకి మీరు మీ యింటికి వచ్చేరు. అప్పుడు మేం యిద్దరం (తప్పు దిద్దుకుంటూ) అప్పుడు నేను పెట్టెనకాల నక్కేను. మీరు పెడతిరుగుళ్లు తిరుగుతున్నారని, మీ పిల్లల్ని కూడా చూడ్డం లేదని అమ్మగారు మీమీద కోప్పడ్డారు. యిది నిజం అని ఒప్పుకుంటారా?

రాధ : (ఆశ్చర్యంతో) మీకు పెళ్లయ్యిందా కామరాజుగారూ?

మల్ల : పెళ్ళేంటమ్మా! ముత్యాలలాంటి పిల్లలు కూడా యిద్దరుంటేను! నేను ఆ గదిలో మూటకట్టుకునేప్పుడే ఆ పిల్లలు కెవ్వుమన్నారు. అందుకే పారిపోయి రావలిసొచ్చింది.

రాధ : (కోపంతో) ఎంత మోసం చెయ్యడానికి పూనుకున్నారు కామరాజుగారూ! అసలు పెళ్ళే కాలేదన్నారు. నన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నానన్నారు. అదంతా అబద్ధమేనా? నేను పూర్తిగా మోసపోనందుకు సంతోషిస్తున్నాను.

కామ : (కోపంతో సుబ్బయ్యను, వెంకయ్యను చూసి) అలా గడకర్రలలా నిలబడి చూస్తారేంరా? అతన్ని విడిచిపెట్టి (మల్లయ్యను చూపిస్తూ) యీ వెధవని కట్టెయ్యండి.

[వెంటనే సుబ్బయ్య, వెంకయ్య సీతారాంను విడిచిపెట్టి మల్లయ్య చేతులు విరిచి కట్టేస్తారు. మల్లయ్యను నౌకర్లు తీసుకుపోతూవుంటే వెనక కామరాజు వెళుతూవుంటాడు.)

రాధ : (ఏదో స్ఫురణకు వచ్చినట్లు) కామరాజుగారూ!

కామ : (ఆగి) ఏం? ఎందుకు?

రాధ : చూడండి కామరాజుగారూ! యీ దొంగ హృదయ పరివర్తన కలిగి నేరాన్ని స్వయంగా ఒప్పుకున్నాడు. మీసొత్తు మీకు దొరికిందికూడా. కనుక యితన్ని యీసారికి క్షమించి విడిచిపెట్టమని మిమ్మల్ని కోరుతున్నాను.

కామ : నీ మాటను తిరస్కరించవలసివచ్చినందుకు విచారిస్తున్నాను రాధా! — దొంగతనం చట్టరీత్యా ఘోరమైన నేరం. ఈ దొంగ తన నేరానికి తగినశిక్ష అనుభవించితీరాలి. నేను దొంగతనాలను ప్రోత్సహించదలుచుకోలేదు. (నౌకర్లతో) వీణ్ణి తాళ్లతో గట్టిగా బిగించండి పదండి!

[సుబ్బయ్య, వెంకయ్య చెరోవైపు నడుస్తూ మల్లయ్యను తీసుకొని ముందు నడుస్తూ వుంటారు. ఆ వెనక కామరాజు నిష్క్రమిస్తాడు. రాధ, గౌరీపతి వాళ్లు వెళ్లిపోతున్నవైపు ఆశ్చర్యంతో చూస్తూ వుంటారు.)

సీతా : (దేవుడిముందు చేతులుజోడించి) భగవాన్! యేమిటి నీమాయ!

గౌరీ : (కోపంతో) ఇది భగవంతునిమాయ కాదు. ధనవంతునిమాయ!!

[గౌరీపతి, రాధ ఎడమవైపు నిష్క్రమిస్తూ వుంటారు. సీతారాం దేవుని ముందు అరమోడ్పుకళ్లతో నిలుచుని వుంటాడు —

[తెర]

# కలగూరగంప

## శకుంతలోపాఖ్యానము: నన్నయ

శ్రీ కొడవంటి శంకరనరసింహబ్రహ్మం

ఆంధ్రుల దురదృష్టమున నుద్గ్రంథములెన్ని యలబ్ధములై యజ్ఞాతములై యడఁగియుండెనో తెలియఁగరాదు. నన్నెచోడని కుమారసంభవ కావ్య మీ శతాబ్దారంభమువఱకు నష్టప్రాయమై యుండినదే కదా! తిక్కన సోమయాజి తన యుత్తర రామాయణారంభమున 'సారకవితాభిరాముఁడ'నియుఁ జేరిన దశకుమార చరిత్రమున 'సాహిత్యవిద్యా పారీణుఁడ'నియు హెచ్చరించిన తిక్కన తాతయైన భాస్కరమంత్రి రచించిన గ్రంథము లింకను బయలు పడలేదు! నిర్వచనోత్తర రామాయణమునఁ 'గవిసార్వభౌమాంకుఁడ'ని సంస్తుతుఁడైన మనుమసిద్ధిరాడి తిక్కనృపాలుఁ డా బిరుదము చే కావ్యమును రచింప కయే కొనియుండెనా? పెక్కురు కవులచేఁ గొనియాడఁబడిన చిమ్మపూడి యమరేశ్వరుని కృతు లేవైనవి? భీమకవి యుద్ధంపమల్ల రాఘవపాండవీయ ద్వ్యర్థి కావ్యమును రచింపఁగా నది నామమాత్రావశిష్టమై నశించెనని పింగళి సూరనామాత్యుఁడు చెప్పుచుండెను గదా! 'యః సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచి కాంధ్రభాషాసు కవిరాజశేఖర ఇతి ప్రథితః సుకవిత్వ విధపేన' ఇత్యాదిగాఁ బొగడఁగన్న నన్నె నారాయణభట్టు కావ్యముల రచింపలేదా? ఆంధ్రశబ్ద చింతామణిలో సగౌరవముగా స్మరింపఁబడిన కవిభల్లటుని గ్రంథము లేవి? ఇందులోఁ గొందఱు నన్నయకు సమకాలికులు. కొందఱు తాతనికిం బూర్వులనియుఁ దలంపఁబడుచున్నారు. జనాశ్రయ బిరుదాంచితుఁడై క్రీ. శ. 600 ప్రాంతమున రాజ్యపాలన మొనర్చిన నిష్ఠకుండిన రాజు మాధవ మాధవవర్మనాఁడు రచింపఁబడి దండిచే స్మరింపఁబడిన (జనాశ్రయ) ఛందోవిచితిలో నాంధ్రదేశ విలక్షణమైన సీసగీతి ద్విపదాదుల లక్షణములుఁగూడ నున్నవని యందురు. కాఁగాఁ దెనుఁగున నన్నయభట్టే యాదికవియని నిశ్చితముగాఁ జెప్ప నవకాశము చాలదు. కనుక నసమగ్రపరీక్షణ కారణముగాఁ బుట్టిన యపోహ నాధారముఁ జేసికొని నన్నయ నాదికవి భావసామ్యముచే వాల్మీకింబోని వాఁడనియు వ్యాసునికన్న ఘనుఁడనియు రాద్ధాంత మొనర్చుటకుఁ బూనుట సరికాదని నా మనవి. వ్యాసుని శకుంతలోపాఖ్యానమున లోపములున్నవనియు నన్నయ వానినెల్ల సరిదిద్దియుఁ గ్రొమ్మెఱుంగులఁ గూర్చియుఁ దీర్చెనని గత ఏప్రియల్ నెల భారతిలో శ్రీ మల్లంపల్లి వీరమల్లేశ్వర శర్మగారు వ్రాసియున్నారు. ఇందెంత సత్యమున్నదో పరామర్శించుటయే యీ వ్యాసోద్దేశము.

'ఇతివృత్తి వశాయాతాం త్యక్త్వాఽననుగుణాం స్థితిం ఉత్ప్రేక్ష్యోఽప్యంతరాభీష్ట రసోచిత కథోన్నయః' ఈ మొదలుగా నానంద వర్ధనాచార్యుల వారి నిబంధన. ఇది పురాణేతిహాసములందలి యితివృత్తములఁ గావ్య వస్తువులుగా మార్చి కూర్చుకొను విషయమై చెప్పఁబడినను దెనుఁగు కవులు సంస్కృత గ్రంథముల నాంధ్రీకరించు సందర్భమున యథామూల పరివర్తనమును గాక పై విధానమును గొంతవఱ కనుసంధించిరని చెప్పనొప్పును. శ్రీనాథుఁడు నైషధాంధ్రీకరణాంతమున 'శబ్దం బనుసరించియు నభిప్రాయంబు గుణించియు భావం బుపలక్షించియు రసంబు పోషించియు నలంకారంబు భూషించియు నౌచిత్యం బాదరించియు ననౌచిత్యంబు పరిహరించియుఁ' దా నా గ్రంథమును జెప్పినట్లు తెల్పినాఁడుగదా! మఱియు రాజరాజనరేంద్రుఁడు నన్నయను గోరినది 'మహాభారత బద్ధనిరూపితార్థ మేర్పడఁ దెనుఁగున రచియింపు'మని! అట్టియెడ నన్నయ గోరంతఁ జెప్ప

కొండంత మాచించెననుట యెట్లు చెల్లునో దురూహ్యము. అతఁడు మూలమునందలి దెల్లఁ దెనుఁగునకుఁ జేరనవసరము లేదు; తెచ్చుట కొతఁడు పూనను లేదు. కాని రచించినపుట్టుకు మూలమునందలి సొగసులు చెడఁగొట్టకుండ విస్పష్టముగాఁ (ఏర్పడ) దెనుఁగువారి కందిచ్చుటకు బాధ్యుఁడై యున్నాఁడు. ఆ బాధ్యత నాతఁ డెంతవఱకు నిలువఁబెట్టుకొన్నాడని ప్రశ్నించినచోఁ జెక్కడల నసావధానుఁడై పొఱపడెనని చెప్పవలసియున్నది. భారతమునందలి యితర కథాభాగములఁ గల ప్రమాదము లిట నప్రస్తుతములగుట శకుంతలోపాఖ్యానము నే విమర్శించితిని.

శకుంతలోపాఖ్యానము భారతమున నే కాక భాగవతాది పురాణములందునుఁ గలదు. మహాకవి కాళిదాసుని కావ్యకళానైపుణ్యమున లోకోత్తర చమత్కారకారిగాఁ బరిణమించిపోయినది కూడ. ఇది నన్నయనాఁటి పరిస్థితి. ఇట్టియెడ మూలగాథ నెట చేసి యనౌచిత్యమున్నఁదొలగించి మార్చుటకు స్వతంత్రుఁడై యట్టిమార్పులకు మార్గదర్శకములై భాగవతాభిజ్ఞాన శాకుంతలాదు లెదుట నుండ నన్నయ గావించిన దేమి? దుష్యంతుఁడు శకుంతలా జన్మవృత్తాంతమును గూర్చి యడుగఁగా నామె తెల్పిన చొప్పు కనుంగొనుఁడు. మేనక విశ్వామిత్రుతపంబుఁ జెఱుప బూని వచ్చినదఁట. అప్పుడు

చ. అలసత యొప్పఁగాఁ దరుణి
యసుమ్ముని వల్లభు ప్రోల నున్న స
మ్మిళిత సుగంధ బంధుర స
మీరవశంబునఁ దూలి చాలపై
వలువ విడలెఁ బయల్పడియె
వల్దవచంబులుఁ గుచయుగ్మమున్
లలిత కృశోదరంబుఁ దర
శ్రీ త్రివళీయుత రోమరాజియున్.

క. అందుఁ దనదృష్టి నాటినఁ
గందర్ప నిశాత సాయకంబులు పెలుచన్
డెందము నాటిన ధృతి సెడి కంది
మునీంద్రుండు దానిఁ గవయఁగఁ దివిరెన్.

ఇట మూలమున నిట్లు గలదు—"అభివాద్య తత స్నాతం ప్రాక్రీడ దృషిసన్నిధౌ అపోవాహచ వాసోస్యా మారుతా శశిసన్నిభమ్. సాగచ్ఛత్త్వరితా భూమిం వాసస్తదభిలిప్సతీ స్మయమానేవ సవ్రీడం మారుతం వరవర్ణినీ. పశ్యత స్తత్ర తత్రస్తే రపస్యగ్ని సమతేజసః విశ్వామిత్ర స్తతస్తాంతు విషమస్థా మనిందితామ్. గృద్ధాం వాసతీ సంభ్రాంతాం మేనకాం మునిసత్తమః అనిర్దేశ్యవయోరూపా మపశ్య ద్వివృతాం తదా. తస్యా రూపగుణాన్ దృష్ట్వా సతు విప్రర్షభ స్తదా చకార భావం సంసర్గా త్తయా కామవశం గతః" అని.

వయసు వచ్చిన బాలిక, ఋషివాటికం దిరిగిన తపస్విని నాఁడే క్రొత్తగా వచ్చిన, 'జగతీ వల్లభుఁ'డని తనచే గుర్తింపఁబడిన, పరపురుషునితో 'వల్దవచంబులుఁ గుచయుగ్మము'ల ప్రశంస - అందువలన నప్రస్తుత ప్రశంసఁ — గావించుట యెట్టి యౌచితియో బిజ్ఞు లెఱుంగక పోరు. ఇది యమూలకమని గ్రహింతురు గాక! 'అనిర్దేశ్యవయోరూపాం' అన్న యవ్యక్త మధురభావము తెనుఁగున లాలిత్యముఁ గోలుపోయి సామాన్య భావగ్రాహ్యమై పర్యవసించినది. ఔచితీ నిర్వహణముపైఁ గన్నుగల కళాతపస్వి యీ ఘట్టమున వివస్త్రముఖమున నూదనా మాత్రముగా నీ విషయమును కాళిదాసువలెఁ జెప్పింపకున్న నూనా సంక్షేపించిరైన రాజుగారి ప్రశ్నకు యుక్తసరిగా 'విశ్వామిత్రాత్మజేవాహం త్యక్తా మేనకయా వనే' ఇత్యాదిగా భాగవత మార్గము చేని యనుసరించి యుండవలసి

వటి కదా! అందుకనుగుణముగా నమూలకమైన యనౌచిత్య కల్పనము గూడ గూర్చుట యిట వ్యక్తము.

ఇంకొక యుదాహరణము. శకుంతల దుష్యంతునితో :

క. జగతీ వల్లభ! యే వ
ర్ణగణిత ధర్మ స్వరూపుఁడని జగములు దన్
బొగడఁగ జగదారాధ్యుం
డగు కణ్వమహా మునీంద్రు నాత్మజను సుమీ

అనియు,

క. కరుణానిరతులు ధర్మ
స్వరూపు లింతకు మదీయజనకులు సముదెం
తురు వారు వచ్చి నీ కి
చ్చిరేనిఁ బాణిగ్రహణము సేయుము నన్నున్,

అనియుఁ జెప్పినది. ఇట మూలము 'కణ్వస్యాహం భగవతో దుష్యంత! దుహితా మతా' అనియు, 'ఫలాహారీ గతో రాజన్! పితా మే ఇత ఆశ్రమాత్' అనియు, దుహితా, పితా) శబ్దముల యౌచితిని గమనింపుఁడు) 'తిష్ఠ చేత్ వసిచే రహస్య కుంతైః పరివారితాం అనయిత్వా తితిక్షైర్నాం దుహితృత్వే న్యవేశయమ్. శరీరకృత్ ప్రాణదాతా యస్య చాన్నాని భుంజతే క్రమేణైతే త్రయోఽప్యుక్తా పితరో ధర్మశాసనే. ఏవం దుహితరం విద్ధి మమ విప్ర శకుంతలాం శకుంతలా చ పితరం మన్యతే మామనిందితా' అని మూల మా శబ్దద్వయ నిర్వచనమును గూడఁ జేసి యున్నది. ఆ భాగమును నన్నయ 'నేను దీనికి భయ త్రాతల మగుటం జేసి గురుల మిదియును నాచే నభివర్ధిత యగుటం జేసి నాకు హృదయనందినియైన కూఁతురని తెనుఁగించుటం జూడ నాతఁడా శబ్దద్వయ విశేషమును గుర్తింపలేదనియే చెప్పవలసియున్నది. ప్రపూరణార్థకమైన దుహ ధాతు జన్యమైన దుహితృ శబ్దమును రక్షణార్థకమైన పా ధాతుజన్యమైన పితృశబ్దమును సార్థకములు సరసములునని రసజ్ఞు లూహింపకపోరు. కవికుల సార్వభౌముఁడైన కాళిదాసు వైఖానసవాక్యముగా 'ఇదానీమేవ దుహితరం' అని ప్రారంభించి, రాజాపదమును పుత్రికా పర్యాయపద మాత్రముగా భావించి శాశ్వత బ్రహ్మచర్య నిష్ఠాపరుఁడైన కణ్వున కెట్లు జనించెనాయని సంశయించినట్లు, 'తదాత్మజేతి కథం' అని చమత్కరించి తుదిఁ దన్నిభ సుఖమున 'శరీర సంవర్ధనాదిభిః స్తాతికాశ్యపోఽస్యాః పితా (పిదా - ప్రాకృ)' అని సమాధాన మిప్పించుటలో సార్థపద ప్రయోగసామర్థ్యమును బరాకాష్ఠ నొందించినాఁడు; మూలభారతమునకు మెఱుఁగుఁ దీర్చినాఁడు. అట్టిచో నన్నయ్య యుప్పటును నా సార్థపద ప్రయోగ సారస్యము నూహింపక 'యావదర్థ పదో క్తి విరాగ్య నిరూఢిని' గవిటింప జేసికొనలేకపోవుటయే కాక ప్రాదుర్భావార్థకమైన జనిధాతుజన్యమైన 'యాత్మజ జనక' శబ్దముల నుపయోగించి యౌచిత్యమును భ్రష్టమొనర్చినాఁడు; అయథార్థము నపలపించినాఁడు.

'అనౌచిత్యాదృతే నాన్యద్ రసభంగస్య కారణమ్' అన్న యానందవర్ధన మనుశాసనము నంగీకరించి 'ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితమ్' అని సిద్ధాంతీకరించిన క్షేమేంద్రుఁడు 'పదే వాక్యే ప్రబంధార్థే గుణేఽలంకరణే రసే క్రియాయాం కారకే లింగే వచనే చ విశేషణే. ఉపసర్గే నిపాతే చ కాలే దేశే కులే వ్రతే తత్త్వే సత్త్వేఽప్యభిప్రాయే స్వభావే సార సంగ్రహే. ప్రతిభాయా మవస్థాయాం విచారే నామ్న్యథాశిషి కావ్యస్యాంగేషు చ ప్రాహు రౌచిత్యం వ్యాపి జీవితమ్' అని తదౌచిత్యస్థానములఁ దెలిపి కేవల తత్త్వ నిర్ణయైకబుద్ధియై కాళిదాసమహాకవినిగూడ నిలువరించి 'క్రోధం ప్రభో! సంహర సంహరేతి యావద్గిరః ఖే మరుతాం చరంతి తావత్స వహ్నిర్ భవనేత్రజన్మా భస్మావశేషం మదనం చకార' అన్న కుమారసంభవ కావ్యాంతర్గత శ్లోకమునుకూర్చి 'సంహారవసరే రుద్రస్య భవాభిధాన మనుచితమేవ' అని చెప్పి శాసించుటయందలి నిర్భయత్వ నిష్పాక్షికత్వ సత్యాన్వేషణ ప్రవణతలు నేఁటి విమర్శకలోకమున కాదర్శప్రాయము గాదగియున్నవని మనవి చేయుచున్నాను. కాళిదాసునిరోపెకన్న నిటఁ గల విశేష మేమున్న మూలగ్రంథ మౌచిత్యసుభగంబులైన పదంబుల సిద్ధపఱచియుంచినను గేవలానవధానతా కారణముగా నవి యనాదృతములైన వనుటయే!

భారతి ఏప్రిల్ సంచికలో నుద్ధృతములైన విషయములఁ గొన్నిటి నిటఁ బరీక్షింతము. కణ్వుఁ డొంటరిగా మాలినీతీరమునకు వెళ్ళినట్లు మూలమునఁ గలదఁట. కులపతి వెంట శిష్యులు వెళ్ళకుందురా యని యాక్షేపము. పైగా రాజక్కడక్కడ కొందఱు విప్రుల జూచినట్లు చెప్పియు వారాతని కాతిథ్యమిచ్చి సత్కరించినట్లుఁ జెప్పకుండుట మూలమునందలి లోటఁట. దుష్యంతుఁడు పిలువవలసివచ్చుట యసమంజసమఁట. ఏవంవిధలోపములనెల్ల నన్నయ

సరిదిద్దెనఁట. కణ్వుఁడు కులపతి నిజమే. అనఁగా నేమి? కొందఱు విద్యార్థులకు గ్రాసవాసాది సౌకర్యము లిచ్చి విద్య బోధించు నాచార్యుఁడన్నమాట. నేఁటి 'రెసిడెన్షియల్ యూనివర్సిటీ' వంటి దాని నడుపుచున్న మహర్షి. అట కణ్వకుటీరము ప్రత్యేకముగను చిదిచిర విద్యార్థుల నివాసస్థానములు వేఱుగను నుండును. దుష్యంతుఁడు కణ్వదర్శనార్థమై తద్గృహవాటికకే వెళ్ళినాఁడు. 'తత్ర తత్రవి ప్రేంద్రాన్ నియతాన్ సంశితవ్రతాన్ జప హోమపరాన్ విప్రాన్ దదర్శ' అని మూలమునఁ గలదు. కాని 'తత్ర తత్ర' అనుటచే మార్గమున వచ్చుచు నెమ్మది నెమ్మది నల్లంతి దవ్వునఁ జూచుట ద్యోతిత మగుచున్నది. మఱియుఁ జూచినది 'నియతాన్, సంశితవ్రతాన్, జపహోమ పరాన్' అని తత్తత్కార్యవ్యగ్రులను. అట్టి స్థితిలో నున్నవారు కణ్వుని కుటీరముం గూర్చి పోవుచున్న జనమును నిల్వరించి యాతిథ్య మీవలయుట యెట్టి ధర్మమో యెఱుఁగరాకున్నది. వారో, తత్తత్కార్య దీక్షితులు; దుష్యంతుఁడా, కణ్వాశ్రమమును త్రోవ నరుగుచున్నవాఁడు; కణ్వునింట నాతిథ్య మిచ్చునారును లేక పోలేదు. ఇప్పట్టునఁ గాళిదాసుని శాకుంతలమును జూతుఁడు. త్రోవ నెనుకైన వైఖానసులు రాజున కాతిథ్య మిచ్చుటకుఁ దిరిగిరాక, కులపతులవారింట లేరని యెఱింగియు వారి కూఁతు రట నాదరింపఁగలదని చెప్పి తమదారిం బోవుచున్నారు. కావున నిట మూలము సర్వథా సంగతియును సహజమును. అటఁగలవారెల్లరును రాజుం జుట్టుముట్టి యేదో వింతవస్తువుం జూచినట్లు చూచుటకాని, స్త్రీజన మిరుకేలంకుల నున్నతస్థానములనుండి విభ్రమముతోఁ బరికించి లాజలఁ జల్లుటకాని జరుగుట కది నగరవీథి యేమిగాదు; శాంతి సమావృతమైన నిరీహమైన మునిపల్లె.

ఇప్పట్టున నింకొకమాట. నన్నయభట్టు మూలమున లేని శోభను గూర్చినాఁడని మురిసిపోవుచున్న పద్యము.

చ. అతిరుచి రాగపుంజయిన
యాతనికిన్ హృదయప్రమోద మా
తతముగ నవ్వనంబున ల
తాలలనల్ మృదులానిలాప వ
ర్తిత కుసుమాక్షతావలులు
సేసలు పెట్టిన యట్టిరీతి సం
పతదళినీ నినాద మృదు
భాషలదీవన లొప్ప నిచ్చుచున్.

అవినయార్థస్ఫోరకమే. ఏమన నీ లతాలలనల చర్య నాగరిక స్త్రీజనవృత్తమును బోలి సాధారణో ద్యాన వనలతా విషయమున కలవడఁదగినదే కాని ఋష్యాశ్రమంబుల వనంబుల కనుచితమే కదా! ఇట మూలమిట్లు - 'మనోరమం మహేష్వాసో వివేశ వనముత్తమం మారుతా కలితాస్తత్ర ద్రుమాః కుసుమశాఖినః పుష్పవృష్టిం విచిత్రాం తు వ్యసృజంస్తే పునః పునః దివస్పృశోఽథ సంఘుష్టాః పక్షిభిః మధురస్వనైః' అని. విశ్వలము, శాంతము నైన యాశ్రమవాటిక నారాజును దదితరులును బ్రవేశించుటయు నచ్చటి వృక్షాగ్రములనున్న పక్షులు బెదరి పైకెగిరి పోయి కూయఁ దొడఁగినవి. తదుత్పతన వేగమున, బహుమారుతోద్వలితమై శాఖలనుండి పూలు రాలినవి. ఇది స్వభావసుందరము. ఈ సంఘటనయందు ద్విజాశీర్వాదములతో చేతులెత్తి పూలుజల్లి యభ్యాగతుని సత్కరించు నీతి 'చెట్టును పిట్టయు చేసెనో' యనిపించి కణ్వాశ్రమనాప్రభావముని సూచించి యుదాత్త రమ్యముగా, చిత్రించినాఁడు వ్యాసభగవానుఁడు. ఈ రెంట నేది ప్రశస్తమో రసికులకే యెఱుక.

ఇఁక కణ్వుఁడొక్కఁడే వెళ్ళినట్లు మూలమున నున్నదనుట సరిగాదు. శకుంతలంగూర్చి కణ్వమహాముని యెందరిగెనని దుష్యంతుఁ డడుగఁగా నామె 'గతః పితా మే భగవాన్ ఫలాన్యాహర్తు మాశ్రమాత్' అని సమాధాన మిచ్చినది. నన్నయయు నిప్పట్టున 'క్రచ్చర వేఁటవచ్చి యిటఁ గణ్వమహామునిఁ జూచి పోఁగా వచ్చితి మెందుఁ బోయిరొకో వారని' దుష్యంతుఁడు ప్రశ్నింపఁగా 'ఈతుఁడును యేగిరి కానకుఁ బండ్లకేఁగె' నని శకుంతల సమాధాన మిచ్చినట్లుగానే చెప్పియున్నాఁడు. మఱియు 'వంతి నమ్మహాముని వనంబునుండి కందమూల ఫలంబులు గొని చనుదెంచు' ననియు నాతఁ డొక్కఁడే యరుగుటను నిర్ధారించినాఁడు. కాఁగా 'అసంఖ్యాకులైన యాతని శిష్యు లేమైరి' ఈ మొదలైన ప్రశ్న పరంపర నన్నయ కథాభాగముపట్ల నైతి ముదయింప వలసినదే కదా! ఇంతకును గణ్వుఁ డెట వని ప్రశ్న, ఫలాహారణమున కేగెనని సమాధానము; ఇటఁ గణ్వేతరులైన శిష్యగుల ప్రసక్తి యప్రస్తుతము. కణ్వుఁడు కులపతియౌ యాతని శిష్యు లాతని వెంటఁ బోవుట సహజధర్మమైనచోఁ బోయియే యుందురు. రాజాగమనమును చెప్పినప్పుడు తద్భృత్యానుగమనము ప్రత్యేకముగా వ్రాయ నెంచర్ప నక్కర లేకయే యూహ్యముగదా!

మఱి మిగిలినది దుష్యంతుఁడు దనరాకఁ దెల్పుకొనవలయుట దోషమును విమర్శ. రాజు కణ్వుని యింటివద్దకు వచ్చినాఁడు. బైట నెవరును లేరు, కణ్వుఁడింట లేఁడుగదా! మిగిలిన స్త్రీజనము (భారతకథను బట్టి శకుంతల యొక్కర్తుకయే వలె

నున్నది) లోపల నుండక వెలుపల కొలువు దీర్చునా? 'సో౽పశ్యమానస్తమృషిం శూన్యం దృష్ట్వా తథాశ్రమం ఉవాచ క ఇహేత్యుచ్చైర్వనం సన్నాదయన్నివ. శ్రుత్వాథ తస్య తం శబ్దం కన్యా శ్రీరివ రూపిణీ నిశ్చక్రామాశ్రమాత్తస్మాత్తాపసీవేషధారిణీ' అని యిప్పట్టున మూలకారుఁడు సందర్భోచితముగా గథఁ జెప్పినాఁడు. రాజు మునికొఱకు జూచి కానక వెలుపల నెవరును లేకపోఁగా 'ఎవరిచ్చట' అని ప్రశ్నించినాఁడు. ఆ మాట విని శకుంతల బైటకు వచ్చినది. ఇది యెంత సహజముగా నున్నది! ఇఁక నన్నయ కథ వినుఁడు —

చ. వలయు సమాత్యులన్ దగిన
వారలనుం బెడఁ గంచి ధారుణీ
తల విభుఁ డొక్కఁడుం జని
తన్విఁ బయోజపలాయతాక్షి సం
కుల మిళితాళి నీల పరి
కుంచిత కోమలకుంతలన్ శకుం
తల యను కన్యకన్ గనియె
దన్మునివల్లభు మందిరంబునన్.

'మందిరంబునన్' - బైట కాదు. వెలుపల నెవ్వరును లేకున్నఁ దెరవేయుట ధర్మమా లోఁగి కొని తలుపుఁ ద్రోచికొని లోనివారిం జూచుటయే ధర్మమా విమర్శింపుఁడు. ఇంకొకటి, యిట రాజునకుఁ గంటఁ బడినది 'తన్వి, పయోజపలాయతాక్షి, సంకుల మిళితాళినీల పరికుంచిత కోమలకుంతల'. పరబాలికను జూచుటతోడనే ప్రత్యంగ సౌందర్యకలన్నమైన దృష్టి. అహో దుష్యంతుని శీల మెంత గాఁ జోపింపఁ బడినది! 'శ్రీరివ రూపిణీ నిశ్చక్రామాశ్రమాత్తస్మాత్తాపసీవేషధారిణీ' అన్న మూలమెంతో గంభీరము. రాజు మోహవశుఁడని చూచుట కాదు. ఆశ్రమమునుండి బైటకు వచ్చినది. ఎవరు? తాపసివేషమున నున్న యామె. కావి యామె రూపు దాల్చిన కాంతిపుంజము వలె నున్నది. విద్యుల్లతంబోని యామె వచ్చుటయు నాతని కండ్లకు మిరుమిట్లు గొల్పినది. ఆ తాపసివేషమేమి అనిపించిన దాతనికి. ఇంత సౌమ్యగంభీరభావ మిం దిమిడ్చినాఁడు వ్యాసముని చంద్రుఁడు. 'శ్రీరివ' అంతే, ప్రత్యంగవర్ణనము లేదు. మెఱుపువంటి రూపము మాత్రమే యుద్భాసించినది. వివిధాంగవిభాగము వంక నాతఁడు చూడలేదు. ఇందేది యుచితమో రసజ్ఞులే నిర్ణయించుకొందురు గాక.

ఇఁక నొకటి. మూలమున దుష్యంతుఁడు గణ్వునిఁ దలంచుకొని తాను చేసిన పనికై దిగులుం జెందినట్లుండు నది భరికాదని నన్నయ శకుంతలయే భీతిలినట్లు సవరించి శోభాతిశయమును గూర్చెనని యొక ప్రశంస. 'పురుషునకు పరవనితాసాంగత్యము సామాన్యదోషమే యగును గాని మహాపరాధము మాత్రము కానేరదు. స్త్రీ, పాలకుని యనుమతి లేకఁ బరపురుషునివంకఁ జూచుటయు మహాపరాధము. పురుషుఁడు స్వతంత్రుఁడు. స్త్రీ కేవల మస్వతంత్రురాలు.' అని యేమేమో ఉపపత్త్యాభాసకల్పన. ఏమైనను గణ్వునకు శకుంతల హృదయానందినియైన కూఁతురు, దుష్యంతుఁడు పైవాఁడు. తప్పు గలిగినప్పుడు తమ వారిపైకన్న నితరులపై నెక్కుడు కనలుపూనుట లోకసహజము. కనుక దుష్యంతుఁడు భీతుఁడగుట సహజము. ఇంకొక విశేషము 'నన్ను గాంధర్వమున వివాహమాడు'మని దుష్యంతుని హెచ్చరిక. 'నా తండ్రిగారు ఫలములకై యరిగినారు, వారు త్వరలో నే రాఁగలరు. ఒకక్షణ మాఁగుము, వారే నన్ను నీకిచ్చి వివాహము చేయఁగలర'ని ధర్మబద్ధమైన శకుంతలా సమాధానము. పాప మామె కేమి తెలియును! కల్లకపటము లెట్టివో తెలియనైన వీలులేని ఋషివాటికఁ బెరిగినది. సాధుహృదయగా నున్నది. వివాహమాడుట కదా నృపు నభిప్రాయమనుకొన్నది. ఋషిమాత్ర మందుల కంగీకరింపకుండునా యని భావించినది. 'తపోవన సంవర్ధితో౽ప్యభిజ్ఞో౽యం జనః కైతవస్య' అన్న కాళిదాసోక్తి ననుస్మరింపుఁడు. మఱి నృపుఁ డన్ననో రాజకార్యములఁ దీర్చి సర్వతంత్రోపాయజ్ఞుఁడై యారితేరిన ప్రౌఢ. ఐశ్వర్యమత్తతచే వికారము లావరించునఁట! ఇట నాతనికిఁ దలఁపుల జృంభితమైనది కామావేశ. దానిఁ దీర్చుకొనఁ జిత్త ముద్వేగమున మున్నది. ఆలస్యమైనఁ గణ్వుఁడు వచ్చునేమో! గాంధర్వవివాహమన్న మంత్రహీనమును రహస్యమైనదియు నని నిర్వచించి యది శాస్త్రీయమైన పద్ధతియని నచ్చఁజెప్పి క్షత్రియుల కదియే ప్రశస్తమని నిరూపించి యామె యనుమతిగాలి నొప్పించి 'ముహూర్తమైనను దన యుచ్చకామావేశమును నిలుపరించుకొనలేక కణ్వు త్రిసంధి యామాసాధ్వి నంటు గావించి యామె వెనుకనైన పండ్లకు వెళ్లిన కణ్వుఁడు వచ్చునంతకు నిల్చు ధైర్యము చాలక మళ్లి వెళ్లిపోయినవాఁడు దుష్యంతుఁడు. నిర్మల ధర్మస్వరూపిణియై ధర్మసంరక్షణ మొనర్పవలసిన మహారాజగు దుష్యంతుని వాక్యములు యథార్థములని విశ్వసించి శాస్త్రీయమైన వివాహ మాతనితో జరిగెనని నమ్మియున్నది శకుంతల. ఇం దెవరు తమ నడవడికై కణ్వునకు శాపానుగ్రహసమర్థుఁడైన తపోధనునకు వెఱవవలసియున్నదో సహృదయులే ప్రమాణము. మూలకారుఁడు శకుంతలను 'విభ్రాజమానాం వపుషా తపసా చ దమేన చ రూపయౌవనసంపన్నాం' అని వర్ణించియున్నాఁడు. నన్నయగారి శకుంతల కెట్టి తపస్సు దమము నున్నట్లు తోఁపదు. పైగాఁ జూచుటతోడనే

'అనంత విలాసంబున జయంతుండపోలె నున్న యతని దుష్యంతుగా నెఱింగి' నదేట. మాముటయే తిడవుగా నామె నాతని సౌందర్యమే యాకర్షించినది. ఇంత కనువేదుగు గల బాలకు దనునుచే నొప్పచున్న తిపప్పినికి శీలమున నెంత యంతరముండును! ఇది నన్నయ శీలపోషణ సామర్థ్యము.

ఇటుఁ గొన్ని ప్రసంగములు మాత్రమే పరామర్శింపఁబడినవి. కడమవికూడఁ తాత్త్వికనిర్ణయ దీక్షతోఁ బరీక్షించినచో సత్యము గోచరింపక మానదు. ఉదాహరణప్రాయముగాఁ గొన్నిమాత్రము స్పృశించి నన్నయ సర్వోత్కృష్టకవి, వ్యాసాదులకును మిన్నయను స్వాభిమానపూరితభ్రమల గొంత తొలగించుటకే యీ ప్రయత్నము. ఇందలి గుణాగుణములరసి సహృదయులైన విచక్షణులే నిర్ణాయకులు.

# 'కోమటి' శబ్ద మీమాంస

## శ్రీ అద్దేపల్లి సత్యనారాయణ

భారతి 1955 మార్చి సంచిక - కలగూరగంప - శీర్షికను, 'కోమటి' శబ్దమునుగురించి శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారు వ్రాసిరి. అందు ఎర్రాప్రగడ హరివంశమున 'కులజలరాశిచంద్రుఁడను కోమటి ప్రోలనయున్' అని యున్నదని ఉదహరించిరి. ఐతే అది రెడ్డికులమున కెటుల చెందునో?

హరివంశకృతిభర్తయు కోమటిప్రోలనకొడుకు నగు కోమటి వేమనను....................

"కం|| శ్రీమత్కుసుమ..............
..................కోమటి వేమా,"

అని గలదని యుదహరించిరి. అందు రెడ్డిశబ్దమే లేదుగదా - రెడ్డికులమున కెటులచెందునో దెలుపరైరి. ఇట్లే హరివంశమునుండి యుదహరించిన పద్యము లెన్నియో చూపిరి కాని, అందొక్కదానియందును రెడ్డికులమని లేదు సరిగదా, వీరైన రెడ్డికులమని నిరూపింపలేక పోయిరి.

మద్రాసు చిత్రవస్తు ప్రదర్శనశాలలోగల శాసనమందున్నదని—"వీరాగ్రగణ్యగతి కోమటి ప్రోలనామా ప్రత్యర్థి భూపతి భుజంగ విహంగరాజః" అని వ్రాసిరి. దీన శౌర్యవంతుడని గలదుగాని రెడ్డికులజుడని లేదుగదా?

"సూర్యస్యైవ సువర్చలా శశిభృతః పుణ్యా యథా రోహిణీ రూఢా కోమటిప్రోలయస్య సదృశీ భార్యాన్నమాంబా సతీ" యనియు.

మాద్యన్మత్తనృపాలతూలపవనో మ్లేచ్ఛాబ్ధికుంభోద్భవః శ్రీమాన్ కోమటి వేమ భూపతి రసౌ వీరః కథం వర్ణ్యతే"

అని పై శాసనమందున్నటు లుదహరించిరి. భూపతి యనగా రాజ్యపాలకుడగును గాని రెడ్డికులజులనబడదుగదా? భూపతులన్ని కులములందును గలరని వీరికి తెలియదా? తెలిసినచో నిట్లేల వ్రాయవలసి వచ్చెనో?

"తతః క్రమేణ గుణజ్యేష్ఠా| విశేషతిః పాలయితో బభూవ చతురర్ణవమేఖలోయా ధరాలక్ష్మీః..................పెద్ద కోమటింద్ర ఇతి రాజనికరావదాత చరితో రాజరాజప్రథవో రాజా" యని వేమభూపాలచరిత్రమను పేర వామనభట్టబాణుడు సంస్కృత గద్య కావ్యమును వ్రాసెనని తెలిపిరి. వేమభూపాలుడని పెద్దకోమటింద్రుడని కలదుగదా, రెడ్డికులమున కన్వయింపచేయుటలో వీరిభావమేమో?

శృంగార శ్రీనాథములో—

"......................
సర్వజ్ఞచక్రవర్తి పెదకోమటి వేమ
భూపతి ర్జయతి........."ఇట్లే పెదకోమటి వేమనకు వీని నొసగుడను పినకోమటికి నుదాహరణముల జూపిరి. ఆ ఉదాహరణలందెచటను వీరు రెడ్డి కులజులను నది లేదయ్యె.

"ప్రాచీన హైందవరాజ్యాంగ తంత్రమును గూర్చి - జయస్వాల్ - ముజుందార్, మొదలగు పండితులు వ్రాసిన గ్రంథములలో - భరతఖండమునలో వర్తకగణము లుండెననియు, వానికి రాజ్యాంగమునందు ముఖ్యస్థానము గలదనియు వ్రాయబడినది. ఈ గణముల కధికారులు శ్రేష్ఠులను ఉద్యోగులు,..." మొదలగు యుపమానముల జూపిరి. వర్తకులు శౌర్యవంతులుగను రాజ్యపాలకులై, ఉద్యోగములందుండిరని ఒప్పుకొనుచు, రెడ్డికులమునకు చెందినవారని చెప్పుటకై చాల శ్రమపడిరి. ఆ కాలమున రెడ్లే వర్తకులని చూపుటకు కాదుగదా?

పెద్దకోమటికి మహాశెట్టి నామాంతర మున్నట్లును - నిఘంటువులలో, "పెద్దకోమటి = నగరపాలకుడు, బ్రౌనుదొర నిఘంటువున, పెద్దకోమటి = నగరపాలకుడు, శంకరనారాయణగారి నిఘంటువున, పెద్దకోమటి = పెద్దశెట్టి, అల్డర్ మన్, అనగా నగరపాలకుడు, పురాధ్యక్షుడు,......" అని గలదని శ్రీకుందూరి ఈశ్వరదత్తుగారే యొప్పుకొనుచు— ఏలకో కోమటిశబ్దము - కోమట్లకు కాదు, రెడ్లకేనని అతికించబోవను?

"ఆంధ్ర నిఘంటువులలో నీ పద మీ యర్థమున జేర్చవలెను." అని వ్యాసాంతమున వాకొనిరి. పాపము

నిఘంటు కారులకు క్రొత్త పదార్థముల సూచించుట కాదుగాని, ఒకజాతికొక వ్యతిరేక కల్పిత భావశబ్దము నుంచుట కొన్ని చిక్కుల కాస్కారమగును గనుక తగదు.

ఈశ్వరదత్తుగారికంటె నొకఅడుగు ముందుకు వేయవలెనను అభిలాషతో శ్రీమతి కె. భ్రమరాంబ గారు 1955 ఏప్రిల్ భారతి - కలకూరగంపలో— "కోమటిశబ్దనర్మ" యను శీర్షికను —"సర్వజ్ఞచక్రవర్తి పెదకోమటి వేమభూపతిర్జయతి" యనియు, —

"జాతా దాతా భూభుజః పెదకోమటి భూప నే చిత్రమ్" అను యుదాహరణలిచ్చిరి. ఈ భ్రమరాంబ గారిచ్చిన మొదటి యుదాహరణలలోగల కోమటి శబ్దము గౌరవచిహ్నముగా తమ పేర్లకు రెడ్డిరాజులు పెట్టుకొనిరని చెప్పిరి.

వేమన కోమటను నిందించెననియు, అనేక పద్యములతో చెండాడెననియు — కొన్ని పద్యము లామె యుదహరించెను. మావద్దల వేమనశతకమును చూచితిమిగాని అందేమును లేవు. ఆమె చూపిన వేమనపద్యము లెచట గలవో తెలుపలేదు. రెడ్డియగు వేమనకవి—అతనికి ఖార్యనున్న—అగౌరవ నామమును తన పద్యములలో నేల విపరీతముగ నిందించవలసిన అవశ్యకత వచ్చెను. ఇట్టిది చూచె స్వవచనవ్యాఘాతము కాదా? ఇది కోమటిశబ్దమును ధరించిన రెడ్లను నిందించినట్లు కాదా? ఇది పూర్వాపర సందర్భము సరిలేక - మిక్కిలి అసందర్భముగా నున్నది.

భారతములో ప్రక్షిప్తములు జేరి బృహద్గ్రంథమైనటుల - అర్వాచీను లనేకులు తమయిష్టము వచ్చిన భావములను యథేచ్ఛగ పద్యములల్లి వేమనశతకమును గూడ బృహద్గ్రంథము నర్చిరి. ఈవిషయము సాహిత్యవేత్త లెల్లరకును విదితమే?

కులములయొక్క కుళ్లు చూపాలనినా, గొప్పవారిని కించపరచాలన్నా, ఎంతో సేపు పట్టదు. బ్రహ్మని తిమ్మ, తిమ్మని బ్రహ్మ చేయుట- అంతిగా సమంజసమనిపించదు. గాంధీమహాత్మను, పంజాబు కేసరి లాలా లజపతిరాయ్, కన్యకాపరమేశ్వరి, అమరజీవి పొట్టి శ్రీరాములు, ఆదినిఘంటుకర్త పండితరాయ మామిడి వేంకనార్యులు, శ్రీమదాత్మూరి లక్ష్మీనృసింహ సోమయాజి, ఆంగ్లాంధ్ర నిఘంటుకర్త పాలూరి శంకరనారాయణలవంటి సర్వోత్తములగన్న కులమును పరిహసింప సాహసించుట సహృదయ హృదయరంజకమగునా?

కోమటిశబ్దము రెడ్డిరాజుల గౌరవచిహ్నమని నిఘంటువులలో - ఇపుడు చేర్చవలసిన అవసరమేల కలిగెనో గదా!

* * *

## శ్రీ జి. టి. ఏ. దీక్షితులు

కోమటి శబ్దమును గురించి భారతి పత్రిక 1955 మార్చి నెల సంచికలో శ్రీ కుందూరి ఈశ్వరదత్తు గారును, 1955 ఏప్రిల్ నెల సంచికలో శ్రీమతి కె. భ్రమరాంబగారును, విమర్శించారు.

'కోమటి' అను పేరు కొండవీడుపాలించిన రెడ్డిరాజుల పేరులలో యుండుట ఈవిమర్శకు కారణమేర్పడినది.

'కోమటి'కి సెట్టి (శ్రేష్ఠి) అను పేరున్నదనియు సెట్టిఅనగా పరిపాలకుడను అర్థముండుటవలన సెట్టి శబ్దము పరిపాలకుని దెల్పును. గనుక మహాసెట్టి పదము వకు పరియాయ తెలుగుపదము పెద్దకోమటి లేక పెదకోమటి యగుచున్నదని శ్రీ. దత్తుగారున్ను, జైనమతమునకు చేరిన శాసనములలో 'గోమటేశ్వరుడు' అను దేవుడు గలడనియు (శ్రావణబెళ్గోళాలో) కొండవీడు రెడ్డిరాజులు గోమటేశ్వర భక్తులైనందున 'గోమట' శబ్దమె 'కోమటి'యై వారి పేరులలో చేరినదని నిర్ధయించుచూ, అయితే కొండవీటి రెడ్డిరాజుల మూలపురుషునినుండి ఆవంశము వారు శైవులుగా ద్రోచుట లేదనియు శైవులైయున్నారను తమసందేహమును వెలిబుచ్చుచు శ్రీమతి భ్రమరాంబగారును వ్యక్తపరచినారు.

కోమటులయొక్క కులగోత్రములను వారిచరిత్రను తెలుపునట్టి 'కన్యకాపరమేశ్వరి పురాణము' అను గ్రంథమొకటిగలదు. అందులో కోమటులు గోగర్భము నందువసించి గోకర్ణము నుండి జన్మించి నందున 'గోమటు'లను పేరుగల్గినదని నిర్వచింపబడినది (8 వ షముల్లాసం), ఇదెంతసత్యమొ?

'గోమతి' నుండి కోమటి శబ్ద మేర్పడినదనియు గోమతి అనగా ఎక్కువ బుద్ధికుశలతగలవారనియు, 'కుమతి'నుండి కోమటి శబ్దమేర్పడినదనియు కుమతి అనగా కుచ్చితోద్దేశ్యము గలవారనియు వివిధ నిర్వచనములున్నవి,

సెట్టి అథవా శ్రేష్ఠి అను బిరుదునామము కోమటులకుమాత్రమే గలిగియుండలేదు. అర్జునవాడ శాసనము (ఎపి - ఇం - 21 సం, 2 సం, 9-16 పే) బెళ్ళగాలిశాసనము (మైసూరు ఇన్స్క్రిప్షన్స్) శా... పురశాసనము (*E - I VOL. IX - P174 - 181*) చాపల్లశాసనము (ఆం- చ 1 భా 320పు), శ్రీనాథక శివరాత్రిమహాత్మ్యం, హరవిలాసము, సకలార్థసాగరము (266పు) మొదలగువానినుండీ కోమటి, బణిజ, బలి...

చేరి, నగర్త, నాటుకోట, సాలి, తొగట, దేవాంగ, గాండ్ల, బెస్త, ఉప్పర, జనుప, శివగిరి, కుమ్మర, మంగల మొదలైన కులములవారికి ప్రాచీనముగా సెట్టి (శ్రేష్ఠి) అను బిరుదనామ ముండినదని తెలియుచున్నది. వీరేగాక ఔత్తరాహులలో మార్వాడి మొదలగు కులములవారికి సేఠ్ (సెట్టి) అను బిరుదు నామము గలదు.

సెట్టి (శ్రేష్ఠి) అను పేరు వేదయుగమునుండి వ్యవహరింపబడుచున్నది. క్రతువు (యజ్ఞము) లొనర్చిన వారిలో 'యూథాం శ్రేష్ఠి' అనువాడున్నట్లు ఐతేరేయ బ్రాహ్మణమను గ్రంథమున గలదు. (ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము 2 సం 600పు). బౌద్ధయుగమున యున్నట్లు 'ఖదిరగారజాతకము', 'అష్టానజాతకము', ఆంధ్రులచరిత్ర (3 భా 115పు) పురాతన సాంఘిక పరిస్థితులు (150, 151పు) కన్నడనాడిచరిత్ర (1 భా 145, 146) మొదలగు వానినుండీ దెలియుచున్నది. వర్తమాన వ్యవహారములందును గలదు.

సెట్టి (శ్రేష్ఠి) అనుపదముతో గూడిన పృథ్వి సెట్టి, నగరసెట్టి, పట్టణసెట్టి, గ్రామసెట్టి, పేటసెట్టి, సంతసెట్టి అను పేర్లున్నట్లు గౌరీపురాణము, బలిజవంశ పురాణము, చౌడేశ్వరీపురాణము క్రీ॥ శ 15వ శతాబ్దపు 'అలంగరు బాదుషాఫర్మానా', శా॥ శ 1364 పానుగంటి వీరుదరాయల శాసనము, శా॥ శ 1693 వాంగ్జా శాసనము మొదలగు వాని నుండియు, సుద్దలిసెట్టి, అంగడిసెట్టి, ఓలిసెట్టి, కోరిసెట్టి అనునవి 'స్వయంభువాగమము (10 పటల 18, 19, 20 శ్లో) నుండియు మహావాడసెట్టి, కుడారదసెట్టి. బనకారసెట్టి అనునవి 'నిరంజనవంశరత్నాకరము'(26, 27,29 పు) నుండియు తెలియుచున్నవి. పలువిధ సెట్టులుండగా కోమటులనగా సెట్టి యనియు సెట్టియనగా సామంతే అథవా యుక రాజనిదలచుట ప్రమాదమే గాగలదేమొ!

గోమతేశ్వరి నుండి 'కోమటి'అను పేరుగల్గినదన్న యూహా బాగున్నను బాధకము లెక్కువగ నున్నవి. కొండవీడు రెడ్డిరాజులలో మరియొక్కవగు చున్నది. ఈ రాజులలో ఏ యొకరిద్దరికి మినహా యితరులలో కోమటిశబ్దము గానవచ్చుటలేదు. ఈ రాజులకు మూలపురుషుడుగా భావింప బడుచున్నవారి పేరు ప్రోలయ వేమారెడ్డి ఇందులో 'ప్రోలయ' శబ్దము గలదుగాని అదియేవిధముగా వచ్చినది తెలియదు. మఱియు ఇతడు జైనుడునుగాడు. శ్రీశైలమునకు మెట్లు గట్టించిన వీరశైవుడు. యితనికుమారుడు అనపోతారెడ్డి ఇతడు జైనుడుగాడు. షట్కాలశివపూజా దురంధరుడను వీరశైవుడు. 3వవాడు అన వేమారెడ్డి ఇతడు శ్రీశైలమల్లికార్జునస్వామి ఆలయమునందు 'వీరశిరోమండపము'ను గట్టించినట్లు శాసనములు దెల్పుచున్నవి. (ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము 2 సం 27పు). దీనినుండి కొండవీడు రెడ్డిరాజులు శైవులేగాని జైనులు గారు. ఇట్టివారిలో మధ్యకాలమున జైనమతము ప్రవేశించి కోమటి నామము గల్గించినదని దలంచుట సయితము ప్రమాదమే గాగలదేమొ.

కోమటి, సాలి, కుమ్మర మొదలగు పేర్లు కులనామములని తెలియుచున్నవి. ఈకులభేదములు వృత్తులనుండి గలిగినవేగాని అన్యములుగావు. యొకేవృత్తిగల తంతుకారకులలో (నేత నేయువారలలో) సాలి, తొగట, దేవాంగ జెళమగ్గ (జెల్లమగ్గ) కైకల, జనుప, కురివి. మాల మొదలగు కులనామములు వాడబడుచున్నవి. సెల్లాలు= బహుపల్చని అంగవస్త్రములు నేయువారగుటచే సెల్లాలోళ్లు—సాలోళ్లు, తొగరు=ఎఱుపురంగు ఎఱ్ఱనినూలును నేతకుపయోగించు వారగుటచే తొగలోళ్లు తొగటోళ్లు, దేవ=శ్రీమంతులు, శ్రీమంతులుపయోగించు విలువైన పట్టుబట్టలు నేయువారగుటచే దేవాంగులు. జెళ్ల=తెలుపు, తెల్లనినూలునే యుపయోగించువారగుటచే జెళమగ్గవరు, కోక=చీర, చీరల నేయువారగుటచే కోకలోళ్లు కైకలోళ్లు. జనుము=నార. జనపనారచె బట్టలు నేయువారగుటచె జనుపోళ్లు, కురి=గొఱ్ఱె. గొఱ్ఱెవున్నిచె కంబళ్లు నేయువారగుటచేకురివాళ్లు, కురివోళ్లు. మాల=నలుపు (ఉదా॥ బాపనపని, మాలకజ్జె) నల్లనూలును నేతకుపయోగించు వారగుటవలన మాలోళ్లు, అను పేర్లురాబడినవని తెలియుచున్నది.

ఒకేవృత్తిగల నేటివ్యాపారులలో గుడ్డలు విక్రయించువారికి జవిలోళ్లు, పలువిధ ఓషధులమ్మువారికి పలసరుకులోళ్లు, ఈవిధముగా పుండీవాళ్లు, వక్కలోళ్లు, ఆకులోళ్లు, పావాకోళ్లు, బ్రాటకాలోళ్లు అను పేర్లు వచ్చియున్నట్లే ప్రాచీనకాలమున వ్యవసాయాది పరికరములు = కొరముట్లు విక్రయించు నట్టి వ్యాపారవృత్తి గలిగియుండినవారిని 'కొరముట్లోళ్లు' అని పిలువబడిరి. ఈకొరముట్లు శబ్దమువంపిలో 'ర' లోపించి కొముటోళ్లు, కోమిటోళ్లు, కోమట్లు అని రూపాంతరము బొందినది. ఇదియొక కులనామమైనది. ఈకులస్థులకు నేటికిని వ్యాపారమే వృత్తిగాయున్నది. గనుక కోమటిశబ్దము కొరముట్లు విక్రయించు వృత్తిగల కులమును దెల్పునేగాని అన్యమును దెల్పుననుట సరిగాకపోవచ్చును.

కొండవీడు రెడ్డిరాజులలో నొకడగు వేమారెడ్డికి ద్రవ్యనిధి లభ్యమగుటకై యొక మానవునిబలి అవసరమైనట్లు అట్టి బలిదానమునకు ఒకకోమటి సమ్మతించి తనకు స్మారకముగా తన కులనామమును రాజు పేరులో చేర్చవలెనని కోరినట్లును ఆ విధముగా వేమారెడ్డి పేరులో కోమటిశబ్దము చేరినటుల స్థానికకథలు చెల్లు చున్నవి. ఇట్టి కథలు పెక్కు రాజుల చరిత్రలలో గలవు. గనుక వేమారెడ్డి పేరులోగల కోమటి శబ్దము స్మారకమేగాని అన్యముగాదు. విమర్శకు లింకను పరిశోధింప ప్రార్థన.

# "ఆంధ్రాంగ్ల నవలలు"

## శ్రీ బుద్ధవరపు సత్యనారాయణ

**1955** వ సం॥ మే నెల 'భారతి' లో "ఆంధ్రాంగ్ల నవలలు" అన్న వ్యాసం ప్రచురించ బడింది. రచయిత శ్రీ వా. వె. ల. నరసింహారావు గారు చేసిన తులనాత్మకపరిశీలన బాగుంది. కాని వ్యాసంలో అక్కడక్కడ కొన్ని అపశ్రుతులు ఉన్నాయి. ఒక దానిని మాత్రం ఇక్కడ పేర్కొంటాను:

'ఫిక్షన్' అన్న పదాన్ని గురించి తాము గ్రహించిన అభిప్రాయం ఏదో ఇదమిద్ధంగా చెప్పక అమాటను గ్రంథాలయాల నిర్వాహకులు "గ్రుడ్డిగా" వాడుతున్నారని ఆరోపించారు. ఫిక్షన్ అన్న పదానికి నిఘంటువు ఇస్తున్న అర్థాన్ని యథాతథంగా మనవి చేస్తాను.

Fiction: Lit. (1) A prose work in narrative form in which the incidents, characters and scenes are partly or wholly imagined; a novel. (2) The department of literature that embraces all fictitious narrative used generally in the phrase 'Prose Fiction'

Fiction may be devided into two department (a) The Romance proper, the product of the fancy and (b) The Novel, proper, the product of imagination or artistic construction.

To vitalize fiction there is needed creative faculty with rare parts to work with.

[NEW STANDARD DICTIONARY]
[Vol. II Page 216, Col. 3]

ఈ అర్థాన్ని బట్టి 'వచనరూపంలో ఉన్న నవలలన్నిటిని 'ఫిక్షన్' అన్న సాహితీ విభాగంలో చేర్చడం తప్పు కాదు. అంతే కాదు. కథలు, కథానికలు మొదలయిన వచన కాల్పనికసాహిత్యం అంతా కూడా ఫిక్షన్ క్రిందకే వస్తుంది.

కాబట్టి గ్రంథాలయాల్లో, పై అర్థానికి లోబడి ఉండే రచనలను ఫిక్షన్ అని వ్రాయడంలో గాని, పిలవడంలో గాని లోపం కనిపించదు. ఒక పదానికి అనేక అర్థాలుంటాయి. ఏదో ఒక అర్థాన్ని మాత్రం గ్రహించి మిగిలినవాటిని కాదనడం గాని, ఇతర అర్థాల్లో ఆ పదాన్ని వాడేవారికి గ్రుడ్డితనాన్ని అంటకట్టడం గాని ఏ రచయితకూ తగదు. ఈ విషయాన్ని రచయితలు ముఖ్యంగా నరసింహారావు గారు దృష్టిలో పెట్టుకోవలెనని మనవి.

# గ్రంథ విమర్శనము

## పాలవెల్లి

ఖండకావ్యసంపుటి. రచన: శ్రీ పల్లా దుర్గయ్య గారు. ప్రచురణ: తెలంగాణా రచయితల సంఘం, హైదరాబాదు. వెల 1-4-0.

ఇందులో రెండుభాగాలున్నాయి. మొదటిది 'పద్యావళి', రెండవది 'గీతావళి'. పద్యావళి అనే ప్రథమభాగంలోని తొలిశీర్షిక 'వర్షామేఘము'; ఇందలి తొలిపద్యం:

అలఘుజ్వాలల మించు కంచుదివిటీ
లై మండు వేసంగి యెం
డలయం దెండుటనేమొ బెండులయి కొం
డల్ గాలిలో దేలి, మొ
క్కలుపోనట్టి పవిన్ దళింపబడి మున్
కానంగరానట్టి తె
క్కలురా, నాకస మెక్కి నిక్కెననగా
గన్పట్టె కాదంబినుల్.

ఈపద్యంలో 'మించుకంచుదివిటీలై' 'యెండలయం దెండుటనేమొ బెండులయికొండల్', 'తెక్కలురా నాకసమెక్కి నిక్కె' ఇత్యాదిపదబంధాలు జిలుగు గంటల్లా శ్రవణపేయములై వినిపించుతూ శబ్దచాలనంలో శ్రీ దుర్గయ్యగారికి గల దక్షతను ద్యోతిమానం చేస్తున్నాయి. శబ్దాలంకారములపట్ల కవికి గల ఆసక్తి కూడా మనకు వ్యక్తమవుతుంది. పద్యాన్ని నిర్మించడంలో రచయితకు గల శిల్పనైపుణ్యంకూడా నెబా కనిపిస్తూంది. శ్రీ దుర్గయ్యగారికి సమగ్రమైన భాషాజ్ఞానమూ పద్యనిర్మాణదక్షతా వున్నవి. అందుచేత పద్యంగాని గేయంగాని ఏది మొదలెట్టినా రచన సుజ్జంలా నడిచిపోతుంది. కాని భావనవిషయంలో కొంత తొట్రుపాటు కనుపించుతుంది.

పై పద్యంలో ఒక జత ఉత్ప్రేక్షలను ప్రయోగించి ఆకసంలో మూగిన మేఘమాలికలను అభివర్ణించారు. అందు మొదటిది: ఆ మేఘాలు, మండు టెండలకు ఎండి బెండులయి గాలిలో తేలి పైకిపోయిన కొండల్లా కనిపించుచున్నాయని. రెండవది: అలా కొండలరూపంలో కనుపించుచున్న మేఘాలు పూర్వం వజ్రాహతి నరికి వేయబడి కనిపించకుండా పోయిన రెక్కలు తిరిగిరాగా ఆకసమెక్కి నిక్కుతున్నట్లున్నాయని. మొదటిదాన్లో 'బెండులవలె' నెండజేయు ఎండలకు 'అలఘుజ్వాలల మించు కంచుదివిటీలై మండు' అనే విశేషణాన్ని సంతరించటంలో ఔచిత్యం కనుపించదు. జ్వాలలు రేగ కంచుదివిటీలు మండించుతాయిగాని ఎండించట మెలా? రెండవ ఉత్ప్రేక్షలో అలా ఎండి బెండులై గాలిలో తేలిన కొండలకు రెక్కలు మొలచాయనటం మరొక అనౌచిత్యం. 'గాలిలో తేలి' అనే అపమాపకం తగిలించి మొదటిదానిలో ఈ రెండవ భావాన్ని ముడిపెట్టకుండావుంటే అంత బాధాకరంగా తయారయ్యేది కాదు. ఎండి బెండయినదానికి యింకా రెక్కలెలా మొలుస్తాయి. పోనీ అలా మొలవటానికి తగిన ఉపపత్తిని దేన్నయినా నామమాత్రంగానైనా సూచించారా అంటే అదీలేదు. పవికి విశేషణంగా వేయబడిన 'మొక్కలుపోనట్టి' అనే ప్రయోగం కేవలం ప్రాసకోసం వేసినట్లు కనుపించుతుందేగాని మరొక సార్థకత యేమీ కనుపించదు. అలాగే తొలిపాదంలో మించుకంచుదివిటీలై మండు అన్న విశేషణంకూడా కేవలం అలంకారార్థమై వాడిందేకాని భావస్ఫోరకమైందికాదు. అలంకారార్థమే వేసినా 'నాకస మెక్కి నిక్కె' అన్న పదబంధం ఎంత సార్థకంగావుంది! కొత్తగా తిరిగి రెక్కలు రావటంవలన ఆ కొండలకు గర్వాతిశయం కలిగిందనే భావాన్ని 'నిక్కె' అనే శబ్దం ద్వారా కవి అత్యంత హృద్యంగా ధ్వని చేస్తున్నారు.

నూరుపేజీల గ్రంథం వుండగా ఈ తొలిశీర్షికలోని తొలిపద్యాన్ని ఒక్కదాన్నే తీసుకుని ఇంత నిశితంగా పరిశీలన చెయ్యటంలోగల ఔచిత్యం మాత్ర మేమిటని పాఠకులకు ఆశ్చర్యం కలుగవచ్చు. కాని ఈ పద్యం దక్కిన గ్రంథమంతటికీ కూడా మచ్చుతునకలాంటిది. ఇదే రకం గుణదోషాలు మనకు గ్రంథం సర్వత్రా గోచరిస్తూ వున్నాయి.

'పద్యావళి' లో సంపుటీకరించిన పద్యాల్లో చాలావరకు— నన్నయభట్టు, ప్రశంసాపద్యావళి, కవి సమ్రాట్టు (శ్రీ సత్యనారాయణగారు) ఆంధ్ర పితామహుడు, వికృతి, నందన మొదలైన శీర్షికలలోనివి—ఆయాఅవసరాలను పురస్కరించుకుని అప్పటి కప్పుడు వ్రాసినవిగా కనుపించుతున్నయ్.

సమాసరచనలో శ్రీ దుర్గయ్యగారు అందె వేసిన చేయి. 'కరవాలము' అన్న కావ్యంలో:

నమ్రమ పరరాజ మస్తక న్యస్త శస్త
మకుట కీలిత మణి ఘృణీ మండితాంఘ్రి
కమలయుగళాంధ్ర రాజేంద్ర కర విరాజ
మాన ఖడ్గమా!

అని ఒరలోనుంచి దూసినట్టు ఒక సమాసాన్ని ఝరున దూశారు.

పద్యావళి భాగంలో 'దివ్వెల పండుగ' అన్న కావ్యం ముచ్చటగా వుంది. దీల్లో కొన్ని సొగసైన పద్యాలున్నయ్ మచ్చుకు:

ముట్టిన మాసిపోవు చెలి
మోమున కుంకుమబొట్టుపెట్టి సీ
కట్టిన పట్టుపుట్టము ధ
గద్ధగకాంతుల నొల్కబోయ కా
ల్మెట్టెలు చిట్కుపొట్కుమని
మంజులనాదము లీనుచుండగా
పట్టణవాసులన్ బలిమి
పండుగ సేయుమటంచు వచ్చితే.

ఈ వచ్చినది కవి భావుకతలో సౌందర్యరాశియైన శ్రీమూర్తిగా రూపొందిన 'దీపావళి పండుగ' మతాబా కాంతులను ఆమె కట్టిన పట్టుపుట్టపు ధగద్ధగలు గానూ, టపాకాయల శబ్దాలను, ఆమె కాళ్ళకున్న మెట్టెల చప్పుడు గానూ కవిగారు ఉత్ప్రేక్షించారు. 'చిట్కు పొట్కు' అన్న ధ్వన్యనుకరణం ఈ పద్యానికి జీవం.

కాని, ఇంతటి మహోన్నత పథాన్ని అందుకున్న కవి మళ్లా వెంటనే,

రోషముపూని సీమది వి
రోధము నూనక తెల్పు మింతయున్
స్టేషనులోన రైలుదిగి
చేతుల నూపుచు నేగుదెంచితో
స్వాగతమంటోడ, లేక యది
భావ్యము కాదనియెంచి వాడలో
రేపను కూసనుంగొని న
రాసరి వచ్చితో భోగిపండుగా.

అంటూ గబుక్కున పాతాళానికి దిగజారిపోవటం మనకు ఆశ్చర్యాన్నీ విచారాన్నీ కూడా కలిగిస్తుంది. శ్రీ దుర్గయ్యగారు తమకున్న సహజమైన ప్రతిభా సంపన్నతను వదిలేసుకుని, ఏదో నూతనత్వాన్ని సృష్టించాలనే ఆవేశంలో ఇలాంటి చవకబారు భావాలకు ప్రాకులాడుతున్నారా అని శంకించవలసి వస్తున్నది. లేకపోతే పై పద్యంలో అలాంటి ప్రతిభా విశేషాన్ని ద్యోతకమానం చేసిన కవికి తిరిగి వెంటనే ఈ బాదరబందీ యేమిటి?

గేయరచనను కూడా కొంచెం పరిశీలించి చూద్దాం. గీతావళి భాగంలో అన్నిటికన్న మిన్నగా మనలను ఆకర్షించేది 'వస్తున్నాం' అన్న గేయం. ఇది పరిహాస ధోరణిలో సాగిన వ్యంగ్యరచన. అధునాతన జీవితవిధానంలో వున్న కశ్మలాన్నంతా రచయిత కడిగి విడిచి పెట్టారు:

వస్తున్నాం వస్తున్నాం
నవనాగరక ప్రపంచపు
నవయుగ నవయువకులం
ప్రస్తుత విద్యార్థులం
భవిష్యత్తు నాయకులం.

* * *

పరీక్షలిచ్చేస్తున్నాం
పట్టీల్ గొట్టేస్తున్నాం
పట్టాల్ సాధిస్తున్నాం
సామంలో నెగ్గకుంటె
సమ్మెలు సాగిస్తున్నాం.

* * *

కొంటున్నాం పత్రిక, కను
గొంటున్నాం ప్రకటన, తె
మ్మంటున్నాం ఉద్యోగం
ఇస్తే సైకొంటున్నాం
ఈకుంటే ఉంటున్నాం.

* * *

అబ్బిన ప్రభుత్వసేవ
అబ్బకున్న ప్రజాసేవ
చేస్తున్నాం, రోజులు
గడిపేస్తున్నాం.

* * *

కుళ్లంతా లోలోపల
ముల్లెగట్టి దాస్తున్నాం
తెల్లటి దుస్తులు గట్టి
తెరమీద నటిస్తున్నాం.
వేలకొలది కేకలతో
వేదిక నలంకరిస్తూ
..................
చప్పట్లు సహిస్తున్నాం.
నరసులవలె చూస్తున్నాం

* * *

ప్రజల సుఖాలకోసం
ప్రాణం బలిచేస్తామని
వాగ్దానా లిస్తున్నాం.

* * *

'ప్రజల సుఖదుఃఖాలను
పంచుకొందు' మని యంటిమి
..................
ప్రజలసుఖాల్లో ముందుగ
పాలు పంచుకొంటున్నాం
..................
ముందుజన్మలో దుఃఖాల్
అంది పుచ్చుకోగలమని
ఆత్మసాక్షిగా ఇదిగో
హామీ మీకిస్తున్నాం.

ఈ సంపుటంలో చేర్చిన పద్యాలుగాని గేయాలుగాని అన్నీ ఒకసారి వ్రాసినవి కావు ఒక విషయానికి సంబంధించినవీ కావు. అందుచేత కవిగారి తాత్విక సిద్ధాంతి పేమిటో బోధపరచుకోవటానికి కూడా యివి అనువుగా లేవు. కాని మొత్తంగా పరిశీలించితే ఒకటి బోధపడుతుంది. జీవిత పురోగమనానికి అనువైన ఒక నూతన తాత్విక సిద్ధాంతాన్ని రూపొందించుకోవాలని రచయిత కోరుతున్నారు. కాని అంతా అంధకార బంధురంగానూ అయోమయంగానూ వుంది. అందుచేత ఎక్కడికక్కడ ఏ కొమ్మ చేతికందితే దాన్ని పట్టుకు ప్రేలాడటంగా వుంది. నేటి ఆధునిక రచయితలలో అనేకమంది స్థితి ఈ విధంగా నేవుంది. ఈ దోషం రచయితలది కాదు. మొత్తం జాతిస్థితే అలాంటి అయోమయావస్థగావుంది. ఈమనస్తత్వాన్నే రచయితలు వ్యక్తీకరించుతున్నారు.

## తమిళ పంచకావ్యకథలు

రచన: శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ; ప్రచురణ: లక్ష్మీనారాయణ గ్రంథమాల మద్రాసు. వెల 1-8-0.

సంస్కృతంలో పంచకావ్యము లున్నట్లే తమిళభాషలో మణిమేఖలై, సిలప్పదికారం, జీవక చింతామణి, కుండలకేశి, వళైయాపతి అనే కావ్యాలకు 'పంచకావ్య' ప్రతీతి వుంది. ఈ కావ్యాలలో యితివృత్తములుగా సేకరింపబడిన అయిదు కథలనూ శ్రీ రాధాకృష్ణ శర్మగారు తెలుగు వచనంలో రచించారు. పై అయిదు కావ్యాలలో కడపటి రెండిటి మాతృకలు (అంటే కుండలకేశి, వళైయాపతి) ఇంకా ఉపలబ్ధములు కాలేదు. వాటి నామములు మాత్రమే స్మరింపబడుతూ వున్నాయి. అందుచేత శ్రీ రాధాకృష్ణశర్మగారు ఈ రెండు కథలనూ వేరుతావులనుంచి గ్రహించవలసి వచ్చింది. కుండలకేశి కథను మహాబోధి పరిపత్రికనుంచి సేకరించారు. వళైయాపతి కథను వైశ్యపురాణంనుంచి సేకరించారు. ఈ రెండు గ్రంథములను రచించిన కవుల పేర్లుకూడా మనకు తెలియవు.

మణిమేఖలై రచించిన మహాకవి 'శాత్తనార్'; 'సిలప్పదికారం' రచించినవాడు కరికాల చోళరాజు మనుమడు ఇళంగో అడిగళ్ అనువాడు. 'జీవక చింతామణి' కర్త తిరుత్తక్క దేవర్ అనువాడు.

ఈనాడు హిందీలోనుంచి యితర భారతీయ భాషలలోనుంచి అనేక గ్రంథాలు తెలుగులోకి తర్జుమా అవుతున్నయ్. అలాంటి స్థితిలో మన సరిహద్దునవున్న తమిళ సోదరప్రజలు మహా కావ్యములుగా పరిగణించుతూన్న గ్రంథాలలోని యితివృత్తాలు కూడా మన ప్రజలకు తెలియకపోవటం హాస్యాస్పదంగా వుంటుంది. ఈ దృష్ట్యా రాధాకృష్ణ శర్మగారి కృషి అభినందనీయమైనది. ఇందు శ్రీ శర్మగారు ఉపయోగించిన గ్రాంథికశైలి హృద్యంగానూ సరళంగానూ వుంది.

Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press,
No. 7. Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.

ఆంధ్ర సాహిత్య పరిషత్తు

Andhra Sahitya Parishat

KAKINADA

## త్రివర్ణచిత్రముల అకారాదిసూచి